Dwaraka

ముహూర్తం

శ్రీ హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, తిథి: బహుళ ఏకాదశి రా. 11.00 వరకు, అనంతరం ద్వాదశి; నక్షత్రం: విశాఖ ఉ. 9.51 వరకు, అనంతరం అనురాధ; అమృతకాలం: రా. 12.35 నుండి 2.25 వరకు; వర్జ్యం: మ. 2.00 నుండి 3.54 వరకు, దుర్ముహూర్తం: ఉ. 8.24 నుండి 9.12 వరకు, తదుపరి మ. 12.24 నుండి 1.12 వరకు; రాహుకాలం: ఉ. 10.30 నుండి 12.00 వరకు; యమగండం: మ. 3.00 నుండి 4.30 వరకు

Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి:56 • సంచిక:272 • శుక్రవారం 12 జనవరి 2018 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

• మళ్లీ డ్రగ్స్ కలకలం

రూ.3కోట్ల విలువైన కొకైన్ పట్టివేత

• కర్నాటక నుంచి హైదరాబాద్‌కు తరలింపు • సంగారెడ్డి జిల్లా కంకోల్ గేట్ వద్ద స్వాధీనం

• ముగ్గురు అరెస్టు..వాహనాలు సీజ్



ఫైల్

(సంగారెడ్డి/హైదరాబాద్, ఆంధ్రప్రభ) మళ్లీ డ్రగ్స్ కలకలం.. సంగారెడ్డి జిల్లాలో డ్రగ్స్ కలకలం రేగింది. మునిపల్లి మండలం కంకోల్ గేట్ వద్ద డీఆర్ఐ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు భారీ మొత్తంలో అత్యంత ఖరీదైన కొకైన్ పట్టుబడింది. దాని విలువ బహిరంగ మార్కెట్ రూ.3 కోట్లకు పైగా ఉంటుందని అధికారుల అంచనా. కర్నాటక నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా 7వ పేజీలో...

• పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో గవర్నర్ నరసింహన్



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న గవర్నర్ నరసింహన్, చిత్రంలో సతీమణి విమల

ఎస్సీ వర్గీకరణ సాధ్యం కాదు

• ఎస్సీల్లో 1126 కులాలున్నాయి

• జాతీయ ఓబీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించే బిల్లు ఆమోదింప చేస్తాం

• దళితులపై దాడులను అరికట్టాలి

• కేంద్రమంత్రి రాందాస్ అథవాల్



హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఎస్సీ వర్గీకరణ జరిగే అవకాశం లేదని కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి రాందాస్ అథవాల్ తెలిపారు. ఎస్సీలో దేశ వ్యాప్తంగా 1126 కులాలు ఉన్నాయని వాటికి వేర్వేరుగా రిజర్వేషన్లను అమలు చేయడం సాధ్యం కాదని అన్నారు. జాతీయ ఓబీసీ కమిషన్ బిల్లును పార్లమెంటులో ఆమోదించేలా చూస్తామని కేంద్ర మంత్రి చెప్పారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీపై మంత్రి గురువారం హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఆయా శాఖల్లో ఉన్న బ్యాక్‌లాగ్‌పోస్టుల 10వ పేజీలో...

చదువుల్లో... వివేకమేది?



ప్రపంచానికే ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని అందించిన భారత్‌కు ఈ ప్రపంచం ఎప్పుడూ రుణపడి ఉంటుంది. భారత పురాతన చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు ఈ ప్రపంచానికి నాగరికత నేర్పాయి.
- ఆల్బర్ట్ ఐన్‌స్టీన్

ఒక మనిషి జీవన విధానానికి సంబంధించినంత వరకు స్పష్టమైన దృక్పథాన్ని నిర్దేశించే సంస్కృతి, సంప్రదాయాలకు నిలయం భారత్. మనిషి కలలుగనే అత్యున్నత జీవన ప్రమాణాల్ని భారత్ ఈ ప్రపంచానికి రుచి చూపించింది.
- రోమైన్‌రోలన్, ఫ్రెంచ్ మనోవైజ్ఞానికులు

యూరోపియన్ భాషలన్నింటికి తల్లివంటిది సంస్కృతం. పురాతన, చారిత్రక, ఆధునిక నాగరికతలక ు పుట్టిల్లు భారత్. ఆ దేశమే ప్రపంచానికి మనోవైజ్ఞానిక శాస్త్రాన్ని అందించింది. లెక్కల్ని రుచి చూపించింది. గణితాన్ని నేర్పింది. అన్ని విధాలుగా ప్రపంచానికే తల్లివంటిది భారత్.
- విల్‌డ్యూరాంట్, అమెరికన్ చారిత్రకవేత్త

భారత్ మానవ వికాసానికి కేంద్రం. భావావేశానికి పుట్టిల్లు. చరిత్రకు భారతే తల్లి. మేథస్సుకు అమ్మమ్మ. సంస్కృతికి తాతమ్మ. మనిషి మనుగడకు అవసరమైన సంస్కృతి, సంప్రదాయాలన్నింటిని భారతీయ చరిత్ర నుంచే సంగ్రహించడం జరిగింది.
- మార్క్ ట్వైన్

చరిత్రకు దూరమవుతున్న నేటితరం
వారసత్వ సంపద మనకు ఎండమావేనా?

• భారత్‌లో మాత్రం కాసుల చదువులకే ప్రాధాన్యత

• విద్యావిషయాల్లో కానరాని చారిత్రక సంస్కృతి, సంప్రదాయాలు • అవకాశాలే లేని భవిష్యత్ తరం...

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి) 1863 జనవరి 12న స్వామి వివేకానంద జన్మించారు. భారతీయ ఆధ్యాత్మిక భావాల్ని ప్రపంచ నలుచెరగులా ఆయన చాటారు. అతి చిన్న వయసులోనే చికాగో మతసమ్మేళనం లో హిందూమత ప్రాశస్త్యాన్ని వివరిస్తూ ఆయన చేసిన ప్రసంగం అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ చరిత్రకారుల్ని, ఆలోచనాపరుల్ని మైమరిపిస్తూనే ఉంటోంది.

ఇటీవల అమెరికాలోని కొలంబియా విశ్వ విద్యాలయం మూడు శతాబ్దాల చరిత్ర పూర్తి చేసుకుంది. ఈ మూడొందల ఏళ్ళలో తమ వద్ద విద్య అభ్యసించిన వారందరిలో అత్యధిక ప్రతిభాశీలుర సర్వే నిర్వహించింది. ఆరుగురు ప్రముఖుల్ని ఇందులో గుర్తించారు. అందులో తొలి వ్యక్తి బాబాసాహెబ్ అంబేద్కర్. ఆయన కాంస్య విగ్రహాన్ని అప్పటి దేశాధ్యక్షుడు ఒబామా చేతుల మీదుగా విశ్వవిద్యాలయ ముఖద్వారం పక్కనే ప్రతిష్ఠించారు. అంబేద్కర్‌ను జ్ఞానానికి ప్రతీకగా కొలంబియా విశ్వవిద్యాలయం అభివర్ణించింది. తమ వర్శిటీలో క్లాస్‌రూమ్‌లో కూర్చుని చదివిన బాలుడు భారతదేశ రాజ్యాంగ నిర్మాతంటూ గొప్పగా ప్రస్తుతించింది.

కొన్నేళ్ళుగా భారత్‌లో చరిత్రను తీసిపారేయడం ఓ అలవాటుగా మారింది. చరిత్ర అడక్కు.. చెప్పింది విను అన్న రీతిలో చరిత్రను తృణప్రాయంగా భావించడం అలవాటైంది. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు తమ చారిత్రక నేపథ్యాన్ని గొప్పగా వర్ణించుకుంటాయి. వాటి నుంచి భవిష్యత్ తరాలు స్ఫూర్తి పొందేలా కార్యక్రమాల్ని రూపొందిస్తాయి. కానీ కొన్నేళ్ళుగా భారత్‌లో కనీసం పాఠ్యాంశాల్లో కూడా చరిత్రను పక్కనపెట్టేశారు. కేవలం సంపదను సృష్టించే విద్యకు మాత్రమే ప్రాధాన్యతనిస్తున్నారు. గతంలో చరిత్ర, సాంఘిక విజ్ఞానం, భాషా పరిజ్ఞానం, లిటరేచర్ 2వ పేజీలో...



• భారతీయులకు తీపి కబురు

గ్రీన్ కార్డుల కోటా పెంపు

• సభ ఆమోదం.. ట్రంప్ వద్దకు ఫైలు

వాషింగ్టన్: అమెరికాలో భారతీయులకు ఊరట కల్పించేకీలక పరిణామం చోటు చేసుకుంది. రిట్-ఆధారిత ఇమ్మిగ్రేషన్ వ్యవస్థను పునరుద్ధరించాలని, గ్రీన్‌కార్డు వార్షిక కేటాయింపులను 45శాతానికి పెంచాలని కోరుతూ ప్రతిపాదనను అమెరికా ప్రతినిధులు సభలో ప్రవేశపెట్టారు. తాజా బిల్లు ప్రకారం ప్రస్తుతం కేటాయిస్తున్న గ్రీన్ కార్డుల సంఖ్య సంవత్సరానికి కేవలం 1,20,000 నుండి 1,75,000 వకు మాత్రమే ఉంటాయి. ఇక బిల్లు పాస్ అయితే మాత్రం ఈ సంఖ్య అనేది సుమారు 5లక్షలకు 10వ పేజీలో...



రోడ్డు మీద చెత్తేస్తే ఫైన్!

• ఇంట్లో నీళ్లు వీధుల్లోకి వదిలినా అంతే • అక్రమ నిర్మాణాలకూ జరిమానాలు • పనిచేయని కార్యదర్శుల సరెండర్ • పంచాయతీ పాలకమండలికి అధికారాలు

• అప్పిలేట్ ట్రిబ్యునల్‌తో సర్పంచ్‌లకు దన్ను

• పంచాయతీరాజ్ కొత్త చట్టంలో వినూత్న మార్పులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సర్పంచ్‌లపై కలెక్టర్ తీసుకునే క్రమశిక్షణ చర్యలపై సర్పంచ్‌లకు అప్పిలేట్ ట్రిబ్యునల్ వెసులుబాటు దిశగా కొత్త చట్టంలో మార్పులకు సబ్ కమిటీ పరిశీలన చేస్తోంది. క్రమశిక్షణ చర్యలకు గురైన సర్పంచ్‌లకు అప్పిలేట్ అథారిటీగా ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందన్న కోణంలో పంచయతీ రాజ్ చట్టంపై ఏర్పాటైన మంత్రుల సబ్ కమిటీ యోచిస్తోంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతను ఏర్పాటైన సబ్ కమిటీ ఎంసీహెచ్ఆర్డీలో గురువారం నాలుగోరోజూ సమావేశమైంది. చట్టంలో చేర్చాల్సిన అంశాలపై సుధీర్ఘంగా చర్చిస్తున్న కమిటీ, గురువారం వరుసగా నాలుగోరోజు కీలక అంశాలను పరిశీలించింది. ఇప్పటివరకు సర్పంచ్‌లపై కలెక్టర్లు చర్యలు తీసుకుంటే అప్పిలేట్ అథారిటీగా ప్రభుత్వం తరపున పంచాయతీరాజ్ శాఖ మంత్రి వ్యవహరిస్తున్నారు.ఇందులో 9వ పేజీలో.

జిల్లాల్లో పరిశ్రమలకు రాయితీలు



వరంగల్ విజన్ డాక్యుమెంట్ విడుదల చేస్తున్న మంత్రి కేటీఆర్

• పరిశ్రమల మంత్రి కేటీఆర్ ప్రకటన

• పారిశ్రామిక వికేంద్రీకరణే లక్ష్యం

• సీఐఐ రూపొందించిన వరంగల్ విజన్ డాక్యుమెంట్ 2028 ఆవిష్కరణ


• ఖాయిలా పరిశ్రమలను ఆదుకోండి

• ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్‌లో భాగస్వాములు కావాలంటూ పిలుపు

• ఫిబ్రవరిలో ప్రపంచ ఐటీ సదస్సు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో పరిశ్రమల వికేంద్రీకరణకు వ్యూహాత్మక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పరిశ్రమలశాఖ మంత్రి కేటీ రామారావు చెప్పారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో, భద్రాచలం లాంటి మారుమూల ప్రాంతాల్లో ఏర్పాటుచేసే కంపెనీలకు అదనపు ప్రోత్సాహక రాయితీలు ఇస్తామని చెప్పారు. భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) తెలంగాణ శాఖ రూపొందించిన వరంగల్ విజన్ డాక్యు మెంట్ - 2028ను గురువారం మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, సిఐఐ తెలంగాణశాఖ ప్రెసిడెంట్ రాజన్న, సిఐఐ మాజీ ప్రెసిడెంట్ వనితా దాట్ల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ, పట్టణాభివృద్ధికి తాను మొగ్గు చూపుతున్నానని, అలాగే గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు అదేస్థాయిలో ప్రోత్సాహం ఇస్తున్నామని అన్నారు. మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ లాంటి జిల్లాల్లో పరిశ్రమలు ఏర్పాటుచేస్తే ఆ ప్రాంతాల అభివృద్ధికి మంచి అవకాశాలు ఏర్పడుతాయన్నారు. వరంగల్ నగరం విద్యాసంస్థలతో ఎంతో అభివృద్ధి చెందిందని, ఐటి కంపెనీలు ఏర్పాటుచేస్తే అవసరమైన మానవ వనరులు పుష్కలంగా లభిస్తాయని మంత్రి చెప్పారు. బెంగళూరు, మైసూర్ ప్రత్యామ్నాయ నగరాలుగా ఉన్నాయని, అలాగే భవిష్యత్తులో హైదరాబాద్, వరంగల్ విస్తరిస్తాయని అన్నారు. విద్యాసంస్థలు, అన్ని రకాల పంటలకు అవసరమైన వ్యవసాయ భూములు, పర్యాటక వారసత్వ సంపద అపారంగా ఉందన్నారు. రంగారెడ్డి జిల్లా భూములు రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్ రంగాలకు పరిమితమవుతున్నందున, వరంగల్ జిల్లా వ్యవసాయ ఉత్పత్తులకు కేంద్రంగా నిలుస్తుందని కేటీఆర్ అన్నారు. వరంగల్ - హైదరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్, కాకతీయ టెక్స్‌టైల్ పార్కు, పర్యాటక కేంద్రాలు, విద్యాసంస్థలతో పరిశ్రమల ఏర్పాటుకు మరిన్ని అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. పర్యాటకరంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.300 కోట్లు కేటాయించగా, కేంద్ర ప్రభుత్వం వరంగల్ నగరాన్ని స్మార్ట్‌సిటీగా ప్రకటించిందని ఆయన గుర్తుచేశారు. ఎయిర్ స్ట్రిప్ అభివృద్ధి చేసేందుకు కొరియాకు చెందిన కంపెనీ ముందుకు వచ్చిందని కేటీఆర్ చెప్పారు.

వరంగల్ జిల్లాలో పండిస్తున్న పత్తిని జిన్నింగ్, స్పిన్నింగ్ చేసి టెక్స్‌టైల్స్‌గా మార్చేందుకు అవకాశాలు ఉన్నాయని ఆ విజన్ డాక్యుమెంట్‌లో పేర్కొన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు అవసరమైన నైపుణ్యతలపై శిక్షణ ఇవ్వాల్సి ఉందని, స్టార్టప్స్, ఇన్నోవేషన్ హబ్స్‌ను ప్రోత్సహిస్తే 10వ పేజీలో...



ఇక్కడ అబ్బాయిలు అమ్మబడును

• జపాన్‌లో విస్తరిస్తున్న గే సంస్కృతి • చీకటి ప్రపంచానికి కేరాఫ్ టోక్యో

• ఆధునిక విపరీత సంస్కృతిని కళ్లకుగట్టిన డాక్యుమెంటరీ



టోక్యో: ఆధునిక ప్రపంచంలో వేశ్యావృత్తి కొత్త రూపు దాలుస్తోంది. ఇప్పటి వరకు మహిళలు కేంద్ర బింవుగా ఉన్న శృంగార సామ్రాజ్యంలో పురుష కోణం మొదలైంది. ఇందుకు జపాన్‌లోని టోక్యో 2-క్రోమ్ జిల్లా సాక్షీభూతంగా నిలుస్తోంది. పబ్బులు, బార్లు, మసాజ్ పార్లర్లు, రెస్టారెంట్లు, డ్యాన్సు క్లబ్‌లు కేంద్రంగా ఈ విపరీత ధోరణి శృతిమించుతోంది. పురుష వేశ్యా సంస్కృతి (గే సెక్స్) విస్తరిస్తోంది. గే సెక్స్ ఇక్కడ చట్టబద్ధమే అయినప్పటికీ, ఇదొక చీకటి సామ్రాజ్యంగా కార్యకలాపాలు సాగుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే జపాన్ రాజధాని నగరంలో ప్రధాన వ్యాపారాలలో ఇదీ ఒకటి. సుమారు 800 కేంద్రాలు నడుస్తున్నాయంటే ఆధునిక సంస్కృతిని జపనీయులు ఏమేరకు ఆదరిస్తున్నారో స్పష్టమవుతున్నది. 'మా పార్లర్‌కు రెగ్యులర్‌గా ఇద్దరు రాజకీయ నాయ కులు వస్తుంటారు. వారు మాకు పర్మినెంట్ కస్టమర్లు' అని ఓ డ్యాన్స్ క్లబ్ యజమాని చెప్పడాన్ని బట్టి, టోక్యో చీకటి సామ్రాజ్య ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవచ్చు. వేలాది మంది యువకులు ఈ తరహా వృత్తిలో చేరిపో యారు. కొందరు ఆన్‌లైన్ ద్వారా సేవలు పొందు 7వ పేజీలో...

హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా టీబీ రాధాకృష్ణన్



చత్తీస్‌గఢ్ హైకోర్టు నుంచి బదలీ... కొలీజియం సిఫారసు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా టీ.బీ. రాధాకృష్ణన్ నియ మితుల య్యారు. ఈ మేరకు సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసినట్లు సమాచారం. జస్టిస్ రాధాకృష్ణన్ చత్తీస్‌గఢ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేస్తున్నారు. కేరళకు చెందిన జస్టిస్ రాధాకృష్ణన్ 1959 ఏప్రిల్ 29న జన్మించారు. ఎన్ బాస్కరన్ నాయర్, కె పారుకుట్టి అమ్మ ఆయన తల్లిదండ్రులు. ఇద్దరు కూడా న్యాయవాదులే. జస్టిస్ తొట్టతిల్ బి రాధాకృష్ణన్ కొల్లంలోని సెయింట్ జోసఫ్ కాన్వెంట్, ఆర్ సెంట్రల్ స్కూల్‌లో ప్రాథమిక విద్యను అభ్యసించారు. యూనివర్సిటీ ఆఫ్ కేరళ నుంచి బీఎస్సీ డిగ్రీని పొందారు. బెంగళూరు యూనివర్సిటీలో ఎల్ఎల్‌బి చేశారు. 1983 డిసెంబర్ 11న న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. 2004 అక్టోబర్ 14 న కేరళ హైకోర్టు పర్మినెంట్ జడ్జిగా నియమితులయ్యారు. ప్రస్తుతం చత్తీస్ గఢ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నారు.

చదవుల్లో వివేకమేది?

(మొదటిపేజీ తరువాయి)

వంటి అంశాల్ని డిగ్రీ స్థాయిలో బోధించేవారు. అయితే వీటివల్ల సంపదసృష్టి సాధ్యం కాదంటూ సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కోర్సుల్నే ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కూడా వీటివైపే మొగ్గు చూపుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా మన సాంకేతిక నిపుణు లు ఇన్ని దేశాల్లో ఉద్యోగాల్లో చేస్తున్నామంటూ ఇప్పుడు గొప్పగా చెప్పుకుంటున్నాం. వారి నుంచి దేశానికి బిలియన్ల విలువైన యూరోలు, డాలర్లు వచ్చిపడుతున్నా యంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నాం. తద్వారా జీవనాన్ని కేవలం సంపద సృష్టికి మాత్రమే పరిమితం చేశాం. కేంద్రం నుంచి రాష్ట్రం, క్షేత్రస్థాయి వరకు కూడా మాతృభాష నేర్చుకోవడంపై నిర్బంధాన్ని అమలు చేస్తూనే అంతర్జాతీయ భాష ఇంగ్లీష్‌లో ప్రావీణ్యతను పెంచుకోమంటూ ఆదేశిస్తున్నాయి. ఆర్ట్స్ బోధనా సంస్థలకు ప్రోత్సాహం కొరవడ్డంతో అంచెల వారీగా ఇవన్నీ సాంకేతిక విద్యాలయాలుగా మారిపో యాయి. దీంతో ప్రస్తుత తరానికి భారత ప్రాచీన సంస్కృతి, సంప్రదాయ వైభవంపై ఏమాత్రం అవగాహన ఉండడరి లేదు. ఇక భవిష్యత్ తరాలకైతే అసలు సమోన్నత భారతీయ చరిత్ర గురించి తెలిసే అవకాశాలు కూడా కొరవడుతున్నాయి.

సాంకేతిక పరిజ్ఞానం సంపాదన నేర్పుతుంది. కానీ ఒక దేశ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు మనిషి ఎలా జీవించాలో బోధిస్తాయి. మనిషిలో ఉన్నత గుణాల్ని ప్రేరేపిస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలిప్పుడు భారత చారిత్రక వైభవాన్ని తమ విద్యార్థులకు నూరిపోస్తున్నాయి. విలువలతో కూడిన జీవన విధానాన్ని అలవాటు చేసుకునేలా వారిని ప్రోత్సహిస్తున్నాయి. కంప్యూటర్లు, భారీ యంత్రాలు అందుబాటులోకొచ్చిన అనంతరం అమెరికా, ఇంగ్లండ్, ఫ్రాన్స్, జపాన్ వంటి దేశాలు అగ్రహోదాను అనుభవిస్తున్నాయి. కానీ ఇవేవీ లేని రోజుల్లోనే భారతీయ నిర్మాణ కౌశల్యం అంతర్జాతీయ సమాజాన్ని ఆకర్షించింది. అప్పటి భారత పాలకులు కేవలం స్థానిక పాలనా వ్యవహారాలకే పరిమితం కాలేదు.



ప్రపంచ వ్యాప్తంగా వీలునన్ని ప్రాంతాల్లో భారతీయ చారిత్రక కళా వైభవాన్ని చాటిచెప్పే నిర్మాణాలు చేపట్టారు. అవిప్పటికీ చెక్కుచెదరలేదు. వేల ఏళ్ళ క్రితం నాటి కట్టడాలు భారతీయ వారసత్వ సంపదకు సజీవసాక్ష్యాలుగా నిల్చిపోయాయి. వీటిని పలు దేశాలు పాఠ్యాంశాలుగా కూడా రూపొందించాయి. వాటి నుంచి తమ పిల్లలకు ప్రేరణ కలిగిస్తున్నాయి.

ఇక్కడి చారిత్రక నిర్మాణాలపై మత, కుల ముద్రలేస్తున్నారు. విదేశాల నుంచి వచ్చిన బహ్మనీ సుల్తాన్‌లో.. మొఘలాయిలో.. ఫ్రెంచ్, డచ్ లేదా బ్రిటీషర్‌లో వీటిని కట్టారు.. మనకేం సంబంధంలేదంటూ వాటికి, ఇప్పటి తరానికి మధ్య దూరాన్ని పెంచుతున్నారు. తాజ్‌మహాల్, చార్మినార్, గోల్కొండ, కుతుబ్ మీనార్ వంటి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కట్టడాల ఆసక్తి అప్పటి పాలకులదే అయినా వాటిని నిర్మించింది భారతీయ నిపుణులే. వాటికి కళారూపాన్ని తెచ్చింది ఇక్కడి కార్మికులే. వేలసంవత్సరాల తరబడి చెక్కుచెదరకుండా నిర్మాణ వైచిత్రిని ప్రదర్శించింది ఈ దేశస్తులే. కానీ వారిని ఇప్పటి తరానికి పరిచయం చేయడంలేదు. విదేశాల్లో విధానం ఇందుకు విరుద్ధంగా ఉంది.

లెబనాన్‌లో ఒక విద్యార్థికి కేవలం ఆదేశ చారిత్రక కళావైభవాన్ని మాత్రమే నూరిపోయడంలేదు. 3వేల ఏళ్ళ నాటి క్రితమే భారతీయ శిల్పులు, నిపుణులైన కార్మికుల, ఉద్దండులైన రూపశిల్పులు తమ దేశానికి వందల సంఖ్యలో ఏనుగులతో సహా వచ్చి నిర్మించిన అద్భుత కట్టడాన్ని వారికి చూపిస్తున్నారు. దాని గురించి వారికి వివరించడమే కాదు.. ప్రతి అంశాన్ని బోధిస్తున్నారు. 4,300 ఏళ్ళ క్రితమే లెబనాన్‌లో బాల్‌బెక్ అనే పేరిట ఒక దేవాలయాన్ని నిర్మించారు. ఇందుకోసం వందలసంఖ్యలో నిపుణులు భారత్ నుంచి అక్కడికి తరలి వెళ్ళారు. సుమారు 300టన్నుల బరువున్న బండరాళ్ళను ఏనుగుల సాయంతో ఆలయ నిర్మాణప్రదేశానికి చేర్చారు. ఈ రాయిని ఈజిప్ట్ నుంచి సేకరించారు. కాలువల ద్వారా పర్వతసానువుల మీదుగా ఈ రాయిని లెబనాన్‌కు తరలించారు.



అక్కడే ఈ రాతిపై శిల్పాలు చెక్కారు. పైభాగంలో వేలాడుతున్న కలువపూల ఆకృతిలో రూపుదిద్దిన శిల్పసౌందర్యం ఇప్పటికీ ఆకట్టుకుంటుంది. ఈ కలువపూల తరహా శిల్ప సౌందర్యమే ఈ ఆలయ నిర్మాణాన్ని భారతీయ శిల్పులు చేపట్టారన్న సాక్ష్యాన్ని వెల్లడిస్తోంది. భారతీయులు మాత్రమే ఎక్కడికెళ్ళిన కలువపువ్వును తమ గుర్తుగా నమోదు చేస్తారు. లెబనాన్ ప్రాంతంలో అసలు కలువపువ్వులే ఉండవు. అలాగే కాంబోడియాలోని ఆంగ్‌కోర్ ప్రాంతంలో ఆంకోర్‌వాట్ పేరిట అత్యద్భుత శిల్పకళా నైపుణ్యంతో కూడిన ఆలయాన్ని అప్పటి తమిళ చక్రవర్తులు నిర్మించారు. ప్రపంచంలోనే మత సంబంధిత ప్రార్థనా ప్రదేశాల్లో ఇప్పటికీ ఇదే పెద్దది. 402చదరపు ఎకరాల విస్తీర్ణంలో దీని నిర్మాణం సాగింది. 12వ శతాబ్దానికి చెందిన చక్రవర్తి రెండో సూర్యవర్మ దక్షిణభారత్ నుంచి కాంబోడియాకు శిల్పుల్ని, నిపుణుల్ని పంపించి ఈ నిర్మాణాన్ని చేపట్టారు.

అలాగే ఇండోనేషియాలోని యోగ్యకర్టా నగరంలో పరంభనన్ పేరిట బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల ఆలయాన్ని సుమారు క్రీస్తుపూర్వం 850వ సంవత్సర కాలంలో భారతీయ నిపుణులే నిర్మించారు. ఇండోనేషియాలోని బాలీ ద్వీపంలో టాలాలాట్ టెంపుల్‌ను కూడా తమిళ శిల్పులే నిర్మించారు. నేపాల్‌లో పశుపతినాథ ఆలయాన్ని క్రీస్తుశకం 753వ సంవత్సరంలో ఉత్తరభారత రాజు జయదేవ్ నిర్మించారు. ఇందులో ఒడిషా, బెంగాల్ నిర్మాణతీరు కనువిందు చేస్తుంది. బర్మాలో కాళీమాత ఆలయాన్ని దక్షిణభారత శిల్పులు నిర్మించారు. తంజావూర్, మధురై ఆలయ శిల్పకళా వైభవం ఇక్కడ కనిపిస్తుంది. కరాచిలో క్రీస్తుశకం 1100 సంవత్సర సమయంలో వరుణదేవుడి ఆలయాన్ని ఒడిషా నిపుణులెళ్ళి నిర్మించారు. శ్రీలంకలో క్రీస్తుపూర్వం పదవ శతాబ్దంలోనే చోళవంశ మహారాణి శింబియన్‌మహాదేవి నల్లూర్ కందస్వామి ఆలయాన్ని నిర్మించారు.ప్రార్థనాలయాలే కాదు.. భారతీయ చారిత్రక సంస్కృతి, సంప్రదాయ చిహ్నాలు ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయి. అఖండ భారత పరిధిలోని సింధులోయలోనే తొలిసారి నాగరికత ఆవిర్భవించింది. భారత్ ఈ ప్రపంచానికి గణితశాస్త్రాన్ని బోధించింది. అర్ధశాస్త్రాన్ని అందించింది. ఖగోళశాస్త్రం కూడా ఇక్కడే పుట్టింది. భారత్ తర్వాతే హరప్పా, మొహంజుదారో నాగరితలు వెలుగు చూశాయి. గ్రీస్, రోమన్ రాజ్యాలు నాగరికత నేర్చుకున్నాయి. కానీ అవేవీ ఇప్పుడు ఉనికిలో లేవు. కాలగర్భంలో కలసిపోయాయి. అప్పటికీ ఇప్పటికీ వేలఏళ్ళ నాటి చరిత్రను సజీవసాక్ష్యంగా నిలుపుకున్న దేశం ఒక్క భారతే. ఈ దేశానికి మాత్రమే ఇంతగొప్ప చరిత్ర సొంతం. కానీ ప్రస్తుత తరం భారత చరిత్రను ఏమాత్రం పట్టించుకోదు. కులమతాల పేరిట చరిత్రను వక్రీకరించేందుకు పాలకులు, రాజకీయ నాయకులు చేస్తున్న ప్రయత్నాలు విద్యార్థుల్ని కూడా పెడదారి పట్టిస్తున్నాయి.


ఆస్ట్రేలియా వంటి దేశాల్లో తప్పనిసరిగా చరిత్రను నేర్చుకు తీరాల్సిందే. అక్కడి పాఠ్యాంశాల్లో చరిత్రను విధిగా బోధిస్తారు. ఆస్ట్రేలియా పౌరసత్వం కావాలంటే అక్కడి విద్యార్థులు చరిత్ర పాఠ్యాంశంలో ఉత్తీర్ణులు కావాల్సిందే. అంతేకాదు.. సామాజిక విలువలు, ఆస్ట్రేలియా సంప్రదాయాలు, జాతీయ గుర్తులపై కూడా అవగాహన ఉండాల్సిందే. లేనిపక్షంలో పౌరసత్వం రాదు. ఇది కేవలం ఆస్ట్రేలియాకే కాదు.. చాలా దేశాల్లో ఈ విధానం అమల్లో ఉంది. ఒక్క భారత్‌లో మాత్రం విదేశీ సంస్కృతికే పెద్దపీటేస్తున్నారు. అమెరికా, చైనాల విధానాల్ని అనుసరించాల్సిం దిగా ప్రబోధిసస్తున్నారు. ప్రపంచం మొత్తం భారత్ వెంట పడుతుంటే భారత్ మాత్రం విదేశీ అలవాట్లు, జీన్స్, ఇతర సంప్రదాయాల్ని అనుసరిస్తోంది. ఒకప్పుడు భారత్‌ను ఆధ్యాత్మిక కేంద్రంగా భావిస్తే ఇప్పుడు చారిత్రక వారసత్వ సంపదగా ప్రపంచం గుర్తిస్తోంది. ఇప్పటికైనా భారతీయ పాఠ్యాంశాల్లో చరిత్రకు పెద్దపీటేయాలి. అప్పుడే మానవ విలువలు, సమాజ వికాశానికి విద్య తోడ్పడుతుందని మేధావులు విశ్లేషిస్తున్నారు.

కొవ్వు కరిగించే సూర్య కిరణాలు



టొరొంటో: శీతాకాలంలో మనిషి బరువు పెరగడానికి కారణం సూర్య కిరణాలు శరీరానికి అంతగా తగలక పోవడమేనని తాజా అధ్యయనంలో తేలింది. చర్మానికి తగిలే సూర్య కిరణాలు చర్మం కింద ఉన్న కొవ్వు కణాలను కరిగిస్తాయని కెనడాలో అల్బెర్టా విశ్వవిద్యాల యం ప్రొఫెసర్ పీటర్ లైట్ తెలిపారు. మనం కంటితో చూడగలిగే సూర్య కిరణాల్లో నీల పౌన:పున్యాలు మనం చర్మంపై విస్తరిస్తాయి. చర్మం కింద ఉన్న కొవ్వు కణాలను చేరుకుంటాయి. కణాల నుంచి కొవ్వు చుక్కలు విడుదలవుతాయి. మరో విధంగా చెప్పాలంటే సూర్య కిరణాల ప్రభావానికి మన కణాలు మరింత కొవ్వును నిల్వ ఉంచుకోలేవు అని లైట్ వెల్లడించారు.

పువ్వు పుట్టకుండానే సీతాకోక చిలుకలు..!



బోస్టన్: భూమిపై తొలి పుష్పం ఆవిర్భవించడానికి మిలియన్ల సంవత్సరాలకు ముందే సీతాకోకచిలుకలు, చిమటలు ఉన్నాయని తాజా అధ్యయనం వెల్లడించింది. అమెరికాలో బోస్టన్ కాలేజీకి చెందిన పరిశోధకులు జర్మనీలోని మారుమూల ప్రాంతంలో తవ్వి తీసిన పర్వతాల రాతి నమూనాలను పరిశీలించారు. దాదాపు 200 మిలియన్ సంవత్సరాల క్రితం భూమిపై సంభవించిన ఉత్పాతాల కారణంగా మట్టిలో కలిసిపోయిన మొక్కలు, క్రిమికీటకా దుల సేంద్రీయ శకలాలను అధ్యయనం చేయగా సీతాకోక చిలుక రెక్కలు కనిపించాయి. అయితే 50 నుంచి 70 మిలియన్ సంవత్సరాల తర్వాత మాత్రమే పుష్పాలతో కూడిన మొక్కలు ఆవిర్భవించాయి. కనుక పువ్వుల కన్నా సీతాకోక చిలుకలే ముందు ఆవిర్భవించాయని చెప్పవచ్చు అని పరిశోధకుల్లో ఒకరైన పాల్ కె స్ట్రోథెర్ తెలిపారు.

ప్యారిస్ రిట్జ్‌లో దోపిడీ

ప్యారిస్: ముఖాలకు మాస్కులను ధరించిన దోపిడీ దొంగలు ఐదు నక్షత్రాల హోటల్లో దోపిడికి పాల్పడ్డారు. హోటల్లో ప్రదర్శనకుంచిన కిటికీల అద్దాలను పగులగొట్టి విలువైన ఆభరణాలను ఎత్తుకెళ్లారు. అంతేకాక, అతిథులను కత్తులు, గొడ్డళ్లతో బెదిరించి భారీగా నగలను మూటకట్టుకుని ఉడాయించారు. ఈ దోపిడీ ఘటన ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌లోని ప్రముఖ హోటల్ రిట్జ్‌లో గురువారం చోటు చేసుకుంది. దాదాపుగా 4.5 మిలియన్ యూరోల విలువైన ఆభరణాలను దోచుకొని దుండగులు ఉడాయిం చారని పోలీసులు తెలిపారు. దోపిడీపారిపో తున్న దొంగలను వెంటాడిన ప్యారిస్ పోలీసులు వారిలో ము గ్గురిని పట్టుకున్నట్లు తెలిపారు మిగతా ఇద్దరు హోటల్ వెనుక గదినుంచి బయటపడి స్కూటర్‌పై పారిపోయాని తెలిపారు.

ఎత్తిపోతల పనుల్లో వేగం పెంచండి



వరంగల్‌లో దేవాదుల ఫేస్-2, 3వ దశ ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్, డిప్యూటీ సీఎం కడియం, స్పీకర్ మధుసూదనాచారి

- టన్నెల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
- కాంట్రాక్టర్లు, అధికారులకు మంత్రి హరీశ్ ఆదేశం
- పనుల్లో జాప్యంపై సంబంధిత అధికారులపై ఆగ్రహం

భూపాలపల్లి రూరల్, ప్రభన్యూస్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా, గొల్లబుద్దారం గ్రామ పరిధిలో జరుగుతున్న దేవాదుల ఎత్తిపోతల పథకం పనుల్లో వేగాన్ని పెంచాలని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు అధికారులకు సూచించారు. గురువారం భూపాలపల్లి మండలంలోని భీంఘన్‌పూర్ చెరువు వద్ద ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను మంత్రి హరీష్‌రావుతో పాటు రాష్ట్ర శాసన సభ స్పీకర్ సిరికొండ మధుసూధనచారి, ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి పరిశీలించారు. ఈ సందర్భంగా సాగునీటి ప్రాజెక్టు మూడవ దశ పనుల పనితీరును కోస్టల్ కంపెనీ అధికారులను మంత్రి హరీష్‌రావు అడిగి తెలుసుకున్నారు. నీటిపారుదల శాఖ ఇంజనీర్లు, కోస్టల్ కంపెనీ ప్రతినిధులు డిజైన్ పనులను మంత్రికి వివరించారు. గొల్లబుద్దారం నుంచి రామప్ప సరస్సు వరకు 85 కిలోమీటర్ల మేర పైపులైన్ కోసం చేపట్టిన టన్నెల్ పనులను మంత్రులు పరిశీలించారు. టన్నెల్ పనులు కేవలం 15.9 కిలోమీటర్ల మేరకే పూర్తి కావడంపై హరీష్ అసంతృప్తి వ్యక్తంచేశారు. పనుల నత్తనడకన సాగుతుండటం పట్ల కోస్టల్ ప్రతిని ధుల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్రాంతి సెలవుల్లోనూ పనులు కొనసాగిం చాలని సూచించారు. అదే విధంగా నిరంతర విద్యుత్ కోసం భారీ టవర్ల నిర్మాణాల ను త్వరిత గతిన చేపట్టాలని టీఎస్ ట్రాన్స్‌కో అధికారులను కోరారు. దేవాదుల 1, 2వ దశ పనులు పూర్తైనందున మూడవ దశ పనులను త్వరితగతిన పూర్తి చేయాల న్నారు. ఈ సందర్భంగా కోస్టల్ కంపెనీ ప్రతినిధులు స్టీలు , సిమెంట్ తదితర ముడి సరుకుల ధరలు పెరిగినందున ప్రభుత్వం తగిన విధంగా రేటు చెల్లించాలని వారు మంత్రికి విజ్ఞప్తి చేయగా, ఉన్నతా ధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హరీశ్ హామీ ఇచ్చారు. రాంపూర్ వద్ద మెగా కంపెనీ ఆధ్వర్యంలో నడుస్తున్న పైపులైన్‌ల తయారీ పనులను పరిశీలిం చారు. ఈ కార్యక్ర మంలో ఎంపీ పసునూరి దయాకర్, మాజీ జెడ్పీచైర్మన్ సాంబారి సమ్మారావు, జాయింట్ కలెక్టర్ అమయ్ కుమార్, ఆర్డీఓ వీర బ్రహ్మ చారి, తహ శీల్దార్ సత్యానారాయణ స్వామి, కోస్ట ల్ కంపె నీ ప్రతిని ధులు నాగేందర్ రావు, గోవర్ధన్ రెడ్డి, ఏఎన్ఎస్ రాజు తదితరులున్నారు.

ఫిబ్రవరిలో ప్రపంచ ఐటీ సదస్సు

- ప్రభుత్వ భాగస్వామ్యంతో నిర్వహణ
- ఐటీ దిగ్గజాలకు వేదిక కానున్న హైదరాబాద్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో నూతన ఒరవడిని సృష్టిస్తున్న హైదరాబాద్ మరో అంతర్జాతీయ సదస్సుకు వేదిక కానుంది. ప్రతిష్టాత్మకమైన ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సు (జీఈఎస్)ను విజయవంతంగా నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వానికి మరో అంతర్జాతీయ సదస్సు నిర్వహణకు అవకాశం దక్కింది. నాస్కామ్, ప్రపంచ ఐటి సర్వీసుల అలియన్స్ (డబ్ల్యూఐటిఎస్ఎ) సంయుక్తంగా ఫిబ్రవరి 19 నుంచి 21 వరకు నిర్వహించనున్నాయి. ఈ సదస్సు నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యం అవుతుందని ఐటిశాఖ మంత్రి కేటీ రామారావు చెప్పారు. ఐటి రంగంలో వస్తున్న అత్యాధునిక టెక్నాలజీలపై ఈ సదస్సులో చర్చిస్తారని గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన తెలిపారు. ప్రపంచ ఐటి దిగ్గజాలు, నిపుణులు, ప్రతిభావంతులైన యువ ఇంజనీర్లు ఒకే వేదికపై ఐటి టెక్నాలజీలో వస్తున్న మార్పులపై చర్చిస్తారని చెప్పారు. నిపుణుల అనుభవాలతో ఐటి రంగంలో అనుసరించాల్సిన కొత్త మార్గాలపై ఈ సదస్సు ఒక వేదికగా నిలుస్తుందని కేటీఆర్ అన్నారు. నాస్కామ్ ప్రెసిడెంట్ ఆర్.చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఐటి రంగంలో 8 నూతన టెక్నాలజీ అంశాలను గుర్తించామని, వీటిపై నిపుణులతో చర్చాగోష్టి నిర్వహిస్తామని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఇన్నోవేషన్, బ్లాక్‌చైన్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బిగ్, డిజిటల్ డేటా, మిషినరీ తదితర టెక్నాలజీపై దృష్టి సారించి చర్చిస్తామని చెప్పారు. స్టార్టప్స్, ఇన్నోవేషన్స్ సెంటర్, ఫిన్‌లింకేజీపై చర్చాగోష్టులు ఉంటాయన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నోవేషన్స్‌పై దృష్టి సారించి నిపుణుల అనుభవాలను యువతకు అందిస్తామని చంద్రశేఖర్ చెప్పారు. ఈ సదస్సులో 2500 మంది ఐటి నిపుణులు పాల్గొంటారని, 30 దేశాల నుంచి 500 మంది ప్రతినిధులు ఇప్పటికే తమ సమ్మతి తెలిపారని చంద్రశేఖర్ తెలిపారు. ఈ సమావేశంలో విట్సా చైర్మన్ వైవునే చియూ, సెక్రటరీ జనరల్ డాక్టర్ జేమ్స్, పాయ్‌శాంట్, ఐటిశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ కూడా పాల్గొన్నారు.

ఖాయిలా పరిశ్రమలను ఆదుకోండి

- ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్‌లో భాగస్వాములుకండి
- నేతన్నలకు ముద్రా రుణాలు ఇవ్వండి
- మహిళా ఔత్సాహికులకు ప్రాధాన్యత
- ఎస్ఎల్‌బీసీ సమావేశంలో మంత్రి కేటీఆర్ పిలుపు



గురువారం కోఠిలోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఎస్ఎల్‌బీసీ సమావేశంలో మంత్రి కేటీఆర్, బ్యాంకు అధికారులు


హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో ఖాయిలా పడిన పరిశ్రమలను గుర్తించి, వాటి పునరుద్ధరణకు ఆర్థికసాయం అందించాలని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి కేటీ రామారావు బ్యాంకర్లను కోరారు. ఖాయిలా పడిన వాటి సమస్యలకు పరిష్కారం చూపించి, రుణాలు పునరుద్ధరించాలని కోరారు. ఖాయిలా పడిన యూనిట్లు మళ్ళీ ఉత్పత్తి మెరుగుపరిచి టర్నోవర్ పెంచుకోగానే రుణాల వసూళ్ళు ప్రారంభించాలని ఆయన సూచించారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ)తో మంత్రి కేటీఆర్ గురువారం సమావేశమయ్యారు. సూక్ష్మ, చిన్న పరిశ్రమ (ఎంఎస్ఇ)లకు బ్యాంకుల నుంచి అందించాల్సిన సహాయంపై చర్చించారు. ఎస్‌బిఐ ప్రధాన కార్యాలయంలో వివిధ బ్యాంకులు, ఎంఎస్ఇ ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఎంఎస్ఇ సమస్యల పరిష్కారానికి లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో ప్రతినెల జిల్లా కేంద్రాల్లో టౌన్‌హాల్ సమావేశాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. ఈ సమావేశాల ద్వారా పరిశ్రమల సమస్యలు తెలుసుకోవడం, వాటి పునరుద్ధరణకు ప్రభుత్వానికి సహకరిస్తామని బ్యాంకర్లు చెప్పారు.ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ, ఎంఎస్ ఇలను ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం వినూత్నమైన కార్యక్రమాలతో ముందుకు పోతుందన్నారు. ఇందులో భాగంగా ఇండస్ట్రియల్ హెల్త్‌క్లినిక్‌ను ఏర్పాటుచేసి సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల సమస్యలను అర్థంచేసుకుని వాటికి సంబంధించిన అన్ని రకాల సహాయాన్ని అందిస్తామని ఆయన చెప్పారు. ఈ హెల్త్ క్లినిక్‌కు రిజర్వు బ్యాంకు నాన్-బ్యాంకింగ్ ఫైనాన్సింగ్ కంపెనీగా గుర్తింపు ఇచ్చిందని మంత్రి గుర్తుచేశారు. ఎంఎస్ఇల కోసం ప్రత్యేకంగా ఒకసంస్థను ఏర్పాటు చేసిన తొలి రాష్ట్ర తెలంగాణ అని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్ కంపెనీలో బ్యాంకర్లు పెట్టుబడులు పెట్టి భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఎంఎస్ఇల అభివృద్ధిలో బ్యాంకుల సహకారాన్ని తాము గుర్తిస్తున్నామని, వాటికి సకాలంలో రుణాలు ఇవ్వాలని కోరారు. ఈ కంపెనీలు వాయిదాలను చెల్లించకుంటే వాటిని మొండి బకాయిల ఖాతాలోకి పంపకుండా, తిరిగి ఆదుకునే విషయంలో నిర్వహించే టెక్నో ఎకనామిక్ వైబిలిటీ (టీఈవీ) ఆధ్వర్యంలో కొంత సానుకూలంగా ఉండాలని బ్యాంకర్లకు మంత్రి సూచించారు. సాధ్యమైనంత తక్కువ సమయంలో దీన్ని పూర్తి చేయాలన్నారు. అవసరమైతే ఈ అధ్యయనాన్ని తమ హెల్త్ క్లినిక్ చేస్తుందని కేటీఆర్ చెప్పారు.ఎంఎస్ఇల పునరుద్ధరణ కోసం తీసుకోవలసిన చర్యలు, సూక్ష్మ పరిశ్రమలకు ముద్రా రుణాల పంపిణీ, ఖాయిలా పడిన సూక్ష్మ, చిన్నతరహా యూనిట్లకు అందించాల్సిన సహకా రంపై ఈ సమావేశం లో విస్తృతంగా చర్చించారు. తక్కువ మొత్తాల్లో రుణాలను పునరుద్ధ రిం చడం ద్వా రా అనేక చిన్న తరహా పరిశ్రమలు తిరిగి తమ కార్యకలాపాలు ప్రారంభి స్తాయని, ఇలాంటి వాటికి ఖచ్చితంగా సహకారం అందించా లని మంత్రి బ్యాంకర్లను కోరారు. ఫుడ్ ప్రాసెసింగ్, లెదర్, వివిధ వృత్తుల ఆధారిత పారిశ్రామికక్లస్టర్లలో ఉన్న యూనిట్లకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు రావాలని కేటీఆర్ కోరారు. మహిళా ఔత్సాహి కులకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని, మహిళా స్వయం సాధికారితకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించాలన్నారు. ముద్రా రుణాలు, ప్రధానమంత్రి ఉపాధి పథకం వంటి కార్యక్రమాల్లో రుణాల పంపిణీ లక్ష్యాలను చేరుకునేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని మంత్రి బ్యాంకర్లను కోరారు. ఈ రెండు అంశాల్లో వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. రాష్ట్రం లోని నేతన్నలకు ముద్రా రుణాల్లో అవకాశం కల్పించి వారి జీవనోపా ధికి ఆర్థికసాయం అందించా లని కేటీఆర్ కోరారు. ఈ సమావే శం లో ఎస్‌బిఐ సీజీఎం, ఎస్ఎల్ బీసీ ప్రెసిడెంట్ జె.స్వామి నాథ న్, పరిశ్రమల శాఖ ముఖ్య కార్య దర్శి జయేష్ రంజన్, టిఎస్- ఐఐసి ఎండి వివి నర్సింహారెడ్డి, ఎఫ్‌ట్యాప్సీ అధ్యక్షుడు గౌర శ్రీని వాస్, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ ఎస్. మణి కందన్, బ్యాయుల తెలంగాణ పరిశ్రమల శాఖాధి కా రులు, ఎంఎస్ఇల ప్రతి నిధులు కూడా పాల్గొన్నారు.

రూ.4.41 లక్షల కోట్ల బ్యాంకు రుణాలు

● ఎస్ఎల్‌బీసీ ప్రెసిడెంట్ స్వామినాథన్

తెలంగాణలో అన్ని బ్యాంకులు కలిసి ఇంతవరకు రూ.4,41,152 కోట్ల రుణాలు మంజూరు చేశాయని రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) ప్రెసిడెంట్, ఎస్‌బిఐ సీజీఎం జె.స్వామినాథన్ తెలిపారు. ఇందులో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఇ) బ్యాంకులు రూ.1,01,663 కోట్ల రుణాలు ఇచ్చినట్లు ఆయన చెప్పారు. ఈ మొత్తం రుణాల్లో సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు 71.60 శాతంతో రూ.72,799 కోట్ల రుణాలు ఉన్నాయని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని ఖాయిలా పరిశ్రమల పునరుద్ధరణపై గురువారం జరిగిన సమావేశంలో బ్యాంకులు అందించిన రుణాలను వెల్లడించారు. ఈ రుణాల్లో సూక్ష్మ సంస్థలకు 48 శాతం, చిన్నతరహా యూనిట్లకు 52 శాతం ఉన్నాయని అన్నారు. ఉత్పాదన రంగంలోనే 33 శాతం రుణాలు ఇచ్చామని, ఇంతవరకు ఈ రంగానికి రూ.33,579 కోట్ల రుణం ఇచ్చినట్లు స్వామినాథన్ తెలిపారు. రుణాలు, డిపాజిట్లలో రాష్ట్రంలోని బ్యాంకులు దేశంలోనే ముందు వరసలో నిలిచి నూరుశాతం సీడీ నిష్పత్తిని సాధించాయని చెప్పారు.

15వ తేదీనే మకర సంక్రాంతి



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : తెలంగాణలోని సిద్ధాంతులందరూ ఏకగ్రీవంగా శాస్త్ర ప్రకారం మకర సంక్రాంతి 15వ తేదీనే (సోమవా రం) జరుపుకోవాలని తీర్మానిం చారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు లు కే.వీ.రమణాచారి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొందరు ఆధునిక పద్ధతుల్లో గణితం ద్వారా పండుగల తేదీల్లో మార్పు ఉందని అయోమయం సృష్టిస్తున్నారని, ఇది కరెక్ట్ కాదని తెలంగాణ విద్వ త్సభ ద్వారా ఖండిస్తున్నామన్నారు. 14వ తేదీ (ఆదివారం) భోగి, 15వ తేదీ మకర సంక్రాంతి, 16వ తేదీ మంగళవారం కనుము పండుగను జరుపు కోవాలని విద్వత్సభ సిద్ధాంతులందరూ ధర్మశాస్త్ర ప్రకా రం నిర్ణయించి పంచాగంలో ప్రక టించారని, దీంతో పాటు ప్రభుత్వం కూడా ఆవిధంగానే సెలవు ప్రకటిం చిందని ఆయన తెలిపారు. ఇందులో ఎలాంటి వివాదం లేదని ఆయన పేర్కొన్నారు.

టారిఫ్ ప్లానుల వివరాలు
ప్రీపెయిడ్, పోస్ట్‌పెయిడ్ సేవలు

airtel

భారతి ఎయిర్‌టెల్ లిమిటెడ్ - ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ సర్వీస్ ఏరియా

ప్రీపెయిడ్ టారిఫ్ ప్లాన్స్

S. No.	Particulars/Services	Details	Unit	Plan Voucher Airtel/AP/GSM/26	Plan Voucher Airtel/AP/GSM/27	Plan Voucher Airtel/AP/GSM/28	Plan Voucher Airtel/AP/GSM/29	Plan Voucher Airtel/AP/GSM/30	Plan Voucher Airtel/AP/GSM/31
1	Registration/Activation/Installation Fees/Charges, if any		Rs	₹181	₹229	₹344	₹449	₹495	₹559
2	One Time charge, if any	Plan Enrolment	Rs	0	0	0	0	0	0
		Advance Rental/other charges	Rs	0	0	0	0	0	0
3	Security Deposit (Refundable), if any	Local	Rs	0	0	0	0	0	0
		STD	Rs	0	0	0	0	0	0
		ISD	Rs	0	0	0	0	0	0
		International Roaming	Rs	0	0	0	0	0	0
		Others	Rs	0	0	0	0	0	0
4	Monthly Rental/Minimum billing amount, if any		Rs	0	0	0	0	0	0
5	SIM/Account Validity			Regular Validity	Regular Validity	Regular Validity	Regular Validity	Regular Validity	Regular Validity
6	Tariff Validity			28 days	28 days	28 days	56 days	70 days	84 days
7	Free/discounted calls/SMS/data transfer, if allowed	Local	Nos	NA	NA	NA	NA	NA	NA
		STD	Nos	NA	NA	NA	NA	NA	NA
		ISD	Nos	NA	NA	NA	NA	NA	NA
		SMS	Nos	NA	NA	NA	NA	NA	NA
		Data	MB	NA	NA	NA	NA	NA	NA
8	Monthly usage discount/discount against fixed charges, if any		Rs	NIL	NIL	NIL	NIL	NIL	NIL
9	Pulse Rate		Secs/Min	NA	NA	NA	NA	NA	NA
10	Billing Period/Cycle			NA	NA	NA	NA	NA	NA
11	Call Charges			Voice / Video	Voice / Video	Voice / Video	Voice / Video	Voice / Video	Voice / Video
a.	Local	on net (A2A Mobile)	Rs	Free	Free	Free	Free	Free	Free
		off net (A2O Mobile)	Rs	Free	Free	Free	Free	Free	Free
		Mobile/Fixed	Rs	Free	Free	Free	Free	Free	Free
b.	STD	on net (A2A Mobile)	Rs	Free	Free	Free	Free	Free	Free
		off net (A2O Mobile)	Rs	Free	Free	Free	Free	Free	Free
		Mobile/Fixed	Rs	Free	Free	Free	Free	Free	Free
c.	ISD	ISD tariff to be made available on website & point of sale	Rs	NA					
12	SMS*			100/day free	100/day free	100/day free	100/day free	100/day free	100/day free
		Local	Rs	₹1	₹1	₹1	₹1	₹1	₹1
		National	Rs	₹1.5	₹1.5	₹1.5	₹1.5	₹1.5	₹1.5
		International	Rs	₹5	₹5	₹5	₹5	₹5	₹5
13	Data	Home	Paise/KB	28 GB (1 GB/day)	28 GB (1 GB/day)	56 GB (2 GB/day)	56 GB (1 GB/day)	70 GB (1 GB/day)	84 GB (1 GB/day)
		Roaming	Paise/KB						
14	Charges while Roaming-National	Local Outgoing	Rs	Free	Free	Free	Free	Free	Free
		STD Outgoing	Rs	Free	Free	Free	Free	Free	Free
		Incoming	Rs	Free	Free	Free	Free	Free	Free
		SMS (Local/STD/ISD)	Rs	Free	Free	Free	Free	Free	Free
15	Special benefits, if any			NA	NA	NA	NA	NA	NA
16	Recharge/other conditions, if any			NA	NA	NA	NA	NA	NA
17	Number of subscribers in the plan		Nos.	NA	NA	NA	NA	NA	NA
18	Plan-wise ARPU per month		Rs	NA	NA	NA	NA	NA	NA

పోస్ట్‌పెయిడ్ టారిఫ్ ప్లాన్స్

S. No.	Particulars/Services	Details	Unit	MyPlan 199 Airtel/AP/GSM/05	MyPlan 299 Airtel/AP/GSM/06	MyPlan Infinity 399 Airtel/AP/GSM/13	MyPlan Infinity 499 Airtel/AP/GSM/10	MyPlan Infinity 799 Airtel/AP/GSM/18	MyPlan Infinity 1199 Airtel/AP/GSM/19	MyPlan Infinity 1599 Airtel/AP/GSM/20	MyPlan Infinity 1999 Airtel/AP/GSM/21	MyPlan Infinity 2999 Airtel/AP/GSM/23	iPhone MyPlan Family 2499 X 24 Months Airtel/AP/GSM/03
1	Registration/Activation/Installation Fees/Charges, if any		Rs	₹300	₹300	₹300	₹300	₹300	₹300	₹300	₹300	₹300	₹300
2	One Time charge, if any	Plan Enrolment	Rs	0	0	0	0	0	0	0	0	0	0
		Advance Rental/other charges	Rs	0	0	0	0	0	0	0	0	0	0
3	Security Deposit (Refundable), if any	Local	Rs	0	0	0	0	0	0	0	0	0	0
		STD	Rs	0	0	0	0	0	0	0	0	0	0
		ISD	Rs	0	0	0	0	0	0	0	0	0	0
		International Roaming	Rs	₹3000	₹3000	₹3000	₹3000	₹3000	₹3000	₹3000	₹3000	₹3000	₹3000
		Others	Rs	0	0	0	0	0	0	0	0	0	0
4	Monthly Rental/Minimum billing amount, if any		Rs	₹199	₹299	₹399	₹499	₹799	₹1199	₹1599	₹1999	₹2999	₹2499
5	SIM/Account Validity			NA	NA	NA	NA	NA	NA	NA	NA	NA	NA
6	Tariff Validity			NA	NA	NA	NA	NA	NA	NA	NA	NA	NA
7	Free/discounted calls/SMS/data transfer, if allowed	Local (Nos), STD (Nos), ISD (Nos), SMS (Nos), Data (MB)		4 My Packs Free. For Details of My Packs please refer our website www.airtel.in	12 My Packs Free. For Details of My Packs please refer our website www.airtel.in	1. Data Quota - 10 GB data 2. Voice - Unlimited (Local calls + STD calls) on both (mobile+fixedline) + Incoming Roaming Free 3. SMS - 100 SMS/day	1. Data Quota - 30 GB data 2. Voice - Unlimited (Local calls + STD calls) on both (mobile+fixedline) + Incoming + Outgoing Roaming Free 3. SMS - 100 SMS/day	1. Data Quota - 50 GB data 2. Voice - Unlimited (Local calls + STD calls) on both (mobile+fixedline) + Incoming & Outgoing Roaming Free + 1 Family Child Connection Free 3. SMS - 100 SMS/day	1. Data Quota - 75 GB data 2. Voice - Unlimited (Local calls + STD calls) on both (mobile+fixedline) + Incoming & Outgoing Roaming Free + 2 Family Child Connection Free 3. SMS - 100 SMS/day	1. Data Quota - 100 GB data 2. Voice - Unlimited (Local calls + STD calls) on both (mobile+fixedline) + Incoming & Outgoing Roaming Free + 2 family Child Connection Free 3. SMS - 100 SMS/day	1. Data Quota - 125 GB data 2. Voice - Unlimited (Local calls + STD calls) on both (mobile+fixedline) + Incoming & Outgoing Roaming Free + 3 Family Child Connection Free 3. SMS - 100 SMS/day	1. Data Quota - 200 GB data 2. Voice - Unlimited (Local calls + STD calls) on both (mobile+fixedline) + Incoming & Outgoing Roaming Free + 4 Family Child Connection Free 3. SMS - 100 SMS/day	1. Data Quota - 30 GB data 2. Voice - Unlimited (Local calls + STD calls) on both (mobile+fixedline) + Incoming & Outgoing Roaming Free + 1 Child Connection Free 3. SMS - 100 SMS/day
8	Monthly usage discount/discount against fixed charges, if any		Rs	NIL	NIL	NIL	NIL	NIL	NIL	NIL	NIL	NIL	NIL
9	Pulse Rate		Secs/Min	60 sec	60 sec	60 sec	60 sec	60 sec	60 sec	60 sec	60 sec	60 sec	60 sec
10	Billing Period/Cycle			30 days	30 days	30 days	30 days	30 days	30 days	30 days	30 days	30 days	30 days
11	Call Charges			Voice / Video	Voice / Video	Voice / Video	Voice / Video	Voice / Video	Voice / Video	Voice / Video	Voice / Video	Voice / Video	Voice / Video
a.	Local	on net (A2A Mobile)	Rs	0.5 / ₹0.05/sec	0.5 / ₹0.05/sec	FREE /	FREE /	FREE / NA	FREE / NA	FREE / NA	FREE / NA	FREE / NA	FREE / NA
		off net (A2O Mobile)	Rs	0.5 / ₹0.05/sec	0.5 / ₹0.05/sec	FREE /	FREE /	FREE / NA	FREE / NA	FREE / NA	FREE / NA	FREE / NA	FREE / NA
		Mobile/Fixed	Rs	0.5 / NA	0.5 / NA	FREE / Airtel Fixed Line FREE	FREE / Airtel Fixed Line FREE	FREE / NA	FREE / NA	FREE / NA	FREE / NA	FREE / NA	FREE / NA
b.	STD	on net (A2A Mobile)	Rs	0.5 / ₹0.05/sec	0.5 / ₹0.05/sec	FREE /	FREE /	FREE / NA	FREE / NA	FREE / NA	FREE / NA	FREE / NA	FREE / NA
		off net (A2O Mobile)	Rs	0.5 / ₹0.05/sec	0.5 / ₹0.05/sec	FREE /	FREE /	FREE / NA	FREE / NA	FREE / NA	FREE / NA	FREE / NA	FREE / NA
		Mobile/Fixed	Rs	0.5 / NA	0.5 / NA	FREE / Airtel Fixed Line FREE	FREE / Airtel Fixed Line FREE	FREE / NA	FREE / NA	FREE / NA	FREE / NA	FREE / NA	FREE / NA
c.	ISD	ISD tariff to be made available on website & point of sale	Rs	For country wise ISD tariff, please visit www.airtel.in									
12	SMS*	Local	Rs	₹1	₹1	₹1	₹1	₹1	₹1	₹1	₹1	₹1	₹1
		National	Rs	₹1.5	₹1.5	₹1.5	₹1.5	₹1.5	₹1.5	₹1.5	₹1.5	₹1.5	₹1.5
		International	Rs	₹5	₹5	₹5	₹5	₹5	₹5	₹5	₹5	₹5	₹5
13	Data	Home / Roaming	Paise/KB	50p/MB	50p/MB	50p/MB	50p/MB	50p/MB	50p/MB	50p/MB	50p/MB	50p/MB	50p/MB
14	Charges while Roaming-National			Voice / Video	Voice / Video	Voice / Video	Voice / Video	Voice / Video	Voice / Video	Voice / Video	Voice / Video	Voice / Video	Voice / Video
		Local Outgoing	Rs	₹0.8 / ₹0.05/sec	₹0.8 / ₹0.05/sec	₹0.8 / ₹0.05/sec	0 / ₹0.05/sec	0 / ₹0.05/sec	0 / ₹0.05/sec	0 / ₹0.05/sec	0 / ₹0.05/sec	0 / ₹0.05/sec	0 / ₹0.05/sec
		STD Outgoing	Rs	₹1.15 / ₹0.05/sec	₹1.15 / ₹0.05/sec	₹1.15 / ₹0.05/sec	0 / ₹0.05/sec	0 / ₹0.05/sec	0 / ₹0.05/sec	0 / ₹0.05/sec	0 / ₹0.05/sec	0 / ₹0.05/sec	0 / ₹0.05/sec
		Incoming	Rs	0 / ₹0.05/sec	0 / ₹0.05/sec	0 / ₹0.05/sec	0 / ₹0.05/sec	0 / ₹0.05/sec	0 / ₹0.05/sec	0 / ₹0.05/sec	0 / ₹0.05/sec	0 / ₹0.05/sec	0 / ₹0.05/sec
		SMS (Local/STD/ISD)	Rs	0.25/0.38/5 / NA	0.25/0.38/5 / NA	0.25/0.38/5 / NA	0.25/0.38/5 / NA	0.25/0.38/5 / NA	0.25/0.38/5 / NA	0.25/0.38/5 / NA	0.25/0.38/5 / NA	0.25/0.38/5 / NA	0.25/0.38/5 / NA
15	Special benefits, if any			NA	NA	1. Wynk Music offer - Unlimited music 2. Wynk Movies offer - Unlimited movies (Eros/Hooq)	1. Wynk Music offer - Unlimited music 2. Wynk Movies offer - Unlimited movies (Eros/Hooq) 3. 6 months secure subscription free						
16	Recharge/other conditions, if any			NA	NA	NA	NA	NA	NA	NA	NA	NA	NA
17	Number of subscribers in the plan		Nos.	NA	NA	NA	NA	NA	NA	NA	NA	NA	NA
18	Plan-wise ARPU per month		Rs	NA	NA	NA	NA	NA	NA	NA	NA	NA	NA

*మైప్లాన్ - వినియోగదారులు 'మైప్లాన్'కు సబ్‌స్క్రైబ్ చేయడం ద్వారా తాము పొందే ఉచిత కాల్స్, SMS & డేటా యూసేజ్ లాంటి ప్రయోజనాలను ఇతర ఎయిర్‌టెల్ పోస్ట్‌పెయిడ్ కనెక్షన్లతో (గరిష్ఠంగా 5 - అదనపు కనెక్షన్లు) కూడా పంచుకోవచ్చు. అయితే అలా అదనంగా చేర్చిన ప్రతి కనెక్షన్‌కూ ₹199 చొప్పున వార్షిక అద్దె మొత్తాన్ని చెల్లించిన తర్వాతే వారికి ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది. మైప్లాన్ కింద ₹299 లేదా అంతకన్నా ఎక్కువ రెంటల్ చెల్లించే పోస్ట్‌పెయిడ్ వినియోగదారులకు 'మైప్లాన్ ఫ్యామిలీ సర్వీసు' అందుబాటులో ఉంటుంది. ఇన్ఫినిటీ ప్లాన్స్ కోసం, ₹499 ఇంకా అంతకు మించిన ప్లాన్స్‌కు @₹299/నెలవారీ ఫ్యామిలీ కనెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. *ఉచిత కోటా వినియోగించిన తరువాత చేసే SMSలకు ఛార్జీలు వర్తిస్తాయి.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
శుక్రవారం 12 జనవరి 2018

నీలేకని వ్యాఖ్యలు వాస్తవం

ఏ మంచి పని చేసినా విమర్శలు, ఆరోపణలు రావడం మన దేశంలో సర్వసాధారణం. అన్నింటినీ ప్రతికూల దృష్టితో చూస్తే మొదటికే మోసం వస్తుంది. ఆధార్‌పై ప్రస్తుతం కొనసాగుతున్న వివాదం గురించి ఆ సంస్థ మాజీ చైర్మన్ నందన్ నీలేకనీ చేసిన వ్యాఖ్యల్లో నిజమెంతో ఉంది. ప్రతి కూల దృష్టితో చూస్తే అంతా ప్రతికూలంగానే కనిపిస్తుందనీ, సానుకూలంగా పరిశీలించి ముందుకు సాగడమే మన లక్ష్యం కావాలని ఆయన వ్యాఖ్యానించారు. ఇదొక్కటే కాదు. ఏ మంచి పనికైనా శషభిషలు, అనుమానాలతో తర్కించుకుంటూ కూర్చుంటే ముందుకు సాగలేం. ఆధార్‌పై తాజా వివాదానికి పరిష్కారంగా కేంద్రం ప్రవేశపెట్టదలచిన వర్చువల్ ఐడీని ఆయన సమర్థించారు. ఆధార్ కార్డు దారుల గోప్యతను కాపాడేందుకు 12 అంకెల బయోమెట్రిక్ బదులు సిమ్ వెరిఫికేషన్‌తో సహా అనేక అవసరాల కోసం వర్చువల్ ఐడిని విశిష్ట గుర్తింపు కార్డు ప్రాధికార సంస్థ(యుఐడిఏ) వెబ్ సైట్ ద్వారా పొందవచ్చని ప్రభుత్వం పేర్కొంది. ఆధార్ కార్డుల వల్ల వ్యక్తిగత గోప్యతకు భంగం కలుగు తుందనీ, ఇది ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తుందని వాదిస్తూ పలువురు సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఇందుకు సంబంధించిన పిటిషన్లన్నింటిపైనా విచారణ జరిపేందుకు సర్వోన్నత న్యాయస్థానం రాజ్యాంగ ధర్మాసనానికి దీనిని నివేదించింది. అది ఇంకా తేలలేదు. ఈలోగా ఐదువందలు చెల్లిస్తే ఆధార్ కార్డు ఎలా పొందవచ్చో నిరూపిస్తూ ఒక పత్రికలో కథనం వచ్చింది. దానిపై ఆ కథనాన్ని పంపిన వ్యక్తిపై కేసు నమోదుచేశారు. ఇదంతా ఆధార్ వ్యవస్థను అప్రదిష్టపాలు చేయడానికేనన్న నీలేకని వ్యాఖ్య అసత్యం కాకపోవచ్చు. ఆధార్‌గా పిలవబడుతున్న విశిష్ఠ గుర్తింపు కార్డు వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. పౌరుల జనగణనకు సంబంధించి గతంలో ఉన్న పద్ధతిలో కొన్ని మార్పులు చేసి ఈ విశిష్ట గుర్తింపు కార్డును రూపొందించారు. యూపీఏ హయాంలో ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఇన్ఫోసిస్ సహా వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో ఏర్పాటు చేసిన వ్యవస్థ చాలా రోజుల పాటు శ్రమించి ఆధార్ నంబర్ ప్రక్రియను పూర్తి చేసింది. 125 కోట్లు పైగా జనాభా కలిగిన దేశంలో ఇలాంటి బృహత్తర ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేయడం సామాన్యమైన విషయం కాదు. అందుకే ఈ ప్రాజెక్టును రాజకీయాలతో సంబంధం లేని సంస్థ సహా వ్యవస్థాపకునికి మన్మోహన్‌సింగ్ అప్పగించారు. దీని వల్ల వ్యక్తిగత గోప్యతకు భంగం కలుగుతుందంటూ అప్పట్లో వాదించిన బీజేపీ అధికారంలోకి రాగానే దీనిని కొనసాగించడమే కాకుండా, దీనిని అన్నింటికీ వర్తింప జేసేందుకు ప్రయత్నించడం వల్ల దీనిని వ్యతిరేకించేవారు ఎక్కువమంది తయారయ్యారు. ప్రభుత్వం అమలు జేస్తున్న సంక్షేమ పథకాల్లో సబ్సిడీ సొమ్ము పక్కదారి పట్టకుండా నిరోధించేందుకే యూపీఏ ప్రభుత్వం ఆధార్‌ని తీసుకుని వచ్చింది. లబ్ధిదారుల పేర్లను ఆధార్‌తో అనుసంధానం చేయడం ద్వారా సబ్సిడీ సొమ్ము దళారుల జేబుల్లోకి వెళ్ళకుండా నిరోధించగలిగామనీ, సుమారు 60 వేల కోట్ల రూపాయిల సబ్సిడీ సొమ్మును ఆదా చేయగలిగామని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆకాశవాణి మన్‌కీ బాత్ కార్యక్రమంలో వెల్లడించారు. ఆధార్‌ని సబ్సిడీ పథకాలకే పరిమితం చేసి ఉంటే ఇన్ని అనుమానాలు వచ్చి ఉండేవి కావేమో. కానీ, మోడీ ప్రభుత్వం మరింత ముందుకు వెళ్ళి,మొబైల్ నెంబర్లను కూడా ఆధార్‌తో అనుసంధానం చేయాలని ఆదేశించింది. దీనిని తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో సహా దేశంలో అనేక వర్గాల వారు వ్యతిరేకించారు. మమత ప్రధానమంత్రి మోడీని రాజకీయంగా విభేదిస్తున్న దృష్ట్యా, ఆమె రాజకీయ కోణం నుంచే వ్యతిరేకిస్తున్నారని కమలనాథులు పేర్కొన్నారు. అయితే, ఇతర వర్గాలు కూడా దీనిని వ్యతిరేకించడం, సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేయడం వల్ల సర్వోన్నత న్యాయస్థానం దీనిపై విస్తృత ప్రాతిపదికపై విచారణకు ఉపక్రమించింది. ఆధార్ వల్ల ప్రయోజనాలు ఉన్నట్టే, నష్టాలు ఉన్నాయని పిటిషనర్లు వాదిస్తున్నారు. ఆధార్ మాత్రమే కాదు, అంతర్జాలం, మొబైల్ ఫోన్‌లు, సామాజిక మాధ్యమాల వల్ల ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో అన్ని అనర్థాలనూ మనం చూస్తున్నాం. దేశవ్యాప్తంగా జనగణన జరిగినప్పుడు కూడా స్వదేశీయులు, విదేశీయుల సమస్య వచ్చింది. అందువల్ల ఆధార్‌ని నీలేకని అన్నట్టుగా ప్రతికూల దృష్టితో కాకుండా సానుకూల దృష్టితో చూస్తే దాని ప్రయోజనం కనిపిస్తుంది. ఆధార్ కార్డుల పంపిణీ ఇప్పటికీ జరగని ప్రాంతాలు దేశంలో ఉన్న మాట నిజమే. పంపిణీ జరిగేట్టు చర్యలు తీసుకోవాలే తప్ప ఈ బృహత్తర పథకానికి అడ్డు చెప్పకూడదు. ప్రభుత్వం కూడా ఆధార్ అనుసంధానం విషయంలో ఆచితూచి ఆదేశాలు జారీ చేయాలి. ఉదాహరణకు మధ్యాహ్న భోజన పథకానికి కూడాఆధార్‌ని ప్రవేశపెట్టడంతో విమర్శలు వెల్లువెత్తాయి. అలా చేయడం కోసమే ఈ వర్చువల్ ఐడి విధానాన్ని ప్రవేశపెడుతున్నారు.

మంచి నిర్ణయం

పాఠకుని మాట

చట్ట సభల్లో కొలువు తీరిన సభ్యులకు సంబంధించిన నేర విచారణలని త్వరితగతిన పూర్తి చెయ్యడానికి కేంద్ర ప్రభుత్వం 12 ప్రత్యేక కోర్టుల్ని నెలకొల్పడానికి ముందుకు రావడం, ఆ నిర్ణయాన్ని సుప్రీం కోర్టు సమర్థించడం ఒక మంచి పరిణామం. నేరమయ రాజకీయాల్ని నిరుత్సాహ పరిచే కార్యక్రమం. 2014 ఎన్నికల అఫిడవిట్ల ప్రకారం దేశ వ్యాప్తంగా వివిధ శాసన సభల్లో, పార్లమెంటులో నేరారోపితులు 1581 మంది. వీరిపై దాదాపు 13,500 కేసులు వివిధ కోర్టుల్లో నడుస్తున్నాయి. ప్రస్తుతం రాజకీయ రంగంలో ఉంటూ, నేర విచారణ ఎదుర్కొంటున్నవారి విషయంలో ఆ కేసులు తెమిలేటప్పటికి తీవ్ర జాప్యం జరుగుతోంది. నేరస్థులుగా నిరూపణ జరిగి, వారికి శిక్షలు పడడమన్నది అరుదైపోతుంది. ఈ లోగా చేతిలో ఉన్న పవరుతో వారు మరింతగా చట్టాల్ని తుంగలోకి తొక్కగలుగుతున్నారు. నేరస్థులు అందుకనే రాజకీయాల్ని ఆశ్రయిస్తున్నారు. చట్ట వ్యతిరేక నేరాల్లో నిందితుల్ని తీసుకువచ్చి చట్టాల్ని తయారుచెయ్యమని పురమాయించడమే పెద్ద విరోధాభాస. అయితే అటువంటి వారిని ప్రోత్సహించడంలో రాజకీయ పార్టీలు ఏమాత్రం సిగ్గు పడడం లేదు. ఎన్నికల్లో గెలవడమొక్కటే ప్రాతిపదికగా తీసుకోవడం వల్ల అన్ని పార్టీల్లో నేరస్థులు ఉంటూనే ఉన్నారు. నేరం నిరూపణ జరిగి జైలు శిక్ష అనుభవించిన వారు కూడా ఆరేళ్ళ పిమ్మట మళ్ళీ చట్టసభల్లో అడుగిడగలరు. ప్రత్యేక కోర్టులు ఏర్పరచడంతో పాటు, ఇలాంటి లొసుగులపై ప్రభుత్వం దృష్టి సారించాలి. రాజకీయ పార్టీలు స్వచ్ఛందంగానే తీవ్ర నేరాల ఆరోపితులకు ఎన్నికల్లో పాల్గొనే అవకాశాల్ని నిరాకరించాలి. ఒక పార్టీ నుండి ఎన్నికై, నేరస్థుడిగా నిరూపించబడిన సభ్యుణ్ణి శిక్షించడంతో బాటు, ఆ పార్టీ కి కూడా భారీ జరిమానా విధించాలి.

-డా. డి. వి. జి. శంకరరావు, మాజీ ఎంపి. పార్వతీపురం

మంచి మాట

స్వార్థం పూర్తిగా తొలిగితేనే భగవంతుడు ఉంటాడు. వెలుగు చీకటి కలిసి ఉండలేవు.

-స్వామి వివేకానంద

చర్చిస్తేనే చట్ట సభల సార్థకత!

ప్రజాస్వామ్యానికి నాలుగు మూలస్తంభాల్లో ఒకటైన చట్టసభలు వాటి విధులను సజావుగా నిర్వహిస్తున్నాయా అన్న ప్రశ్న తరచూ వినిపిస్తూ ఉంటుంది.మన దేశంలో చట్ట సభల తీరు తెన్నులు మొదటి రెండు దశాబ్దాలు సజావుగా ఉన్నా, తర్వాత అవి రణరంగాన్ని తలపించేట్టు మారిపోయాయి. అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదాలు, సవాళ్ళు,ప్రతిసవాళ్ళు సహజమే.గతంలో అవి ఆయా అంశాలకు మాత్రమే పరిమితం అయ్యేవి.ఇప్పుడు వ్యక్తుల మధ్య వివాదాలుగా,ఘర్షణలుగా పరిణమిస్తున్నాయి. అసెంబ్లీ, లేదా పార్లమెంటు సమావేశాలు ప్రారంభమయ్యే ముందు క్రమం తప్పకుండా,సభా పతులు సభావ్యవహారాల కమిటీ (బిజినెస్ అడ్వయిజరీ కమిటీ---బిఏసీ)సమావేశాలను నిర్వహించడం, అక్కడ ఇరు పక్షాల మధ్య అంగీకారం కుదరడం, బీఏసీలో ఖరారు చేసిన అజెండాను చాపచుట్టేసి ఇరువర్గాలూ వాగ్యుద్ధానికి తలపడటం సర్వసాధారణం అయింది.ఈ కారణంగా కొత్తగా చట్టసభలకు ఎన్నికైన వారు సభలో మాట్లాడేందుకు అవకాశం లభించడం లేదు.ఎన్నోఆశలతో,ఎంతో హోం వర్క్ చేసుకుని వచ్చేకొత్త సభ్యులకు అటు పార్లమెంటు లోనూ,ఇటు అసెంబ్లీలలోనూ తీవ్ర నిరాశ ఎదురవుతోంది. చట్టసభలు సజావుగా సాగకపోవడం వల్ల ఆర్థిక బిల్లుతో సహా, ముఖ్యమైన బిల్లులు చర్చకు నోచుకోవడం లేదు.ప్రజా సమస్యలపై చర్చజరిగితేనే చట్టసభల సార్థకత.

విచిత్రమేమంటే.... ఏ అంశంపైనైనా చర్చకు సిద్ధమేనని అధికార పక్షం ప్రకటిస్తూ ఉంటుంది. తాము లేవనెత్తిన అంశాన్ని మాత్రమే మొదట చర్చకు చేపట్టాలని ప్రతిపక్షం వాదిస్తూ ఉంటుంది. పార్టీల స్థానాలు మారినా, దశాబ్దాలుగా ఈ సీన్ మాత్రం మారడం లేదు. అంతిమంగా ప్రజలు నష్టపోతున్నారు. ప్రజలకు సంబంధించిన అంశాలు మరుగున పడిపోతున్నాయి. చట్టసభల కార్యకలాపాల ప్రత్యక్ష ప్రారంభమైన తర్వాత ఈ ధోరణి మరింత ఎక్కువైంది. ప్రజలు చూస్తున్నారన్న వెరపుతో చట్టసభ సభ్యులు ముఖ్యమైన విషయాలను మాత్రమే ప్రస్తావిస్తారన్న అంచనాలు తారవమారు అయ్యాయి.దీంతో ముఖ్యమైన బిల్లుల రూపకల్పనలో,వాటిపై చర్చలో పాల్గొనే అవకాశం సభ్యులకు లభించడంలేదు.ఇది వాంఛనీయం కాదని వాదించే వారే సభల్లో అడుగు పెట్టగానే దానిని మరిచి పోవడం,అమీతుమీ తేల్చుకోవడానికన్నట్టుగా వాగ్వాదాలకు దిగడం సర్వసాధారణం అయింది.

బిల్లుల రూపకల్పన

బిల్లుల రూపకల్పనలో సంబంధిత సంస్థలను, వ్యక్తులను భాగస్వాములను చేస్తే చట్టాలను మరింత కట్టుదిట్టంగా రూపొందించే అవకాశం ఉంది. సమావేశాల్లో కనీసం ఒకరోజైనా విపక్షాల అజెండా మేరకు చర్చ చేపట్టే వీలుండాలి.

ప్రస్తుతం బిల్లుల ఆమోదంలో మౌఖిక ఓటునే స్వీకరిస్తున్నా రు. సభ్యుల ఓట్లను నమోదుచేసి, బహిర్గతం చేయరు. ప్రతిబిల్లుపైనా సభ్యుల అభిప్రాయాలను, ఓటును భద్రపరచి వెల్లడిస్తే బాగుంటుంది. తద్వారా వివిధ చట్టాల రూపకల్పనలో సభ్యుల భాగస్వామ్యం ప్రపంచానికి తెలుస్తుంది. సభ్యులకు తమ నియోజకవర్గాల్లో ఆయా అంశాలపై ప్రచారం చేసుకునే వెసులుబాటూ లభిస్తుంది. పార్టీలు జారీచేసే విప్ కొన్ని సందర్భాల్లో సభాకార్యక్రమాలు అదుపు తప్పడానికి కారణమవుతోంది. అవిశ్వాస తీర్మానంపై తప్ప మరే విషయంలోనూ విప్ జారీ చేయకుండా రాజకీయ పార్టీలను నియంత్రించాలి. అన్నింటికన్నా ముఖ్యంగా పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం వెల్లివిరిసేలా ఎన్నికల సంఘం గట్టి చర్యలు తీసుకోవాలి.

విదేశాల్లో ఇలా..

యునైటెడ్ కింగ్‌డమ్ పార్లమెంటులో విపక్షాలకు 20 రోజులను కేటాయిస్తారు. ఆ 20 రోజుల్లో 17 రోజులను ప్రధాన ప్రతిపక్షం, మిగతా మూడురోజులు ఇతర విపక్షాలూ వినియోగించుకోవచ్చు. ఈ 20 రోజులచర్చ అజెండాను విపక్షాలే నిర్ణయిస్తాయి. ఏ అంశంపైనయినా సభ చర్యకు స్వీకరించడానికి 40 మంది సభ్యుల మద్దతు కూడగడితే చాలు. కాబట్టి సభావ్యవహారాలకు విపక్షాలు అడ్డుతగిలే అవకాశం చాలా తక్కువ. అమెరికాలో 60 మంది సెనేటర్ల మద్దతు ఉంటే, ఏ అంశాన్నయినా చర్చకు అనుమతిస్తారు. ప్రజాక్షేత్రంలో కీలకమైన అంశాలకు చర్చల్లో ప్రాధాన్యం కల్పించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుంది. భారత్‌లోనూ ఈ పద్ధతి సాధ్యాసాధ్యాలపై చర్చించాలి, జాతి ప్రగతి రథం గతిరీతుల్ని నిర్దేశించేది పార్లమెంటులోని చర్చలే. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ళలో అనేక అంశాలపై ఎంపీలు రోజుల తరబడి నిర్విరామంగా చర్చించేవారు. ఇప్పుడు రోజులు పూర్తిగా మారిపోయాయి.

బిల్లుల ఆమోదంలోనూ వెనకబాటు

బిల్లుల ఆమోదంలోనూ చట్టసభలు వెనకబడుతున్నాయి. తొలిరెండు లోక్‌సభలు 300కు పైగా బిల్లుల్ని ఆమోదించగా, అయిదో లోక్‌సభ కాలానికి ఆ సంఖ్య 450కి చేరింది. పదిహేనో లోక్‌సభలో ఆ సంఖ్య 165కి పడిపోయింది. అందులో 25 శాతం బిల్లుల్ని గంటసేపు కూడా చర్చించకుండానే ఆమోదించారు. అయిదో దశకంలో బడ్జెట్‌పై 132 గంటలపాటు చర్చిస్తే గడచిన దశాబ్దంలో ఆ వ్యవధి 39 గంటలకు క్షీణించింది. కనీస చర్చలేకుండానే బడ్జెట్లను పార్లమెంటు ఆమోదిస్తున్న తీరు, సభ్యుల హాజరీ పని విధానంలో సంస్కరణల ఆవశ్యకతను గుర్తు చేస్తోంది. ప్రజాసమస్యలపై నిర్మాణాత్మకంగా చర్చించి, పరిష్కారాలు అన్వేషించాల్సిన చట్టసభల్లో సభ్యుల హాజరీ క్రమంగా తరిగిపోతోంది. గడిచిన కొంతకాలంగా పార్లమెంటు సమావేశాల్లో ఎంపీల హాజరు తగ్గడం పట్ల ప్రధాని నరేంద్రమోడీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇక మీదట ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధపెట్టి, తాను సభ్యుల హాజరును పర్యవేక్షిస్తాననీ ఆయన భాజపా ఎంపీలకు స్పష్టం చేశారు. ప్రశ్నల సంఖ్య, చర్చల్లో భాగస్వామ్యం వంటి విషయాలను ప్రాతిపదికగా తీసుకున్నప్పుడు ప్రస్తుత పార్లమెంటులో అత్యధిక సభ్యులు చెప్పుకోదగ్గ ఆసక్తినే కనబరుస్తున్నట్లు స్పష్టమవుతోంది. సభ్యులు మరింత చురుగ్గా సభాకార్య కలాపాల్లో పాల్గొనేందుకు మార్గాలను అన్వేషించడం తప్పనిసరి.

పనితీరుపై కారణాలను అన్వేషించాలి

చట్టసభల పనితీరు ఆశించిన మేరకు లేకపోవడానికి గల కారణాలను లోతుగా అన్వేషించి, అవసరమైతే ప్రభుత్వమే ఆ మేరకు సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి. ముఖ్యంగా పార్లమెంటుకు, శాసనసభలకు ముందస్తు షెడ్యూల్ ప్రకటించాలి. ఆ రకంగా చట్టసభల పనిదినాల ను తగ్గించేందుకు వీలుపడదు. గత సభలతో పోలిస్తే 2014లో ఎన్నికైన పదహారో లోక్‌సభలో సభ్యుల హాజర శాతం మెరుగ్గా ఉంది. ఈ సభలో ఇప్పటివరకూ సభ్యుల సగటు హాజరీ 81 శాతంగా ఉంది. ఇది సంతృప్తికరంగానే ఉన్నప్పటికీ ఆరు శాతం సభ్యులకు కనీసం 50 శాతం హాజరు లేకపోవడం 24 శాతం సభ్యులకు 75 శాతం హాజరు కొరవడటం కించిత్తు ఆందోళన కలిగించే విషయమే. హాజరు శాతం మెరుగ్గానే కనబడుతున్నా, సభ్యులు చర్చల్లో పాల్గొనడం లేదనే గణాంకాలు సూచిస్తున్నాయి. బహుశా అందుకేనేమో భాజపా ఎంపీల కు ఇకమీదట తాను స్వయంగా పర్యవేక్షిస్తానని ప్రధాని మోడీ చెప్పి ఉంటారు.



కోట్ల రూపాయల ప్రజాధనం వృధా..

అయిదేళ్ల క్రితం (2012) లెక్కల ప్రకారం నిముషంపాటు లోక్‌సభ నడపడానికి రెండున్నర లక్షల రూపాయలు ఖర్చవుతుంది. అంటే గంటకు కోటిన్నర రూపాయల వ్యయమన్నమాట. సగటున లోక్‌సభ రోజుకు ఆరు గంటలు పనిచేస్తుంది. మొత్తం ఖర్చు తొమ్మిది కోట్ల రూపాయలు. రాజ్యసభ నిర్వహణకు రోజుకు రూ.5.5 కోట్లు వ్యయమవుతోంది. ఉభయ సభల్లో అంతరాయం ఏర్పడి ఒక గంటపాటు స్థంభిస్తే రూ.2.6 కోట్లు నష్టపోతున్నాం. నిరుడి శీతాకాల సమావేశాల్లో సుమారుగా రూ.246 కోట్లు ప్రజల సొమ్ము నీళ్లపాలైంది. ఇదంతా 2012 ప్రభుత్వ లెక్కల ప్రకారం తాజా గుణాంకాల ప్రాతిపదికన చూస్తే వృథా పోయిన మొత్తం కనీసం రూ.350 కోట్లకు పై మాటే ఉంటుంది. అనవసర వివాదాల పాలబడి సభాకాలం వృథా పోతున్నందున కీలక బిల్లులపై చర్చకు సమయం సరిపోవడం లేదు. దాంతో వాటిపై సమగ్రంగా చర్చించకుండానే ఆమోదించాల్సిన అనివార్యత తలెత్తుతోంది. ఫలితంగా చట్టాల్లో అనేక లొసుగులు చోటు చేసుకుంటున్నాయి. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టమే ఇందుకు చక్కటి ఉదాహరణ.

జీరో అవర్ సైతం....

ఏ మాత్రం సంబంధంలేని అంశాలపై వివాదాస్పద వ్యాఖ్య లు చేయడంవల్ల సభా పరిణామాలు గతి తప్పుతున్నాయి. అంతర్గత ప్రజాస్వామ్యం కొడిగట్టడంతో కొన్ని సందర్భాల్లో ఆయా పార్టీల అధినేతల సూచనల మేరకు యుక్తా యుక్తాలు మరచి సభ్యులు అనుచితంగా ప్రవర్తించడమూ సమస్యలకు కారణమవుతోంది. ప్రస్తుతం సభలో ఏదైనా ముఖ్యమైన అంశం లేవనెత్తాలం టే ప్రధానంగా తీర్మానం, ప్రశ్నసమ యం, శూన్యగంట (జీరోఅవర్) పాయింట్ ఆఫ్ ఆర్డర్ రూపంలో సభ్యులకు అవకాశముంది. ప్రశ్నల రూపంలో సభ్యులు ఏదైనా అంశం లేవనెత్తవచ్చు. కొన్ని రకాల ప్రశ్నలకు సంబంధిత మంత్రులు నేరుగా సభలోనే సమాధానం చెబుతారు. మంత్రి జవాబుపై తిరిగి రెండు ప్రశ్నలువేసే వెసులుబాటు సభ్యులకు ఉంటుంది. మరికొన్ని రకాల ప్రశ్నలకు సభలో నేరుగా కాక రాతపూర్వకంగా మంత్రులు సమాధానం ఇస్తారు. శూన్య గంటలో సభ్యులు ముఖ్యమైన విషయాల ను సభదృష్టికి తీసుకురావచ్చు. ఆరో దశకం వరకూ పార్లమెంటులో జీరో అవర్ లేదు. ఆ తరవాత దీన్ని తొలుత రాజ్యసభల్లో, అనంతరం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ప్రశ్నాసమయం తరవాత జీరో అవర్‌లో సభ్యులు స్పీకర్ అనుమతితో ప్రాధాన్యం ఉన్న ఏ అంశమైనా లేవనెత్తవచ్చు. అయితే జీరో అవర్ ఎంతో ఉపయోగకరం! అయినప్పటికీ అక్కడ పరి మితంగా మాత్రమే మాట్లాడే అవకాశం ఉంటుం ది. పా యిం ట్ ఆఫ్ ఆర్డర్ సభలో కేవలం నియమావళి ఉల్లం ఘనకు సం బంధించిన విషయాల్లో స్పష్టత ఇచ్చేందుకే ఉప యోగ పడుతుంది. సభలో ఏదైనా అంశంపై సభ్యులు చర్చ చేపట్టా లంటే అందుకు పరిమితమార్గాలు మాత్రమే ఉన్నాయి.

అసెంబ్లీలలో అంతంతమాత్రమే..

రాష్ట్రా ల్లో శాసనసభల పరిస్థితి మరింత అధ్వాన్నం. 2009 - 2014 మధ్యలో లోక్‌సభ ఏడాదికి సగటున 69 రోజులు సమావేశమైతే, హరియాణాలో శాసనసభ ఏడాదికి 11 చొప్పున మొత్తం 54 రోజులు సమావేశమయ్యాయి. కేరళ అసెంబ్లీ సగటున ఏడాదికి 50 రోజులు, తమిళనాడు సభ 44 రోజుల పాటు సమావేశమయ్యాయి. చాలా రాష్ట్రాల్లో బిల్లులు ప్రవేశపెట్టిన రోజునే కనీస చర్చ సైతం చేపట్టకుండా వాటిని సభలో ఆమోదించేస్తున్నారు. చట్టాలు తీసుకువస్తున్నారు. బిల్లులోని సాంకేతిక అంశాలను కూలంకషంగా చర్చించే స్థాయీ సంఘాలూ అనేక రాష్ట్రా ల్లో లేవు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్, హరియాణా వంటి రాష్ట్రా లు అంశాలవారీగా నిపుణుల కమిటీలు వేసి చట్టాల రూపకల్పనలో కాస్తముందడుగు వేశాయి. అత్యధిక రాష్ట్రా ల్లో శాసనసభల పనితీరు ఇప్పటికీ అంతంత మాత్రమే. దేశ భవితకు కీలకావసరమైన విద్యా విధానం గురించి చట్టసభల్లో ఎంతమేరకు చర్చించారన్న లెక్కతీస్తే నిరాశే మిగులుతుంది. ఈ దేశంలో అయిదో తరగతి విద్యార్థుల్లో కనీసం సగం, నాలుగు వాక్యాలు సరిగ్గా చదవలేని, సామాన్య గణితమూ చేయలేని స్థితిలో ఉన్నారని అధ్యయనాలు ఘోషిస్తున్నాయి. ఇంతటి సమస్యపై ఎన్నిసార్లు ఎంతసేపు పార్లమెంటులో చర్చించింది? మరోవంక కనీస మౌలిక సౌకర్యాలు కొరవడి ప్రభుత్వాసుపత్రుల్లో నిత్యం వందలమంది తుది శ్వాస విడుస్తున్నారు. దేశానికి అనారోగ్య హేతువుగా పరిణమించిన ఈ సమస్యపై ఎన్నిసార్లు ఎంతసేపు చట్టసభల్లో మాట్లాడారన్న లెక్క తేలిస్తే నిర్వేదమే మిగులుతుంది. న్యాయ వ్యవస్థ ఎదుర్కొంటున్న కొన్ని సమస్యల కారణంగా తీర్పుల్లో విపరీతమైన జాప్యం జరుగుతోంది. ఫలితంగా వివిధ సందర్భాల్లో న్యాయార్థులకు అన్యాయమే ఎదురవుతోంది. ఇంతటి కీలకాంశంపై ఎన్నిసార్లు చట్టసభలు చర్చించాయి? పంతాలు, పట్టింపుల రూపేణా విలువైన సభాకాలాన్ని, ధనాన్ని వృధా చేస్తున్నారు.

కీర్తి నాగరాజు, 9652404611

చరిత్రలో ఈ రోజు



- **1948:** మహాత్మా గాంధీ తన చివరి దీక్షను ప్రారంభించారు. దేశ విభజనానంతరం చోటుచేసుకున్న హింసతో కలత చెందిన ఆయన ఈ దీక్షకు పూనుకున్నారు. జనవరి 30న హత్యకు గురయ్యారు.
- **1954:** న్యూజిలాండ్ పార్లమెంటును క్వీన్ ఎలిజబెత్-2 ప్రారంభించారు.
- **1960:** ఇంగ్లండ్‌తో క్రికెట్ టెస్ట్‌మ్యాచ్‌లో వెస్టిండీస్‌కు చెందిన గ్యారీ సోబర్స్, వారెల్ జంట నాలుగో వికెట్‌కు 399 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.
- **2010**ఫ హైతీలో పెనుభూకంపం. లక్షా అరవైవేలమంది దుర్మరణం.

యువతకు స్ఫూర్తి ప్రదాత




నేడు జయంతి

బలమే జీవనం, బలహీనతే మరణం.... మనస్సులో ధైర్యం, హృదయంలో ప్రేమ.... ఉన్నవానిని నన్ను అనుసరించనివ్వండి. నాకు ఇంకెవరూ వద్దు. మీలో దివ్యత్వాన్ని అభివ్యక్తీకరించడమే మతం.... ఇలాంటివి వేలకొలది సూక్తులు మానవాళికి అందించిన స్వామి వివేకానంద పేరు తెలియని వారు లేరంటే అతిశయోక్తి కాదు. వివేకానందుని జన్మదినమైన జనవరి 12వ తేదీని జాతీయ యువజన దినోత్సవంగా పాటిస్తాం. ఆధునిక యుగపు ఆధ్యాత్మికవేత్తలలో ఆయన ఒకరు. ఆధ్యాత్మికతను, సామరస్యానికి, గొప్ప సంస్కృతికి భారతభూమి నిలయమని వారు గ్రహించేలా చేశారు. ఆయన అసలు పేరు నరేంద్రనాథ్. 1863 జనవరి 12వ తేదీన జన్మించారు. ఆయన ప్రతిభను చూసిన ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హేస్టీ తన పాతికేళ్ల అనుభవంలో ఇంత తెలివితేటలు ఉన్న విద్యార్థిని చూడలేదని పేర్కొన్నాడు. ఆయనకు బాల్యం నుంచి దేవుడు ఎక్కడున్నాడో తెలుసుకోవాల న్న తపన ఉండేది. శ్రీరామకృష్ణ పరమహంస వద్దకు వెళ్తే ఆయన నీ సందేహాలన్నీ తీరుస్తారని ఎవరో సలహా ఇవ్వడంతో శ్రీరామకృష్ణుల వద్దకు వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. శ్రీరామకృష్ణులసొంత గ్రామం కామార్పుకూరు ఆయన ఆ సమయంలో కలకత్తా నగరానికి ఉత్తరంగా ఉన్న దక్షిణేశ్వర కాళికాలయంలో నివసిస్తూ ఉండేవారు. శ్రీరామకృష్ణులు మహాశక్తి సంపన్నులే కాదు. ఆయన జీవితం పవిత్రతకి ప్రతిరూపమని గ్రహించాడు నరేంద్రుడు. శ్రీరామకృష్ణులకు కూడా తన శిష్యునిపై అఖండ విశ్వాసముండేది. నరేంద్రుడు ప్రపంచాన్ని కదిలించగల శక్తివంతుడనీ, ఇతర శిష్యులు నక్షత్రాల లాంటి వారైతే, నరేంద్రుడు సూర్యుడనీ అందరి తోనూ నిర్మొహమాటంగా చెప్పేవారు. వివేకానం దుడు అమెరికాలో హార్వర్డ్ విశ్వవిద్యాలయ పండితుడు ప్రొఫెసర్ రైట్‌తో ఆయనకు పరిచయం ఏర్పడింది. విశ్వమత మహాసభలలో హైందవ ధర్మానికి ప్రాతినిధ్యం వహించాల్సిందిగా ఆయనను ప్రొఫెసర్ రైట్ కోరారు. తాను వచ్చింది అందుకనే నని, కానీ తన వెంట ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేవని, అందువల్ల సభలో పాల్గొనడం కుదరదని విన్నానని తెలిపారు. అది విని విస్తుపోయిన ఆ అమెరికా పండితుడు స్వామీ మిమ్మల్ని ధ్రువపత్రా లు అడగడమంటే సూర్యుడికి ప్రకాశించేహక్కు ఎవరిచ్చారని అడగడమే అని సమాధానమిచ్చారు. 1893 సంవత్సరం సెప్టెంబర్ 11వ తేదీ సోమవారంనాడు విశ్వమత మహాసభలు మొదలైనా యి. కొలంబస్ హాల్ అనే ఒక పెద్ద భవనంలో జరిగాయి స్వామీజీ మాట్లాడే వంతు వచ్చింది, ముందుగా సరస్వతీదేవిని తలచుకుని, శ్రావ్యమైన ఆయన కంఠంతోనూ, అంతకంటే మధురం, పరమ పవిత్రమైన ఆయన హృదయాంతరాళాలలో నుంచి వచ్చిన విశ్వమానవ సౌభ్రాతృత్వ భావనలోనూ, నా అమెరికా దేశ సోదర సోదరీమణులారా అని మొదలుపెట్టారు భారతీయ ధర్మం అన్ని మతాలను అంగీకరిస్తుందని, గౌరవిస్తుందనీ అన్ని మతాలు సత్యాలేననీ,ఎన్ని మతాలున్నా, అవన్నీ భగవం తుడిని చేరుకోవడానికి మార్గాలేనని స్వామీజీ చెప్పారు. ఎవరూ మతాన్ని మార్చుకోవాల్సిన అవసరం లేదనీ, నా మతమే గొప్పది, నా మతమే నిలవాలి అనుకునేవారు బావిలో కప్పవంటివారని స్వామీజీ తెలిపారు. చికాగో నగరంలోని ధనవంతు లూ, ప్రముఖులూ స్వామీజీకి ఆతిథ్యం ఇవ్వడం కోసం పోటీ పడ్డారు. 1894 సంవత్సరం చివర్లో స్వామీజీకి ఇక ప్రయాణాలు చాలనిపించింది. 1895 జూన్ నెల మొదట్లో స్వామీజీ న్యూయార్క్ వెళ్లారు. అక్కడ 12 మంది ఆంతరంగిక శిష్యులతో ఏడువారా లు గడిపారు. గుడువిన్, సోదరి క్రిస్టీన్ జీవితాంతం స్వామీజీకి శిష్యులుగా మారారు. 1897 జనవరి 15న స్వామీజీ స్వదేశంలో కాలుపెట్టారు. 1902, జూలై 4వ తేదీన ధ్యానముద్ర చేస్తూనే స్వామీజీ కన్నుమూశా రు. కానీ, ఆయన ప్రవేశ పెట్టిన సిద్ధాంతాలూ, కార్య క్రమాలూ కొనసాగుతూ నే ఉన్నాయి. లేవండి, మే ల్కొనండి గమ్యం చేరే వరకు విశ్రమించకండి అని దేశ ప్రజలందరికీ పిలుపునిచ్చారు. స్వామి వివేకానం దు డు యువతకు స్ఫూర్తిదాత, మార్గదర్శి ఆయన ప్రతీ సూక్తి నినాదాలు యువతను, అన్నివర్గాల ప్రజలను ఉత్తేజింపచేస్తాయి.

-కామిడి సతీష్‌రెడ్డి (టీచర్) 9848445134

సూటిమాట




ఆధార్ సమాచార రక్షణపై కేంద్రం చాలా ఆలస్యంగా స్పందించింది. కొత్తగా వర్చ్యువల్ నెంబర్‌ను కేటాయించడం తలతిక్క చర్య. గుర్రాన్ని కట్టేసిన తరవాత, దాన్ని అదుపు చేయడానికి ప్రయత్నించడం లాంటిదే ఇది. ఇప్పటికే కోట్లాదిమంది తమ ఆధార్ వివరాలను బలవంతంగా వివిధ సంస్థలకు ఇచ్చేశారు

-పి. చిదంబరం, కేంద్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి

మానవాళికి మహోపకారి

మెట్రిక్యులేషన్ రెండుసార్లు తప్పిన సగటు విద్యార్థి, మెడికల్ కోర్సుల్లో కూడా పాస్ మార్కులు పొందలేని విద్యార్థి, ఎనిమిది రోజుల వ్యవధిలో ఇద్దరు సోదరుల్ని పోగొట్టుకున్న అభాగ్య విద్యార్థి, సన్యాసుల్లో కలిసిపోవాలని పరితపించిన విద్యార్థి టెర్రామైసిన్, టెట్రాసైక్లిన్ లాంటి మందులను కనుగొన్నారంటే విశ్వసించగలమా? ఫోలిక్ యాసిడ్‌ని కనిపెట్టి, స్ప్రూ వ్యాధి జాడ ఈ భూగోళంపై లేకుండా చేశాడంటే నమ్మగలమా? క్షయరోగ నివారణకు బసాని కోటి నికాసిడ్, హైడ్రాజైజ్ మందులను మానవాళికి అందించాడంటే అంగీకరించగలమా? బోదకాలు, టైఫాయిడ్, పాండురోగం లాంటి భయంకర వ్యాధుల నుంచి మానవాళికి విముక్తి కలిగించారు. ఆయనే డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు.

1895 జనవరి 12న సుబ్బారావు జన్మించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం వారి స్వస్థలం. చిన్నతనంలోనే తండ్రి చనిపోయారు. స్ప్రూ వ్యాధిసోకి ఇద్దరు సోదరులు చనిపోయారు. ఫలితంగా మెట్రిక్ రెండుసార్లు తప్పారు. కాశీకి వెళ్ళిపోయాడు. సన్యాసిగా మారాలని స్థిరనిశ్చయానికి వచ్చారు. రామకృష్ణ మఠంలో చేరే ప్రయత్నం చేశారు. అతని మానసిక స్థితిని గ్రహించిన మఠం నిర్వాహకులు, అతన్ని హిందూ హైస్కూలులో చేర్పించారు. అక్కడి మెట్రిక్ చదివారు. మెట్రిక్ తప్పాడు. స్నేహితులు అతన్ని ఓదార్చి, మళ్ళీ మెట్రిక్ పరీక్ష రాయించారు. మెట్రిక్ పాసయ్యాడు సుబ్బారావు. అటు తర్వాత ప్రెసిడెన్సీ కళాశాలలో చేరి ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. మద్రాసు మెడికల్ కళాశాలలో చేరి పట్టభద్రుడయ్యాననిపించుకొన్నారు.సుబ్బారావు స్వతహాగా స్వాతంత్ర్యభావాలు కలిగిన వాడు. స్వాతంత్ర్య పోరాటం జరుగుతున్న రోజులవి. ఆపరేషన్ థియేటర్ డ్రెస్ కోడ్‌ను ఉల్లంఘించి ఖద్దరు దుస్తులతో ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్ళాడు. బ్రిటిష్ ప్రొఫెసర్ ఆగ్రహించారు. ఎంబిబిఎస్ డిగ్రీ రాకుండా, కేవలం యల్ఎంఎస్



నేడు డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు జయంతి

(లైసెన్స్‌డ్ మెడికల్ సర్వీస్)కి పరిమితం చేశారు. ఆ సర్టిఫికెట్‌తో మద్రాసు మెడికల్ సర్వీసులో చేరటం సాధ్యంకాక, డాక్టర్ ఆచంట లక్ష్మీపతి స్థాపించిన ఆయుర్వేద కళాశాలలో అధ్యాపకునిగా చేరారు. ఆ కాలంలో మద్రాసు వచ్చిన అమెరికన్ డాక్టర్‌తో సుబ్బారావుకు పరిచయమైంది. ఆయన జీవితానికి అది ప్రధానమైన మలుపు. సుబ్బారావులోని పట్టుదలను, ప్రజ్ఞను పసిగట్టిన ప్రముఖులు కొందరు ఆయన ఉన్నతస్థాయికి ఎదగడానికి సహకరించారు. మల్లాది సత్యలింగ నాయకర్ ధర్మసంస్థ ఆర్థిక సహాయంతో 1923లో అమెరికా వెళ్ళారు. హార్వర్డ్ స్కూల్ ఆఫ్ ట్రాపికల్ మెడిసిన్ సంస్థలో లైబ్రేరియన్‌గా చేరారు. జీవరసాయన శాస్త్రంలో అభిరుచిని పెంచుకొన్నారు. డాక్టర్ ఓటో పోలిన్ అనే ప్రొఫెసర్ నేతృత్వంలో పరిశోధనలు సాగించి, 1930లో పి.హెచ్‌డి పట్టా అందుకొన్నారు. 1945లో వారి పరిశోధనలు ఫలించాయి. ఫోలిక్ ఆమ్లం నుంచి, బంగారు వన్నె భస్మాన్ని కనుగొన్నారు. ఆ భస్మం స్ప్రూవ్యాధి నిర్మూలనకు ఉపయోగపడింది. 1948లో అమెరికా ప్రభుత్వమే సుబ్బారావుకు అమెరికా పౌరసత్వం ప్రకటించింది. 1948 ఆగస్టు 9న సుబ్బారావు అమెరికాలోనే మరణించారు.

-దాసరి ఆళ్వారస్వామి

అంతా కల్తీమయం



- మహబూబ్‌నగర్, గద్వాల జిల్లాల్లో జోరుగా నిత్యావసర వస్తువుల కల్తీ
- బియ్యంలోనూ మోసాలకు పాల్పడుతున్న వ్యాపారులు • పాలు, కారం కల్తీతో అనారోగ్యానికి గురవుతున్న ప్రజలు • వ్యాపారుల మాయాజాలం
- నామమాత్రపు తనిఖీలతో చేతులు దులుపుకుంటున్న అధికారులు

మహబూబ్‌నగర్, ప్రభ న్యూస్ : మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో కల్తీ వ్యాపారం గుట్టుచప్పుడు కాకుండా జోరుగా సాగుతుంది. బియ్యం, పప్పులు, ఉప్పులే కాకుండా నూనె, నెయ్యి, పసుపు, పాలతోపాటు ఏకంగా ద్విచక్ర వాహనాల్లో పోసే పెట్రోల్ కూడా కల్తీకి పాల్పడుతున్నారు. కల్తీ వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతున్నప్పటికీ అధికారులు ఎక్కడా దాడులు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. గుట్టుచప్పుడు కాకుండా కల్తీ వ్యాపారం చేస్తుండడంతో నిరక్షరాస్యులైన గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలు వాటిని వినియోగించి అనారోగ్యం బారిన పడుతున్నారు. కల్తీ వ్యాపారం చేసినట్లయితే దాడులు చేయడంతోపాటు కేసులు పెట్టాలంటూ ఆదేశాలు ఉన్నప్పటికీ జిల్లాలో కల్తీగాళ్లు తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు...ఆరు కాయలుగా సాగిస్తున్నారు.

కల్తీ అవుతున్న నూనె..

జిల్లాలో కల్తీ నూనె వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతుంది. కేవలం నూనె తయారికి అనుమతులు తీసుకున్న వారు కల్తీకి పాల్పడుతూ దర్జాగా ప్యాకెట్ల రూపంలో నూనెను విక్రయిస్తున్నారు. గిట్టుబాటు కావడం లేదనే ఆలోచనతో కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా అధికారుల కళ్లుగప్పి ఈ కల్తీ నూనె వ్యాపారానికి తెర లేపుతున్నారు. నిజానికి ఆయిల్ మిల్లులో ఒరిజినల్‌గా పల్లి నూనెను విక్రయించాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వం బ్లండెడ్ ఆయిల్‌కు అనుమతి ఇవ్వగా, దానికి సాకుగా చేసుకుని వ్యాపారులు కల్తీలకు పాల్పడుతున్నారు. బ్లండెడ్ ఆయిల్‌లో 80శాతం మేరకు వేరుశనగ నూనె, 20శాతం మేరకు పామాయిల్ కలుపుకుని ప్యాకెట్ తయారు చేసి, ఏది ఎంత మోతాదులో ఉందో స్పష్టంగా కనిపించేలా ముద్రించాల్సి ఉంది. కాని వ్యాపారులు తక్కువ ధరకే లభిస్తున్న పామాయిల్, రైస్ బార్న్ ఆయిల్, సోయా ఆయిల్‌ను 80శాతం మేరకు తీసుకుని, 20 శాతం మేరకే వేరుశనగ నూనెలో కలిపి మోసాలకు పాల్పడుతున్నారు. వేరుశనగ బొమ్మలను కవర్‌పై పెద్దగా ముద్రించి వినియోగదారులను ఆకట్టుకుంటున్నారు. నిజానికి ఒరిజనల్ పల్లి నూనె ధర కిలోకు రూ. 120నుంచి రూ. 130ల వరకు ఉంటుంది. కాని ఇప్పుడు వ్యాపారులు కల్తీలకు పాల్పడి తయారు చేసిన పల్లి నూనె ధర రూ. 65నుంచి రూ. 70ల వరకు ఉంటుంది. వినియోగదారులకు తక్కువ ధర అంటూ కిలోకు రూ. 100నుంచి రూ. 110లకు విక్రయిస్తున్నారు.

అనారోగ్యం బారిన ప్రజలు..

కల్తీ నూనె సేవించిన ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. కల్తీ నూనెతో చేసిన పదార్థాలు తినడం వల్ల అసిడిటి వస్తుంది. అలాగే క్యాన్సర్, బ్రెయిన్ ట్యూమర్ వంటి ప్రాణాంతక వ్యాధులు సోకవడంతో ఆసుపత్రుల పాలవుతున్నారు.

బియ్యంలోనూ మోసం..

తెలంగాణ ప్రాంతంలో ఎక్కువగా ప్రజలు ఆహారంగా బియ్యాన్ని వంట చేసుకుని తింటుంటారు. అందుకే ఈ ప్రాంతంలో బియ్యానికి మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్ ఉంది. దీనిని ఆసరాగా చేసుకున్న వ్యాపారులు బియ్యంలోనూ మోసానికి పాల్పడుతున్నారు. దొడ్డు బియ్యాన్ని తీసుకుని డబుల్ పాలిసింగ్ చేస్తూ సన్న బియ్యం పేరిట వినియోగదారులకు అంటగడుతున్నారు. బీపీటీ, హెచ్‌ఎంటీ అని సన్నబియ్యాన్ని చూపించి వ్యాపారులు విక్రయిస్తుంటే గుర్తించలేక వినియోగదారులు మోసపోతున్నారు. వాస్తవానికి నాసీరకం, మంచి రకం బియ్యంలో నాణ్యతతోపాటు ధరల్లో కూడా బాగా వ్యత్యాసం ఉంటుంది. ధరల్లో కిలో రూ. 5నుంచి రూ. 20ల వరకు తేడా ఉంటుంది. ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ ద్వారా రూపాయికే కిలో బియ్యాన్ని విక్రయిస్తుండగా, కొందరు వ్యాపారులు వాటిని తక్కువ ధరకే కొనుగోలు చేసి, డబుల్ పాలిసింగ్ చేస్తూ సన్నగా మారుస్తున్నారు. పాలిష్, స్టీమింగ్‌లో కొన్ని మెళకువలు పాటించడంతో సన్నబియ్యానికి, దొడ్డు బియ్యానికి తేడా కనపడకుండాపోతుంది. ఓ దశలో ధాన్యం పండించేరైతు కూడా గుర్తు పట్టలేనంత వీలుగా తయారు చేసి బీపీటీ, హెచ్‌ఎంటీ రకం బియ్యంలో వాటిని కలుపుతూ కల్తీకి పాల్పడుతున్నారు. దీనిపై గతంలో అధికారులు తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేసిన సంఘటనలు ఉన్నప్పటికీ వ్యాపారుల్లో మార్పు రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.





కల్తీ పాలతో అనారోగ్యం..

డిమాండ్‌కు సరిపడా పాల ఉత్పత్తి లేకపోవడంతో వ్యాపారులు కల్తీకి తెర లేపుతున్నారు. కొందరు గ్రామాల నుంచి తెస్తున్న ఒరిజినల్ పాలలో ప్యాకెట్లు కొనుగోలు చేసి వాటిని కలుపుతూ ఒరిజినల్ పాల పేరిట వినియోగదారులకు విక్రయిస్తున్నారు. షాంపోను గిన్నెలో పోసి, దానిలో కొంత నూనె వేసి బాగా కలిపితే దాని నుంచి తెల్లటి పాల వంటి నురుగ వస్తుంది. దానికి పాల ఫ్లేవర్స్‌ను కలిపి పాలు తయారు చేస్తున్నారు. ఇటీవల కొందరు యూరియా నుంచి కూడా పాలు తయారు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ కల్తీ పాల వల్ల కాలేయంతోపాటు జీర్ణ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుంది.

కారం పొడి కల్తీ..

కారం పొడిలో రంపపు పొట్టు, తవుడును కలుపుతుంటారు. రంగు వచ్చేలా కాంగోరెడ్ అనే కెమికల్‌ను కలుపుతుంటారు. ఇది పెట్రోలియం బై పొడక్ట్. ఈ కల్తీ కారంపొడి వాడకం వల్ల క్యాన్సర్‌లాంటి భయంకర రోగాలు వస్తుంటాయి. జిల్లా అధికారులు స్పందించి కల్తీ వ్యాపారంపై ప్రత్యేక దృష్టిసారించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పాలను, కారాన్ని గుర్తించడమెలా..

కల్తీ పాలను గుర్తించాలంటే వేడి పాలను గ్లాసులో తీసు కని, నిమ్మరసం పిండితే పాలు విరిగిపోవాలి. అలాగే విరిగిపోలేదంటే వాటిని కల్తీ పాలుగా గుర్తించవచ్చు. అలాగే కారం టీ స్పూన్, బాత్ రూమ్ క్లీన్ చేసే యాసిడ్ కొద్దిగా మిక్స్ చేయాలి. కారం పొడి మొత్తం గులాబీ రంగులోకి మారుతుంది. కొద్ది సేపటి తరువాత కొన్ని నీళ్లు పోస్తే ఎరుపు రంగులోకి వస్తే అది నిజమైన కారం పొడి అని గుర్తించాలి.

సంగీత నిరసన ఫలించింది


- ఇంట్లోకి తీసుకెళ్లాలని ఫ్యామిలీ కోర్టు ఆదేశం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్ బోడుప్పల్‌లో 54 రోజులుగా తన పాపను ఒడిలో పెట్టుకుని నిరసన తెలుపుతున్న సంగీత ఎట్టకేలకు గురువారం అత్తింట్లో తిరిగి అడుగుపెట్టింది.టీఆర్ఎస్ మాజీ నేత శ్రీనివాస్‌రెడ్డి భార్య సంగీతను కొట్టిన దృశ్యాలు 54 రోజుల క్రితం మీడియాలో సంచలనం కలిగించిన విషయం విదితమే. హైదరాబాద్‌లోని మియాపూర్ ఫ్యామిలీ కోర్టు గురువారం సంగీత కేసులో పలు ఆదేశాలు జారీ చేసింది. సంగీతను భర్త శ్రీనివాసరెడ్డి గౌరవప్రదంగా ఇంటికి తీసుకెళ్లాలని చెప్పింది. అంతేకాకుండా ప్రతి నెల రూ.20 వేలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే, శ్రీనివాస్‌రెడ్డి మాత్రం కోర్టులో పిటిషన్ దాఖలు చేస్తానని అంటున్నారు. కోర్టు తీర్పుతో గురువారం పలువురు అధికారులు సంగీత ఇంటికెళ్లి ఆమెను ఇంట్లోకి పంపారు. ఇంటికి తాళాలు వేసి ఉండటంతో ఆ తాళాలను సుత్తితో సంగీత స్వయంగా పగులగొట్టింది. సంగీత భర్త, అత్తమామలు గురువారం మియాపూర్ ఫ్యామిలీ కోర్టుకు హాజరయ్యారు.


ఏపీ మంత్రి దేవినేని నుంచి ప్రాణహాని

- పోలీసులను ఆశ్రయించిన దంపతులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఏపీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో తమ భూమి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారంటూ ఏపీకి చెందిన సురేష్-ప్రనిజలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ యూసుఫ్‌గూడలో నివాసముంటున్న సురేష్-ప్రనిజలు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో మంత్రి దేవినేని ఉమ, ఆయన అనుచరుల నుంచి తమకు ప్రాణహాని ఉందంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు రక్షణ కల్పించాలని కోరారు. తమకు బెదిరింపులు వస్తున్నాయని వారు ఆరోపించారు. అమరావతిలో ఉన్న భూమికి సంబంధించి దేవినేని కుటుంబానికి, ప్రనిజ దంపతులకు కొన్ని రోజులుగా గొడవ జరుగుతోంది. ఈ క్రమంలో బాధితులు విజయవాడలో పలుసార్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సివిల్ కోర్టులో కూడా కేసు నమోదు చేశారు. అయినా వేధింపులు ఆగలేదు సరికదా.. గతంలో ప్రనిజపై దాడి కూడా చేశారు.

'గజల్' బెయిల్‌పై నేడు వాదనలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : లైంగిక వేధింపుల కేసులో అరెస్టై చంచల్‌గూడ జైలులో గజల్ శ్రీనివాస్ ఇప్పుడు తోటి ఖైదీలతో కలిసిపోతున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. శనివారం జైలులో జరిగిన యోగా శిక్షణా శిబిరం ప్రారంభోత్సవంలో గజల్స్ పాడి తోటి ఖైదీలను ఆకట్టుకున్నట్లు తెలుస్తోంది. జైలుకు వచ్చినప్పటి నుంచి అతడి సతీమణి, కుమార్తె ములాఖత్‌కు రాలేదని కూడా తెలుస్తోంది. అతడి తరపు న్యాయవాది, బంధువులు మాత్రమే కలిసివెళ్లారు. లైంగిక వేధింపుల కేసులో అరెస్టైన శ్రీనివాస్‌ను తమ కస్టడీకి ఇవ్వాలన్న పం జాగుట్ట పోలీసుల పిటిషన్‌ను గురువారం నాంపల్లి కోర్టు కొట్టివేసింది. గజల్ శ్రీనివాస్ నుంచి ఎటువంటి రికవరీ అవసరం లేదని పోలీసులు రిపోర్ట్‌లో పేర్కొన్నందున కస్టడీకి ఇవ్వాల్సిన అవసరం లేదని న్యాయమూర్తి తెలిపారు. కస్టడీ పిటిషన్‌ను తిరస్కరించిన నేపథ్యంలో శుక్రవారం గజల్ శ్రీనివాస్ మళ్లీ వేసిన బెయిల్ పిటిషన్‌పైన వాదనలు జరగనున్నాయి.

బండ్ల గణేష్‌పై అట్రాసిటీ కేసు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: టాలీవుడ్ నిర్మాత బండ్ల గణేష్, అతడి సోదరుడు శివబాబులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైందని ఏసీపీ సురేందర్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణానికి చెందిన డాక్టర్ దిలీప్ చంద్రకు ఫరూఖ్ నగర్ మండలం, బూర్గుల శివారులో పౌల్ట్రీఫామ్‌లు, భూములున్నాయి. వీటిని కొనుగోలు చేసేందుకు బండ్ల గణేష్ గతంలో ఒప్పందం చేసుకున్నారు. ఒప్పందం ప్రకారం ఈ ఆస్తులపై ఉన్న బ్యాంకు రుణాలను చెల్లించి, రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. అయితే, నిర్ణీ త సమయంలోగా రుణాలను చెల్లించకపోవడంతో.. ఈ ఆస్తు లను, దిలీప్ చంద్ర ఇంటిని బ్యాంకు అధికారులు సీజ్ చేశారు. అయితే తనకు రావాల్సిన డబ్బుల కోసం దిలీప్ చంద్ర, ఆయన భార్య, కౌన్సిలర్ కృష్ణవేణితో కలిసి బూర్గుల శివారులో గల గణేష్ పౌల్ట్రీ ఫామ్ కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా తమను గణేష్, అతని సోదరుడు శివబాబు కులం పేరుతో దూషించారంటూ కృష్ణవేణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో, బండ్ల గణేష్ సోదరులపై అట్రాసిటీ కేసు నమోదైంది.

రిటైర్డ్ నేవీ ఆఫీసర్‌పై దాడి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : నగరంలోని మాసబ్ ట్యాంకు ప్రాంతంలో ఓ అపార్ట్‌మెంట్ వద్ద దుండగులు కత్తులు, తల్వార్లతో వీరంగం సృష్టించారు. అపార్ట్‌మెంట్ సెల్లార్‌లోకి జొరబడి రిటైర్డ్ నేవీ ఆఫీసర్ ఇక్రమ్ ఖలీమ్‌పై కత్తులు, తల్వార్లతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఇక్రమ్‌ను స్థానికులు ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. భూవివాదాలే ఈ దాడికి కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దాడి దృశ్యాలు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. వాటి ఆధారంగా దుండగులను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

ముంబై మోజో బ్రిస్టో యజమానికోసం


హైదరాబాద్‌లో గాలింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ముంబై మోజో బ్రిస్టో పబ్ యజమాని యుగ్‌తుని కోసం ముంబై పోలీసులు హైదరాబా ద్‌లో గాలింపు చర్యలు చేపట్టారు. మోజో బ్రిస్టో పబ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 14 మంది మృతి చెందారు. దీంతో, తనను అరెస్టు చేస్తారని భావించి యుగ్‌తుని హైదరాబాద్‌కు పారి పోయి వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ముంబై పోలీసులు యుగ్‌తుని జాడ కోసం అన్వేషణ కొనసాగిస్తున్నారు. ఇందు కోసం ముంబైకి చెందిన స్పెషల్‌టీమ్ పోలీసులు రంగంలోకి దిగి యుగ్‌తుని కోసం పూర్తిస్థాయిలో జల్లెడ పడుతున్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. స్థానికంగా ఓ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్న రేష్మి(18) తాము ఉంటోన్న అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి ఈ ఘటనకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని యువతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే రేష్మికి మతిస్థిమితం సరిగా లేదని ఆమె తల్లిదండ్రులు అంటున్నారు. కాగా, ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఇటలీలో వనపర్తివాసి మృతి



హైదరాబాద్, ఆంధ్రప్రభ వనపర్తి జిల్లా వాసి ఇటలీలో అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. వనపర్తి జిల్లా ఘణపురం మండలం మానాజీపేట గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ నిపుణుడు జయప్రకాష్ ఇటలీలో అనుమానా స్పద రీతిలో మృతి చెందాడు. ఇటలీలోని ఆస్ట్రియన్ సిటీలోని ఐబీఎం సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కొన్ని రోజులుగా అతడు ఆఫీసుకు రాకపోవడంతో సహచర ఉద్యోగులు ఇంటికి వెళ్లి చూడగా జయప్రకాష్ విగతజీవిగా కనిపించాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. ఇతనికి భార్యా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అసలు ఏం జరిగిందో దర్యా ప్తు జరిపించమని విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్‌ను కోరారు. అక్కడి అధికారులతో మాట్లాడి మృతదేహాన్ని స్వస్థలానికి త్వరగా పంపే ఏర్పాట్లు చేయాల్సిందిగా వారు కోరారు.

బీసీ బిల్లుకోసం ఢిల్లీకి అఖిలపక్షం

- లెజిస్లేచర్ కమిటీకి బీసీ సంక్షేమ సంఘం విజ్ఞప్తి



హైదరాబాద్,ఆంధ్రప్రభ : పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టడం కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. బీసీ బిల్లు పార్లమెంటులో పెట్టేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేస్తూ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య నేతృత్వంలో సంఘం నాయకులు గురువారం అసెంబ్లీలో బీసీ లెజిస్లేచర్ కమిటీకి విజ్ఞప్తి చేశారు. కమిటీని కలిసిన వారిలో గుజ్జ కృష్ణ, ఎస్ రామలింగం, కోట్ల శ్రీనివాస్, టిఆర్ చందర్, సిలుముల అశోక్, సతీష్ తదితరులు పాల్గొన్నారు. బీసీ లెజిస్లేచర్ కమిటీ చైర్మన్ ఉల్లోల గం గాధర్‌గౌడ్, సభ్యులు విటల్‌రెడ్డి, బాలసాని లక్ష్మినారాయణ, ఫరూఖ్ తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా: ముగ్గురి మృతి

పాన్‌గల్, ప్రభ న్యూస్ : వనపర్తి జిల్లా, పాన్‌గల్ మండల కేంద్రంలోని ప్రసిద్ధి గాంచిన బాలపీర్ల దర్గా సమీపంలో ట్రాక్టర్ బోల్తా పడి అందులో ప్రయాణిస్తున్న యువతితో పాటు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, బంధువుల కథనం ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా, బొందల పల్లి గ్రామానికి చెందిన బాలస్వామి మొక్కుబడి చెల్లించుకునేందుకు బాలపీర్ల దర్గాకు గురువారం తెల్లవారు జామున చేరుకుని, మధ్యాహ్నం మొక్కు బడి చెల్లించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. డ్రైవర్ మద్యం సేవించడంతో ట్రాక్టర్ నడపవద్దని బంధువులు వారించినప్పటికి వినకుండా ట్రాక్టర్ నడపడంతో దర్గా నుండి కిలో మీటర్ దూరంలో ఉన్న ఆర్అండ్‌బి రోడ్డుకు చేరుకున్న వెంటనే ట్రాక్టర్ అదుపుతప్పి పక్క పొలంలోకి దూసుకువెళ్లి బోల్తా పడడంతో డ్రైవర్ తిరు పతయ్య (45), మౌనిక (16) అక్కడికక్కడే మృతి చెందారు. ఇతర వాహనాలలో వచ్చిన బంధువులు, చుట్టు ప్రక్కల వారు గమనించి గాయపడిన ఏడుగురిని చికిత్స నిమిత్తం వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స నిమిత్తం ఏరియా ఆసు పత్రికి తరలించిన వారిలో మృతి చెందిన డ్రైవర్ తిరుపతయ్య భార్య తిరుపతమ్మ (40) చికిత్స పొందుతూ మృతి చెందింది.

28 పార్టీలతో బహుజన లెఫ్ట్ ఫ్రంట్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రంలో కొత్త ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక ఆవిర్భవించింది. 28 పార్టీలతో బహుజన లెఫ్ట్ ఫ్రంట్(బీఎల్ఎఫ్) ఏర్పడింది. దీనికి అధ్యక్షుడిగా నల్లా సూర్యప్రకాష్, కన్వీనర్‌గా తమ్మినేని వీరభద్రం ఎన్నికయ్యారు. జ్యోతిరావు పూలే, బీఆర్ అంబేద్కర్, మార్క్స్ ఆలోచనల మేళవింపుతో ఈ ఫ్రంట్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉన్న రాజకీయాలకు ప్రత్యామ్నాయ వేదికగానే బీఎల్ఎఫ్ ఏర్పాటు చేసినట్టు కన్వీనర్ తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఈ నెల 25న హైదరాబాద్‌లో 29 పార్టీలతో ఐక్యవేదిక బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సభకు సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి, ప్రకాశ్ అంబేద్కర్ మరికొందరు ప్రముఖ నేతలు వస్తారన్నారు. కొత్త పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఈ ఫ్రంట్ కాదని స్పష్టం చేశారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రజలకు మేలు చేసేందుకు పోరాడటమే ధ్యేయంగా ఫ్రంట్ పనిచేస్తుందని చెప్పారు. అంతేకాక పార్టీలు ధనికులకు దాసోహమవుతున్న విధానాన్ని మార్చడమే తమ లక్ష్యమన్నారు. సీపీఐ, న్యూడెమోక్రసీ, ఇతర వామపక్షపార్టీలను కూడా ఫ్రంట్‌లోకి ఆహ్వానిస్తున్నామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో 119 స్థానాల్లో పోటీ చేస్తామని బీఎల్ఎఫ్ అధ్యక్షుడు సూర్యప్రకాష్ స్పష్టం చేశారు.

కోడిపందేలపై నేడు సుప్రీంలో విచారణ



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: వివాదాస్పదంగా మారిన కోడిపందేలపై సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం వాదనలు విననుంది. సంక్రాంతి సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో మరీ ముఖ్యంగా గోదావరి జిల్లాల్లో జరిగే కోడిపందేలను హైకోర్టు నిషేధించిన విషయం తెలిసిందే. 2014లో దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు 2016లో తీర్పునిస్తూ కోడిపందేలను నిషేధిస్తున్నట్టు పేర్కొంది. ఈ తీర్పును సవాల్ చేస్తూ పిటిషనర్ రఘురామకృష్ణంరాజు స్పెషల్ లీవ్ పిటిషన్ అదే ఏడాది దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం, గతంలో రూపొందించిన నిబంధనల్లో 4వ నిబంధన (ఇళ్లల్లోకి వెళ్లి కోళ్లను సీజ్ చేయడం)ను సస్పెండ్ చేసింది. మరోవైపు పూర్తిగా కోడిపందేలను నిషేధించడాన్ని సవాల్ చేస్తూ ఈ ఏడాది జనవరి 4న రఘురామకృష్ణం రాజు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గురువారం జరిగిన వాదనల్లో సంక్రాంతి సమయంలో 144 సెక్షన్ విధించడాన్ని తప్పుబట్టారు. శనివారం నుంచి పండుగ మొదలవుతున్నందున నేడు కూడా వాదనలు వినాల్సిందిగా న్యాయస్థానాన్ని కోరారు. దీంతో ఈ రోజు కూడా సుప్రీం కోర్టులో కోడిపందేల కేసుపై వాదోపవాదాలు జరగనున్నాయి. రఘురామకృష్ణం రాజు తరపు న్యాయవాది గల్లా సతీష్ ఈ కేసు వివరాలను మీడియాకు వెల్లడిస్తూ, కోడిపందేలుగా పేర్కొనడం వల్ల ఇందులో జూదం ఉంటుందన్న భావన కలుగుతోందన్నారు. నిజానికి సంక్రాంతి సమయంలో కోళ్ల పోటీలు నిర్వహించడం సంస్కృతిలో భాగం అని తాము న్యాయస్థానానికి చెబుతామని పేర్కొన్నారు. పందెం లేదా జూదం లేకుండా కోళ్ల పోటీలు నిర్వహించేలా తాము న్యాయస్థానం నుంచి ఉపశమనం పొందుతామన్న ఆశాభావం వ్యక్తం చేశారు.


మళ్లీ చెడ్డీ గ్యాంగ్ కదలికలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్‌లో చెడ్డీ బనియన్‌గ్యాంగ్ మళ్లీ హడలెత్తిస్తోంది. మరల మియాపూర్, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో చెడ్డీబనియన్ గ్యాంగ్ కదలికలు కనిపించాయి. దీంతో ఆయా ప్రాంత ప్రజానీకం భయంతో వణికిపోతున్నారు. అత్యంత కిరాతక గ్యాంగ్ చెడ్డీ బనియన్ గ్యాంగ్ మధ్యప్రదేశ్, మహారాష్ట్రలకు చెందిన వీరు చెడ్డీ, బనియన్‌తో సంచరిస్తూ ఉంటారు. వీరు అనేక రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతూ హైదరాబాద్‌లో ప్రవేశించారు. ఇక్కడి శివారు ప్రాంతాల్లో చెడ్డీగ్యాంగ్ హల్‌చల్ చేస్తోంది. నిన్న మొన్నటివరకు శివారు ప్రాంతాలైన మియాపూర్, కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలలో తెగబడిన ఈ చెడ్డీ బనియన్ గ్యాంగ్ ఈ మారు మల్కాజ్‌గిరి వంటి ప్రాంతాల్లో సైతం సంచరించినట్లు తెలుస్తోంది. ఈ గ్యాంగ్ కదలికలకు సంబంధించిన కదలికలు సైతం సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైనా పోలీసులు ఇంతవరకూ ఈ చెడ్డీ బనియన్ గ్యాంగ్‌ని పట్టుకోలేకపోవడం గమనార్హం. ఈ గ్యాంగ్ ఆ ఇళ్లల్లో ప్రవేశించి దోపిడీ చేసిందన్న విషయం సదరు ఇంటి సభ్యులు చూసేదాకా తెలియదంటే ఎంత చాకచక్యంగా వీరు ఇళ్లలో చోరీలు చేస్తారన్నది అర్థమవుతోంది. ఓ వేళ తమ కదలికలు ఎవరైనా గుర్తించినా.. లేదా తాము చేస్తున్న పనికి అడ్డొచ్చినా ఈ గ్యాంగ్ సభ్యులు హత్యలు చేయడానికి వెనుకాడరు. ఇలాంటి భయానకమైన చెడ్డీ బనియన్ గ్యాంగ్ హైదరాబాద్‌లో యథేచ్ఛగా సంచరిస్తున్నా.. మరోవైపు అందుకు సంబంధించిన దృశ్యాలు సైతం సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైనా పోలీసులు చెడ్డీ బనియన్ గ్యాంగ్‌ని ఇంతవరకూ పట్టుకోకపోవడం గమనార్హం.

చెడ్డీ బనియన్ గ్యాంగ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచిస్తున్నారు తప్ప భయానకమైన ఈ గ్యాంగ్ సభ్యుల ఆచూకీని మాత్రం పోలీసులు పసిగట్టలేకపోతున్నట్లు తెలుస్తోంది. టెక్నాలజీ వినియోగిస్తున్నామని నేరం జరగకుండా.. ఒకవేళ నేరం జరిగిన క్షణాల్లోనే నేరసులను పట్టుకోవడం సాధ్యపడగలదని పోలీసులు ఢంకా బజాయించి చెబుతున్నారు. ఈ గ్యాంగ్ కదలికలు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సైతం కనిపిస్తున్నట్లుగా తెలుస్తోంది. కాగా, ఇటీవల వార్షిక సమావేశ సందర్భంలో చెడ్డీబనియన్ గ్యాంగ్ గురించి ప్రస్తావించిన సందర్భంలో పోలీసులు చాలా లైట్ తీసుకున్నారు. అది అంత ప్రాధాన్యత కలిగిన గ్యాంగ్ కానే కాదని కొట్టి పారేశారు. మరి అలా కొట్టి పారేసిన పోలీసులు చెడ్డీ బనియన్‌గ్యాంగ్ హల్‌చల్ చేసిన సందర్భంలో మాత్రం ఈ గ్యాంగ్ పట్ల చాలా అప్రమత్తంగా ఉండాలని, చోరీలకు పాల్పడే సమయంలో అడ్డొచ్చిన వారిని చంపేందుకు కూడా వెనుకాడదని స్థానిక ప్రజలకు సూచనలిస్తున్నట్లు సమాచారం. మరోవైపు చెడ్డీ బనియన్ గ్యాంగ్ అంత ప్రాధాన్యత లేనిదిగా కొట్టిపారేయడం వెనుక పోలీసుల అంతరార్థమేమిటి?

నేడు ప్రధానితో చంద్రబాబు భేటీ

- పోలవరం, నియోజక వర్గాల పెంపు, ప్రత్యేక ప్యాకేజీ అమలుపై కీలక చర్చ • పెండింగ్ అంశాలపై రానున్న స్పష్టత



అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం ఉదయం ప్రధానితో భేటీ అయ్యేందుకు గురువారం రాత్రి ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయం మోడీతో చంద్రబాబు సమావేశానికి అపాయింట్‌మెంట్ ఖరారు చేసింది. ఈ మేరకు గురువారం రాత్రి పొద్దుపోయేవరకు విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన ఆర్థిక, జలవనరులు, వ్యవసాయ, విద్యుత్, హోం, మునిసిపల్‌శాఖ ఉన్నతాధికారులతో భేటీ అయ్యి పలు అంశాలపై కూలంకషంగా చర్చించారు.

రాజధాని నిర్మాణానికి రూ. 11 వేల కోట్ల మేర నిధులను కేటాయించాల్సిందిగా ప్రధానిని కోరాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. రాజధానిలో నిర్మించే సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు, వివిధ ప్రభుత్వ శాఖల భవనాల సముదాయం, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధుల నివాసాల నిర్మాణం కోసం రూ.11 వేలకోట్లు అవుతుందని సీఆర్‌డీఏ అంచనాలు రూపొందించారు. అయితే, ఇప్పటికే రాజధాని నిర్మాణం కోసం కేంద్రం రూ. 1500 కోట్లను విడుదల చేసింది. ప్రధానితో భేటీలో సమయం ఉంటే రాజధాని డిజైన్లను ప్రధాని మోడీకి చూపించాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. ఇందుకోసం సీఆర్‌డీఏ అధికారులను కూడా ముఖ్యమంత్రి తనతోపాటు ఢిల్లీకి తీసుకెళ్లారు.ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన హామీలు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, ప్రత్యేక ఆర్థిక సహాయం, శాసనసభ నియోజకవర్గాల పెంపునకు సంబంధించిన అంశాలపై మోడీతో ముఖ్యమంత్రి చర్చించనున్నారు. 16,000 కోట్ల రూపాయల రెవెన్యూ లోటుతో పాటు ముఖ్యమంత్రుల సమావేశంపై సైతం చర్చించే అవకాశాలున్నాయి. విశాఖ రైల్వే జోన్, విదేశీ ఎయిడెడ్ ప్రాజెక్టులు, రానున్న సాధారణ ఎన్నికలలో జనసేన పార్టీ పోటీ చేసే అవకాశాలున్న నేపథ్యంలో మరో 50 నియోజకవర్గాలను పెంచాలనే విషయమై ముఖ్యమంత్రి ప్రధానంగా ప్రధానితో ప్రస్తావిస్తారని తెలిసింది.

టిడిపి, జనసేన, తెలుగుదేశం కలిసి పోటీ చేసిన పక్షంలో అసెంబ్లీ సీట్ల పెంపు అనివార్యమే అనే సంకేతాలను ఇవ్వనున్నారు. ఈ భేటీని రాజకీయంగా కూడా వినియోగించుకోవాలనే యోచనలో ముఖ్యమంత్రి వుండటంతో సమావేశానికి ప్రాధా న్యత ఏర్పడింది. ఈ భేటీవల్ల భవిష్యత్ రాజకీయ పరిణామాలపై స్పష్టత వచ్చే అవకాశాలు వున్నాయి. జనసేనతో కలిసి ఎన్నికల బరిలోకి దిగాలంటే సీట్ల పెంపుదల చేయాల్సిందేననే సంకేతాలను సమావేశంలో చంద్రబాబు ఇచ్చే అవకాశాలు లేకపోలేదు. కేంద్రం సహకారం కావాల్సిన ఇండస్ట్రియల్ కారిడార్‌ల విషయంలో ముఖ్యమంత్రి ప్రధాని వద్ద ప్రస్తావిస్తారు. ఇప్పటికే వ్యూహాత్మకంగానే కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసిన ముఖ్యమంత్రి ప్రధానితో భేటీ ముగియగానే అనంతరం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీతోనూ సమావేశం కానున్నారని సమాచారం. గతంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీలో పేర్కొన్నట్టుగా ఆంధ్రప్రదేశ్‌కు చేసే ఆర్థిక సహాయాన్ని విదేశీ ఆర్థిక సంస్థల నుంచి కాకుండా నాబార్డు నుంచి గ్రాంటు రూపంలో అందించాలని కోరారు. ప్రత్యేకప్యాకేజీ ప్రకారం కేంద్ర ప్రాయోజిత పథకాల కింద 2015 నుంచి 2020 వరకు రాష్ట్రానికి 16,447 కోట్ల రూపాయలు రావాల్సి వుంటుందనే విషయాన్ని ముఖ్యమంత్రి లేఖ ద్వారా గుర్తు చేశారు. ఇదే విషయమై ప్రధానితో భేటీలో ప్రస్తావించనున్నారు. రాష్ట్ర పార్లమెంట్ సభ్యులు కలిసినప్పుడు సీఎంతో భేటీలో అన్ని అంశాలపై చర్చించుకుంటామని ఇటీవలే నరేంద్ర మోడీ పేర్కొనడం జరిగింది. కాగా తన పర్యటనలో భాగంగా రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ నాయకులు తరచుగా చేస్తున్న విమర్శల విషయమై కూడా ప్రస్తావనకు వచ్చే రానున్నాయి. తాజాగా మంత్రి పైడికొండల మాణిక్యాలరావు, బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు అధికార తెలుగుదేశం లక్ష్యంగా బహిరంగ విమర్శలకు దిగడంపై కూడా చంద్రబాబు ప్రధాని దృష్టికి తీసుకెళతారని భావిస్తున్నారు. ఒకవైపు రాష్ట్రంలో మిత్రపక్షంగా వుంటూనే మరోవైపు తమ ప్రభుత్వంపై విమర్శలు చేయడం ఆక్షేపణీయమంటూ మోడీ దృష్టికి బాబు తెస్తారని తెలుస్తోంది. అదే విధంగా రాజ్యసభలో వున్న ట్రిపుల్ తలాక్ బిల్లుకు తెలుగుదేశం పార్టీ కూడా మద్దతు ఇస్తుందని ముఖ్యమంత్రి ప్రధానికి స్పష్టీకరిస్తారు. ఈ విషయంలో నెలకొన్న మనస్పర్థలపై వివరణ ఇస్తారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

చట్టపరిధిలో సి-ఫామ్స్ పరిశీలన

- వాణిజ్య పన్నుల శాఖకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వాణిజ్య పన్ను మదింపు ఉత్తర్వులు జారీ చేసినందువల్ల పిటిషనర్ పిటిషనర్ సమర్పించిన సి ఫామ్స్‌ను స్వీకరించేందుకు తిరస్కరిస్తూ వాణిజ్య పన్ను శాఖ తేది.11.3.2008న జారీ ఎండార్స్‌మెంట్ లేఖను హైకోర్టు రద్దు చేసింది. అలాగే తన వాదనలు వినిపించేందుకు పిటిషనర్ కు ఓ అవకాశం ఇవ్వాలని హైకోర్టు వాణిజ్య పన్ను శాఖ అధికారికి స్పష్టం చేసింది. సి ఫామ్స్‌ను స్వీకరించాలంటూ పిటిషనర్ చేసిన అభ్యర్థనను చట్ట ప్రకారం పరిశీలించాలని హైకోర్టు వాణిజ్య పన్ను శాఖను ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ టి.రజని తో కూడిన డివిజన్ బెంచ్ ఇటీవల ఈ మేరకు తీర్పును వెలువరించింది. ఇంతటితో ఈ వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈ వ్యాజ్యాన్ని గుంటూరు జిల్లాకు చెందిన బాలాజీ కాటన్ సిండికేట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

నుమాయిష్‌లో అటవీ శాఖ స్టాల్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తల్లిలాంటి ప్రకృతిని కాపాడితే అది మనలను కాపాడుతుందని రాష్ట్ర అటవీ శాఖ ప్రధాన అటవీ సంరక్షణాధికారి పీకే ఝా అన్నారు. ఆరోగ్య తెలంగాణ...అభివృద్ధి తెలంగాణలో తమ శాఖ భాగస్వామ్యం వహిస్తోందని చెప్పారు. గురువారం ఎగ్జిబిషన్ (నుమాయిష్)లో అటవీశాఖ స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రకృతి ప్రాధాన్యతను పెద్దలకు గుర్తు చేయడం, పిల్లలకు అటవీ జంతువులపై అవగాహన కల్పించడం కోసం సమాచారాన్ని ఈ స్టాల్‌లో ప్రదర్శించినట్లు చెప్పారు. సంక్రాంతి సెలవులతో పాటు నెలరోజుల పాటు తమ స్టాల్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీఎఫ్ వైల్డ్ లైఫ్ మనోరంజన్ భాం జా, పీసీసీఎఫ్ పబ్లిసిటీ పి రఘువీర్, సీఎం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, అదనపు అటవీ సంరక్షణ అధికారులు పృధ్వీరాజ్, మునీంద్ర, లోకేష్ జైస్వాల్, ఆర్ శోభ, ఆర్ఎం డోబ్రియల్, బాబూరావు, సునీల్ కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

Andhraprabha business 2018

బిజినెస్ BUSINESS

ఇండస్ఇండ్ బ్యాంకు లాభం రూ. 936 కోట్లు

• నికరలాభంలో 25 శాతం వృద్ధి
• పెరిగిన మొండిబకాయిలు


రోమేశ్ సోబ్తి

ముంబై : ప్రైవేట్ బ్యాంకు ఇండస్ ఇండ్ బ్యాంకు డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభం లో 25 శాతం వృద్ధితో రూ.936.2 కోట్లు ఆర్జించింది. ఫలితాలు అంచనా ప్రకారం సాధించాయి. అయితే మొండి బకాయిలు మాత్రం పెరిగాయి. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలోరూ.750.64 కోట్లు ఆర్జించింది. ఇతర ఆదాయం, నిర్వహణా ఆదాయం నికర వడ్డీఆదాయం పెరగడంతో లాభాలు పెరిగాయి. నికర వడ్డీ ఆదాయం మాత్రం విశ్లేషకుల అంచనాలను చేరుకోలేకపోయింది. సంవత్సరం ప్రాతిపదికన చూస్తే 20 శాతం పెరిగి రూ.1,895 కోట్లు ఆర్జించగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1,578.4 కోట్లుగా నమోదైంది. త్రైమాసికం ప్రతిపాదికన చూస్తే రుణాల డిమాండ్ 25శాతం పెరిగింది. డిపాజిట్లు 23 శాతం పెరగితే పొదుపు ఖాతాల్లో మాత్రం 68 శాతం వృద్ధి కనిపించింది. డిసెంబర్ త్రైమాసికంలో బ్యాంకు మంచి లాభాలను ఆర్జించిందని.. రుణాల డిమాండ్ కూడా స్థిరంగా కొనసాగిందని బ్యాంకు సీఈవో, ఎండి రోమేశ్ సోబ్తి చెప్పారు. నికరవడ్డీ మార్జిన్ మాత్రం 3.99 శాతానికి దిగిరాగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 4 శాతంగా నమోదైంది. అయితే ఇక్కడ వచ్చిన చిక్కల్లా బ్యాంకు మొండి బకాయిలు డిసెంబర్ త్రైమాసికంలో ఏకంగా 1.16శాతానికి ఎగబాకగా.. సెప్టెంబర్ త్రైమాసికంలో 1.08 శాతంగా నమోదయ్యాయి. వివరంగా చెప్పాలంటే మొత్తం ఇచ్చిన రుణాలపై క్యూ3లో గరిష్ఠ ఎన్‌పీఏ 1,499 కోట్లకు చేరగా.. క్యూ2 రూ.1,345.3 కోట్లు ఉంది. నికర ఎన్‌పీఏ రూ.592.2 కోట్లుకాగా క్యూ2 రూ.536.9 కోట్లుగా ఉంది. మొండిబకాయిలకు కేటాయింపు రూ.236.2 కోట్లు చేయగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.216.9 కోట్లతో పోల్చుకుంటే 8.9 శాతం పెరిగింది. త్రైమాసికం ప్రాతిపదికన చూస్తే ఎన్‌పీఏ 19.6శాతం తగ్గి రూ.293.8 కోట్లకు దిగివచ్చింది. ఇతర ఆదాయం (వడ్డీయేతర ఆదాయం) డిసెంబర్ త్రైమాసికంలో 16.7 శాతం పెరిగి రూ.1189.76 కోట్లుకాగా ..వాటిలో రుసుముల ద్వారానే 22 శాతం రాబట్టుకుంది. క్రితం ఏడాది పోల్చుకుంటే నిర్వహణా ఆదాయం 22.1 శాతంతో రూ.1664.69 కోట్లు ఆర్జించింది. కాగా బీఎస్ఈలో దీని షేరు మధ్యాహ్నం 0.59 శాతం క్షీణించి రూ.1742.60 వద్ద ట్రేడ్ అయ్యింది.

శ్రీ సిమెంట్ లాభం రూ.333 కోట్లు



న్యూఢిల్లీ : శ్రీసిమెంట్ డిసెంబర్ త్రైమాసికంలో స్టాండ్ ఎలోన్ ప్రాతిపదికన నికరలాభంలో 41.58 శాతం వృద్ధితో రూ.333.33 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.235.43 కోట్లు ఆర్జించినట్లు కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. మొత్తం ఆదాయం రూ.2,383.53 కోట్లకు చేరగా..క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలోరూ.2,226.79 కోట్లని 7.03 శాతం వృద్ధి కనిపించిందని కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. సిమెంట్ రెవెన్యూ రూ.2,193.64కోట్లు కాగా క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.2,085.25 కోట్లు కాగా విద్యుత్ విభాగం రెవెన్యూ రూ.349.58 కోట్లు కాగా.. క్రితం ఏడాది రూ.246.47 కోట్లని తెలిపింది. బీఎస్ఈలో దీని షేరు 0.19శాతం పెరిగిరూ.19,511.95 వద్ద ముగిసింది.

బజాజ్ కార్పొరేషన్ లాభం రూ.55 కోట్లు

• క్యూ3లో 4.55 శాతం క్షీణత

న్యూఢిల్లీ : ఎఫ్ఎంసీజీ దిగ్గజం బజాజ్ కార్పొరేషన్ క్యూ3 నికరలాభంలో 4.55 శాతం క్షీణించి రూ.55.16 కోట్లు దిగివచ్చింది. అధిక వ్యయమే దీనికి కారణమని కంపెనీ వివరణ ఇచ్చింది. క్రితం ఏడాది ఇదేత్రైమాసికంలో రూ.57.79 కోట్లు ఆర్జించినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. మొత్తం ఆదాయం మాత్రం 5.92 శాతం పెరిగి రూ.212.53 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలోరూ.200.65 కోట్లని ఒక ప్రకటనలో తెలిపింది.

ఎస్‌బీఐలో డ్రెస్ కోడ్



హైదరాబాద్ : ప్రభుత్వరంగానికి చెందిన స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఈ నెల 6వ తేదీన జారీ చేసిన సర్క్యులర్‌లో ప్రతి ఉద్యోగి డ్రెస్ కోడ్‌ను విధిగా పాటించాలని సూచించింది. పురుషులు ఫార్మల్స్, మహిళా సిబ్బంది అయితే ఫార్మల్ ఇండియన్ లేదా వెస్టన్ డ్రెస్‌లో విధులకు రావలని కోరింది. టీషర్ట్‌ల, జీన్స్, స్పోర్ట్‌షూస్, షార్ట్స్, త్రీఫోర్త్ వస్త్రధారణలతో విధులకు రావద్దని సూచించింది. అయితే ఒకేరకమైన బెల్టులు, కానీ, షూష్‌లు కానీ వేసుకురావ్వని కోరింది. ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పులతో బ్యాంకులకు రావద్దని ఖచ్చితంగా షూష్ వేసుకురావాల్సిందేనని కోరింది. ముదరురంగు షర్ట్‌పై ప్రింటింగ్ ఉన్న షర్ట్, గళ్ల చొక్కాలపై సాధారణ టై ధరించాలని సూచించింది. ఎస్‌బీఐ 24వేల బ్రాంచీల్లో 3 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. కొత్త డ్రెస్ కోడ్‌తో కస్టమర్లకు ఉద్యోగులకు మధ్య ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుందని సర్క్యులర్ పేర్కొంది.

ఎఫ్‌డీఐ సడలింపుతో... పెరగనున్న విదేశీ ఇన్వెస్టరు



న్యూఢిల్లీ : కేంద్ర కేబినెట్ బుధవారం నాడు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనలు సడలించడంతో... విదేశీ ఇన్వెస్టర్లు భారత్ పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతారని యూఎస్ ఇండియా స్ట్రాటెజిక్ పార్టనర్‌షిఫ్ ఫోరమ్ (యూఎస్ఐఎస్‌పీఎఫ్) గురువారం నాడు పేర్కొంది. టాక్స్, ఆడిట్ దిగ్గజం డెలాయిట్ కూడా రిటైల్ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి విదేశీ ఇన్వెస్టర్లు ఉత్సాహం చూపుతారని అంచనా వేసింది. కేంద్రప్రభుత్వం బుధవారం నాడు విదేశీ ఎయిర్‌లైన్స్... పీకల్లోతునష్టాల్లో కూరుకుపోయిన ఎయిర్ ఇండియాలో 49 శాతం పెట్టుబడులు పెట్టడానికి అనుమతించింది. అలాగే సింగిల్ బ్రాండ్ రిటైల్, నిర్మాణం, పవర్ ఎక్స్ఛేంజీల్లో పెట్టుబడులు పెట్టడానికి నిబంధనలు సడలించింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని యూఎస్ఐఎస్‌పీఎఫ్ చైర్మన్ జాన్ చాంబర్స్ స్వాగతించారు. ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం తీసుకుందని ఆయన ప్రశంసించారు.

ఎఫ్‌డీఐ విభాగంలో సంస్కరణలు తీసుకురావడంతో విదేశీ ఇన్వెస్టర్లు భారత్ పెట్టుబడులు పెట్టడానికి ఉత్సాహంతో ముందుకు వస్తారని జాన్ చాంబర్స్ ఒక ప్రకటనలో తెలిపారు. డెలాయిట్ ఇండియా భాగస్వామి అనిల్ తాల్‌రేజా మాట్లాడుతూ.. సింగిల్ బ్రాండ్‌రిటైల్ రంగంలో 100శాతం ఎఫ్‌డీఐని అనుమతించడంతో భారత్ మార్కెట్లోకి అతిపెద్ద రిటైలర్లు క్యూ కడతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విదేశీ ఇన్వెస్టర్లు భారత్ మార్కెట్లకు తగ్గట్లు తాజా వ్యూహాలు రూపుదిద్దుకుంటాయని డెలాయిట్ ఒక ప్రకటనలో పేర్కొంది.

టీసీఎస్ లాభం రూ.6,531 కోట్లు

• అంచనాలకు తగ్గట్లే ఫలితాలు • త్రైమాసిక ప్రాతిపదికన 1.3 శాతం వృద్ధి • మధ్యంతర డివిడెండ్ రూ.7

ముంబై : దేశంలోని అతి పెద్ద ఐటి కంపెనీ టాటా కన్సెల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభం త్రైమాసికం ప్రాతిపదికన 1.3 శాతం వృద్ధితో రూ.6,531 కోట్లు ఆర్జించింది. సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.6,446 కోట్లు నమోదు చేసింది. మార్కెట్ విశ్లేషకులు కూడా క్యూ3లో రూ.6532.70 కోట్ల వరకు ఆర్జిస్తుందని అంచనా వేశాయి... అదే స్థాయిలోనే ఫలితాలు ఉన్నాయి. బీఎస్ఈకి అందించిన సమాచారాన్ని బట్టి క్యూ3 మొత్తం ఆదాయం 1.32 శాతం పెరిగి రూ.31,774 కోట్లకు ఎగబాకిందని తెలియజేసింది. కాగా మధ్యంతర డివిడెండ్ షేరుపై రూ.7 ప్రకటించింది.

ఈ డివిడెండ్ వాటాదారుల ఖాతాలోకి ఈ నెల 31న జమ అవుతుంది. ఫలితాలపై కంపెనీ సీఈవో, ఎండీ, రాజేశ్ గోపీనాథన్ మాట్లాడుతూ.. 2017 సంవత్సరంలో మంచి ఫలితాలను ప్రకటించి గొప్ప ముగింపు పలికామని చెప్పారు. గత సంవత్సరం అన్నీ రంగాలకు చెందిన పరిశ్రమల నుంచి మంచి ఒప్పందాలు కుదర్చుకున్నామని, దీంతో రాబోయే త్రైమాసికాల్లో మంచి ఫలితాలు చూపించడానికి ఆస్కారం ఏర్పడిందన్నారు. డిసెంబర్ త్రైమాసికంలో 50 మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువ చేసే ముగ్గురు క్లయింట్లు లభించారని, అలాగే 20 మిలియన్ డాలర్ల క్లయింట్లు ఏడుగురు, 10 మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువ చేసే క్లయింట్లు తొమ్మిది, 5 మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువ చేసే క్లయింట్లు 15 మంది లభించినట్లు గోపీనాథన్ వివరించారు. డిసెంబర్ త్రైమాసికంలో మొట్టమొదటిసారి 50 మిలియన్ డాలర్ల క్లయింట్లతో ఒప్పందాలపై సంతకాలు జరిగాయని, డిజిటల్ టెక్నాలజీలో కీలకమైన మైలురాయిని దాటామని గోపీనాథన్ తెలిపారు.

డిసెంబర్ చివరి నాటికి కంపెనీలో ఉద్యోగుల సంఖ్య 390,880.. అని గరిష్టంగా 12,534 మంది చేరగా.. నికరంగా 1667 మంది అని కంపెనీ తెలిపింది. వడ్డీ భారం రెండు శాతం పెరిగి రూ.8651 కోట్లకు చేరగా.. సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.8479 కోట్లని తెలిపింది. బీఎస్ఈలో దీని షేరు 0.67 శాతం క్షీణించి రూ.2788.40 వద్ద ముగిసింది. మార్కెట్ ముగిసిన తర్వాత పలితాలు ప్రకటించింది. రిటైల్, సీపీజీ విభాగాల్లో త్రైమాసికం ప్రాతిపదికన 6.4 శాతంవృద్ధి కనిపించిందని,, అటు తర్వాత ఎనర్జీ, యుటిలిటి విభాగాల్లో 8.5 శాతం, ట్రావెల్, ఆతిథ్య రంగాల్లో 2.9 శాతం లైఫ్ సైన్సెస్ విభాగంలో 2.5 శాతం వృద్ధి కనిపించింది.

ముఖ్యాంశాలు

సాధారణంగా డిసెంబర్ త్రైమాసికంలో కంపెనీలు ఫలితాలు పెద్దగా జోరుండవు. అయితే టీసీఎస్ ఫలితాలు మాత్రం నిలకడగానే ఉన్నాయి. డిజిటల్ రంగం నుంచి మంచి డిమాండ్ లభించడమే కారణం.

- ☑ డిసెంబర్‌తో ముగిసిన 2017లో మంచి ఫలితాలు సాధించామని అన్నీ రంగాలకు చెందిన పరిశ్రమలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని టీసీఎస్ సీఈవో రాజేశ్ గోపీనాథన్ చెప్పారు.
- ☑ క్యూ3 నికరలాభం రూ.6,531 కోట్లు.. నికరలాభంలో 1.3 శాతం వృద్ధి.. ఏడాది ప్రాతిపదికన చూస్తే నాలుగు శాతం క్షీణించింది.
- ☑ డాలర్ ప్రాతిపదికన రెవెన్యూ త్రైమాసికం ప్రకారం చూస్తే ఒక శాతం పెరిగి 4,787 మిలియన్ డాలర్లు, ఏడాది ప్రాతిపదికన చూస్తే 9.1 శాతం .. విశ్లేషకుల అంచనా ప్రకారమే రెవెన్యూ.
- ☑ రూపాయి ప్రాతిపదికన చూస్తే రెవెన్యూ 1.2 శాతంతో రూ.90,904 కోట్లు.
- ☑ తయారీ, రిటైల్, కన్స్యూమర్ బిజినెస్, సీఎంటీల మంచి రెవెన్యూ సాధించగా.. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, బీమా వ్యాపారాల నుంచి రెవెన్యూ తగ్గింది.
- ☑ మొత్తం రెవెన్యూలో డిజిటల్ రెవెన్యూ వాటా 22.1శాతం ఏడాది ప్రాతిపదికన చూస్తే 39.6 శాతం, త్రైమాసికం ప్రాతిపదికన చూస్తే 13.9 శాతం పెరిగింది.
- ☑ రూ.1 ముఖ విలువ కలిగిన షేరుపై రూ.7కు మధ్యంతర డివిడెండ్‌కు బోర్డు సిఫారసు చేసింది.
- ☑ గ్లోబల్ మార్కెట్లో వృద్ధి ఇలా ఉంది. త్రైమాసికం ప్రాతిపదికన ..లాటిన్ అమెరికాలో 5 శాతం, కాంటినెంటల్ యూరోప్ 2.6 శాతం, ఉత్తర అమరికా 1.5 శాతం. ఏడాది ప్రాతిపదికన .. కాంటినెంటల్ యూరోప్ 22.3 శాతం, బ్రిటన్ 8.2 శాతం, భారత్ 4.1 శాతం, ఉత్తర అమెరికా 2.8 శాతంగా నమోదయ్యాయి.
- ☑ అతి పెద్ద డీల్స్ ..50 మిలియన్ డాలర్ల క్లయింట్లు ముగ్గురు, 20 మిలయన్ డాలర్ల క్లయింట్లు 7, పది మిలియన్ డాలర్ల క్లయింట్లు తొమ్మిది, 5 మిలియన్ డాలర్ల క్లయింట్లు 15 మంది చేరారు.
- ☑ మానవ వనరుల విషయానికి వస్తే క్యూ3 చివరి నాటికి 390,880 మంది పనిచేస్తున్నారు.



రూ.3,500 కోట్ల బినామీ ఆస్తుల జప్తు

• అక్రమార్కుల పాలిట సింహస్వప్నంగా మారిన బినామీ చట్టం • బినామీ ఆస్తులపై 24టీంలతో నిఘా

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : బినామీ ఆస్తుల నిషేధం చట్టం అక్రమార్కుల పాలిట సింహస్వప్నంగా మారింది. ఈ చట్టం కింద ఇప్పటి వరకు 3500 కోట్ల రూపాయల విలువైన బినామీ ఆస్తులు జప్తు చేసినట్లు ఆదాయపు పన్ను శాఖ వెల్లడించింది. దాంతో పాటు 900 కేసులు కూడా నమోదు చేసింది. నవంబర్ 2016 నుంచి అమల్లోకి వచ్చిన ఈ చట్టం ద్వారా ఆదాయపు పన్ను శాఖ అక్రమ ఆస్తులను కనిపెడుతోంది. ఇప్పటివరకు బినామీ ప్లాట్లు, దుకాణాలు, నగలు, వాహనాలు, బ్యాంకు డిపాజిట్లు, ఖాతాలు పట్టుబడ్డాయి. జప్తు చేసిన 3500 కోట్ల ఆస్తులలో 2900 కోట్ల రూపాయల స్థిరాస్థులున్నాయి. బినామీ ఆస్తులకు సంబంధించిన అయిదు కేసులలో 150 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు అడ్జుకేటింగ్ అథారిటీ అనుమతించింది. ఈ కేసులో ఓ రియల్ ఎస్టేట్ సంస్థ భాగోతం కూడా బయటపడింది. 110 కోట్ల రూపాయల విలువ చేసే యాభై ఎకరాల భూమిని బినామీ పేర్లతో కొని కస్టమర్లకు అమ్మింది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఐటి శాఖ దర్యాప్తులో కస్టమర్లు, బ్రోకర్ల ద్వారా సాక్ష్యాలు సేకరించి నిరూపించింది. పెద్దనోట్ల రద్దు సమయంలో కొందరు వ్యక్తులు తమ ఉద్యోగులకు డబ్బులిచ్చి వారి ఖాతాల ద్వారా నగదు మార్పించి తిరిగి తమ ఖాతాలలో జమచేయించిన కేసులు బయటపట్టాయి. ఈ కేసులో 39 కోట్ల రూపాయల బినామీ నగదు పట్టుబడింది. మరో వాహనంలో పట్టుబడిననగదు 1.11 కోట్లు తమది కాదని కారులోని వ్యక్తి చెప్పడంతో అది బినామీ నగదని తేలింది. ఈ కేసులన్నింటిని బినామీ చట్టం కింద నిరూపితమయ్యాయి. బినామీ ఆస్తుల నిషేధిత చట్టం కింద పట్టుబడిన ఆస్తులను ప్రొవిజినల్ అటాచ్‌మెంట్ చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బినామీ చట్టం కింద రుజువైన దోషులకు ఏడేళ్ల జైలు శిక్ష, పట్టుబడిన ఆస్తులలోని 25శాతం జరిమాన విధించనున్నారు. బినామీ ఆస్తులను గుర్తించేందుకు దర్యాప్తు విభాగం దేశ వ్యాప్తంగా ప్రత్యేకంగా 24 బినామీ నిషేధిత బృందాలను ఏర్పాటు చేసింది. బినామీ ఆస్తులను గుర్తించేందుకు డేగ కళ్లతో సోదాలు చేస్తున్నారు. నల్లధనాన్ని అరికట్టే చర్యల్లో భాగంగా బినామీ లావాదేవీలపై ఐటి శాఖ కన్నేసింది. దాంతో దేశ వ్యాప్తంగా అనేక బినామీ కేసులు పట్టుబడుతున్నాయి.

INCOME TAX DEPARTMENT

ప్యాసింజర్ కార్ల అమ్మకాలు 30 లక్షలు



న్యూఢిల్లీ : ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 2017లో రికార్డుస్థాయిలో మొట్టమొదటిసారి 30 లక్షల యూనిట్లు దాటిపోయాయి. ఐదు సంవత్సరాల గరిష్ఠానికి... 8.85 శాతం వృద్ధి కనిపించింది. ముఖ్యంగా చెప్పుకోవాలంటే యుటిలిటి వాహనాలకు డిమాండ్ విపరీతంగా పెరిగిపోయింది. సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యూఫ్యాక్చరర్స్ (సియామ్) విడుదల చేసిన తాజా గణాంకాలను బట్టి చూస్తే 2017 లో ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 32,29,109 యూనిట్లకు చేరగా.. 2016లో 29,66,603 యూనిట్ల విక్రయాలు జరిగాయి.. మొత్తానికి అమ్మకాల్లో 8.85 శాతం వృద్ధి కనిపించింది. ఈ ఆర్థిక సంవత్సరం వరుసగా మూడు త్రైమాసికాల్లో అమ్మకాలు జోరందుకున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 9 శాతం దాటవచ్చునని, గతంలో సియామ్ 7-9 శాతం వరకు ఉంటుందని అంచనా వేసింది. వివరాల్లోకి వెళితే గతేడాది ప్యాసింజర్ వాహనాల అమ్మకాల్లో 5.13 శాతంతో 21,68,151 యూనిట్లు విక్రయించగా.. 2016లో 20,62,357 యూనిట్లు వరకు జరిగాయి. యుటిలిటి వాహనాల హవా కొనసాగింది. గతేడాది 8,70,060 యూనిట్ల యూవీ వాహనాలు జరిగితే 2016లో 7,24,522 యూనిట్లు జరిగాయి. ఇక్కడా 20.09 శాతం వృద్ధి కనిపించింది. ద్విచక్ర వాహనాలు: గతేడాది రికార్డు స్థాయిలో 1,91,76,905 యూనిట్ల విక్రయాలు జరగ్గా... 2016లో 1,76,86,685 యూనిట్లు జరిగాయి.. 8.43 శాతం వృద్ధి కనిపించింది. గతేడాది ప్యాసింజర్ కార్ల విక్రయాలు దేశీయ మార్కెట్లో 32 లక్షల యూనిట్లు విక్రయించగా.. ద్విచక్ర వాహనాలు 1.91 కోట్ల యూనిట్ల జరిగాయని సియామ్ డైరెక్టర్ జనరల్ సుగాతో సేన్ మీడియాతో చెప్పారు. వాణిజ్య వాహనాలతో పాటు ద్విచక్ర వాహనాల అమ్మకాలు గతేడాది 8.39 శాతం వృద్ధితో 2,37,39,780 యూనిట్లు విక్రయించగా.. 2016లో 2,19,01,703 యూనిట్లు విక్రయాలు జరిగాయని సేన్ వివరించారు.

లంబోర్గినీ సూపర్ ఎస్‌యూవీ 'ఉర్సు'

ధర రూ. 3కోట్లు.. టాప్ స్పీడ్ గం॥కు 305 కి.మీ



ముంబై: ఇటాలియన్ సూపర్ స్పోర్ట్స్ కార్ల తయారీ కంపెనీ గురువారం నాడు మొట్ట మొదటి సూపర్ స్పోర్ట్స్ యూటిలిటి వాహనం 'ఉర్సు'ను దేశీయ మార్కెట్లో విడుదల చేసింది. దీని ధర రూ.3 కోట్లు. కొత్త మోడల్స్‌ను దేశీయ మార్కెట్లో విడుదల చేసిన తర్వాత అమ్మకాలు 2.5 నుంచి 3రెట్లు పెరుగుతాయని ఆశిస్తోంది. గ్లోబల్ మార్కెట్లతో పోల్చుకుంటే ఇండియా మార్కెట్ ఆసక్తికరంగా ఉంటుందని లాంబోర్గిని జనరల్ మేనేజర్ ఏసియా ఫసిపిక్ ఆండ్రియా బాల్దీ చెప్పారు. ఉర్సు రాకతో మార్కెట్లో లాంబోర్గిని సీన్ పూర్తిగా మారిపోతుందని.. అమ్మకాలు జోరందుకుం టాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భారతీయ కస్టమర్ల అభిరుచుల్లో పూర్తి స్థాయి మార్పులు చేర్పులు కనిపిస్తున్నాయని.. లంబోర్గినికి భారత్ మార్కెట్ అత్యంత కీలకం కానుందని, కొత్త సెగ్మెంట్ కస్ట మర్లు తమ కొత్త ప్రొడక్టుకు ఆకర్షి తులవు తారని లాం బోర్గిని ఇండియా చీఫ్ శరద్ అగర్వాల్ చెప్పారు. లాంబోర్గిని ఉర్సు ఫీచర్ల విషయానికి వస్తే 4.0 లీటర్ల ట్విన్ టర్బో వీ8 ఇంజిన్, ఆటో తయారీ కంపెనీల చరిత్రలో ఇదే మొదటిది. ఈ ఇంజిన్‌తో 641 బీహెచ్‌పీ పవర్ 850 ఎన్ఎం పీక్ టార్కో తో పాటు 0-100 కిలోమీటర్ల వేగాన్ని కేవలం 3.6 సెకన్లలో అందుకుంటుంది. 12.8 సెకన్లలో 200 కిలోమీటర్ల వేగాన్ని తాకుతుంది. దీని టాప్ స్పీడ్ గంటకు 305 కిలోమీటర్లు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా దూసుకుపోయే ఎస్‌యూవీ అంటే ఇదేనని ఆటో రంగానికి చెందిన నిపుణులు చెబుతున్నారు.


ఈ ఏడాది కొలువులే కొలువులు!

మెర్సర్ నివేదిక

న్యూఢిల్లీ: ఈ ఏడాది దేశంలోని అన్నీ కంపెనీలు సిబ్బందిని పెంచుకుంటాయని, అదే సమయంలో ఉద్యోగుల వేతనాలు 10 శాతం పెరుగుతాయని మెర్సర్ 2017 ఇండియా టోటల్ రెమ్యూనరేషన్ సర్వేలో పేర్కొంది. కాగా 2016-17లో మాత్రం ఇవి నిలకడగా సాగాయని తెలిపింది. మెర్సర్ మొత్తం 791 సంస్థలను వొవిధ రంగాలకు చెందిన వాటిని సర్వే చేసింది. వాటిలో 55 శాతం కంపెనీలువచ్చే 12 నెలల్లో సిబ్బందిని పెంచుకుంటామని చెబితే.. గత ఏడాది 48 శాతం కంపెనీలు ఇవే మాట అన్నాయి. భారతీయ పరిశ్రమలు గతకొన్నిసంవత్సరాలనుంచి మందగమనంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఆర్థిక వ్యవస్థ జోరందకపోవడంతో పాటు నైపుణ్యం కలిగిన సిబ్బంది కొరత కూడా దేశీయ పరిశ్రమలను పట్టి వేధిస్తోందని మెర్సర్ ఇండియా బిజినెస్ లీడర్ శాంతి నరేష్ చెప్పారు. ఈ ఏడాది రెండు కంపెనీల్లో ఒక కంపెనీ సిబ్బందిని పెంచుకునే ఆలోచనలో ఉన్నాయి. రిటైల్, ఎఫ్ఎంసీజీ, తయారీరంగంతో పాటు ఫార్మాస్యూటికల్స్ రంగాల్లో ఉపాధి అవకాశాలు న్నాయి.

అలాగే సప్లయి చెయిన్ ప్లానింగ్, ఎనలిటిక్స్, కంప్యూటర్ ఇమేజరీ, స్టోర్ డిజైన్, రంగాల్లో కూడా ఉద్యోగావకాశాలుంటాయని నరేశ్ వివరించారు. కంపెనీల్లో వలసల విషయానికి వస్తే స్వల్పంగా తగ్గాయని.. 13.3 శాతంనుంచి 11.5 శాతానికి దిగివచ్చాయని తెలిపారు. ఆర్అండ్‌డితో పాటు సేల్స్ ప్రొఫెషనల్స్ అన్ని స్థాయిలో సంస్థలకు లభ్యం కావడం పెద్ద సవాలేనని తెలిపింది. కంపెనీలకు ఇంజినీరింగ్, సేల్స్ ప్రొఫెషనల్స్ లభించడం ఇబ్బందేనని నివేదికలో పేర్కొంది. కొత్త ఉద్యోగాల విషయానికి వస్తే ... న్యూకాలర్ జాబ్స్ విషయానికి వస్తే వారికి సాంకేతిక పరంగా బాగా నైపుణ్యం ఉండాలి.. ఉదాహరణకు క్లౌడ్, కాగ్నిటివ్, సెక్యూరిటి, డేటా సైన్స్‌లలో ఉన్నత విద్యతో మంచి అవగాహన కలిగి ఉండాలని ఐబిఎం ఇండియాకుచెందిన వీపీ హెచ్ఆర్ దిల్‌ప్రీత్‌సింగ్ చెప్పారు.

డిసెంబర్ నుంచి వృద్ధిరేటు జోరు!



న్యూఢిల్లీ : దేశ ఆర్థికవ్యవస్థ డిసెంబర్ నుంచి జోరందుకుందని మోర్గాన్‌స్టాన్లీ తాజా నివేదికలో పేర్కొంది. దీనికి ఉదాహరణ చెబుతూ పర్చేజ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ)లతో పాటు వాహనాల అమ్మకాలు, ఉక్కు, సిమెంట్ డిమాండ్ పెరగడమే కారణమని నివేదికలో వివరించింది. దీంతో పాటు రిటైల్ ద్రవ్యోల్బణం క్రమంగా పెరగడంతో వస్తువులు ధరలు కూడా పెరిగాయి. డిసెంబర్ రిటైల్ ద్రవ్యోల్బణం 5.4 శాతం నమోదయ్యే అవకాశం ఉందని తేల్చి చెప్పింది. దీంతో పాటు ఎగుమతులు, దిగుమతులు కూడా క్రమంగా పెరుగుతూపోయాయని వివరించింది.

ధరల విషయానికి వస్తే ఆహార పదార్థాల ధరలు క్రమంగా తగ్గముఖం పట్టాయని.. కూరగాయల ధరలు గణనీయంగా తగ్గాయని పేర్కొంది. అయినా సంవత్సరం ప్రాతిపదికన చూస్తే ఆహార ద్రవ్యోల్బణం 5.4 శాతం కాస్తా ఎక్కువేనని తెలిపింది. కాగా నవంబర్‌లో 4.4 శాతంగా నమోదైంది. సంవత్సరం ప్రాతిపదికన చూస్తే డిసెంబర్‌లో టోకు ద్రవ్యోల్బణం 3.9 శాతంగా నమోదు కాగా.. నవంబర్‌లో 3.7 శాతంగా నమోదైంది. అయితేవాణిజ్యలోటు మాత్రం కాస్తా మెరుగుపడి డిసెంబర్ చివరి నాటికి 13.3బిలియన్ డాలర్లకు దిగివచ్చింది. మోర్గాన్ స్టాన్లీ నివేదిక ప్రకారం ఎగుమతులు మాత్రం సంవత్సరం ప్రాతిపదికన 23.2 శాతం డిసెంబర్‌లో వృద్ధి కనిపించింది. అదే సమయంలో దిగుమతులు కూడా 25.5 శాతానికి చేరే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే నవంబర్ నెల పారిశ్రామికోత్పత్తి 3.2 శాతానికి చేరుకోగా.. నవంబర్‌లో 2.2 శాతంగా నమోదైందని పేర్కొంది.

టెర్మ్ డిపాజిట్ వడ్డీరేట్లు పెంచిన ఇండియన్ బ్యాంక్

హైదరాబాద్ : చెన్నై ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న ఇండియన్ బ్యాంకు టెర్మ్ డిపాజిట్లపై వడ్డీరేట్లు పెంచింది. దేశీయ/ ఎన్ఆర్ఈ టెర్మ్ డిపాజిట్లపై రూ.5 కోట్ల డిపాజిట్ల వరకు 25 బేసిస్ పాయింట్లు పెంచి 125 బేసిస్ పాయింట్లకు సవరించింది. జనవరి 8, 2018 నుంచి కొత్త వడ్డీరేట్లు అమల్లోకి వస్తాయి.

ఎగ్జిబిషన్‌లో ఆర్‌బీఐ స్టాల్

ఆవిష్కరించిన ప్రాంతీయ డైరెక్టర్



హైదరాబాద్ : రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రాంతీయ డైరెక్టర్ ఆర్ సుబ్రమణియన్ గురువారం నాడు ఎగ్జిబిషన్‌లో ఆర్‌బీఐ స్టాల్‌ను ఆవిష్కరించారు. తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆర్‌బీఐ స్టాల్‌ను ప్రారంభించడానికి ప్రధాన కారణం.. కస్టమర్ల ప్రయోజనాలను కాపాడ్డానికి అని.. ప్రజలకు బ్యాంకింగ్ వ్యవస్థపై అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశమన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థ గురించి ప్రస్తావిస్తూ.. ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులు అత్యంత నమ్మకమై నవని ఆయన అన్నారు. బ్యాంకులపై ఎలాంటి ఫిర్యాదులు చేయదలచుకుంటే ఆర్‌బీఐ స్టాల్ చేయవచ్చునని దీనికి ఎలాంటి రుసుము తీసుకోమని ఆయన చెప్పారు. ప్రస్తుతం ప్రజల్లో రూ.10 నాణెం రూ.5 నోటుపై ఉన్న అనుమానాలను ఆయన నివృత్తి చేశారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ ఆర్‌బీఐ జనరల్ మేనేజర్‌హ డాక్టర్ సింగాలా సుబ్బయ్య, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు నరోత్తమరెడ్డితో పాటు బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

నాతో పాటు నా సతీమణి ఓటు కూడా తీసేశారు

ఎన్నికల అధికారి అనూప్‌సింగ్‌కు సుధీర్ రెడ్డి ఫిర్యాదు



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ఓటరు జాబితా సవరణలో అవకతవకలు జరిగాయని వాటిని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి అనూప్‌సింగ్‌కు కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తిచేసింది. ఈ మేరకు మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి నేతృత్వంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తదితరులు గురువారం సచివాలయంలో అనూప్‌సింగ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. జీహెచ్ఎంసీ పరిధిలో టీఆర్ఎస్ పార్టీ బలహీనంగా ఉన్నందున ఒక పథకం ప్రకారం తమ ఓట్లను తొలగించారని సుధీర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. తన ఓటుతో పాటు తన సతీమణి ఓటును కూడా తొలగించారని చెప్పారు. సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, నగరంలో 17 లక్షల ఓటర్లను తొలగించారని ఫిర్యాదు చేశారు. ఓటరు జాబితా సవరణ వెనుక ఉన్న ఏజెన్సీని అధికార పార్టీ నాయకులు తప్పుదోవ పట్టించారని చెప్పారు. ఓటరు ప్రక్షాళన పారదర్శకంగా జరిగేలా చూడాలని, ఇప్పటికే జరిగిన తప్పులను సరిదిద్దాలని అనూప్‌సింగ్‌ను కోరారు. ఈ విషయం పరిశీలించి తగు చర్య తీసుకుంటానని వారికి అనూప్‌సింగ్ హామీ ఇచ్చారు.

ఆర్మూర్ డిక్లరేషన్‌పై ప్రచారం



హైదరాబాద్,ఆంధ్రప్రభ : రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టు బడి ఉందని, ఆర్మూర్‌లో జరిగిన డిక్లరేషన్ వారికి ధైర్యాన్ని ఇస్తోందని టీపీసీసీ అధికార ప్రతినిధి మల్లు రవి అన్నారు. కిసాన్ ఖేత్ మజ్దూర్ కాంగ్రెస్ సమావేశం అనంతరం ఆయన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల తక్షణ సమస్యలు పరిష్కరించకుండా రూ. 4 వేల పెట్టుబడిపై దృష్టిసారిస్తోందని విమర్శించారు. ఇచ్చిన హామీ మేరకు రైతులవడ్డీని చెల్లించాలని కోరుతూ ప్రభుత్వంపై వత్తిడి తెస్తామన్నారు.

గిరిజనుల మధ్య చిచ్చుపెట్టిన కేసీఆర్: రవీంద్ర నాయక్

రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం సాధ్యం కాదని తేలడంతో వారి మధ్య చిచ్చుపెట్టిందని మాజీ ఎంపి రవీంద్రనాయక్ ఆరోపించారు. లంబాడీ, కోయ,గోండుల మధ్య గొడవలు పెట్టి ప్రభుత్వం చోద్యం చూస్తోందని ఆరోపించారు. గిరిజనులకు ప్రత్యేకంగా ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని , బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విలేఖరుల సమావేశంలో ఏపీసీసీ నేత సూర్యానాయక్ కూడా పాల్గొన్నారు.

విదేశాల్లోనూ టీఆర్ఎస్ కమిటీలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రపంచ వ్యాప్తంగా టిఆర్ఎస్ శాఖల బలోపేతానికి కృషిచేస్తున్నట్లు టిఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం కో-ఆర్డినేటర్ మహేష్ బిగాల తెలిపారు. ముఖ్యమంత్రి కెసిఆర్, ఎంపీ కల్వకుంట్ల కవితల సూచనల మేరకు టిఆర్ఎస్ ఆస్ట్రియా కమిటీని గురువారం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఆస్ట్రియా పార్టీ అధ్యక్షులుగా మేడిపల్లి వివేక్‌రెడ్డి, గౌరవ చైర్మన్‌గా ప్రవీణ్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా కంది వంశీ, యలగం సతీష్, ప్రధాన కార్యదర్శులు అమరమం శ్రీకాంత్‌రెడ్డి, దైవాల రవితేజ, నరేష్, రాజిరెడ్డి, కార్యదర్శులుగా మనోజ్, భరత్, శశి తదితరులు ఎన్నికయ్యారు. ఇతర దేశాల్లోనూ పార్టీ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు నేతలు తెలిపారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

ఆర్‌టీసీ మజ్దూర్ యూనియన్ డిమాండ్



హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఆర్‌టీసీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ డిమాండ్ చేసింది. తెలంగాణ ఆర్‌టీసీ మజ్దూర్ యూనియన్ కార్యవర్గ సమావేశం గురువారం సంఘం ప్రధాన కార్యదర్శి కె హన్మంతు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో సుధాకర్, గుజ్జ కృష్ణ, సతీష్‌గౌడ్, మల్లేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో వివిధశాఖల్లో పనిచేస్తున్న 2.20 లక్షల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఉద్యోగులు సమాజాన్ని ప్రభావితం చేసే శక్తిగా ఎదగాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి ఉద్యోగులు 43 రోజులపాటు చేసిన సకల జనుల సమ్మె ప్రధాన కారణమని గుర్తు చేశారు. ఉద్యోగులు కేవలం జీతాలు తీసుకునే యంత్రాలుగా కాకుండా నాయకత్వం పెంచుకుని ప్రభావిత శక్తిగా ఎదగాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది రెగ్యులరైజ్ కోసం కోర్టులో ఉన్న కేసులను తొలగించి వారిని రెగ్యులరైజ్ చేయడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పదవీ విరమణ పొందిన వారి స్థానంలో కొత్తగా భర్తీ చేయకపోవడంతో అవి ఖాళీగా ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలోని 45 ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో కలిపి సుమారు 2.20 లక్షల వరకు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని చెప్పారు.

వయో వృద్ధుడికి హార్ట్‌వాల్వ్ మార్పిడి



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : 82 సంవత్సరాల వ్యక్తికి హార్ట్ వాల్వ్ మార్పిడిని సిటీజన్ స్పెషాలిటీ ఆస్పత్రి వారు విజయవంతంగా పూర్తి చేశారు. చికిత్స జరిగిన మూడు రోజుల్లోనే రోగి తన పనితాను చేసుకుంటున్నాడు. హైదరాబాద్‌తో పాటు ఉభయ తెలు గురాష్ట్రాల్లో ఈ తరహా చికిత్సలు అత్యంత అరుదుగా మాత్రమే జరుగుతాయని వైద్యులు పేర్కొన్నారు. వైద్యులు దీనికి సంబంధించిన వివరాలను గురువారం వెల్లడించారు. గోపాలకృష్ణ (82) సంవత్సరాల వయస్సు గల వ్యక్తికి ఆరోటిక్ వాల్వ్ అనేది గుండెలోని నాలుగు కవాటాలలో ఒకటి కుచించుకుపోవడంతో కాల్షియఫ్ ఆర్టిక్ స్టెనోసిస్తో, ట్రాన్స్ హెటర్ ఆరోటిక్ వాల్వ్ రిప్లేస్‌మెంట్ (టీఏవీఆర్)ను చేశారు. ఈరోగి దీర్ఘకాలిక మూత్ర పిండాల వ్యాధితో బాధ పడుతున్నాడు. అంజియోప్లాస్టీలో లాగానే గజ్జ ప్రాంతం (కుడి పొడవాటి ధమని) నుంచి టీఏవీఆర్ చికిత్సను వైద్యులు నిర్వహించారు. రోగికి అనస్థీషియా ఇచ్చిన తరువాత ఎవిల్యుట్- ఆర్‌పెర్క్యుటేనియస్ ఆర్టిటిక్ వాల్ (మెడ్ట్రానిక్ యూఎస్‌ఏతో తయారు చేయబడింది) గుండెకు పుపుసధమని (ఫె మోరల్ ఆర్టరీ) ద్వారా ఫ్లూరోస్కోపీ సాయంతో అమర్చారు. మొత్తం ఈ ప్రక్రియను 90 నిమిషాల్లో వైద్యులు పూర్తి చేశారు. మూడు రోజుల తరువాత రోగిని డిశ్చార్జి చేసినట్లు వైద్యులు తెలిపారు. సిటీజన్ స్పెషాలిటీ ఆస్పత్రి హార్ట్ ఫెయిల్యూర్ క్లీనిక్ ప్రారంభిస్తున్నట్లు డాక్టర్లు ఎ.సంజీవ్‌కుమార్, డా.సుధీర్ కోగంటి, డా.శ్రీనివాస్ కుమార్, డా.గోకుల్ రెడ్డి, డా.జె.రామకృష్ణలు తెలిపారు.

సైబర్ భద్రత పెను సవాల్

• మధ్యప్రదేశ్ డీజీపీల సమావేశంలో చర్చ • పోలీస్ సంస్కరణలపై సూచనలు • మాలిమాథ్ కమిటీ సిఫార్సులపై సమీక్ష • పాఠశాలల్లో అమరవీరుల ఛాయాచిత్ర ప్రదర్శన • వివరాలు వెల్లడించిన ఏపీ డీజీపీ మాలకొండయ్య



అమరావతి, ఆంధ్రప్రభ బ్యూరో: సమాజానికి సవాల్‌గా మారిన సైబర్ భద్రత, వామపక్ష తీవ్రవాదంపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముం దని వివిధ రాష్ట్రాల డీజీపీ సమావేశం పేర్కొన్నది. మధ్యప్రదేశ్‌లో ఇటీవల వివిధ రాష్ట్రాల డీజీపీలకు పోలీసు వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లపై మూడు రోజుల పాటు సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో ప్రస్తుతం పోలీస్ వ్యవస్థ ఎదుర్కొంటున్న అనేక కీలకమైన అంశా లపై విస్తృతంగా చర్చించారు. పోలీసుల సంస్కరణలపై ఏర్పాటు చేసిన మాలిమాథ్ కమిటీ సిఫార్సులపై కూలంకషంగా చర్చించారు. సర్వోన్నత సైబర్ భద్రత,వామపక్ష తీవ్రవాదం, పోలీస్ ఇమేజ్ అధారపడి ఉన్నందున మరిన్ని ఆధునిక చర్యలకు ఉపక్రమించాల్సిన అవసరాన్ని గుర్తించాయి. ఏపీ పునర్విభజన చట్టంలో భాగంగా ఏర్పాటు చేయాల్సిన సంస్థలు,పోలీస్ భాగస్వామ్యంపై కూడా ఏపీ డీజీ పీ మాలకొండయ్య చర్చించారు. దేశంలో సైబర్ నేరాల సంఖ్య అధికంగా పెరిగిందని, ఆన్‌లైన్ లావాదేవీలు పెరిగిపోయిన నేపథ్యంలో వీటి సంఖ్య అనతికాలంలోనే మరింతగా వేగంగా పెరిగిందని చెప్పారు. ఇతర దేశాల్లోని సర్వర్లు ఎలా నియంత్రించే విషయం ఇప్పుడు పోలీసులకు పెద్ద సవాల్‌గా మారిందని అన్నారు. సోషల్‌మీడియా, ఇతర సం బంధిత అంశాలకు సంబంధించిన నేరాల నియంత్రణ నేడు ఎంతో కీలకంగా మారిందన్నారు. కొన్ని ఏరియాల్లో వామపక్ష తీవ్రవాదంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. క్రిమినల్ జస్టిస్ సిస్టం సంస్కరణలపై మాలిమాథ్ కమిటీ చేసిన సిఫార్సులుపై సమావేశంలో కీలకంగా, సుదీర్ఘంగా చర్చించారు. క్రిమినల్ జస్టిస్ వ్యవస్థపై అధ్యయనం చేసి, నాణ్యమైన అంశాలను సిఫార్సు చేయడానికి మాలిమాథ్ కమిటీ ఫ్రాన్స్, జర్మనీ వంటి ఇతర దేశాలలో ఉన్న నేర న్యాయ మార్గాలను పరిశీలించింది. వీటిని సమీక్షించారు. వామపక్ష తీవ్ర వాదాన్ని అరికట్టేందుకు తీసుకోవాల్సిన అంశంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చిం చారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని వామపక్ష తీవ్రవాదంపై డీజీపీలు సుదీర్ఘంగా చర్చించి,చర్యలపై పలు సూచనలు చేశారు. ఇటీవల జరిగిన సంఘ టనలు,తీవ్రవాదుల కార్యనిర్వహణ,వారి ఆయుధాలు, ఆధునాతన పద్దతులు, అందుకు పోలీసులు అనుసరించాల్సిన వ్యూహాలు గురించి విస్తృతమైన చర్చ జరిగిందని డీజీపీ మాలకొండయ్య తెలిపారు.ఇదే సమయంలో తీరప్రాంత భద్రతపై కూడా చర్చించినట్లు చెప్పారు. దీనిపై అదనపు దృష్టిఉంచాల్సిన అవసరాన్ని సమావేశాన్ని గుర్తించిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 900 కిలో మీటర్ల మేరకు తీరప్రాంతం ఉందని డీజీపీ చెప్పారు. అంతేకాకుండా రానున్నకాలంలో పోలీస్ విభాగం బాధ్యతపై తీవ్రంగా చర్చించిందన్నారు. అదే క్రమంలో గౌరవ సూచకంగా ప్రభుత్వ పాఠశాలలలో అమరవీరుల ఛాయచిత్రాలు ప్రదర్శించాలని పలువురు డీజీపీలు సూచించారని చెప్పారు. ఇప్పటివరకు దాదాపు 33వేల పైగా పోలీసులు తీవ్రవాద దాడుల్లో ప్రాణాలు కోల్పాయారని గుర్తు చేసుకున్నారని చెప్పారు. దీనిపై విద్యార్థుల్లో చైతన్యం పెంచాల్సిన అవసరాన్ని సమావేశం గుర్తించిందన్నారు. సమావేశంలో ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం - 2014తో ఏర్పాటు చేయాల్సిన పోలీస్ సంస్కరణలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి పలు సూచనలు చేయడం జరిగిందని మాలకొండయ్య తెలిపారు.

సొంత భవన సముదాయానికి ఏపీ ఎస్‌సీహెచ్ కసరత్తు

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నత విద్యకు సంబంధించి ఉన్నత ప్రమాణాలు పెంపొందించేందుకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఏపీఎస్‌సీహెచ్ఇ) సంస్థను అన్ని విధాలా, ప్రత్యేక హంగులతో అభివృద్ధి చేసేం దుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను రూపొం దించింది. ఈమేరకు ఏపీఎస్‌సీహెచ్ఈ సంస్థ అభివృద్ధికి తీసుకోవల్సిన అంశాలపై ప్రభుత్వానికి సమగ్రమైన నివేదికను తాజాగా అందజేసినట్లు సమాచారం. పరిపాలనాపరమైన అభివృద్ధికి కావ ల్సిన మౌలిక వసతుల కల్పన , భవనాల అభివృద్ధి, ఇతర ప్రతిపాదనలను ఏపీఎస్‌సీహెచ్ఈ తాజాగా ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిసింది. మౌలిక వసతులు, నిధుల కేటాయింపు, అకాడమిక్, పరిపాల న, శిక్షణ వసతులు, యూనివర్శిటీతో సహకారం, కళాశాలలు, కేంద్ర ఏజెన్సీలకు సంబంధించి ఉత్తమ ఉన్నత విద్యను అభివృద్ధి చేసే దిశలో భాగంగా సంస్థ కొన్ని ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించింది.

ఈ క్రమంలో అత్యుత్తమ విద్యా అవకాశాలను పెంపొం దించేందుకు ఏపీఎస్‌సీహెచ్ఈ క్యాంపస్‌ను సర్వ హంగులతో తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ఎంత బడ్జెట్ అవసరమవుతుంది..ఎంత మంది సిబ్బంది కావాలి..ఏఏ సౌకర్యాలు అభివృద్ధి చేయాలనే అంశంపై ప్రభుత్వానికి నివేదికలు అందా యి. నాణ్యమైన విద్యను అభివృద్ధి చేయాలంటే అన్ని విధాలా సంస్థను అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు. ఇందుకోసం సుమారు రూ. 60 కోట్లుతో కొన్ని ప్రతిపాదనలను ఏపీఎస్‌సిహెచ్ఈ ప్రభుత్వం వద్దకు పంపినట్లు సమాచారం. ఉన్నత విద్యామండలి శాశ్వత భవనాల కోసం సుమారు 6 ఎకరాల భూమిని కేటాయించాల్సి ఉందంటున్నారు. అలాగే ఇందుకు సంబంధించిన ప్రాజెక్టుకు 2,48,000 చదరపు అడుగుల స్థలం అవసరముంటుందంటున్నారు. ఇందులో ప్రధాన కార్యాలయానికి 60,000 చదరపు అడుగులు, గృహ వసతికి 64,000 చదరపు అడు గులు, ఇతర అవసరాల కోసం 1,52,000 చదరపు అడుగుల స్థలం అవసరముంటుందని ఏపీ ఎస్‌సిహెచ్ఈ ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు తెలిసింది. వీటన్నింటికీ మొత్తం రూ. 60 కోట్లు దాకా వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం తాడేపల్లిలోని అద్దె భవనంలో నడుస్తున్న ఉన్నత విద్య కార్యాలయానికి భవిష్యత్‌లో పూర్తి స్థాయిలో శాశ్వత ప్రాతిపదికన మౌలికవసతులు సమకూర్చేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా శాశ్వతప్రాతిపదికన ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ అభివృద్ధికి చర్యలు తీసుకోబోతున్నారు.

పోలవరం టెండర్లు ముందుకే

అమరావతి, ఆంధ్రప్రభ: పోలవరం ప్రాజెక్టుకు సంబం ధించి స్పిల్‌వే పనుల్లో వేగం తగ్గిందని, భవిష్యత్‌లో పను లను మరింత వేగంతో నిర్వహించాలని,లేకుంటే నిర్దేశిత గడువు లో ప్రాజెక్టును ప్రారంభించడం కష్టమవుతుందని పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవో ఎస్‌కె హల్దార్ స్పష్టంచేశారు. గురువా రం స్థానిక జలవనరుల శాఖా కార్యాలయంలో గురువారం జరిగిన పోలవరం అథారిటీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవ రం ప్రాజె క్టుకు సంబంధించి పిలిచిన టెండర్ల విషయంలో ముందు కెళ్లాలని అధికారులకు సూచించా రు. ఈనెల 18తో గడువు ముగియనందు న, పిలిచిన టెండర్లను ఈనెల 18న తెరిచి, కొత్త సంస్దకు పనులు అప్పగించా లని పేర్కొన్నారు. వారం తర్వాత టెండర్ల ను తెరవా ల్సిందిగా ఆయన అధికారులకు సూచిం చారు. 60సీ నిబంధన కింద కొన్ని పనులు విడదీసి రూ. 1,395 కోట్ల పనులకు ప్రభు త్వం గతంలో టెండర్లు పిలిచిన సంగతి తెలిసిందే. స్పిల్‌వేలోని కాంక్రీట్ పనులు, స్పిల్ పైలట్ చానల్ నిర్మాణం తది తర పనులను ప్రధాన కాంట్రాక్టర్ నుంచి తప్పించి, కొత్త వారికి అప్పగించేందుకు పిలిచిన టెండర్లపై ప్రాథమికంగా ముందుకెళ్లాని హల్దార్ అధికారులకు సూచించారు. ఆశించిన రీతి లో స్పిల్‌వే పనులు జరగడం లేదని అన్నారు. ఇలా అయితే నిర్దేశిత లక్ష్యానికి ఇబ్బంది కలుగుతుందన్నారు.

సీబీఎస్ఈ టెన్త్, ట్వల్త్ షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, ఆంధ్రప్రభ: జాతీయ స్థాయిలో సిబిఎస్ఈ నిర్వహించే పదవ తరగతి, పన్నెండవ తరగతి పరీక్షల షెడ్యూల్ ఖరారైంది. ఈ ఏడాది మార్చి 5వ తేదీనుంచి 12వ తరగతి పరీక్షలు ప్రారంభమవుతుండగా, మార్చి 6వ తేదీనుంచి 10వ తరగతి పరీక్షలు జరగనున్నాయని సిబిఎస్ఈ ప్రకటించింది. షెడ్యూల్ ఈ విధంగా ఉంది.

10 తరగతి షెడ్యూల్

తేదీ	సబ్జెక్టు కోడ్	సబ్జెక్టు
06-03-2018	002	హిందీ కోర్సు-ఎ
12-03-2018	101	ఇంగ్లీష్ కమ్యూనికేషన్
16-03-2018	086	సైన్స్ థియరీ
22-03-2018	087	సోషల్ సైన్స్
28-03-2018	041	మ్యాథమేటిక్స్
02-04-2018	122	సంస్కృతం

12 తరగతి షెడ్యూల్

తేదీ	సబ్జెక్టు కోడ్	సబ్జెక్టు
05-03-2018	301	ఇంగ్లీష్ కోర్సు
07-03-2018	042	ఫిజిక్స్
09-03-2018	054	బిజినెస్ స్టడీస్
13-03-2018	043	కెమిస్ట్రీ
15-03-2018	055	అకౌంటెన్సీ
21-03-2018	041	మేథమేటిక్స్
23-03-2018	065	ఇన్ఫర్మేటిక్స్ ప్రాక్టీస్
23-03-2018	083	కంప్యూటర్ సైన్స్
26-03-2018	030	ఎకనామిక్స్
27-03-2018	044	బయాలజీ
02-04-2018	302	హిందీ కోర్సు
09-04-2018	048	ఫిజికల్ ఎడ్యుకేషన్

గుట్కాపై మరో ఏడాది నిషేధం

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : గుట్కాపై మరో ఏడాది పాటు నిషేధం విధిస్తూ ప్రభుత్వం గురు వారం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ప్రభుత్వం గుట్కా ను నిషేధిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు జన వరి 6 వతేదీన ముగిశాయి. దీంతో ఆహార భద్రత కమిషనర్ మరో సంవ త్సరం పాటు గుట్కాను నిషేధిస్తూ తాజాగా ఈ ఉత్తర్వులను జారీ చేశారు.

15 వరకు టీఆర్‌టీ సవరణలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల భర్తీ కోసం నిర్వ హించే ఉపాధ్యాయ నియామక పరీక్ష దరఖాస్తు ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. టిఆర్‌టికి మొత్తం 2,7 7,5 74 దరఖాస్తులు వచ్చాయి. అభ్యర్థులు దరఖాస్తు ఫారంలో రాసిన బయోడేటాలోని తప్పులను సవ రించుకోవడం కోసం 11 వరకు ఇచ్చి న ఎడిట్ ఆప్షన్‌ను 15 వరకు పొడిగిస్తూ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమి షన్ గురు వారం నిర్ణయంతీసుకుంది. అభ్య ర్థు లు ఎడిట్ ఆప్షన్‌ను ఉపయోగిం చుకోవాలని కమిషన్ కార్యదర్శి వాణి ప్రసాద్ తెలిపారు.

ఇక్కడ అబ్బాయిలు అమ్మబడును

(మొదటిపేజీ తరువాయి)

తుంటే, మరికొందరు బార్లు,పబ్‌ల ద్వారా శారీరక సుఖాలను పొందుతున్నారట. కొన్ని బార్లలో అయితే ఏకంగా యువకుల చిత్రాలు మెనూలో అంతర్భాగంగా ఉండటం విశేషం. సదరు కస్టమర్ మెచ్చిన యువకుడు క్షణాల్లో డ్రింక్‌తో టేబుల్ ముందు ప్రత్యక్షమవుతాడు. తొలి 30 నిముషాల పరిచయానికి సుమారు 500 యెన్‌లు చార్జ్ చేస్తారు. సదరు యువకుడు నచ్చితే, తర్వాత దశకు వెళ్తారు. ప్రైవేటు గదికి , లేదా లవ్ హోటల్‌కు చేరుకుని శారీరక సుఖాన్ని పొందుతారు.

ప్రకృతి వైపరీత్యాలూ కారణమే..

వేశ్యావృత్తి నియంత్రణ చట్టంలో మహిళలు- పురుషుల అంశంపై స్పష్టమైన నిర్వచనం లేకపోవడం ఈవిధమైన ధోరణులకు కారమైంది. కొద్దిపాటి లోపాలను ఆసరాగా చేసుకుని మొత్తం చట్టాన్నే పక్కదారి పట్టించారు. ఈ దారుల్లోకి ప్రవేశిస్తున్న సగటు యువకుల వయసు 20 సంవత్సరాలుగా ఉంది. ''సునామీ, భూకంప ప్రాంతాలకు చెందిన యువకులు బతుకుదెరువు కోసం టోక్యోబాట పట్టారని నివేదికలు వెల్లడిస్తున్నాయి. 2011 తర్వాత ఈ తరహా వలసలు ఎక్కువ అయినట్లు తెలుస్తోంది. అంతకు ముందు పేదరికం, కుటుంబ నేపథ్యం, పరిస్థితుల మూలంగా మహిళలు వేశ్యావృత్తిని ఆశ్రయించేవారు. కానీ పుకుషిమా అణువిద్యుత్ కేంద్రం పేలుడు తర్వాత పురుషులకు బతుకు దెరువు కష్టమైంది. అలాంటి వారు 2-క్రోమ్‌ను ఆశ్రయించారు' అని బాయ్స్ ఫర్ సేల్ డాక్యుమెంటరీ బృంద సభ్యుడు యాష్ తెలిపారు.

టేకిటీజీ అంటున్న ప్రియురాళ్లు

జపనీస్ మిలీనియం కుర్రాళ్లు తాగుబోతులు కారు.. ర్యాష్ డ్రైవింగులకు వెళ్లరు.. ప్రార్థనలతో సమయం వృథా చేయరు.. మరేంచేస్తారు? అంటే బతకడానికి అవసరమైన పనులు చేస్తుంటారు అన్న సమాధానం హృదయాలను కదలించి వేస్తుంది. గే సెక్స్ వృత్తి ఇష్టం కాకున్నా తప్పనిసరి పరిస్థితుల్లో అటువైపు వెళ్లాల్సి వచ్చిందని చాలా మంది యువకులు బాహాటంగా అంగీకరిస్తున్నారు. ఇదే విషయాన్ని



వారి ప్రియురాళ్ల ముందు నిస్సంకోచంగా చెప్పేస్తున్నారు. వాళ్లు కూడా ప్రియుడి వృత్తిని తప్పుబట్టడం లేదు. టేకిటీజీ అనేస్తున్నారు. బతకడానికి ఏదోఒకటి చేయాలి కదా! అంటూ మద్దతుగా నిలుస్తుండటం విశేషం.

ఊహను మించిన వాస్తవాలు..

బాయ్స్ ఫర్ సేల్ డాక్యుమెంటరీ జపాన్‌లో విస్తరిస్తున్న గే సంస్కృతిని, పురుష వేశ్యావృత్తి చీకటి కోణాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది. టోక్యో ఎయిడ్స్ వారోత్సవం-2017లో భాగంగా ఇది గతేడాది నవంబర్ 26నవిడుదలైంది. గత 15 ఏళ్లలో సమాజంలో చోటుచేసుకుంటున్న విపరీత పరిణామాలు ఇతివృత్తాలుగా ఇయాన్ థామస్ యాష్ అనేక డాక్యుమెంటరీలను చిత్రీకరించాడు. ఈ కోవలో వచ్చిన బాయ్స్ ఫర్ సేల్ తెరకెక్కింది. నాలుగు ఫిలిం ఫెస్టివల్ అవార్డులను దక్కించుకుంది. లాస్ ఏంజెల్స్, ద. ఆఫ్రికా, మెక్సికో, ఈక్వెడార్‌లలో మంచి గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా దర్శక, నిర్మాత యాష్ తనకు ఎదురైన అనుభవాలను వెల్లడిస్తూ.. 'వాస్తవ పరిస్థితులు చూశాక నాకు మతిపోయినంత పనైంది' అని వ్యాఖ్యానించాడు. పదేళ్ల కిందటే ఈ డాక్యుమెంటరీ ఆలోచన చేశారట. కానీ నాలుగేళ్ల కిందట కార్యాచరణ ప్రారంభించగా, 2017 చివరలో తెరకెక్కింది. ఫిబ్రవరి నాటికి హాంగ్‌కాంగ్, టురిన్, మిస్సిసిపి, సిడ్నీ నగరాల్లో ప్రదర్శనకు ఏర్పాట్లు జరుగుతున్నాయని యాష్ చెప్పుకొచ్చాడు.

రూ. 3కోట్ల విలువచేసే కొకైన్ పట్టివేత

(మొదటిపేజీ తరువాయి)

దుండగులు పట్టుబడ్డారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని, తదుపరి విచారణ నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన హైదరాబాద్ డ్రగ్స్ కేసులో కీలక నిందితులు కాల్విన్, మైక్ కమింగా, గాబ్రియేల్, లేడీ డాన్ సంగీతలు ఎక్సైజ్ పోలీసులకు చిక్కారు. వీరి కాల్ డేటాలు విశ్లేషించిన ఎక్సైజ్ పోలీసులు విస్తుపోయారు. హైదరాబాద్ నగరంలో 8, 9 తరగతి చదివే కార్పొరేట్ విద్యార్థులను సైతం డ్రగ్స్‌కు బానిసలను చేశారు. ఇదే క్రమంలో ఇందుకు సంబంధించి టాలీ వుడ్‌కు చెందిన 12 మంది సినీ స్టార్స్‌ను సైతం ఎక్సైజ్ సిట్ విచారణ జరిపింది. ఇక దీంతో డ్రగ్స్ వాడకం, వినియోగం, సరఫరా తగ్గిపోగలదని అంతా భావించారు. అందుకు భిన్నంగా పరిస్థితులు నెలకొన్నాయి. ఏకంగా హైదరాబాద్ అడ్డగా శివారు ప్రాంతాలలో మూతపడ్డ కంపెనీలను తీసుకుని డ్రగ్స్ తయారీ చేస్తున్నారు. డ్రగ్స్ మాఫియాలు అంతేస్థాయిలో రెచ్చిపోతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి యథేచ్ఛగా డ్రగ్స్‌ను తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. నైజీరియన్లతో పాటు ఇతరులు సైతం డ్రగ్స్ దందాకు తెరదీస్తున్నారు. తాజాగా కర్నాటక నుంచి అత్యంత ఖరీదైన డ్రగ్స్‌ను హైదరాబాద్‌కు తరలిస్తుండగా సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ గేట్ వద్ద తనిఖీలలో కోట్లాది రూపాయల విలువ చేసే కొకైన్ పట్టుబడటమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పవచ్చు.

చర్లపల్లి రైల్వే టెర్మినల్ త్వరలో ప్రారంభం

రైల్వే జీఎం వినోద్‌కుమార్

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు ఏర్పాట్లు చకచకా జరుగు తున్నాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ (జీఎం) వినోద్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం రైల్వే పరిధిలో ఉన్న 50 ఎకరాలు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనున్న 100 ఎకరాల విస్తీర్ణంలో దీనిని చేపట్టనున్నామని దీనికి సుమారుగా రూ.360 కోట్లు వ్యయమవుతుందన్నారు. సుమారు 150 రైళ్ల రాకపోకలకు అనుగుణంగా ఆరు ప్లాట్ ఫాంలు, లైన్ల నిర్మాణంతో పాటు ఇతర సదుపాయాలు కల్పించనున్నామని ఆయన తెలిపారు. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూ డలలో ప్రధాన రైల్వేస్టేషన్లు ఉన్నాయని, నగరానికి రాకపోకలు భారీగా పెరుగుతుండడంతో వీటిలో రద్దీ తారాస్థాయికి చేరుకుందన్నారు. రోజు సుమారు 401 రైళ్లు ఈ మూడు స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తు న్నాయ న్నారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులకు సౌకర్య వంతంగా ఉండడంతో పాటు ప్రధాన స్టేషన్లలో రద్దీని తగ్గించేందుకు చర్లపల్లిలో మెగా టెర్మినల్ నిర్మాణాన్ని చేపట్టామని ఆయన తెలిపారు. ఔటర్‌ను ఆనుకొని ఉండడంతో ఈ టెర్మినల్ అన్ని విధాలుగా అనుకూ లంగా ఉంటుందని దీనిని ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. మొదటగా ఆరు ప్లాట్ ఫాంలో దీనిని ప్రారం భించి తరువాత 10 ప్లాట్ ఫాంలుగా విస్తరించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఢిల్లీ, విజయవాడ, విశాఖ, తిరుపతి, చెన్నై తదితర మార్గాల్లో రాకపోకలు సాగించే 150 రైళ్లను ఇక్కడి నుంచి నడిపేందుకు అవకాశం ఉందన్నారు.

హైదరాబాద్ నుంచి మచిలీపట్నానికి ప్రత్యేక రైలు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకొని హైదరాబాద్ నుంచి మచిలీపట్నం వరకు ప్రయాణికుల కోరిక మేరకు ప్రత్యేక రైలు (07250) ను నడపడానికి రైల్వేశాఖ నిర్ణయించింది. ఈ రైలు సికింద్రాబాద్ స్టేషన్‌లో రాత్రి 11.30 నిమిషాలకు బయలుదేరి పగిడిపల్లి, నల్లగొండ, మిర్యాల గూడ, పిడుగురాళ్ల, గుంటూరు, విజయవాడ, గుడివాడ, మీదుగా మచిలీపట్నం మరుసటి రోజు ఉదయం 10 గంటలకు చేరుకుంటుందని దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

ఎఎస్‌రావు ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య టాప్

ఆలిండియా మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థులు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: డాక్టర్ ఎఎస్ రావు అవార్డ్స్ కౌన్సిల్ వారు నిర్వహించిన 30వ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఫైనల్ ఎగ్జామినేషన్‌లో ఆలిండియా మొదటి ర్యాంకును శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు సాధించారు. టాప్-10లో 15 ర్యాంకులు, టాప్-20లో 28 ర్యాంకులు సాధించినట్టు శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బిఎస్ రావు తెలిపారు. 9, 10వ తరగతి విద్యార్థులకు ఈ పరీక్షను ఆలిండియా స్థాయిలో నిర్వహిస్తారు. 9వ తరగతి నుంచి 36 మందికి ర్యాంకులు ప్రకటించగా వారిలో 22 మంది తమ స్కూల్ విద్యార్థులున్నారని, 10వ తరగతి నుంచి 40 మంది విద్యార్థులకు ర్యాంకులు ప్రకటించగా వారిలో 29 మంది శ్రీచైతన్య విద్యార్థులు ఉన్నారని చెప్పారు. డాక్టర్ ఏఎస్ రావు ఒలింపియాడ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

'చైనాను కాపీ కొట్టొద్దు'

న్యూఢిల్లీ: చైనా అభివృద్ధి మోడళ్లను భారత్ కాపీ కొట్టకూడదని నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్ అన్నారు. చైనా అనుసరించిన పద్ధతులను మనం ఇక్కడ కూడా అమలుచేయడం సరికాదన్నారు. పట్టణీకరణ కోసం విదేశీ మోడళ్లను పరిశీలించాలసిన అవసరం లేదన్నారు. మనం విదేశీ మోడళ్లను అనుకరించటం విచారకరమని రాజీవ్ కుమార్ వ్యాఖ్యానించారు. చైనాలో తీరప్రాంతాల్లో మాత్రమే అభివృద్ధి జరిగిందన్నారు. ఆధునికీకరణలో మిగతా ప్రాంతాలు వెనుకబడే ఉన్నాయన్నారు. అక్కడ ప్రతి ఏటా సుమారు 5 మిలియన్ల మంది తీరప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వెళ్తుంటారు. మన దేశంలోనూ అదేవిధంగా జరగటం సరికాదన్నారు. బతుకుదెరువు కోసం తీరప్రాంతాలకు వెళ్లి పండుగ రోజుల్లో మాత్రమే సొంతింటికి వచ్చేలా ఉండే అభివృద్ధి మనకు వద్దన్నారు. దేశవ్యాప్తంగా అభివృద్ధిపథంలో హబ్‌లు తయారు చేయాలని రాజీవ్ కుమార్ అన్నారు.

పందెం కోళ్లతో బరిలో ఎంపీ, ఎమ్మెల్యే!

- జన్మభూమి సభలోనే పందేలు ప్రారంభం



కోడి పందేలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వర్మ, ఎంపీ తోట

కాకినాడ, ఆంధ్రప్రభ ప్రతినిధి: రెవెన్యూ, పోలీసు అధికారులు చూస్తుండగానే తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం జన్మభూమి సభలో ఎమ్మెల్యే ఎస్‌విఎస్‌ఎన్ వర్మ, కాకినాడ ఎంపీ తోట నరసింహంలు కోడిపందేలు ఆడారు. తెలుగుదేశం కార్యకర్తల కేరింతల మధ్య కోళ్లను రింక్ లోకొదిలి ప్రజా ప్రతినిధులు ఆనందించారు. పిఠాపురం నియోజకవర్గం జన్మభూమి ముగింపు సభను రాజీవ్ గాంధీ మున్సిపల్‌హైస్కూల్ ఆవరణలో నిర్వహిం చారు. పిఠాపురం, గొల్లప్రోలు, యు కొత్తపల్లి మండ లాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. ముఖ్య అతిథిగా కాకినాడ ఎంపీ తోట నరసింహం హాజరయ్యారు. ముందస్తుగా కార్యకర్తలు తీసు కొచ్చిన కోడి పుంజులను ఎమ్మెల్యే వర్మ, ఎంపీ నరసింహంలు చెరో పుంజును తీసుకుని వాటిని బరిలోకి వదిలారు. కార్యకర్తలు కేరింతలు, ఉత్సాహ పూరిత కేకల మధ్య కోడి పుంజులు రెండు కొట్లాడు కున్నాయి. ఇదంతా రెవెన్యూ అధి కారులు, పోలీసుల అధికారులు చూస్తుండగానే కొనసాగింది. కొంత సమయం తర్వాత వారు సభలోకి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ తెలుగు వారి సంప్ర దాయంలో కోడి పందేలు ఒక భాగమన్నారు. ఎడ్లపందేలు, ముగ్గులు, హరి దాసులు, గంగిరెద్దులు పిండి వంటలు మాదిరిగానే కోడి పందేలు సైతం సంక్రాంతి సరదాల్లో ఒక భాగమన్నారు. కోడి పందేలను జన్మభూమి సభలో కాకుండా సరదాగా బయట వదిలినట్టు ఆయన సమర్థిం చుకున్నారు. అక్కడే పోలీసు అధికారులు సైతం వున్నా పట్టించు కున్న నాదుడే లేడు. వద్దని వారించే సాహ సం పోలీసులు చేయ లేకపోయారు.

నాలుగు రోజుల క్రితమే ఎట్టి పరిస్థితిలోనూ కోడిపందేలను ఆపలేరని ఎమ్మెల్యే ఉప్పాడలో ప్రకటించిన సంగతి విధితమే. ఒకచోట చేరిన కోడి పుంజులు సహజంగానే పోట్లాడుకుంటాయని ఆయన వ్యాఖ్యానించారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జన్మభూమి సభలో కోడిపందేలు నిర్వహించడం పలువురు విమర్శిస్తున్నారు.

గవర్నర్ మార్పు ఇప్పట్లో లేనట్లే

- కేంద్రం సంకేతాలు? ● తెలుగు రాష్ట్రాల వివాదాలు తాత్కాలికమేనంటూ నివేదిక?



అమరావతి, ఆంధ్రప్రభ: తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ ఇఎస్‌ఎల్ నరసింహన్ మార్పుపై వస్తున్న ఊహాగానాలకు తాత్కాలికంగా తెరపడిన ట్టేనని భావిస్తున్నారు. వరుస వివాదాల నేపథ్యంలో గవర్నర్‌ను మార్చడం తథ్యమనే ప్రచారం బలంగా జరిగింది. ఈ పరిణామాల ఫలితంగానే నరసింహన్‌ను కేంద్రం ఢిల్లీకి పిలిపించుకుందని అంతా భావిం చారు.అయితే ఈసారి కూడా గవర్నర్ లాబీయింగ్ ఫలించిందని, నరసింహన్ తేలికగానే బయట పడ్డారని భావిస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రా లను పరిపాలనాపరంగా నెట్టుకు రావడంలో నరసింహన్ కన్నా సమర్థుడు లేడని కేంద్ర ప్రభుత్వం అభిప్రాయ పడుతోందంటూ హస్తినవర్గాలు నిర్ధారించుకోవడం విశేషం. ఫలితంగా గవర్నర్‌ను ఇప్పట్లో మార్చ బోరనే వాదనలకు బలం చేకూరినట్టయింది. అయితే తన ఢిల్లీ పర్యటనలో దాయాది రాష్ట్రా ల మధ్య స్పర్ధలు సహజమని, క్రమేణా అవి సర్దుకుంటాయనే రీతిలో కేంద్ర ప్రభుత్వానికి ఒక నివేదికను సమర్పించినట్టు తెలిసింది. విభజన చట్టంలోని పాక్షికమైన సమస్యలు మాత్రమే పెండింగ్‌లోవు న్నాయని పేర్కొన్న గవర్నర్ , మరోవైపు అవి కూడా త్వరలోనే సర్దుకుంటాయని కేంద్రం దృష్టికి తెచ్చారు. రెండు రాష్ట్రా ల పరిపాలన, రాజకీయ పరిస్థితులపై తన ఢిల్లీ పర్యటన సందర్భంగా నరసింహన్ కేంద్ర హోం శాఖకు సమగ్ర నివేదికను అందజేశారు. అందులో పలు అంశాలను ప్రస్తావిస్తూ, ఉభయ రాష్ట్రా లలో సీరియస్‌గా పరిగణించే అంశాలేమీ లేవంటూ తేల్చి చెప్పారు. కాగా కేసీఆర్‌కు పక్షపాతిగా గవర్నర్ మారారంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్రంలోని ప్రతిపక్షం విమర్శలు గుప్పిస్తున్న నేపథ్యంలో గవర్నర్‌ను కేంద్రం ఢిల్లీకి పిలిపించు కోవడం ప్రాధాన్యతను సంతరించు కుంది. కేవలం ఉభయ రాష్ట్రా లలోని 'స్టేటస్' రిపోర్టు లక్ష్యంగానే ఢిల్లీ పర్యటన సాగిందని హస్తినవర్గాల కథనం. ఈ పరిణామాల నేపథ్యంలో గవర్నర్‌ను ఇప్పట్లో మార్చే ఉద్దేశం లేదంటూ కేంద్రం సంకేతాలిచ్చి నట్టయింది. ఇదిలా వుండ గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీలో బిజెపి శాసనసభా పక్ష నేత విష్ణుకుమార్ రాజు గవర్నర్ తెలంగాణ ప్రభుత్వ పక్షపాతిగా మారారంటూ ధ్వజమెత్తడం విశేషం. ఏపీ అభివృద్ధి అంటే నరసింహన్‌కు గిట్టదని విమర్శించారు. తక్షణమే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకం గా కొత్త గవర్నర్‌ను నియమించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదే విధంగా తెలంగాణలో ప్రతిపక్ష మైన కాంగ్రెస్ కూడా గవర్నర్‌పై మండిపడుతోంది. నరసింహన్ టీఆర్‌ఎస్ ఏజెంట్‌గా మారారని, ముఖ్యమంత్రికి వత్తాసు పలుకుతు న్నారని అసహనం వ్యక్తం చేశారు. తాము చేస్తేనే గవర్నర్ అయిన నరసింహన్ తన పద్ధతిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఇదిలా వుండగా ఇప్పటికిప్పుడు గవర్నర్ వివాదం సద్దుమణిగి నట్టుగా కనిపిస్తున్నప్పటికీ, కేంద్రం ఏ సందర్భం లోనైనా కీలక నిర్ణయం తీసుకునే యోచన కూడా లేకపోలేదని పరిశీలకులు అంటున్నారు.

లేపాక్షి శిల్పాలు అద్భుతం

న్యూజిలాండ్ జట్టు కితాబు



లేపాక్షి, ప్రభ న్యూస్ : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన లేపాక్షి దేవాలయాన్ని న్యూజిలాండ్‌కు చెందిన అండర్ 15 జట్టు గురువా రం మధ్యాహ్నం సందర్శిం చింది. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు సూర్య ప్రకాశ్, లక్ష్మీనరసింహ శర్మలు స్వా గతం పలికారు. అనంతరం దేవాలయ విశిష్టతను అర్చకులను అడిగి తెలుసు కున్నారు. ఏడు శిరస్సుల నాగేంద్రు డు, అర్ధాంతరంగా ఆగిపోయిన కల్యాణ మండపం, సీతమ్మ పాదం తదితర ఆలయ విశిష్టతను అర్చకులను అడిగి సంతృప్తిని వ్యక్తం చేశారు. దేవాలయంలోని శిల్పాలను, చిత్రాలను చూసి అద్భుతంగా వున్నాయని వారు తెలిపారు. అనంతరం దుర్గా పాపనేశ్వర, వీరభద్ర స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ అర్చకు లు ఆలయ మర్యాదలతో వారిని సత్కరించారు. అనంతరం తీర్ధ ప్రసాదాలు అంద జేశారు. వీరి వెంట ఆర్‌డిటి డైరెక్టర్ విశాల్ పెర్రార్, ఎటిఎల్ మీనాక్షిలు వున్నారు.

చిత్తశుద్ధితో పనిచేస్తాం

టీటీడీ అధికారుల ప్రమాణం

తిరుమల, ప్రభ న్యూస్ : టీటీడీలో ఉద్యోగ బాధ్యతలు త్రికరణశుద్ధిగా నిర్వహిస్తామని ఉద్యో గులు, సిబ్బంది గురువారం ఉదయం ప్రమాణం చేశారు. తిరుమలలో గోకులం విశ్రాంతి భవనం ప్రాంగణంలో తిరుమల జేఈవో శ్రీనివాసరాజు ఈ మేరకు అధికారులు సిబ్బంది చేత ప్రమాణం చేయించారు. అఖిలాండకోటి బ్రహ్మాండనాయక ుడైన శ్రీ వేంకటేశ్వరస్వామివారి కొలువులో ఒక ఉద్యోగిలా సేవ చేసే అదృష్టం నాకు కలిగింది. ఇది నా పూర్వజన్మ పుణ్యఫలంగా భావిస్తున్నాను. ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ నేను నా ఉద్యోగ ధర్మాన్ని త్రికరణశుద్ధిగా నిర్వహిస్తాను. స్వామిని సేవించడానికి నిత్యమూ వేలకొలది తిరుమలకు వచ్చే భక్తులకు ఏమాత్రం అసౌకర్యం కలగకుండా చిత్తశుద్ధితో నా విధులు నెరవేరు స్తాను. విధి నిర్వహణలో నీతి, నిజాయితీతో నడుచుకుంటాను. హిందూ ధర్మాన్ని, హిందూ సాంప్రదాయా న్ని పాటిస్తూ, అన్యమత ప్రచారానికి పాల్పడను. జీవోఎంఎస్ నెం. 1060లోని 9(6)ని అతిక్రమించను. ఏదైనా కారణాలతో అన్యమతం పాటించడం కానీ, ప్రచారంలో గానీ లేదా అలాంటి కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు యాజమాన్యం దృష్టికి వస్తే తగిన క్రమశిక్షణా చర్యలకు బాధ్యుడినవుతాను అని శ్రీవారి చిత్రపటం ముందు ప్రమాణం చేశారు. ప్రమాణం చేసిన వారిలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఈ సందర్భంగా జేఇఓ విలేకరులతో మాట్లాడుతూ టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఆదేశాల మేరకు అధికారులతో, సిబ్బందితో ప్రమాణం చేయించి నట్లు తెలిపారు. ఈ మేరకు ప్రమాణ పత్రంతో ప్రమాణం చేసిన విషయాన్ని ఉద్యోగుల సర్వీసు రిజిస్టర్‌లో ఎంట్రీ చేయిస్తామన్నారు. ఉద్యోగులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని నిబద్ధతతో వ్యవహరిస్తారని తెలియజేశారు.





దివ్యాంగులకు 5 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి

సీఎంకు, మంత్రి జూపల్లికి దివ్యాంగుల లేఖ

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : నూతన పంచాయతీ చట్టంలో వికలాం గులకు అన్ని హోదాల్లో 5 శాతం రాజకీయ రిజర్వేషన్లను కల్పించా లని సీఎం కేసీఆర్‌కు, మంత్రి జూపల్లి కృష్ణారావుకు విక లాంగులు లేఖ రాశారు. రాష్ట్రంలో అధికారిక లెక్కల ప్రకారం వికలాంగుల సంఖ్య 10 లక్షల 56 వేలు ఉన్నారని ఇది 1995 చట్ట ప్రకారం 7 రకాల వైకల్యాల జనాభా లెక్కింపు మాత్రమే అన్నారు. 2016 సంవత్స రంలో ఆమోదించిన వికలాంగుల హక్కుల చట్టం ప్రకా రం అదనంగా 14 రకాల గుర్తించినా మొత్తం 21 రకాలైన వికలాంగుల జనాభా దాదా పు 20 లక్షలకు పైగానే ఉందని ఆ లేఖలో పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ కల గ్రామాభి వృద్ధి ద్వారా బంగారు తెలంగాణ సాధించే క్రమంలో నూతన పంచాయతీ చట్టంలో బడుగు, బలహీన వర్గాలకున్న ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ, ఉమెన్ మాదిరి గానే వికలాంగులకు కూడా అన్ని రాజకీయ హక్కులు, రిజర్వేషన్స్ సంక్షేమం, అభివృద్ధి పథకాలతో సమాన అవకాశాలు ఇచ్చే విధంగా చేర్చాలని ఆ లేఖలో వారు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం మంత్రి జూపల్లిని కలిసి లేఖను స్వయంగా అందజేశారు.

ఓబీసీలకు నిధులు పెంచాలి

కేంద్ర మంత్రి అథవాలేకు తెలంగాణ సంక్షేమ సంఘం విజ్ఞప్తి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: కేంద్ర బడ్జెట్‌లో ఓబీసీలకు నిధులు పెంచాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. జనాభాలో 50 శాతానికిపైగా ఉన్న బీసీలకు నిధులు పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కేంద్ర సామాజిక న్యాయ సాధికారిత సహాయ మంత్రి రాందాస్ అత్వాలేకు గురువారం వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఇ నిరంజన్, కుల్కచర్ల శ్రీనివాస్, ఎస్ దుర్గయ్య గౌడ్, టి విక్రంగౌడ్, వరికుప్పల మధు, నామాల సంతోష్‌గౌడ్, భిక్షపతిరావు తదితరులు పాల్గొన్నారు. కేంద్ర బడ్జెట్ రూ. 39,61,354 కోట్లు ఉండగా అందులో ఓబీసీలకు కోసం కేటాయించిన నిధులు కేవలం రూ. 972 కోట్లు మాత్రమేనని జాజుల మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జనాభాలో 50 శాతానికిపైగా ఉన్న వారికి కేవలం రూ. 972 కోట్లు ఏ మూలకు సరిపోవన్నారు. ఫిబ్రవరిలో జరిగే కేంద్ర బడ్జెట్ సమావేశాల్లో బీసీలకు రూ. 50వేల కోట్లు కేటాయించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. బీసీలకు జాతీయ స్థాయిలో ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయాలన్నారు. బీసీ పరిశోధక విద్యార్థులకు రాజీవ్ ఫెలోషిప్‌లు మంజూరు చేయాలని కోరారు. జాతీయబీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీసీల సంక్షేమానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు పెంపు పరిశీలనలో ఉందని కేంద్ర మంత్రి చెప్పారని జాజుల తెలిపారు.



లాల్ బహదూర్ శాస్త్రికి ఘననివాళి

న్యూఢిల్లీ: మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఘనంగా నివాళి అర్పించారు. ట్విట్టర్లో ప్రధాని మోడీ లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి చేసిన సేవలను కొనియాడారు. రాబోయే తరాలకు ఆయన చేసిన సేవలు ఆదర్శం అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ట్విట్టర్‌లో లాల్ బహదూర్ శాస్త్రికి నివాళి అర్పించారు. 1904లో జన్మించిన లాల్ 1964, 1966 మధ్య దేశ ప్రధానమంత్రిగా పనిచేశారు. ఆయన ప్రధానిగా ఉండగానే 1966లో తాష్కెంట్లో మరణించారు.1966 జనవరి 10న తాష్కెంట్ ఒప్పందంలో సంతకం చేసిన తరువాత ఆయన మరణించారు. ఈ ఒప్పందం అనంతరం అధికారికంగా 1965లో జరిగిన ఇండో పాకిస్థాన్ యుద్ధం ముగిసింది. జై జవాన్, జై కిసాన్ నినాదం ఇప్పటికీ ఆయన్ని నిరంతరం స్మరించుకునేలా నిలిపింది.

అవినీతి భారతం.. రోడ్లు అదృశ్యం

ప్రధాని పథకంపై విదేశీ అధ్యయనంలో వెల్లడి



వాషింగ్టన్: భారతదేశంలో అంతులేని అవినీతి గ్రామీణులను నడిరోడ్డులో నిలువుదోపిడి చేస్తున్నదని విదేశీ పరిశోధకులు చేపట్టిన ఒక అధ్యయనం తేల్చింది. మారుమూల ప్రాంతాలను దేశంలో ఇతర ప్రాంతాలకు అనుసంధానం చేయాల్సిన రహదారుల నిర్మాణ పథకం దీనికి ఊతమిచ్చింది. అసలు నిర్మించని రోడ్లకు ప్రభుత్వం నిధులు చెల్లించిన వైనాన్ని వెలుగులోకి తీసుకువచ్చింది. అమెరికాలో ప్రిన్స్‌టన్ యూనివర్శిటీ, ఫ్రాన్స్‌లో ప్యారిస్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌కు చెందిన పరిశోధకులు ఒక వినూత్నమైన టెక్నిక్ ద్వారా ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన(పీఎంజీఎస్‌వై) పథకాన్ని పరిశీలించారు. సదరు అధ్యయనం జర్నల్ ఆఫ్ డెవలప్‌మెంట్ ఎకనమిక్స్‌లో ప్రచురితమైంది. పథకం జాబితాకు లోబడి నిర్మాణం పూర్తయినట్టుగా పేర్కొన్న దాదాపు 500 రహదారులను అసలు నిర్మించకుండానే చెల్లింపులు జరిపినట్టు అది వెల్లడించింది. పరిశోధకులు ఈ తప్పిపోయిన రహదారులను రాజకీయ అవినీతితో ముడిపెడుతున్నారు. మరీ ముఖ్యంగా స్థానిక రాజకీయ నాయకులు తమ వర్గానికి చెందిన వారికి దక్కేట్టుగా రోడ్డు కాంట్రాక్టులను మలుపు తిప్పుతున్నారు. ఈ పథకంలో అవినీతి కారణంగా తప్పిపోయిన రోడ్లతో నేరుగా 8,75,000 గ్రామీణులకు కీడు జరుగుతున్నదని మా ఫలితాలు సూచించాయి అని అధ్యయనానికి నేతృత్వం వహించిన ప్రిన్స్‌టన్ ప్రొఫెసర్ డ జాకోబ్ ఎన్ షప్రియో తెలిపారు. దేశవ్యాప్తంగా మూడు లక్షలకుపైగా గ్రామాలను రహదారులతో ఇతర ప్రాంతాలకు అనుసంధానం చేయడమే లక్ష్యం గా భారతప్ర భుత్వం 2000 సంవత్సరంలో పీఎంజీఎస్‌వై పథకాన్ని ప్రారంభించింది.

త్వరలో జిల్లాలకు ర్యాంకులు: నీతి అయోగ్

న్యూఢిల్లీ: అభివృద్ధి చెందాలని ఆకాంక్షించే 115 జిల్లాలకు ఏప్రిల్ నాటికి నీతి అయోగ్ ర్యాంకులు ఇవ్వనుంది. ఆకాంక్షించే జిల్లాల రూపాంతీకరణ అనే అంశంపై ఈ నెల మొదట్లో జరిగిన సదస్సులో నీతి అయోగ్ ఈ విషయాన్ని వెల్లడించింది. పౌష్టికాహారం, విద్య, ఆరోగ్యం లాంటి 10 పరామితులు ప్రాతిపదికగా వెనుకబడిన 115 జిల్లాలకు ర్యాంకులు ఇస్తామని తెలిపింది. ఈ మేరకు సదస్సుకు సమర్పించిన నివేదికను గురువారం నీతి అయోగ్ వెబ్‌సైట్ లో ఉంచారు. అలాగే ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల రియల్ టైమ్ పర్యవేక్ష ణకు ఏప్రిల్ నాటికి ఒక యంత్రాంగాన్ని సైతం నీతి అయోగ్ నెలకొల్పనుంది.

తమిళనాడులో రవాణా సమ్మె విరమణ

చెన్నయ్: తమిళనాడు రవాణా ఉద్యోగులు ఎనిమిది రోజులుగా చేస్తున్న సమ్మెను గురువారం తాత్కాలికంగా విరమించుకున్నారు. 14న రాష్ట్ర ప్రజలు పొంగల్ పండుగ జరుపుకోనున్న తరుణంలో వారికి పెను ఊరట కలిగిస్తున్నట్టుగా ఉద్యోగ సంఘాలు సమ్మె విరమించుకున్నట్టు ప్రకటించాయి. ప్రభుత్వం, ఉద్యోగుల మధ్య వేతన సవరణ వివాదం పరిష్కారం కోసం మద్రాసు హైకోర్టు ఒక మధ్యవర్తిని(ఆర్బిట్రేటర్) గురువారం నియమించిన తరుణంలో సమ్మె విరమణ నిర్ణయం వెలువడింది. రాష్ట్ర ప్రజల ప్రయోజనార్థం సమ్మెను తాత్కాలికంగా విరమించుకుంటున్నట్టు సీఐటీయూ నేత ఎ.సౌందర్‌రాజన్ విలేకరులతో అన్నారు. మధ్యవర్తి నెల రోజుల్లోగా వేతన సవరణ అంశాన్ని నిర్ణయించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉత్తరాఖండ్‌లో మదరసాలు సంస్కృతం బోధిస్తాయి!

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ రాష్ట్రంలో మదరసాలు ఇక నుంచి సంస్కృతంను బోధించనున్నాయి. గురువారం ఈమేరకు వివరాలను ఉత్తరఖండ్ మదరసా ఎడ్యుకేషన్ బోర్డు(యుఎంఈబీ) డిప్యూటీ రిజిస్ట్రార్ అఖ్లక్ అహ్మద్ మీడియాకు తెలిపారు. యుఎంఈబీకి చెందిన కిందిస్థాయి కమిటీ ఈ మేరకు బుధవారం నిర్ణయం తీసుకుందన్నారు. ఇందులో భాగంగా మదరసాలు సంస్కృతంతో పాటు, కంప్యూటర్ సైన్స్‌లను ఆప్షనల్ సబ్జెక్టులుగా చేర్చుకునే ప్రతిపాదనకు కమిటీ ఓకే చెప్పిందన్నారు. ఈ ప్రతిపాదనను బోర్డు ఉన్నత కమిటీ కూడా ఆమోదించాల్సి ఉందని చెప్పారు. ఒకవేళ ఉన్నత కమిటీ కూడా ఆమోదం తెలిపితే ఈ ప్రతిపాదన అమలు వచ్చే అకడెమిక్ సంవత్సరంనుంచి జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోని మదరసాలు మ్యాథ్స్, సైన్స్, ఆయుష్, సోషల్ సైన్సెస్‌లను అప్షనల్ సబ్జెక్టులుగా కలిగివున్నాయి.

ప్రధాని చిత్రం మార్ఫింగ్.. ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

ఖగారియా(బీహార్): మార్ఫింగ్ చేసిన ప్రధాని మోడీ చిత్రంతోపాటు అభ్యంతరకరమైన క్యాప్షన్‌ను పెట్టి సోషల్ మీడియాలో షేరింగ్‌చేసిన ఘటనలో ఒక పోలీస్ ఇన్‌స్పెక్టర్ సస్పెండ్‌కు గురయ్యాడు. వివరాలను ఖగారియా ఎస్పీ గురువారం మీడియాకు వెల్లడించారు. టౌన్ పోలీస్ స్టేషన్లో మహ్మద్ ఇస్లాం ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన పంపిన వివాదాస్పద సందేశం కొన్ని రోజుల క్రితమే బయటకు వచ్చింది. స్థానిక ట్రేడర్స్ నడుపుతున్న వాట్సాప్ గ్రూప్‌లో ఇస్లాం ఈ సందేశాన్ని షేర్ చేశాడు. ప్రధాని మోడీ, ముంబై దాడుల మూలకర్త హఫీజ్ సయీద్‌తో కరచాలనం చేస్తున్నట్లు చిత్రంను షేర్ చేశాడు. దాని కింద క్యాప్షన్‌లో దేకో కౌన్ దేశ్‌ద్రోహీ హై (చూడండి దేశ ద్రోహులెవరో) అన్న వాఖ్యాలున్నాయి. ఇస్లాం వైఖరి బీహార్ సర్వెంట్స్ కండక్ట్ రూల్స్-1976కు అతిక్ర మించాడని ఎస్పీ తెలిపారు. ఆయన బదిలీని నిలిపివేసిదర్యాప్తుకు ఆదేశించారు.

సుస్థిర అభివృద్ధి దిశగా తెలంగాణ

• ఇబ్బందులు అధిగమిస్తూ ముందుకు • ఆశాజనకంగా అన్ని రాబడులు

• ప్రభుత్వ సంస్కరణల ఫలితమే వృద్ధిరేటు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ నాలుగేళ్ల అనతికాలంలోనే సుస్థిర అభివృద్ధి దిశగా దూసుకుపోతున్నది. బంగారు తెలంగాణ నినాదాన్ని వాస్తవ దిశలో సాకారం చేసుకోవడంలో విజయవంతమవుతోంది. బడ్జెట్‌లో పొందుపర్చుకున్న రాబడులు, అంకెలను వాస్తవంలో తెచ్చుకుంటూ ముందుకు సాగుతోంది. నోట్ల రద్దు, జీఎస్టీ వంటి ఇబ్బందులను అధిగమిస్తూ నేర్పుగా ఆదాయ రాబడులను సమీకరించుకుంటోంది. ఇందుకు పాలనా సంస్కరణల మొదలు అన్ని రంగాలు ఇతోధిక వృద్ధి రేటుతో అభివృద్ధికి అండగా నిలుస్తున్నాయి. జిల్లాల పునర్వ్యవస్థీకరణ, పాలనా సంస్కరణలు, అధికార వికేంద్రీకరణ, వ్యవసాయ రంగ పునరుత్తేజం, కుల వృత్తులకు పునర్వైభవంద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్తరూపు, సేవా రంగంలో ప్రగతి అంతా కలిసి రాష్ట్ర వికాసం కొత్త పుంతలు తొక్కుతోంది.

రాష్ట్ర రాబడులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగుతుండగా జీఎస్టీ(వస్తు సేవల పన్ను)రాబడి కొంత మేర తగ్గుతూ వస్తోంది. దీనిని కూడా అతి త్వరలో అధిగమించేలా సర్కార్ కసరత్తు ఆరంభించింది. నవంబర్ కంటే స్టేట్ జీఎస్టీ సుమారు రూ.11కోట్లు తగ్గగా, ఐజీఎస్టీ రూ. 30కోట్లు తగ్గింది. నవంబర్‌లో రూ.1549కోట్ల జీఎస్టీ వసూళ్లురాగా డిసెంబర్‌లో రూ. 1503కోట్లు మాత్రమే ఖజానాకు చేరాయి. అయితే స్లాబ్‌రేట్లలో మార్పులు, జీఎస్టీ రిటర్నులు దాఖలుకు గడువు పెంపుతో రాబడికి కొంత గండి పడిందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

అనేక వస్తు సేవలను 28శాతం పన్ను రేటులోనుంచి 18శాతం స్లాబ్‌లోకి కొన్ని 18నుంచి 12 శాతం స్లాబ్‌లోకి చేరడం, మరికొన్ని సేవలు 12నుంచి 5 శాతంలోకి, అధిక వస్తు సేవలు 5 శాతం నుంచి సున్నా(పన్ను రహిత జాబితా) పన్నులోకి చేరడంతో రాబడిపై ప్రభావం పడింది. అయితే డిసెంబర్‌లో స్టేట్ జీఎస్టీ కంటే ఐజీఎస్టీ కొంత మేర వృద్ధిని సాధించింది. రాష్ట్రానికి జీఎస్టీ ద్వారా కనీస రాబడిని రూ.1745కోట్లుగా ప్రభుత్వం అంచనా వేసింది.

ఈ నిర్ధారిత మొత్తంకంటే తక్కువగా సాధిస్తే ఆ మొత్తాన్ని కేంద్రం లోటుగా పరిగణించి సర్దుబాటు చేస్తుంది. ప్రతీ రెండు నెలలకు ఒకసారి ఈ మొత్తాలను సర్దుబాటు చేయాలని చట్టంలో ఉంది. జీఎస్టీ తగ్గుతున్న తరుణంలో కేంద్రం రాష్ట్రానికి కీలకసూచనలు చేసింది. జీఎస్టీ రాబడులు తగ్గేందుకు కారణాలను గుర్తించాలని కోరింది. వాటిని గుర్తించి రాబడి మార్గాలను పెంచుకోవాలని పేర్కొంది. పన్ను వసూలుకు చర్యలు తీసుకోవడంతోపాటు, అక్రమాలను కట్టడి చేయాలని, పన్ను చెల్లించని వ్యాపారులను, జీరో దందాలను అరికట్టాలని సూచించింది. ఈ నేపథ్యంలో ఇ-వే బిల్లులను తెరపైకి తెచ్చింది. పన్ను చెల్లించకుండా సరుకులను తరలించే వాహనాలపై నిఘా పెట్టింది. తాజాగా నూతన సంవత్సర వేడుకలపై పన్నును విధించి కట్టడిచేసింది. వసూళ్లను చేసింది. ప్రత్యేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటు చేసే అంశంపై దృష్టిసారించింది.

ప్రస్తుత ఆర్థిక ఏడాది తొమ్మిది మాసాల్లో ఆబ్కారీ ఆదాయంలో కలుపుకుని 19శాతం వృద్ధి రేటును రాబడి శాఖలు నమోదు చేశాయి. గతేడాది ఇదే సమయానికి వాణిజ్య పన్నుల రాబడులు రూ. 24,977 కోట్లు ఉండగా తాజాగా ఈ ఏడాది రూ. 26,982 కోట్లకు చేరాయి.

ఇది కీలకాంశం అధిక వృద్ధిని సాధించి కీలక వసూళ్లను నమోదు చేసుకున్నట్లుగా ఆర్థిక వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రత్యేకంగా ఈ తొమ్మిది నెలల్లో వ్యాట్ వసూళ్లు రూ.19,404 కోట్లుకాగా, ఎక్సైజ్ డ్యూటీ రూ.2828 కోట్లు, పరిహార రూపంలో రూ.169కోట్లు, ఎస్జీఎస్టీ రూ. 3969కోట్లు, ఐజీఎస్టీ రూ.3438కోట్లుగా నమోదైంది. డిసెంబర్‌లో ఈ మొత్తాలు 11 శాతం వృద్ధిని సాధించి చేసుకున్నాయి. ఇక ఆబ్కారీ రాబడితో కలుపుకుంటే మొత్తం రాబడులు రూ. 29,811 కోట్లుగా నమోదైంది. డిసెంబర్‌లో ఇది 25 శాతం అధిక ఆదాయం దిశగా దూసుకుపోయింది.

రోడ్డుమీద చెత్తేస్తే ఫైన్!

(మొదటి పేజీ తరువాయి)

ప్రక్షాళన చేసి మరింత పారదర్శకత తెచ్చేందుకు ట్రిబ్యునల్ ఏర్పాటే మేలని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది. పారదర్శకంగా వ్యవహరించేందుకు అనువైన అంశాల్లో భాగంగా కీలక చర్యలను తెరపైకి తెచ్చారు. చట్టానికి లోబడి ప్రజలెవరైనా వ్యవహరించకపోతే జరిమానా విధించే హక్కును కూడా సర్పంచ్ నేతృత్వంలోని పాలకమండలికి కట్టబెట్టే అంశంపై చర్చించారు.

రహదారులపై చెత్త వేయడం, ఇంట్లోని నీటిని వీధుల్లోకి వదలడం, రహదారులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం వంటి 22 అంశాల్లో నిబంధనలు ఉల్లంఘించేవారికి పంచాయతీ పాలకవర్గమే జరిమానా విధించే విషయంపై చర్చించారు. గ్రామాల పరిశుభ్రత, అక్రమ నిర్మాణాల కట్టడి, వాటి తొలగింపునకు అయ్యే వ్యయాలను కూడా అందుకు కారకులనుంచే వసూలు చేసే అంశాన్ని సబ్ కమిటీ తీవ్రంగా పరిశీలిస్తోంది. ఇప్పటివరకు పంచాయతీల్లో ఆడిటింగ్ ప్రక్రియ కొంత ఆలస్యంగా జరుగుతోందని గుర్తించామని, దీనిని సవరించేందుకు చట్టంలో మార్పులు చేయాలని నిర్ణయించారు. ఆర్థిక ఏడాది పర్తయిన 9నెలల్లోపు ఆడిటింగ్ ప్రక్రియ ముగుస్తోందని, పంచాయతీల్లో జరుగుతున్న ఆడిటింగ్ వ్యవహారాల డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు సబ్ కమిటీకి వివరాలను వెల్లడించారు. ఈ అంశంలో చేపట్టాల్సిన మార్పులపై చర్చించిన కమిటీ ఆడిటింగ్ కాలపరిమితి తగ్గించే దిశగా తీసుకోవాల్సిన చర్యలను పరిశీలించింది. పంచాయతీల్లో జరుగుతున్న నిధుల వ్యయం, పన్నుల వసూళ్లు వంటివన్నీ ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలనే నిబంధనను చట్టంలో పొందుపర్చాలని భావిస్తున్నారు. ఇందుకు ప్రతీ గ్రామ పంచాయతీలో ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించుకోవాలని సబ్ కమిటీ అభిప్రాయపడింది. సక్రమంగా విధులు నిర్వహించని కార్యదర్శులను సరెండర్ చేసే అధికారాన్ని పాలక వర్గానికి కట్టబెట్టే దిశగా సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డితోపాటు ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు, అదనపు కార్యదర్శి స్మితా సబర్వాల్, అడిషనల్ అడ్వొకేట్ జనరల్ రాంచందర్‌రావు, పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, కమిషనర్ నీతూ ప్రసాద్, న్యాయ శాఖ కార్యదర్శి నిరంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ముగ్గురు పిల్లల అనర్హత ఎత్తివేయాలి: గిరిజనాభివృద్ధి సంస్థ చైర్మన్

ముగ్గురు పిల్లలుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులుగా పేర్కొంటూ 1995లో విధించిన నిబంధనను ఎత్తివేయాలని సబ్ కమిటీకి తెలంగాణ గిరిజనాభివృద్ధి సంస్థచైర్మన్ గాంధీనాయక్ వినతి పత్రం అందజేశారు. ఎంపీలు, ఎమ్మెల్యేలకు లేని నిబంధన స్థానిక సంస్థల్లో పనిచేసే వారికే విధించడం సరికాదని, కొత్త చట్టంలో ఈ నిబంధన ఎత్తివేయాలని ఆయన కోరారు.

నాణేల ఉపసంహరణ పిల్ కొట్టివేత

న్యూఢిల్లీ: మతపరమైన చిహ్నాలు ఉన్న నాణేలను ఉపసంహరించాలని కోరుతూ దాఖలైన పిల్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. మత చిహ్నాలు ఉన్న నాణేలు చెలామణిలో లేకుండా ఉపసంహరించాలని ఢిల్లీకి చెందిన నఫీస్ ఖాజీ, అబూ సయీద్ ప్రజా ప్రయోజనం వ్యాజ్యం దాఖలు చేయగా హైకోర్టు దానిని నిరాకరించింది. 2010, 2013 సంవత్సరాల్లో బృహదీశ్వర ఆలయం, వైష్ణోదేవి ఆలయ చిహ్నాలతో ఉన్న నాణేలను ఆర్బీఐ జారీ చేయటంపై పిటీషనుదార్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది లౌకికవాదానికి వ్యతిరేకమంటూ పిటీషనులో పేర్కొన్నారు. ఈ నాణేలను ఉపసంహరించుకోవాలని ఆర్బీఐ, ఆర్థికమంత్రిత్వ శాఖకు ఆదేశాలివ్వాలని వీరిరువురు కోర్టును కోరారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ గీతా మిత్తల్, జస్టిస్ హరిశంకర్ ధర్మాసనం ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యంను తిరస్కరించింది. మత చిహ్నాలు ఉన్న నాణేలు చెలామణి లౌకికవాదంపై ఏ మాత్రం ప్రభావం చూపదని స్పష్టం చేసింది.

సీఎస్‌ను కలిసిన ఎస్ఎఫ్‌సీ చైర్మన్

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: రాష్ట్ర ఆర్థిక సంస్థ (ఎస్ఎఫ్‌సి) చైర్మన్ జి రాజేశం గౌడ్ గురువారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌ను కలిశారు. ఆయనతో పాటు ఎస్ఎఫ్‌సి సభ్యుడు ఎం చెన్నయ్య కూడా సీఎస్‌ను కలిశారు. స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్‌కు సంబంధించిన వినతిపత్రాన్ని వారు చీఫ్ సెక్రెటరీకి అందజేశారు.

జాతరకు ఏర్పాట్లు చేయండి

• ప్రభుత్వానికి మహేష్ దత్ ఎక్కా వినతి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మేడారం జాతర సమయం సమీపిస్తున్న తరుణంలో భక్తులకు సకల సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి బెన్‌హర్ మహేష్ దత్ ఎక్కా అధికారులను కోరారు. మేడారంలోని ఐటిడిఏ గెస్ట్‌హౌస్‌లో ఆయన అన్ని శాఖలతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే అన్ని శాఖలకు తగిన నిధులు మంజూరు చేయడం జరిగిందని, ఆయా శాఖలు తమకు అప్పగించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని అన్నారు.ఈసారి జాతరకు సమ్మక్క - సారలమ్మ గిరిజన మ్యూజికం భక్తులకు, పర్యాటకులకు అందుబాటులోకి రానుందని తెలిపారు. త్వరలోనే మేడారం జాతరకు కేంద్ర ప్రభుత్వం జాతీయ పండుగ హోదా కల్పిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. కేంద్ర గిరిజనశాఖ మంత్రి, ఆయా పొరుగు రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు, ఇతర ప్రముఖులు జాతరకు హాజరవుతారని అన్నారు. సమావేశంలో భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కర్ణన్, ఏటూరు నాగారం ప్రాజెక్టు అధికారి కాకా లింగయ్య, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

దార్శనికుడు మర్రి చెన్నారెడ్డి

• ఏడాది పొడవునా శతజయంతి ఉత్సవాలు • ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తే సంతోషం: రోశయ్య



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి శత జయంతి ఉత్సవాలను ఏడాది పొడవునా నిర్వహించాలని నిర్ణయించినట్లు శత జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ కె రోశయ్య వెల్లడించారు. ఉత్సవాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తే సంతోషమని, వారితో కలిసి పని చేస్తామని, లేకపోతే తామే నిర్వహించుకుంటామని చెప్పారు. ఈ నెల 13 న జరిగే జయంతి కార్యక్రమానికి పాండిచ్చేరి ముఖ్యమంత్రి వి. నారాయణ స్వామి ముఖ్య అతిథిగా హాజరవుతారని, వచ్చే నెలలో జరిగే చెన్నారెడ్డి స్మారకోపన్యాసం సదస్సుకు మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ హాజరవుతారని వెల్లడించారు. గురువారం ఇక్కడ ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా రెండు సార్లు పని చేసిన చెన్నారెడ్డి దార్శనికుడు, మేధావి, పరిపాలనాదక్షుడని కొనియాడారు. ఐదు రాష్ట్రా లకు గవర్నర్‌గా పని చేశారన్నారు. ఆయన గొప్ప వ్యక్తిగా అభివర్ణించారు. చిన్నతనంలోనే అంటే 31ఏళ్ల వయస్సులోనే ఎంపిగా గెలిచారని, 33 ఏళ్ల వయస్సులో మంత్రిగా బాధ్యతలు నిర్వహించారని చెప్పారు. తనకు తెలిసి అంత చిన్న వయస్సులో ఎంపీగా,మంత్రిగా పని చేసినవారు ఉన్నారని అనుకోవడం లేదన్నారు. 1956 లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన సందర్భంగా పెద్దమనుషుల ఒప్పందంలో సంతకం చేసిన వ్యక్తియని తెలిపారు. సంస్కృతీ సంప్రదాయాలు, వేదాలను గూర్చి ప్రచారం చేశారని, ఆయన హయాంలోనే సినిమా పరిశ్రమ చెన్నై నుంచి హైదరాబాద్‌కు తరలివచ్చిందని చెప్పారు. ఏడాది పొడవునా ఐదారు సదస్సులు నిర్వహించాలని తలపెట్టినట్లు రోశయ్య చెప్పారు. మారుమూల గ్రామాల అభివృద్ధి పథకం (రిమోట్ ఏరియా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం), సైక్లోనే ఎమర్జన్సీ రీ కన్‌స్ట్రక్షన్ ప్రోగ్రాంను ప్రపంచ బ్యాంకు సహకారంతో ఆయన హయాంలో విజయవంతంగా నడిపించారని తెలిపారు. సామాజిక న్యాయం, లౌకిక వాదానికి కట్టుబడిన వ్యక్తిగా రోశయ్య తెలిపారు. రెండుసార్లు సీఎంగా బాధ్యతలు నిర్వహించిన చెన్నారెడ్డి శత జయంతి ఉత్సవాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తే సంతోషిస్తామని, లేకపోతే తామే చేపడతామని ఒక ప్రశ్నకు బదులుగా రోశయ్య వివరించారు. ఈ సమావేశంలో చెన్నారెడ్డి తనయులు మర్రి శశిధర్ రెడ్డి, రవీంద్రారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు జి నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

కుంభమేళా తరహాలో మేడారం జాతర

• అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాట్లు • హెలీకాప్టర్ సేవలు కల్పించండి • అధికారులతో సీఎస్ ఎస్పీ సింగ్ సమీక్ష



హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరకు సర్వం ముస్తాబవుతోంది. మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. కుంభమేళ తరహాలో అత్యంత ఆదరణ లభించేలా ప్రచారం చేసేందుకు సర్కార్ సమాయత్తమవుతోంది. అత్యంత ఘనంగా జాతరను నిర్వహించేందుకు పకడ్బంధీ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పి సింగ్ గురువారం అన్ని శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. మేడారం సమ్మక్క, సారలక్క జాతర ఏర్పాట్లపై గురువారం సచివాలయంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. జనవరి 31నుండి ఫిబ్రవరి 3 వరకు జరిగే సమ్మక్క, సారలక్క జాతరను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం లభించేలా చూడాలని, కుంభమేళ తరహాలో ఏర్పాట్లు చేయలన్నారు. జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆయన స్పష్టం చేశారు. సాంస్కృతిక శాఖలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని, జాతర కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. గతంలో వరంగల్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన కరుణను జాతరకు ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు చెప్పారు. ఈ జాతరకు దేశంలోని అన్ని రాష్ట్రాల గిరిజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రులను, కార్యదర్శులను. గిరిజన పార్లమెంటు సభ్యులను ఆహ్వానించాలని ఆయన అభిప్రాయపడ్డారు. జాతరకు వచ్చే ముఖ్య అతిథులను ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానించాలన్నారు. మేడారంలో పారిశుధ్యానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, మున్సిపల్ సిబ్బందిని కేటాయించాలని ఆదేశించారు. అత్యాధునిక మరుగు దొడ్లను నిర్మించాలన్నారు. జాతరకు హెలీ కాప్టర్ సేవలను కల్పించాలని అన్నారు. ఇబ్బందులు లేకుండా భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్ కుమార్, పర్యాటక శాఖ కార్యదర్శి బి వెంకటేశం, దేవాదాయ శాఖ కమిషనర్ శివశంకర్, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ క్రిస్టినా జడ్‌చొంగ్తూ నాగిరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ ఉత్పత్తిలో ద.మ. రైల్వే ముందడుగు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: ఇంధన పరిరక్షణ మరియు పునరుత్పాదక వనరుల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేయడంలో హైదరాబాద్ డివి జన్ స్థిరంగా ముందడుగు వేస్తోంది. ఇంధన సామర్థ్య పరికరాల వల్ల ఎ-1 కేటగిరి స్టేషన్‌లలో ప్రథమ స్థానం పొందిన కాచిగూడ స్టేషన్‌తో ఈ చొరవకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రక్రియలో 1312 సంప్రదాయ లైట్ల స్థానంలో లైట్ ఎమిటెడ్ డియోడ్ (ఎల్ఈడీ) లైట్లను 370 సీలింగ్ ఫ్యాన్ల స్థానంలో ఇంధన సామర్థ్యం గల బ్రష్ లెస్ డైరెక్ట్ కరెంట్ (బీఎల్‌డీసీ) ఫ్యాన్లు మరియు 5 నక్షత్రాల స్థాయి గల ఇంధన సామర్థ్య ఇన్వర్టర్ ఏసీ లను అమర్చారు. దక్షిణ మధ్య రైల్వే కేంద్ర కార్యాలయమైన రైల్ నిలయం భవనంలో 3048 సంప్రదాయ లైట్ల స్థానంలో ఎల్ఈడీ లైట్లు అమర్చడం ద్వారా భారతీయ రైల్వేలో ప్రప్రథమ జోన్‌గా గుర్తింపు పొందింది.హైదరాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ చొరవతో ఇంధన పరిరక్షణ ప్రణాళిక ఆలోచనలో భాగంగా జూన్,2018 కల్లా రైల్వే కాలనీల్లో కూ డా ఎల్ఈడీ లైట్లు అమర్చారు. కాచిగూడ, సికింద్రాబాద్ లోని ఇండియన్ రైల్వే ఇనిస్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీరింగ్ అండ్ కమ్యూనికేషన్ , జోనల్ రైల్వే ట్రైనింగ్ ఇనిస్టిట్యూ ట్, లేఖా భవన్ మొదలైన చోట్ల 1.45 ఎం.డబ్ల్యు.పి ఆన్-గ్రిడ్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసి మార్చి 31, 2018 కల్లా సిద్ధం చేయడానికి ప్రణాళిక తయార య్యింది. కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్ పనులు పూర్తయ్యే దశలో ఉంది. అది ఈనెల చివరరాఖరుకు విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభి స్తుంది.

హామీలతో మభ్యపెడుతున్న కేసీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏ ముఖ్యమంత్రి ఇవ్వనన్ని హామీలు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఇస్తూ ప్రచారాల ద్వారా ప్రజల మభ్యపెడుతున్నారని తెలుగుదేశం పార్టీ శాసనసభ్యుడు సండ్ర వెంకటవీరయ్య దుయ్యబట్టారు. సరైన సమయంలో ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. తెదేపా తెలంగాణ కార్యకర్తల శిక్షణా శిబిరం మూడో బ్యాచ్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సండ్ర మాట్లాడుతూ, గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసుకోవాలని, వచ్చే ఎన్నికల నాటికి శిక్షణా తరగతుల ద్వారా కొన్ని వేలమంది తయారు కావాలని అన్నారు.

తెదేపా మద్దతు లేకుండా ప్రభుత్వమే ఏర్పాటు కాదు: రావుల

శిక్షణా తరగతులలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో చర్చపెట్టి, పార్టీ పటిష్టతకు దోహద పడాలని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి చెప్పారు. కేసీఆర్ హామీ ఇచ్చిన తర్వాత ఈ మూడేళ్ళలోనే 3,500 మంది ఆత్మ హత్యలకు పాల్పడ్డారని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్య దర్శులు బొల్లం మల్లయ్య యాదవ్, బుచ్చిలింగం, అధికార ప్రతినిధి నర్రోత్తమ్, పార్టీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ అజ్మీర రాజునాయక్, బీసీ సెల్ అధ్యక్షుడు పెద్దోజి రవీంద్రచారి, టిఎన్‌టియుసి అధ్యక్షుడు బిఎన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌తో మేం చర్చించం

• ఉత్తమ్ లేదా జానా అయితే ఓకే: బాల్క సుమన్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: విశ్వసనీయత లేని రేవంత్‌రెడ్డితో తాము విద్యుత్ ఒప్పందాలపై చర్చించబోమని, గత ప్రభుత్వంలో పనిచేసిన ఉత్తమ్ లేదా జానారెడ్డిలు చర్చకు వస్తే సిద్ధమని టిఆర్ఎస్ ఎంపీ బాల్క సుమన్ అన్నారు. విద్యుత్ ఒప్పందంపై టిఆర్ఎస్, కాంగ్రెస్ సవాళ్ళు ప్రతిసవాళ్ళు కొనసాగుతున్న నేపథ్యంలో గురువారం టిఆర్ఎస్ ఎల్పీ సమావేశంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. రేవంత్‌రెడ్డి మాటలు తాము నమ్మమని, ఆయనతో చర్చించవద్దని తెలంగాణ సమాజం నుండి కూడా సూచనలు వచ్చాయని.. పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్ లేదా జానా ఆధారాలు ప్రకటించి చర్చకు రావాలన్నారు.

కోమటిరెడ్డి ఆరోపణలు అబద్ధాలు: పల్లా మండిపాటు

సోలార్‌పవర్‌లో అవినీతి జరిగిందని నల్లగొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన ఆరోపణలు అబద్దమని ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వరరెడ్డి తీవ్రంగా ఖండించారు. 2వేల మెగావాట్లకు గాను 1700మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్నదన్నారు. కర్ణాటక కన్నా తక్కువకే తెలంగాణ విద్యుత్ కొనుగోలు చేస్తున్నదన్నారు. తెలంగాణ రాష్ట్రానికి 53.8శాతం విద్యుత్ వాటాను ఒప్పించి తామే విభజన చట్టంలో పెట్టించామని కోమటిరెడ్డి అనడం శుద్ధ అబద్ధమన్నారు. ఎమ్మెల్సీ భాను ప్రసాద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 2.40లక్షల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంటే 2.15లక్షల మెగావాట్ల విద్యుత్ సబ్‌క్రిటికల్‌లోనే జరుగుతున్నదన్నారు.


చర్చకు రాకుండా టీఆర్ఎస్ పారిపోయింది: రేవంత్ రెడ్డి



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : విద్యుత్ రంగంలో జరిగిన అవినీతిపై చర్చకు రాకుండా పాలక టీఆర్ఎస్ పార్టీ పారిపోయిందని ఎమ్మెల్యే ఎ రేవంత్ రెడ్డి ఆరోపించారు. విద్యుదుత్పత్తి, కొత్త ప్లాంట్ల నిర్మాణం, విద్యుత్ కొనుగోళ్లలో అవినీతి జరుగుతోందని తాము ఆరోపిస్తే, అవన్నీ అబద్ధాలని , గోబెల్స్ ప్రచారం చేస్తున్నామని టీఆర్ఎస్ ఎంపి బాల్క సుమన్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, భానుప్రకాష్ మండిపడ్డారని, అంతేగాక బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారని రేవంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వారి సవాల్‌ను తాము స్వీకరిస్తున్నామని, 12 వ తేది మధ్యాహ్నం 2 గంటలకు బహిరంగ చర్చకు వస్తామని, తనతో పాటు ఎమ్మెల్యే ఎస్ సంపత్‌కుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దాసోజు శ్రవణ్ ప్రగతిభవన్‌కు రావడానికైనా సిద్ధమని తాము సవాల్‌ను స్వీకరించామని, తీరా , రేవంత్ రెడ్డితో బహిరంగ చర్చ జరిపే ప్రసక్తిలేదని టీఆర్ఎస్ నాయకులు ప్రకటించడాన్ని రేవంత్ ఒక ప్రకటనలో తప్పుబట్టారు.రేవంత్ రెడ్డి చెప్పింది తప్పని తేలితే ఆబిడ్స్ సెంటర్‌లో ముక్కునేలకు రాయాలని అంటూ టీఆర్ఎస్ నాయకులు సవాల్ చేశారని ప్రకటనలో పేర్కొన్నారు.బహిరంగ చర్చకు రాకపోయినప్పటికీ విద్యుత్ అవినీతి,అక్రమాలను బయటపెట్టే వరకు వదిలేది లేదని రేవంత్ తెలిపారు.

రుణమాఫీపై సర్కార్‌ను నిలదీయాలి

• కిసాన్ కాంగ్రెస్ సమావేశంలో ఉత్తమ్



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రుణమాఫీ వడ్డీపై మాటతప్పిన టీఆర్ఎస్ సర్కార్‌ను నిలదీయాలని టీపీసీసీ అధ్యక్షులు కేప్టెన్ ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. అధికారంలోకి రాగానే రూ. లక్షవడ్డీ మాఫీ ఏకకాలంలో చేస్తామని ప్రకటించిన సీఎం కేసీఆర్ రైతులకు ఇచ్చిన హామీని వమ్ము చేశారని విమర్శించారు.నాలుగు విడతలుగా మాఫీ చేయడంతో వడ్డీలకే మాఫీ డబ్బులు సరిపోయాయని చెప్పారు. వడ్డీ చెల్లిస్తామని అసెంబ్లీ సాక్షిగా రైతులను మోసం చేసిన కేసీఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గ్రామగ్రామాన ఆందోళనలు చేపట్టాలని కోరారు. గురువారం గాంధీభవన్‌లో కిసాన్ ఖేత్ మజ్దూర్ కాంగ్రెస్ సమావేశం జరిగింది. కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు కోదండరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉత్తమ్ మాట్లాడుతూ, రైతుల సమస్యలపై ఈ నెల 13 న కిసాన్ కాంగ్రెస్ అన్ని కమిటీలు అన్ని జిల్లా కేంద్రాలలో విలేఖరుల సమావేశాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ వైఫల్యాలను చాటాలని కోరారు. అలాగే 17న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో రైతుల సమస్యలపై వినతిపత్రాలు సమర్పించాలని సూచించారు. అదే విధంగా సాధ్యమైనంతగా కిసాన్ కాంగ్రెస్ కమిటీలు వేయాలని కోరారు. 31 జిల్లాలు , 570 మండలాలలో కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలని సూచించారు.ఈ విలేఖరుల సమావేశంలో ఎమ్మెల్యేలు టీ జీవన్ రెడ్డి, జి చిన్నారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లురవితో పాటు జిల్లాల నుంచి వచ్చిన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అవినీతిపై చర్చకు సిద్ధమా?

• సీఎం కేసీఆర్‌కు కోమటిరెడ్డి సవాల్



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సాగునీటి ప్రాజెక్టులు, విద్యుత్ ఒప్పందాలపై జరుగుతున్న అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావును కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి సవాల్ చేశారు. చర్చ ఎప్పుడో సీఎం చెప్పాలని, ఆయన కానీ, జెన్‌కో సీఎండీ ప్రభాకరరావు కాని చర్చకు రావాలని డిమాండ్ చేశారు. చర్చకు ప్రగతిభవన్ లేదా మరెక్కడికైనా వచ్చేందుకు సిద్ధమని కోమటిరెడ్డి ప్రకటించారు. గురువారం శాసనసభ మీడియా హాలులోఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ హయాంలో వేల కోట్ల రూపాయల అవినీతి జరుగుతోందని, దాన్నుంచి ఆయన ఎప్పటికీ తప్పించుకోలేరని అన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారి పాపం పండుతుందని, ఎప్పటికీ తప్పించుకోలేరన్నారు. దాదాపు 23ఏళ్ల తర్వాత బీహార్ మాజీ సీఎం లాలూప్రసాద్ యాదవ్‌కు జైలు శిక్ష పడిందని వెంకటరెడ్డి గుర్తు చేశారు. ప్రభుత్వ అవినీతిని గణాంకాలతో నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ప్రభుత్వ నిర్వాకం వల్ల వేలకోట్ల భారం రాష్ట్ర ప్రజలపై పడబోతోందని హెచ్చరించారు. సోలార్ పవర్ ఒప్పందాల్లో భాగంగా పనులు ప్రారంభించిన సంస్థలను మినహాయించి పనులు ప్రారంభించని సంస్థల కాంట్రాక్టులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే , విద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించి బీహెచ్ఈఎల్ చేపట్టే పనులు కాకుండా సబ్ కాంట్రాక్టులు ఇచ్చిన పనులను రద్దు చేయాలన్నారు.

కారెక్కనున్న మరో మాజీ మంత్రి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: టిఆర్ఎస్ పార్టీలోకి మరో మాజీమంత్రి రాబోతున్నారా?వలసలతో.. నిండుగా కళకళలాడుతున్న కారులోకి మరో నేత ఎక్కబోతున్నారా? నిజామాబాద్ నేతల్లో జరుగుతున్న చర్చల ప్రకారం ఈ ప్రశ్నలకు ఔననే సమాధానం వినిపిస్తోంది. నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత సారధ్యంలో ఇందుకు సంబంధించిన ప్రయత్నాలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒకప్పుడు నిజామాబాద్ రాజకీయాల్లో చక్రం తిప్పి, మంత్రిగా పనిచేస్తూ జిల్లాలో తొమ్మిదికి తొమ్మిది అసెంబ్లీ స్థానాల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించిన మండవ వెంకటేశ్వరరావును క్రియాశీల రాజకీయాల్లోకి తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. 2014 నుండి ఆయన రాజకీయాలకు దూరంగా ఉన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా పలు మార్లు మండవతో మాట్లాడగా, జిల్లా రాజకీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కవిత చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. సంక్రాంతి తర్వాత ఈ చేరిక ఉండవచ్చని ప్రచారం టిఆర్ఎస్ వర్గాల్లో ఉంది.

1000 రకాల తీపి రుచులు

13 నుంచి 15 వరకు స్వీట్ ఫెస్టివల్ పోస్టర్ విడుదల



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : సచివాలయంలో తెలంగాణ పర్యాటక మరియు సాం స్కృతిక శాఖా మంత్రి అజ్మీరా చందూలాల్ పర్యాటక కార్యదర్శి బుర్రా వెంకటేశంతో కలిసి ఇంటర్ నేషనల్ కైట్ మరియు స్వీట్ ఫెస్టివల్ గోడ పత్రికను గురువారం విడుదల చేశారు. అనంతరం మంత్రి చందూలాల్ మాట్లాడుతూ సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో సంక్రాంతి సందర్భంగా ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు తెలంగాణ పర్యాటక శాఖ మూడోసారి ఇంటర్ నేషనల్ కైట్ ఫెస్టివల్‌తో పాటు స్వీట్ ఫెస్టివల్‌ను కలిపి నిర్వహిస్తున్నామన్నారు. ఈ స్వీట్ ఫెస్టివల్ 1000 రకాల స్వీట్లను ఒకే వేదికపై ప్రదర్శించడం ప్రపంచంలో ఇదే మొదటిసారన్నారు. హైదరాబాద్‌లో నివసిస్తున్న వివిధ రాష్ట్రాల, దేశాల ప్రజలు స్వయంగా తయారు చేసిన ఈ స్వీట్లను ప్రదర్శించడంతో పాటు అమ్మకాలను జరుపుకు నేందుకు కౌంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. సాం స్కృతిక శాఖా కార్యదర్శి బుర్రా వెంకటేశం మాట్లా డుతూ నగరానికి అంతర్జాతీయ స్థాయిలో పేరుంద న్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన మహిళలు ఒకే కౌంటర్ వద్ద స్వీట్లను తయారు చేయడం ద్వారా మిని ఇండియాను తలపించేవిధంగా ఉంటుందన్నారు. 15 దేశాలతో పాటు 25 రాష్ట్రాల నుంచి మహిళలు తయారు చేసిన 1000 రకాల స్వీట్లు అందరికీ అందుబాటు ధరల్లో ఉంటాయన్నారు. ప్రతిరోజుల లక్షమందికి పైగా సందర్శకులు రానున్నట్టు ఆయన పేర్కొన్నారు.

నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించండి

ఉన్నత విద్యామండలి సభ్యులకు గవర్నర్ నరసింహన్ సూచన

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ఉన్న డిగ్రీ కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లో దశల వారీగా మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ గురువారం తనను కలిసిన ఉన్నత విద్యా మండలి సభ్యులకు సూచించారు. ప్రయోగ శాలల్లో అన్నిరకాల వసతులను ఏర్పాటు చేసి విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు చేపట్టేలా ప్రోత్సహించాలన్నారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య తుమ్మల పాపిరెడ్డి, వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ లింబాద్రి, ప్రొఫెసర్ వెంకటరమణ, కార్యదర్శి డాక్టర్ ఎన్ శ్రీనివాస రావు గురువారం గవర్నర్ నరసింహన్‌ను రాజ్‌భవన్‌లో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గత ఏడాది కాలంగా ఉన్నత విద్యా మండలి చేపట్టిన కార్యక్రమాలతోపాటు ఈ ఏడాది కొత్తగా చేపట్టబోయే కార్యక్రమాలను గవర్నర్‌కు వివరించారు.

రాష్ట్రంలోని ప్రవేశ పరీక్షలను ఈ ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్టు చైర్మన్ పాపిరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో యూనివర్సిటీ విద్య పూర్తి కాగానే ఉపాధి లభించేలాగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. నాణ్యమైన విద్య అందేలా చూస్తున్నట్టు చెప్పారు. అన్ని కాలేజీల్లో విద్యార్థులు, అధ్యాపకుల హాజరు కోసం బయోమెట్రిక్‌ను అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వి వెంకటరమణ రాసిన పుస్తకాన్ని గవర్నర్‌కు అందజేశారు.



ప్రపంచ నేతల్లో మోడీ ర్యాంక్-3



న్యూఢిల్లీ: ప్రపంచ నేతల్లో భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీకి మూడో ర్యాంక్ దక్కింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, బ్రిటన్ ప్రధాని థెరిసా మే కన్నా మోడీ ఎక్కువ స్థాయికి చేరారు. గ్లోబల్ పర్సన్స్ ర్యాంకింగ్స్‌లో మోడీ మూడో స్థానంలో నిలిచారు. గ్లోబల్ సర్వే ఆఫ్ వరల్డ్ లీడర్స్‌లో ఆయనకు ఈ ర్యాంక్ దక్కింది. జర్మన్ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్ ప్రథమ స్థానంలో నిలిచారు. ఫ్రెంచ్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రన్ ద్వితీయ స్థానంలో నిలిచారు. మోడీ భారీ ఆర్థిక సంస్కరణలు చేపట్టారు. ప్రపంచ దేశాలతో సత్సం బంధాలకు విశేష కృషి చేశారు. ఉగ్రవాదంపై ఉక్కు పిడికిలి బిగించడంతో మూడో ర్యాంక్ దక్కింది. దీంతో ప్రపంచం ఆయన సేవలు, ప్రతిభ గుర్తించినట్లయిందని బీజేపీ వర్గాలు సంతోషిస్తున్నాయి.

అత్యంత చిన్నసైజ్ పెన్‌డ్రైవ్



వాషింగ్టన్: ప్రపంచంలోనే అత్యంత చిన్న సైజ్ ఉన్న పెన్ డ్రైవ్‌ను సాన్‌డిస్క్ సంస్థ తాజాగా విడుదల చేసింది. లాస్‌వెగాస్‌లో జరుగుతున్న కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ షో 2018లో సాన్ డిస్క్ తన అల్ట్రాఫిట్ యూఎస్‌బీ 3.1 ఫ్లాష్ డ్రైవ్‌ను లాంచ్ చేసింది. ఈ డ్రైవ్ 16, 32, 64, 128, 256 జీబీ స్టోరేజ్ వేరియెంట్లలో లభిస్తున్నది. రూ.1400 ప్రారంభ ధరకు ఈ పెన్ డ్రైవ్‌ను కొనుగోలు చేయవచ్చు. ఈ పెన్ డ్రైవ్‌లలో 256 జీబీ స్టోరేజ్ వేరియెంట్‌లో యూజర్లు ఏకంగా 14వేల ఫొటోలు, 10 గంటల ఫుల్ హెచ్‌డీ వీడియోలు, 16వేల పాటలను స్టోర్ చేసుకోవచ్చు.

జల్లికట్టుకు.. ఆధార్ సమర్పించాలి

చెన్నై: జల్లికట్టుకు ఆధార్ లింకు చేయాలని మదురై కలెక్టర్ తెలిపారు. తమిళనాడు రాష్ట్రంలో జల్లికట్టులో పాల్గొనేవారు ఎక్కువగా ఉన్నారు. జల్లికట్టు కోసం ఒక సందర్భంలో పెద్ద ఉద్యమమే జరిగింది. జల్లికట్టు క్రీడలో పాల్గొనే వారు ఆధార్ కార్డు సమర్పించాలని మదురై కలెక్టర్ తెలపడం కొత్త ట్విస్టుగా మారింది.

ఫడ్నవిస్‌కు మళ్లీ తప్పిన ప్రమాదం



ముంబై: మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీలు హెలికాప్టర్ ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. ముంబైకి సమీపంలోని మీరా రోడ్‌లో ఇవాళ ఓ కార్యక్రమానికి హాజర య్యేందుకు వెళుతుండగా ఈ ఘటన చోటుచేసు కుంది. ఓ స్కూల్ ఆవరణలో హెలికాప్టర్ ల్యాండ్ కావాల్సి ఉండగా, అక్కడ వైర్ ఉండటాన్ని గుర్తించిన పైలట్ చాపర్‌ను వెనక్కి మళ్లించాడు. సమీప ప్రాంతంలోని మరోచోట హెలికాప్టర్‌ను సురక్షితంగా ల్యాండ్ చేశాడు. హెలికాప్టర్ ప్రమాదాల నుంచి బయటపడటం ఫడ్నవీస్‌కు ఇదేం కొత్త కాదు. గత ఏడాది జులైలోనూ ఆయన హెలికాప్టర్ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. మే 2017లో సీఎం ప్రయాణిస్తున్న హెలికాప్టర్ లాతూర్‌లో క్రాష్ ల్యాండింగ్ అయింది.

ఏకే47తో కానిస్టేబుల్ అదృశ్యం

ఇటా(యుపి): ఎకె 47 తుపాకీతో రెండు రోజుల క్రితం అదృశ్యమైన ఒక కానిస్టేబుల్ ఆచూకీ లభించింది. ఒక డ్రెయిన్‌లో చిత్తుగా తాగి పడి ఉండగా పోలీసులు అతడిని కనుగొన్నారు. ఎకె 47 తుపాకీ కూడా అక్కడే లభ్యమైంది. కానిస్టేబుల్ రోహిత్ కుమార్ రెండు రోజుల క్రితం ఎకె 47 తుపాకీతో సహా అదృశ్యమయ్యాడు. ఎంత వెదికినా అతడి జాడ తెలియరాలేదు. పోలీసులు అతడికి కోసం ముమ్మరంగా గాలిస్తుండగా ఒక డ్రెయిన్‌లో చిత్తుగా తాగి పడి ఉన్నస్థితిలో వారికి దొరికాడు. పోలీస్ అధికారులు అతడిని సస్పెండ్ చేశారు.

8వేల బుల్లెట్ కాట్రిడ్జిలు స్వాధీనం




డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని డెహ్రగూడ్‌లో పోలీసులు ఒక మహిళ తో సహా నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి 8 వేల బుల్లెట్ కాట్రిడ్జిలను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 119 ఉపయోగించాల్సిన బుల్లె ట్లు కూడా ఉన్నాయి. ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులు, స్థానిక ఇంటెలి జెన్స్ విభాగం అధికారులు వారిని ప్రశ్నిస్తున్నారు.

మలప్పురంలో 400 బులెట్లు స్వాధీనం

కేరళ రాష్ట్రంలోని మలప్పురంలో బులెట్ల కలకలం రేపాయి. సిట్ అధికారులు 400 బులెట్లను స్వాధీనం చేసుకున్నారు. మలప్పురంలో సిట్ అధికారులు బులెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

'పద్మావత్'పై నిషేధ ఆదేశాల్లేవ్!



లక్నో: సంజయ్ లీలా బన్సాలీ వివాదాస్పద చిత్రం పద్మావత్ విడుదలపై ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం నిషేధం విధించలేదు. ఈ చిత్రం విడుదలపై నిషేధాన్ని విధిస్తూ ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదని హోంశాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. కొన్ని వర్గాల నుంచి బెదిరింపులు ఎదురవుతున్న దృష్ట్యా శాంతిభద్రతల కోసం పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని ఆ అధికారి చెప్పారు. ఉత్తరాఖండ్‌లో కర్ణిసేనకు చెందిన ప్రతినిధి వర్గం సీఎం రావత్‌తో సమావేశమై చిత్రం విడుదలను నిలిపివేయాలని కోరింది.

ఎర్రకోటపై దాడి: నిందితుడు అరెస్టు

న్యూఢిల్లీ: దేశరాజధాని ఢిల్లీలోని ఎర్రకోటపై దాడితో ప్రమేయం ఉన్న ఎల్ఇటి ఉగ్రవాద సంస్థకు చెందిన బిలాల్ అహ్మద్ కావా అనే ఉగ్రవాదిని పోలీసులు అరెస్టు చేశారు. ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు, గుజరాత్ ఎటిఎస్ పోలీసులు సంయుక్తంగా చేప ట్టిన ఆపరేషన్‌లో బిలాల్ అరెస్టయ్యాడు. ఢిల్లీ విమానాశ్రయంలో బిలాల్‌ను అరెస్టు చేశారు.

ఎస్సీ వర్గీకరణ సాధ్యం కాదు

(మొదటిపేజీ తరువాయి)

వివరాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసు కొచ్చారు. సమావేశం అనంతరం కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడారు.

దేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం దివ్యాంగులు 2,68,557 మంది ఉన్నారని మంత్రి రాందాస్ అథవాల్ తెలిపారు. వారికి ప్రత్యేకంగా ఏప్రిల్ 15న సుకన్య భారతీ యోజన పథకాన్ని కేంద్రం ప్రారంభించిందని గుర్తు చేశారు. ఇప్పటి వరకు తమ మంత్రిత్వ శాఖ అధ్వర్యంలో దేశ వ్యాప్తంగా 6 వేల క్యాంపులను ఏర్పాటు చేశా మన్నారు. ఇప్పటి వరకు 7 లక్షల మందికి వివిధ రకాల పరికరాలను అందజేసినట్టు చెప్పారు. ఇందుకోసం రూ. 330 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. జాతీయ ఓబీసీ బిల్లుకు చట్టబద్ధత కల్పించడం కోసం కేంద్రం చర్యలు తీసుకుం దన్నారు. ఇప్పటికే లోక్‌సభలో బిల్లుకు ఆమోదం లభించిందని రాజ్యసభలో చర్చ సందర్భంగా కొన్ని సవరణలు వచ్చాయని వాటిపై లోక్‌సభలో చర్చించి బిల్లుకు చట్టబద్ధత కల్పించేలా చూస్తామని స్పష్టం చేశారు. ప్రమోషన్లలో రిజర్వేషన్లను ఇవ్వొద్దని కోర్టు తీర్పు ఉందని, అయితే ఉద్యోగులకు ఇచ్చే ప్రమోషన్లలో రిజర్వేషన్లను అమలు చేసేలా చూడాలని విజ్ఞప్తులు వచ్చాయని, రిజర్వేషన్లు అమలు చేసేలా పార్లమెంటులో బిల్లు తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. దళితులపై దాడులు పెరుగుతున్నాయని వాటిని నివారించాల్సిన అవసరం ఉందని అన్నారు. బిజెపి అధికారంలో ఉన్నందునే దళితులపై దాడులు జరుగుతున్నాయనేది సరైంది కాదని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రా ల్లో కూడా దళితులపై దాడులు జరుగుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్, బిజెపి అనేది కాకుండా దళితులపై జరిగే దాడులను నివారించాల్సిన అవసరం ఉందన్నారు. కుల రాజకీయాలతో ఉపయోగం ఉండదని అన్నారు. నక్సలైట్లు దళితులు, బడుగుల కోసం పోరాడుతున్నారని, అయితే వారు ఎంచుకున్న విధానం సరైంది కాదని వారు జనజీవన స్రవంతిలో కలవాలని సూచించారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ ఓబీసీలకు రిజర్వేషన్లను అమలు చేస్తున్నారని, అవి కాకుండా ఇతరులు అందరికి కలిపి 25 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తే ఉపయోగకరంగానే ఉంటుందని అభిప్రాయపడ్డారు.



వివరాలు ఇవ్వని అధికారులపై మండిపడ్డ కేంద్ర మంత్రి

వివిధ ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులపై కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి రాందాస్ అథవాల్ గురువారం హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహించారు. అయితే ఈ సమావేశంలో కొన్ని శాఖలకు చెందిన అధికారులు వారి శాఖలో ఎన్ని పోస్టులు ఉన్నాయి, వాటిలో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల వివరాలు తెలియదని చెప్పడంతో అధికారులపై కేంద్ర మంత్రి మండిపడ్డారు. బ్యాక్‌లాగ్ పోస్టుల వివరాలు లేకుండా ఏమి చేస్తున్నారని, ఎన్ని బ్యాక్‌లాగ్ పోస్టులు ఉన్నయో తెలియకపోతే వాటిని భర్తీ చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు. తక్షణమే వివరాలను పంపించాలని అధికారులను ఆదేశించారు.

విద్యార్థులు అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి: అథ్‌వాలే

డా.బిఆర్ అంబేద్కర్ స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ముందుకు సాగాలని కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి రాందాస్ అథ్‌వాలే పేర్కొన్నారు. పీజీ లా కాలేజీ ఓయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్ (డా.బిఆర్ అంబేద్కర్ మరియు కాంస్టుషలిజం) కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తెలం గాణకు మరట్వాడా (నిజాం కాలంలో ఉన్న మహా రాష్ట్ర)కు ఎనలేని సంబంధం ఉందన్నారు. గతంలో మరట్వాడా నిజాం పరిపాలనలో భాగంగా ఉండేదని ఆ సమయం లో విద్యా సంస్థలన్నీ కూడా నిజాం పాలనలోనే కొనసాగేవన్నారు. గతంలో తమ రిపబ్లిక్ పార్టీ యూపీఏ భాగస్వామ్యంలో ఉండేదని ప్రత్యేక తెలం గాణ బిల్లును ప్రవేశపెట్టినప్పుడు తమ పార్టీ నుంచి కూడా మద్ధతు ఇచ్చామన్నారు. డా.బీఆర్ అంబేద్కర్ అట్టడుగు వర్గం నుంచి వచ్చి గొప్ప మేధావిగా పేరు ప్రఖ్యాతలు సంపాదిం చారన్నారు. అంబేద్కర్ ఎక్కడ చదివారో ఎక్కడ నివసించారో అన్ని ప్రదేశాలను చూసి వచ్చానని ఆయన తెలిపారు. అంబేద్కర్ ఆలోచనలు ఎంతో సైంటిఫిక్‌గా ఉన్నాయని, ఆయన ఆలోచనలు ఇప్పటితరానికి కూడా పనికొస్తున్నాయన్నారు. రాజ్యాం గాన్ని మార్చాలంటున్న కొందరి వాదన తప్పని, రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ మధ్యలో కల్పించుకొని అంబేద్కర్ దినంగా ఒకరోజు పాటిం చాలని కేంద్రమంత్రిని విజ్ఞప్తి చేయగా ఈ విషయమై ప్రధానమంత్రితో చర్చిస్తానని ఆయన పేర్కొన్నారు. జస్టిస్ కె.జీ.బాలకృష్ణన్ మాట్లాడుతూ అంబేద్కర్ దూరదృష్టితో రాజ్యాంగాన్ని రచించారన్నారు. రాజ్యాం గం రచించే సందర్భంలో ఆయనతో పనిచేసిన కొద్ది మంది పలు కారణాలచే తప్పుకున్నారని అయినా ఆయన బాధ్యతను తన భుజస్కంధాలపై వేసుకొని దానిని పూర్తి చేశారని ఆయన తెలిపారు. అంతేకాకుండా రాజ్యాంగంలో ఫెడరలిజం మరియు ఇండిపెండెంట్ న్యాయవ్యవస్థ గురించి వివరించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ దత్తాత్రేయ, వైస్ చాన్సలర్ ఎస్.రామచంద్రం, వైస్ చాన్సలర్ (ఎన్ఎల్ఎస్ఐయు) డాక్టర్ ఆర్.వెంకటరావ్ తదితరులు పాల్గొన్నారు.

'వచ్చే ఏడాది ఫీజులు పెంచొద్దు'

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజుల నియం త్రణ కోసం ప్రభుత్వం నియమిం చిన ప్రొఫెసర్ తిరు పతి రావు కమిటీ చేసిన ప్రతిపాద నలను ప్రభుత్వం అమలు చేయకుండా స్టేటస్ కో విధించిన నేపథ్యంలో రాష్ట్రంలో ఉన్న సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ స్కూల్స్ యాజ మాన్యాలను వచ్చే ఏడాది ఫీజులను పెంచొద్దని పాఠ శాల విద్య సంచాలకులు జి కిషన్ ఆదేశించారు. గురువారం ఆయా స్కూల్స్ మేనేజ్‌మెంట్లతో కిషన్ తన కార్యాలయంలో సమావేశం అయ్యారు. తిరుపతి రావు కమిటీ సిఫారసుల అమలు పై ప్రభుత్వం స్టేటస్ కో విధించిందని అందుకే 2018-19 సంవత్సరంలో ఫీజుల ను పెంచొద్దని ఆదేశించారు. 2016-17 లోని ఫీజులనే కొనసా గించాలన్నారు. అయితే తమ స్కూల్స్‌లో పనిచేసే సిబ్బంది వేతనాలను పెంచాలని కోరుతు న్నారని అందువల్ల తమకు ఫీజులు పెంచక తప్పడం లేదని స్కూల్స్ యాజ మాన్యాలు కిషన్ దృష్టికి తీసు కెళ్లారు. అయితే 2018-19లో ఫీజులను పెంచొద్దని స్కూల్స్ ఎదుర్కొం టున్న సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఈ నేప థ్యంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు.

పీఎస్ఎల్‌వీ సీ-40 నేడే నింగిలోకి

- 31 ఉపగ్రహాలను కక్ష్యలోకి మోసుకుపోనున్న భారత నౌక
- పీఎస్ఎల్‌వీ 42వ ప్రయోగం
- సెంచరీకి చేరనున్న స్వదేశీ శాటిలైట్
- 29 నిమిషాల్లో గమ్యం చేరనున్న రాకెట్
- షార్‌లో భద్రత కట్టుదిట్టం

నెల్లూరు, ప్రభ న్యూస్ బ్యూరో: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో భారీ ప్రయోగానికి సర్వం సిద్ధమైంది. భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) కేంద్రం నుంచి శుక్రవారం ఉదయం 9.29 గంటలకు పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పీఎస్ఎల్‌వీ) సీ-40 ప్రయోగాన్ని చేపట్టనుంది. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ ప్రయోగానికి సంబంధించి గురువారం తెల్లవారుజామున 5.29 గంటలకు భారత శాస్త్రవేత్తలు కౌంట్‌డౌన్‌ను కూడా ప్రారంభించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోటలోని మొదటి ప్రయోగ వేదిక నుంచి నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకుపోనున్న పీఎస్ఎల్‌వీ నౌక 29 నిమిషాలపాటు అంతరిక్షంలో ప్రయాణించి తనలో అనుసంధానమైన 31 ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టనుంది. పీఎస్ఎల్‌వీ ప్రయోగ రంగంలో 42వ ప్రయోగంతో పాటు ఈ ప్రయోగం విజయవంతమైతే స్వదేశీ ఉపగ్రహాల సంఖ్య సెంచరీ పూర్తికానుంది. పీఎస్ఎల్‌వీ రాకెట్‌లో కార్టోశాట్-2 ఈఆర్ ఉపగ్రహంతో పాటు 11 కిలోల ఐఎన్ఎస్ఐసీ ఉపగ్రహం, నానో ఉపగ్రహాన్ని, 100 కిలోల మరో మైక్రోశాట్ క్లిక్ రూమ్‌లో వివిధ పరీక్షలు నిర్వహించి కీలకమైన ఆ ఉపగ్రహాన్ని రాకెట్‌కు అగ్రభాగాన అమర్చారు. 710 కిలోల బరువుతో మూడు స్వదేశీ ఉపగ్రహాలతో పాటు కెనడా, ఫ్రాన్స్, ఫిన్‌లాండ్, యూకేలకు చెందిన ఒక్కో నానో ఉపగ్రహం, రిపబ్లిక్ ఆఫ్ కొరియాకు చెందిన మరో 5 నానో ఉపగ్రహాలు, అమెరికాకు చెందిన 19 నానో ఉపగ్రహాలను రాకెట్‌లో అనుసంధానం చేశారు. 470 కిలోల బరువు కలిగిన 28 విదేశీ నానో ఉపగ్రహాలను భారత నౌక దశలవారీగా నిర్ణీత సమయం లోపు కక్ష్యలోకి ప్రవేశపెట్టనుంది. భారత శాస్త్రవేత్తలు ఈ ప్రయోగాన్ని విజయవంతం చేసి మరోసారి అంతరిక్ష ప్రయోగరంగంలో తమ సత్తా చాటుకోవాలని ఆ దిశగా గత మూడు నెలలుగా ప్రయోగ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

29 నిమిషాల్లోనే పూర్తికానున్న ప్రయోగం

షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి శుక్రవారం ఉదయం 9.29 గంటలకు తన ప్రయాణాన్ని ప్రారంభించిన భారత నౌక సరిగ్గా 29 నిమిషాల్లో గమ్యాన్ని చేరుకుని నాలుగు దశల్లో తనలో అనుసంధానమైన 31 ఉపగ్రహాలను దశలవారీగా కక్ష్యలోకి ప్రవేశ పెట్టనుంది. గతంలో ఒక ప్రయోగం ద్వారా 5 నుంచి 10 రాకెట్లలోపే అంతరిక్షంలోకి ప్రవేశపెట్టే భారత శాస్త్రవేత్తలు క్రమేణ ఉపగ్రహాల సంఖ్య పెంచుతూ వచ్చారు. గత ఏడాది ఒకేసారి 104 ఉపగ్రహాలను విజయవంతంగా గమ్యం చేర్చిన ఇస్రో తాజాగా 31 ఉపగ్రహాలను మరోసారి ఒకే ప్రయోగం ద్వారా అంతరిక్షంలోకి ప్రవేశపెట్టబోతోంది. దీంతో ప్రపంచ దేశాల దృష్టి మరోసారి ఇస్రోపై పడింది.



పీఎస్ఎల్‌వీ ప్రయోగరంగంలో 42వ ప్రయోగం

అంతరిక్ష ప్రయోగరంగంలో తనకంటూ ప్రత్యేకతను చాటుకోవడంతోపాటు వాణిజ్యపరమైన ప్రయోగాలను కూడా సూపర్ సక్సెస్ చేస్తూ స్వదేశీ ఉపగ్రహాలతో పాటు విదేశీ ఉపగ్రహాలను కూడా విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశపెడుతున్న ఇస్రో ప్రతి విజయం వెనుక పీఎస్ఎల్‌వీ రాకెట్ కష్టం దాగి ఉంది. ఇప్పటివరకు పీఎస్ఎల్‌వీ ప్రయోగరంగంలో 41 ప్రయోగాలు చేపట్టగా వాటిలో 39 ప్రయోగాలు విజయవంతమయ్యాయి. ఒక్క ప్రయోగం విఫలం కాగా మరో ప్రయోగం అసంపూర్తిగా ముగిసింది. తాజాగా శుక్రవారం ఇస్రో చేపట్టబోయే ప్రయోగం 42వది. ఈ ప్రయోగంలో 3 స్వదేశీ ఉపగ్రహాలతో పాటు 28 ఇతర దేశాలకు చెందిన ఉపగ్రహాలను కూడా భారత శాస్త్రవేత్తలు అంతరిక్షంలోకి పంపబోతున్నారు. 97 స్వదేశీ ఉపగ్రహాలను ఇప్పటికే విజయవంతంగా అంత రిక్షంలోకి తీసుకెళ్లిన పీఎస్ఎల్‌వీ శుక్రవారం మరో 3 ఉపగ్రహాలను కూడా మోసుకు వెళ్లనుంది. దీంతో స్వదేశీ ఉపగ్రహాల సంఖ్య వందకు చేరబోతోంది.

కోర్టుకు నటరాజన్

చెన్నై: తమిళనాడు మాజీ సీఎం స్వర్గీయ జయలలిత చెలికత్తె శశికళ భర్త నటరాజన్ సిబిఐ కోర్టు ముందు లొంగి పో యారు. ఇంగ్లండ్ నుంచి లగ్జరీ కారు తెచ్చు కున్న సమయంలో పన్ను ఎగ్గొట్టిన కేసులో ఆయన కోర్టులో లొంగిపోయారు. అనారోగ్య కారణాలను పేర్కొం టూ గత విచారణలకు ఆయన హాజరు కాలేదు.

దాణాస్కాం: 24న తీర్పు

రాంచి: దాణా కుంభకోణానికి సంబంధించిన 3వ కేసులో లాలూ ప్రసాద్ యాదవ్‌పై సిబిఐ ప్రత్యేక కోర్టు ఈ నెల 24వ తేదీన తీర్పు వెల్లడించనున్నది. ఈ కేసు 1990లో ఛైబాసా ట్రెజరీనుంచి 35.62 కోట్ల రూపాయిలను మోసపూరితంగా విత్ డ్రా చేసిన విషయా నికి సంబంధించినది. ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఈ నెల 24వ తేదీన ఈ కేసుపై తీర్పు చెప్పనున్నారని సిబిఐ అధికారి ఒకరు తెలిపారు.

మమతకు చుక్కెదురు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ ముఖ్య మంత్రి మమతా బెనర్జీకి సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. కోల్‌కతాలో బీజేపీ ర్యాలీపై హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. బీజేపీ ర్యాలీకి పూర్తి భద్రత కల్పించాలని మమతా బెనర్జీ సర్కారుకు సుప్రీం కోర్టు ఆదేశించింది.

బీజేపీ నేతలు జంప్!

లక్నో: బీజేపీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు ఇద్దరు సమాజ్‌వాదీ పార్టీలో చేరారు. శంభు చౌదరి, నంద్ కిశోర్ మిశ్రా అనే ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు బీజేపీకి రాజీ నామా చేసి సమాజ్‌వాదీ పార్టీలో చేరారు.

ఉగ్రవాదులు అమరులు: పీడీపీనేత

శ్రీనగర్: ఉగ్రవాదులు తమ సోదరులని, వారు అమరవీరులని, వారి మరణించినందుకు సంబరాలు చేసుకోకూడదని అధికార పార్టీ ఎమ్మెల్యే ఐజాజ్ అహ్మద్ మీర్ వ్యాఖ్యానించారు. మీర్ వ్యా ఖ్యలు వివాదాస్ప ద మ య్యాయి. తీవ్రవాదులు జమ్ము కాశ్మీర్‌కు చెం దిన వారని, వారు తమ సం తాన మని ఆయన చెప్పా రు. వారిని చంపినప్పుడు సంబరాలు చేసుకో కూడదని ఆయన అన్నారు. ఉగ్రవా దులతో పోరాటం లో మృతి చెందిన జవాన్ల పట్ల తమకు సానుభూతి ఉందని ఆయన అన్నారు.

జిల్లాల్లో పరిశ్రమలకు రాయితీలు

(మొదటిపేజీ తరువాయి)

ఉపాధి మెరుగువుతుందని సూచిం చింది. పర్యాటక రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంపైనే పూర్తిగా ఆధారపడి నందున ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాట్లను ప్రోత్సహిస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందని సూచించింది. వ్యవసాయ రుణాలు సకాలంలో, సరిపడినంత ఇవ్వాల్సి ఉందని ఆ విజన్ డాక్యుమెంట్‌లో సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల ఉత్పత్తి కేంద్రాలను వరంగల్ జిల్లాలో ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ఆ డాక్యుమెంట్‌లో ప్రస్తావించారు.

గ్రీన్ కార్డుల కోటా పెంపు

(మొదటిపేజీ తరువాయి)

చేరుకుంటుందని పలువురు భావిస్తున్నారు. ఇక గ్రీన్‌కార్డు పొందడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని కొందరు ప్రవాస భారతీయులు అంటున్నారు. శాస్త్రసాంకేతిక రంగానికి చెందిన భారత్-అమెరికా వాసులే అధికంగా హెచ్-1బీ వీసాపై అమెరికాలో ఉన్నారు. ఐటీ ఇంజినీర్లుగా అడుగుపెడుతున్న ప్రతీ ఒక్క భారతీయుడు గ్రీన్ కార్డు హోందా పొందుతున్నాడు. అయితే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గ్రీన్ కార్డు కొనసాగింపుపై చేసిన ప్రకటన ఆందోళన రేకెత్తించింది. అయితే ఈ కొత్త బిల్లు చట్టంగా మారితే భారత ఐటీ ఇంజినీర్లకు ప్రయోజనం చేకూరుతుందన్న విశ్లేషణ వినిపిస్తోంది.

కాగా అమెరికా గ్రీన్‌కార్డు ఉన్నవారిలో అధికంగా భారతీ యులే ఉన్నారు. ట్రంప్ సర్కార్ మద్దతుతో ప్రతినిధుల సభ ముం దుకు చేరిన బిల్లు కాస్త ముందుకు సాగి ట్రంప్ సంతకం పూర్తయితే ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న సందిగ్ధతకు తెరపడుతుం దని ఇండో-అమెరికన్‌లు భావిస్తున్నారు.

ఈ బిల్లు తమ సరిహద్దులను ఎంతో సురక్షితంగా ఉంచుతుంది. అమెరికన్ డిఫెండర్లకు కూడా మంచి మద్దతు లభిస్తుంది. అంతర్గత అమలును బలోపేతం చేయడంతో పాటు ఆర్థికాభివృద్ధి దిశగా అమెరికా పయనిస్తుంది అని మెక్‌కౌల్ అన్నారు. ఒక వేళ ప్రతికూల మార్పులు తీసుకొస్తే మాత్రం అమెరికాలో నివసిస్తున్న చాలా మంది భారతీయులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటారని, ఎంతో మంది ఉపాధి కోసం తన భార్య, పిల్లలు, తల్లిదండ్రులతో ఇక్కడ వచ్చి నివాసం ఉంటున్నారని కౌల్ చెప్పారు. దీంతో పాటు ఎలాంటి ట్యాక్సు లేకుండా రెన్యూవల్ చేసే విధంగా తాత్కాలిక వీసాను సైతం ఉద్యోగుల తల్లిదండ్రుల కోసం సభ తీసుకొచ్చింది. బిల్లు కాస్త చట్టం అయితే అమెరికా ఆర్థిక వ్యవస్థ మరింత బలం అవుతుంది అని చట్టసభ్యులు వివరిస్తున్నారు.

అమెరికాలో స్థిర నివాసం ఏర్పర్చుకున్నవారిలో అత్యధికంగా మెక్సికో వాళ్లు ఉండగా, అతి తక్కువగా పాకిస్థానీయులు ఉన్నారు. మెక్సికో నుండి 1,58,619 మంది, చైనా నుండి 74,558 మంది, ఇండియా నుండి 64,116 మంది, పిలిఫిన్స్ నుండి 56,478, క్యూబా నుండి 54,396, డోమినికన్ రిపబ్లికన్‌లు 50,610, వియ త్నాం నుండి 30,832, ఇరాక్ నుండి 21,107 మంది, సల్వేడర్ 19,478 మంది, పాకిస్థాన్ నుండి 18,057 మంది నివాసం ఉంటున్నారు.

అమెరికాలో ఫిబ్రవరి 23న తెలుగువాడికి ఉరి



- ఇద్దరి హత్య కేసులో నిందితుడు
- ఆంధ్రప్రదేశ్ వాసిగా గుర్తింపు

వాషింగ్టన్: భారత సంతతికి చెందిన అమెరికావాసికి ఫిబ్రవరి 23న ఆ దేశ ప్రభుత్వం ఉరి తీయనుంది. ప్రస్తుతం అతను జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. ఉరి శిక్ష తేదీని ఆ దేశ ప్రభుత్వం ఖరారు చేసింది. భారతీయ సంతతికి చెందిన ఓ వ్యక్తి అమెరికాలో ఉరి తీయబడటం ఇదే మొదటిసారి. 32ఏళ్ల రఘునందన్ యండమూరి, పదేళ్ల పాపతో పాటు అతని 61ఏళ్ల అమ్మమ్మను 2014లో హత్య చేశాడు. ముందుగా వీరిని కిడ్నాప్ చేసి అనంతరం హతమార్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. కిడ్నాప్ చేసిన అనంతరం వీరిని ఓ పాతబడ్డ భవనంలో రఘునందన్ యండమూరి దాచిపెట్టాడు. నేరం రుజువు కావడంతో జైలు శిక్ష అనుభవిస్తున్న అతన్ని ఫిబ్రవరి 23న ఉరితీయాలని న్యాయస్థానం ప్రకటించింది. 2015లో కేసును విచారించిన పెన్సిల్వేనియా గవర్నర్ టామ్ వోల్ఫ్ రఘునందన్ చేసింది చిన్న తప్పు కాదని ఉరిశిక్షే సరైన తీర్పు అని వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యండమూరి హెచ్-1బీ వీసాపై అమెరికా వచ్చాడు. ఎలక్ట్రికల్, కంప్యూటర్ సైన్స్‌లో డిగ్రీలు చేశాడు. ఉరి శిక్ష వేయడాన్ని సవాల్ చేస్తూ ఏప్రిల్‌లో చేసిన అప్పీల్‌ను న్యాయ స్థానం కొట్టేసింది. అప్పటి గవర్నర్ తీర్పు చెప్పినా ఎప్పుడు ఉరి శిక్ష వేయాలి అనేది నిర్ణయించలేదని స్థానికంగా ఓ పత్రిక పేర్కొంది. ఉరి తీయడానికి సంబంధించిన నోటీసు సైతం జారీ చేసిందని పెన్సిల్వేనియాలోని పెన్స్ వార్తా సంస్థ వివరించింది. గవర్నర్ వోల్ఫ్ 2015లో ఉరి శిక్షను తాత్కాలికంగా వాయిదా వేశారు.

మోడీ ఎన్నికల చర్చలు

బీజేపీ నేతలతో విందు భేటీ

- అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలపై చర్చ
- కొత్త ఓటర్ల కోసం మిలీనియం ఓటరు కార్యక్రమం
- ప్రభుత్వ పథకాల అమలు, ఆర్థిక పరిస్థితిపై చర్చ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : రానున్న అసెంబ్లీ, లోక్‌సభలో అనుసరించాల్సిన వ్యూహంపై బీజేపీ కీలక నేతలతో ప్రధానమంత్రి నరేంద్రమోడీ సమావేశమయ్యారు. ప్రధానమంత్రి నివాసం 7, లోక్‌కళ్యాణ్ మార్గ్‌లో ఈ సమావేశం నిర్వహించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, పార్టీ ప్రధానకార్యదర్శులు, ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల పార్టీ ఇన్‌చార్జిలు, పలువురు కేంద్రమంత్రులు ఈ విందు సమావేశానికి హాజరయ్యారు. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు, ఈ ఏడాది త్రిపుర, మిజోరం, మేఘాలయ, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ అసెంబ్లీలకు ఎన్నికల జరగనున్నాయి.

ఈ నేపథ్యంలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలు, ఎత్తుగడలపై ప్రధానమంత్రి వీరితో చర్చించినట్లు తెలిసింది. ప్రభుత్వ పథకాల అమలు తీరు, ప్రజలలో వాటి ప్రభావం తదితర అంశాలను సమావేశంలో ప్రస్తావించినట్లు సమాచారం. దేశ ఆర్థిక పరిస్థితి, తాజా రాజకీయ పరిస్థితులపై సమావేశంలో చర్చ జరిగినట్లు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల్లో టార్గెట్ 350ని ఇప్పటికే అమిత్‌షా నిర్దేశించిన నేపథ్యంలో దానికి అనుగుణంగా తీసుకోవాల్సిన కార్యక్రమాలపై చర్చించనట్లు సమాచారం.

వీలైనంత ఎక్కువగా యువకులను పార్టీ వైపు ఆకర్షించేందుకు వివేకానంద జయంతి రోజున రక్తదాన శిబిరాలను ప్రారంభించాలని ఇదే వరకే నిర్ణయించారు. జనవరి 12 నుంచి 23 వరకు రక్తదాన శిబిరాలను నిర్వహించనున్నారు. మిలీనియం ఓటర్ల నమోదుపై క్యాంపెయిన్ నిర్వహించనున్నారు. దళిత వర్గాలను ఆకర్షించేందుకు అంబేద్కర్ పేరుతో భారీ ఎత్తున కార్యక్రమాలు ముందుకు తీసుకువెళ్లనున్నారు.

మిలీనియం ఓటరు పేరుతో ఇప్పటికే బీజేపీ యువమోర్చా ప్రారంభించిన క్యాంపెయిన్‌ను ముందుకు తీసుకువెళ్లాలనే అంశంపై చర్చించినట్లు సమాచారం. 2000వ సంవత్సరంలో జన్మించిన వారికి ఈ ఏడాదితో 18ఏళ్లు నిండిన నేపథ్యంలో వారందరినీ ఓటర్లుగా చేర్పించాలని బీజేపీ టార్గెట్‌గా పెట్టుకుంది. ఆయా కళాశాలలకు వెళ్లి పెద్ద ఎత్తున విద్యార్థులనుకలిసి వారందినీ ఓటరు జాబితాలో నమోదు చేయించనున్నారు. దేశవ్యాప్తంగా రెండుకోట్ల మంది కొత్త మిలీనియం ఓటర్లున్నారని బిజెపి అంచనా వేస్తోంది. వీరిని ముందుగానే





కలవడం ద్వారా కొత్త ఓటర్లను తమ వైపుకు తిప్పుకోవాలని వ్యూహరచన చేసింది. ఈ మేరకు యువమోర్చాకు కాలేజ్ కనెక్ట్ పేరుతో ఓ కార్యక్రమాన్ని అందజేసింది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో నరేంద్రమోడీకి అనుకూలంగా పెద్ద ఎత్తున యువ, మహిళ ఓటర్లు ఓట్లు వేశారు. ఈ నేపథ్యంలో 2019 ఎన్నికల్లోనూ కొత్త వారందరినీ బీజేపీ వైపు మరలేటట్లుగా కొత్త కార్యక్రమాన్ని రూపొందించారు. సులభంగా వారిని ఓటర్ల జాబితాలో చేర్పించడం, ఐడి కార్డులు ఇప్పించే విధంగా యువమోర్చా శ్రేణులు సహకరించనున్నాయి.

గత నెల ప్రధాని మన్‌కీ బాత్‌లోనూ మోడీ కొత్త ఓటర్ల అంశాన్ని ప్రస్తావించారు. 21వశతాబ్దంలో జన్మించిన వారందరూ ప్రజాస్వామ్య ప్రక్రియ పాల్గొనేందుకు అర్హత సాధించారని వారికి స్వాగతం పలికారు. యువ ఓటర్లే నూతన భారతదేశానికి పునాదుల్లాంటివారని మోడీ కొనియాడారు. వీలైనంతగా యువ ఓటర్లందరినీ తమ వైపు ఆకర్షించాలని ఇప్పటికే ప్రధానమంత్రి లక్ష్యాన్ని నిర్దేశించారు. ఆ దిశగా 2019 ఎన్నికల వ్యూహాన్ని రూపొందిస్తున్నారు.

చైనాలో చర్చి కూల్చివేత

బీజింగ్: ఉత్తర చైనాలోని ఓ చర్చిని అధికారులు కూల్చేశారు. ఎలాంటి అల్లర్లకు తావివ్వకుండా గట్టి బందోబస్తు మధ్య ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. కొన్ని వర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటాయని సంబంధిత అధికారులు భావించారు. ప్రధానంగా నాస్తికులైన కమ్యూనిస్టు పార్టీ నుండి వ్యతిరేకత వస్తుందని అనుకున్నారు. పారా మిలటరీతో పాటు ఆర్మ్‌డ్ పోలీసులు రంగంలోకి దిగి గోల్డెన్ ల్యాంప్‌స్టాండ్ చర్చిని పడగొట్టారు. ఈ చర్చి షాంగ్జీ ప్రావిన్సులోని లిన్ఫెన్‌లో ఉంది. చర్చి అండర్‌గ్రౌండ్‌లో పేలుడు పదార్థాలు పెట్టి ఈ చర్యకు ఉపక్రమించారు. చైనాలో సుమారు 60 మిలియన్ క్రిస్టియన్లు ఉన్నారు. చర్చి నిర్మాణంలో సరైన నియమ నిబంధనలు పాటించలేదని చైనా ప్రభుత్వం పేర్కొంది. నిర్మాణానికి సంబంధించిన ప్రమాణాలు ఉల్లంఘించారనే ఆరోపణలు ఉన్నాయి. చాలా మంది పారామిలటరీ బలగాలు, పోలీసులు, అధికారులు చర్చిని చుట్టుముట్టారని, ఆ ప్రాంతాన్ని అంతా తమ ఆధీనంలోకి తీసుకున్నారని, ఆ తరువాత పెద్దపెద్ద మిషన్లు పెట్టి కూల్చివేయడం ప్రారంభించారని సమీపంలో నివసిస్తున్న ఓ పాస్టర్ చెప్పుకొచ్చారు.

ఒబామాకు 3వేల డాలర్ల బహుమతులు

- 2015లో రిపబ్లిక్ డే వేదికగా అందించిన మోడీ, ప్రణబ్

వాషింగ్టన్: బరాక్ ఒబామా అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో 2015లో గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ నేపథ్యంలో భారత్ ఆయనకు 3వేల డాలర్లు ఖరీదు చేసే బహుమతి అందించింది. రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొన్న మొట్ట మొదటి అమెరికా అధ్యక్షుడిగా ఒబామా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారు. ప్రధాని మోడీ వ్యక్తిగతంగా మారియన్ అండర్‌సన్ ఫొటోతో ఉన్న ఫ్రేమ్‌తో పాటు చేతితో తయారు చేసిన బాక్సును కూడా ఒబామాకు అందించారు. అదేవిధంగా సీడీ సెట్టును సైతం ఆయనకు బహుమతిగా ఇచ్చారు. మోడీ ధరించే నీలం, ఎరుపు, క్రీమ్ కలర్ శాలువలను బరాక్‌కు అందించారు. వీటి ఖరీదు సుమారు 1,231 డాలర్లు ఉంటుందని ప్రొటోకాల్ డిపార్ట్‌మెంట్ అధికారులు వివరించారు. రాజ్‌ఘాట్ సమాధిని సందర్శించిన సమయంలో అక్కడి కమిటీ గాంధీజీ బట్టలు నేసే చరఖాతో పాటు జాతిపిత పేరుతో ఉన్న 'ఆటోబయోగ్రఫీ - స్టోరీ ఆఫ్ మై ఎక్స్‌పరిమెంట్స్ విత్ ది ట్రూత్' పుస్తకాన్ని అందించారు. బ్రాంజ్ కలర్‌తో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం ఇస్తూ ఘనంగా రాజ్‌ఘాట్ కమిటీ



సన్మానించింది. దీని విలువ సుమారు 929.01 డాలర్లు ఉంటుంది. రాష్ట్రపతిగా ఉన్న ప్రణబ్ ముఖర్జి 'థాట్స్ అండ్ రెఫ్లెక్షన్స్' అనే పుస్తకాన్ని అందించారు. ప్రణబ్ అందించిన బహుమతుల ఖరీదు 825 డాలర్లుగా అధికారులు లెక్కించారు. జనవరి 25 నుండి 27 వరకు భారత్‌లో బరాక్ ఒబామా ఆయన సతీమణి మిచెల్లి ఒబామాతో పర్యటించారు. మిచెల్లి ఒబామా సుమారు 1500 డాలర్ల బహుమతులు భారత్ నుండి స్వీకరించారు.

క్రిప్టో కరెన్సీకి మంగళం!



సియోల్ : దక్షిణ కొరియా కరెన్సీని క్రిప్టోలో లెక్కిస్తారు. ఈ నేపథ్యంలో క్రిప్టో కరెన్సీనికి చెక్ పెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎంతో విలువైన బిట్‌కాయిన్లను దక్షిణ కొరియాలో కరెన్సీగా చెలామణి చేయడానికి ఆలోచిసున్నారు. న్యాయశాఖ మంత్రి పార్క్ సంగ్-కీ మాట్లాడుతూ.. ఆర్థిక స్థితిగతులను పర్యవేక్షిస్తూ.. వ్యాపార రంగంలో బిట్‌కాయిన్‌లు తీసుకొచ్చేందుకు చర్చలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉండేందుకుగాను మంత్రివర్గం అన్ని విధాలుగా కసరత్తు చేస్తున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే.. దక్షిణ కొరియాలో బిట్ కాయిన్ విలువ చాలా ఎక్కువగా ఉందని తెలిపారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా క్రిప్టో కరెన్సీతో లావాదేవీలు జరుగుతున్నట్టు వివరించారు. బిట్ కాయిన్లు తీసుకొచ్చే విషయంలో ఇంకా చర్చలు కొనసాగుతున్నాయని, ఇంకా ఫైనల్ చేయలేదని చీఫ్ ప్రెస్ కార్యదర్శి యూన్ యంగ్ చాన్ అన్నారు. బ్యాంకు అధికారులతో కూడా చర్చలు నిర్వహిస్తున్నారు.

జాతీయవాదంపై బీజేపీ, ఆరెస్సెస్ భక్తులు తమ వైఖరిని తెలపాలి



ముంబై: సినిమా హాళ్లలో జాతీయ గీతాపాలన ఐచ్ఛికమని బీజేపీ ఇటీవల పేర్కొన్న వ్యాఖ్యలపై ఆ పార్టీ మిత్రపక్షం శివసేన అసంతృప్తిని వ్యక్తం చేసింది. బీజేపీ భక్తులు, ఆరెస్సెస్ జాతీయవాదంపై తమ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేసింది. గురువారం, శివసేన తన అధికార పత్రిక సామ్నాలో సంపాదకీయంలో బీజేపీ నేతృత్వంలోన ఎన్డీఏ ప్రభుత్వం సినిమా హాళ్లలో జాతీయ గీతాలాపన అంత ప్రాముఖ్యం కాదన్న విషయంపై సుప్రీం కోర్టు వ్యతిరేకిస్తూ ఇచ్చిన తీర్పును చారిత్రాత్మకం, విప్లవాత్మకమని అభివర్ణించింది. 'కేంద్రం తీసుకున్న నిర్ణయంపై సుప్రీంకోర్టు యూ టర్న్ తీసుకుంది. ఇప్పుడు ఆరెస్సెస్, ఇతర జాతీయ సంస్థలు ఏమి చెపుతారో చూడాలి' అని వ్యాఖ్యానించింది. జాతీయగీతంపై ప్రభుత్వ వైఖరి పిరికితనంతోకూడిన నిర్ణయంగా శివసేన అభివర్ణించింది. జాతీయతభామ నిర్వచనం రోజు రోజుకూ మారిపోతున్నదని శివసేన పేర్కొంది. 'సుప్రీంకోర్టు తీర్పు మోడీ ప్రభుత్వానికి పెద్ద కుదుపు. వందేమాతరం గీతాన్ని ఆలపించేవారు జాతీయవాదులైతే.. పాడనివారంతా దేశద్రోహులేనా' అని సామ్నా సంపాదకీయం ప్రశ్నించింది. స్వాతంత్ర్య సమరంలో వందేమాతరం అంటూ చనిపోయిన వారంతా మూర్ఖులేనా..ప్రశ్నించారు.

బీజేపీ, ఆరెస్సెస్‌లు హిందు అతివాద సంస్థలు

- కర్నాటక సీఎం సిద్ధ రామయ్య



బెంగళూరు: కర్నాటకలో అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీజేపీ నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. తాజాగా గురువారం, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, భారతీయ జనతా పార్టీ(బీజేపీ), రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్సెస్)లను హిందూ అతివాద సంస్థలని విమర్శించగా, కాషాయ పార్టీ ఈ విమర్శలను తిప్పికొడుతూ.. కాంగ్రెస్ పార్టే వేర్పాటువాదులకు మద్దతిస్తోందని ప్రతి విమర్శలు చేసింది. ఒకవేళ మీ ఆరోపణలకు రుజువులుంటే మమ్మల్ని, ఆరెస్సెస్ నేతలను అరెస్టు చేయాలని సిద్ధరామయ్య ప్రభుత్వానికి బీజేపీ సవాలు విసిరింది. బుధవారం సిద్ధరామమయ్య బీజేపీ, ఆరెస్సెస్, బజ్‌రంగ్ దళ్ నేతలను ఉగ్రవాదులుగా పేర్కొన్నారు. కాగా, గురువారం వారిని హిందూ అతివాదులుగా అభివర్ణించారు. చామరాజనగర్‌లో విలేకరులతో సిద్ధ రామయ్య మాట్లాడారు. ఈ సందర్భంగా ఒక విలేకరి ఈ విషయాన్ని ప్రస్తావించగా నేను బుధవారం కూడా వారిని హిందూ అతివాదులగానే పేర్కొన్నాను అని బదులిచ్చాడు. అనంతరం మైసూరులో విలేకరులతో మాట్లాడుతూ.. 'నేను హిందుత్వ ఉగ్రవాదులు అని అన్నాను. నేను కూడా హిందువునే అయితే నేను మానవత్వమున్న హిందువును. వారు కూడా హిందువులే కాని వారికి మానవత్వం లోపించింది.

సిద్ధ రామయ్యావి బాధ్యతలేని వ్యాఖ్యలు : బీజేపీ ఎంపీ శోభా కరాండ్లజె

అటల్ బిహారీ వాజ్‌పేయి ఆధ్వర్యంలో నిర్మితమైన బీజేపీని, నేతలను ఉగ్రవాదులుగా సిద్ధ రామయ్య పేర్కొనడాన్ని ఆయన బాధ్యతలేమి వైఖరిని సూచిస్తున్నదని బీజేపీ ఎంపీ శోభా కరాండ్లజె గురువారం అన్నారు. దేశంలో ఈరోజు ఉగ్రవాదం ఉన్నదంటే అందుకు కారణం కాంగ్రెస్ పార్టీ, జమ్ము, కశ్మీర్‌లో నెలకొన్న పరిస్థితులని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ ఖలిస్తాన్ ఉద్యమానికి మద్దతిచ్చిందన్నారు. ఈ కారణంగా అనేక మంది అధికారులు, సైనికులు, నేతలతో సహా ఒక ప్రధానిని కూడా కోల్పోయామని చెప్పారు. అంతేకాక, ఎల్టీటీఈకి ఆర్థిక సహాయం చేయడంతోపాటు, ఆ సంస్థ సభ్యులకు దాని అధినేత ప్రభాకరణ్‌కు ఆశ్రయం, శిక్షణ ఇచ్చిందని ఆరోపించారు. త్వరలో ఎన్నికలు కర్నాటకలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో బీజేపీ- ఆరెస్సెస్‌లను ఉగ్రవాద సంస్థలుగా పేర్కొంటూ ఎన్నికలకు మత రంగు పులిమి లబ్ధిపొందాలని చూస్తోందని బీజేపీ ఆరోపించింది.

న్యూస్ యాంకర్‌ను కాను.. కన్నతల్లిని

- కుమార్తెతో పాక్ యాంకర్ న్యూస్ బులిటెన్
- చిన్నారి జైనాబ్ అత్యాచారం, హత్యకు నిరసన

న్యూఢిల్లీ: ఈరోజు నేను కిరణ్ నాజ్‌ను కాను. ఇవాళ నేను ఒక మాతృమూర్తిని. అందుకనే నా కుమార్తెతో కూర్చున్నాను.. బుధవారం సాయంత్రం పాకిస్తాన్‌కు చెందిన సమా టీవీ చానల్ ఏడు గంటల న్యూస్ బులిటెన్‌ను సమర్పిస్తున్న సందర్భంగా న్యూస్ యాంకర్ కిరణ్ నాజ్ అన్న మాటలివి. వారం రోజుల క్రితం ఎనిమిదేళ్ళ చిన్నారి జైనాబ్‌పై అత్యాచారం, హత్యా ఘటనతో యావత్ పాకిస్తాన్ దిగ్భ్రాంతి చెందింది. ప్రజలు ఆగ్రహావేశాలకు లోనయ్యారు. దేశ వీధుల్లోనూ, సోషల్ మీడియాలోను నిరసనలు మిన్నంటాయి. ఈ



సందర్భంగా యాంకర్ కిరణ్ నాజ్ స్పందించిన వైనం అందరి హృదయాలను కదిలించింది. ఇవాళ నేను జైనాబ్ గురించి తప్ప మాట్లాడ్డానికి ఇంకేమీ లేదు. చిన్నారి మృతదేహం ఎంతో భారమన్నది నిజం. నేడు చిన్నారి అంత్యక్రియల భారం కింద పాకిస్తాన్ సమాధి అయ్యింది అని దాదాపు రెండు నిముషాల వీడియో క్లిప్‌లో గద్గద స్వరంతో కిరణ్ నాజ్ వ్యాఖ్యానించారు. సదరు వీడియోను సమా టీవీకి చెందిన ఒమర్ ఆర్ ఖురేషి ట్వీటర్‌లో షేర్ చేశారు.

న్యాయవాది నుంచి నేరుగా సుప్రీం జడ్జి

న్యూఢిల్లీ: న్యాయవాది హోదా నుంచి నేరుగా సుప్రీంకోర్టు న్యాయ మూర్తి పదవిని చేపట్టే తొలి మహిళ గా సీనియర్ న్యాయవాది ఇందు మల్హోత్రా అరుదైన ఘనతను దక్కిం చుకోనున్నారు. సుప్రీం కోర్టు న్యాయ మూర్తులుగా ఉత్తరాఖండ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.ఎం.జోసెఫ్, సీనియర్ న్యాయవాది ఇందు మల్హోత్రా పేర్లను భారత ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని సీనియర్ జడ్జిలతో కూడిన కొలిజియం సిఫార్సు చేసినట్టు సమాచారం. మొత్తం ఆరు ఖాళీలకు వీరిద్దరి పేర్లను కొలిజియం నిర్ణయించింది. కొలిజియం సిఫార్సు ను ప్రభుత్వం ఆమోదించిన పక్షంలో సర్వోన్నత న్యాయస్థానానికి నేరుగా నియమించబడిన తొలి మహిళా న్యాయవాదిగా ఇందు మల్హోత్రా నిలుస్తారు. ఆమె మధ్యవర్తిత్వం



(ఆర్బిట్రేషన్) లో స్పెషలైజేషన్ చేశారు. 2007లో సీనియర్ అడ్వ కేట్‌గా సుప్రీం కోర్టు నియమించిన రెండవ మహిళా న్యాయవాదిగా ఆమె పేరుగాంచారు. అది కూడా జస్టిస్ లీలా సేథ్ తొలిసారి నియ మించబడిన మూడు దశాబ్దాల తర్వాత ఇందు మల్హోత్రా నియమితులయ్యారు. మొత్తం 25 మంది సుప్రీం కోర్టు జడ్జీలలో ఏకైక మహిళా జడ్జిగా జస్టిస్ ఆర్.భానుమతి ఉన్నారు. 2014, ఆగస్టు నెలలో ఆమె పదోన్నతి పొందారు. జస్టిస్ భానుమతి సుప్రీంకోర్టు జడ్జి పదవి చేపట్టిన మహిళల్లో ఆరవవారు. జస్టిస్ ఫతిమా బీవి 1989లో తొలిసారి ఆ పదవి చేపట్టిన మహిళగా నిలిచారు.

అఫ్జల్ గురు కుమారుడికి డిస్టింక్షన్

శ్రీనగర్: పార్లమెంటుపై దాడి చేసిన ఉగ్రవాది అఫ్జల్ గురు తనయుడు చదువులో అత్యంత ప్రతిభ చూపుతున్నాడు. అఫ్జల్ గురు కుమారుడు గాలిబ్ గురు ఇంటర్ మీడియట్ విద్యలో డిస్టింక్షన్ సాధించాడు. ఇంటర్లో 88శాతంతో 441 మార్కులు సాధించాడు. జమ్మూ కాశ్మీర్ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు నిర్వహించిన హయ్యర్ సెకండరీ స్కూల్ పరీక్షలో గాలిబ్ గురు డిస్టింక్షన్‌లో పాస్ అయ్యాడని విద్యాశాఖ అధికారులు తెలిపారు. దీంతో గాలిబ్ గురు (17)కు సామాజిక మాధ్యమాల ద్వారా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే ప్రతిభ కొనసాగించాలని నేషనల్ కాన్ఫరెన్స్ అధికార ప్రతినిధి సారా హయత్ మెరుగైన ప్రతిభ చూపిన గురును ప్రశంసల్తో ముంచెత్తారు. బారాముల్లా జిల్లా సోపోర్ పట్టణంలో అఫ్జల్ కుటుంబం నివసిస్తోంది.

కల్తీ మద్యం తాగి 11 మంది మృతి

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని బారబంకి జిల్లాలో మద్యం మహమ్మారి 11 మంది ప్రాణాలను బలి తీసుకుంది. ఓ శుభకార్యానికి హాజరైన 11మంది అక్కడ జరిగిన విందు కార్యక్రమంలో కల్తీ మద్యం సేవించడంతో ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం రాత్రి విందు సందర్భంగా మద్యం సేవించినవారు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని లక్నో ట్రామా సెంటరుకు చేర్చడంతో విషయం బయటకు వచ్చిందని జిల్లా అడిషనల్ కలెక్టర్ అనిల్ సింగ్ తెలిపారు. కల్తీ మద్యంలో స్పిరిట్ వల్ల ఘోరం జరిగిందని స్థానిక అధికారులు తెలిపారు. అయితే బాధితులు చలి గాలులతో తీవ్ర అస్వస్థతకుగురై ప్రాణాలు కోల్పోయారని ఎక్సైజ్ అధికారులు విలేఖరులకు తెలిపారు. పోస్టుమారం పూర్తయిన తరువాతే ఖచ్చితమైన వివరాలు తెలిసే అవకాశం ఉందని వీరు తెలిపారు.

కాలిఫోర్నియాలో కాల్పుల కలకలం

లాస్ఏంజెల్స్: తుపాకీ కాల్పుల చప్పుళ్లు కాలిఫోర్నియా యూనివర్సిటీలో కలకలాన్ని రేపాయి. గుర్తుతెలియని వ్యక్తి కళాశాల ప్రాంగణంలోకి ప్రవేశించి తుపాకీతో వీరంగం చేశాడు. బుధవారం నాడు జరిగిన ఈ ఘటనతో కాలేజీని తాత్కాలికంగా మూసివేశారు. రంగంలోకి దిగిన పోలీసులు నేరస్తుడి కోసం గాలిస్తున్నారు. అయితే, ఈ సంఘటనలో ఎవరూ గాయపడలేదని ఉన్నతాధికారులు వెల్లడించారు. లాస్ఏంజెల్స్‌కు 100 కిలోమీటర్ల దూరంలోని బెర్నార్డినొలో ఈ కాలేజీ ఉంది. పార్కింగ్, ఆర్ట్స్ బిల్డింగ్ వద్ద అగంతకుడు కాల్పులకు పాల్పడినట్లు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పేర్కొంది.

'ఆధార్ ఉల్లంఘన అబద్ధమే..'

బెంగళూరు: ఆధార్ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కొందరు అబద్ధపు ప్రచారం చేస్తున్నారని . యునిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యుఐడిఏఐ) మాజీ చైర్మన్ నందన్ నీలేకని అన్నారు. ఆధార్ గోప్యతకు సంబంధించి ఆందోళన చెలరేగుతున్న నేపథ్యంలో భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ మాజీ చైర్మన్ నీలేకని స్పందించారు. ఆధార్‌పై కావాలనే కొందరు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ అవార్డు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఆధార్‌పై అసత్యాలు ప్రచారం చేయటం తగదన్నారు. ఆధార్ గోప్యతకు సంబంధించి వచ్చిన కథనాలు వందశాతం కల్పితమన్నారు. ఆధార్ డేటా ఉల్లంఘనపై అధికారులు చేసిన ఫిర్యాదు మేరకు ట్రిబ్యూన్ పత్రికపై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. ఆధార్ గోపత్యత కోసం ప్రవేశపెట్టిన వర్చువల్ ఐడీని నీలేకని ఆహ్వానించారు.

సిక్కు వ్యతిరేక అల్లర్లపై సిట్ నియామకం

న్యూఢిల్లీ: మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్య అనంతరం జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్లకు సంబంధించిన 186 కేసుల దర్యాప్తుకోసం సుప్రీంకోర్టు కొత్త సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం)ను ఏర్పాటు చేసింది. ఈమేరకు గురువారం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా ఆధ్వర్యంలోని ధర్మాసనం ఒక ప్రకటనను విడుదల చేసింది. ఢిల్లీ హైకోర్ట్ మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎస్ ఎన్ దింగ్రా నేతృత్వం వహించనున్న ఈ సిట్ బృందంలో సభ్యులుగా ఐపీఎస్ అధికారి అభిషేక్ దులార్, పదవీ విరమణ చేసిన ఐజీ ర్యాంక్ అధికారి రాజ్‌దీప్ సింగ్ ఉంటారు. సిట్ దర్యాప్తు నివేదిక సమర్పించడానికి రెండునెలల గడువును నిర్ణయించింది. మార్చి 19న ఈ కేసులపై కోర్టు విచారణ చేపట్టనున్నట్లు ధర్మాసనం వెల్లడించింది. మొత్తం 250 కేసుల్లో 186 కేసులను గత సిట్ ఎలాంటి దర్యాప్తు చేయకుండానే మూసివేసిందని కోర్టు గుర్తించింది.

దాణా స్కాంలో లాబీయింగ్‌పై యోగీ ఆగ్రహం

లక్నో: దాణా కుంభకోణంలో ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌ను విచారించే సమయంలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అధికారులు ఆయనకు అనుకూలంగా వ్యవహరించారని ఇటీవల మీడియాలో వార్తలు వచ్చిన నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగీ ఆధిత్యనాథ్ సీరియస్‌గా స్పందించారు. ఈ అంశంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి నివేదికను సాధ్యమైనంత తొందర్లో సమర్పించాలని జాన్సి డివిజన్ కమిషనర్‌ను గురువారం ఆదేశించారు. ఈ మేరకు వివరాలను సిఎం కార్యాలయం నుంచి ఒక అధికారిక ట్వీట్ వెలువడింది. జిల్లా న్యాయమూర్తి మన్నన్ అక్తర్, జాలున్ సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ భారిపల్ సింగ్‌ను దాణా స్కాంలో లాలూకు అనుకూలంగా వ్యవహరించారని పేర్కొంటూ సీబీఐ వారిని విచారించిందని మీడియాలో కొన్ని వర్గాలు ఆరోపిస్తూ కథనాలను ప్రచురించాయి. దీనికి రుజువుగా జనవరి 4న సీబీఐ న్యాయమూర్తి రాంచీలో లాలూను విచారిస్తూ.. 'లాలూజీ మీకు మద్దతుగా అనేకసూచనలు, ఫోన్ కాల్స్‌ను మాకు వస్తున్నాయి' అని పేర్కొన్నారు. వారి పేర్లను వెల్లడించలేదు. అనంతరం లాలూకు మూడున్నరేళ్ల జైలు రూ.5లక్షల జరిమానాను విధిస్తూ తీర్పు చెప్పారు.

సుప్రీం కోర్టులో మహిళల రోదనలు

న్యూఢిల్లీ: కొందరు మహిళలు కోర్టు హాలులోకి ఏడ్చుకుంటూ వచ్చి అరగంట సేపు కార్యకలాపాలకు అంతరాయం కలిగించడంతో గురువారం సుప్రీంకోర్టులో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. దాంతో జస్టిస్ జె.చలమేశ్వర్ ధర్మాసనం నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. దాదాపు మధ్యవయస్సులో ఉన్న మహిళలు కోర్టు నంబరు 2లోకి చొరబడ్డారు. జస్టిస్ జె.చలమేశ్వర్, సంజయ్ కిషన్ కౌల్‌లతో కూడిన ధర్మాసనం ఎదుట బిగ్గరగా మాట్లాడుతూ ఏడ్వటం ప్రారంభించారు. వారు రాకముందే ఒక ధిక్కరణ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం.. వాయువ్య ఢిల్లీలో రోహిణిలో సెక్టార్15 వద్ద మోడరన్ కో-ఆపరేటివ్ గ్రూప్ హౌసింగ్ సొసైటీలో ఫ్లాటులను ఖాళీ చేయించాలని ఆదేశించింది. వారం రోజుల్లోగా వాటిని స్వాధీనపరచాలని ధిక్కరణకు పాల్పడినవారి తరపు న్యాయవాదిని ఆదేశించింది. ఇంక ఏ మాత్రం సమయం ఇచ్చేది లేదని పేర్కొంటూ తదుపరి విచారణను ఒక వారానికి వాయిదా వేసింది. ఆదేశం వెలువడిన కొద్ది నిముషాలకే కొందరు మహిళలు కోర్టు రూములోకి ప్రవేశించారు. దశాబ్దాల కాలంగా సొసైటీలో ఉంటున్న తమకు వేరే దిక్కు లేదని ఏడుస్తూ బిగ్గరగా మాట్లాడటం మొదలుపెట్టారు. గగ్గోలు చేశారు.

ఇండియన్ స్టోర్లపై అమెరికా దాడులు

వాషింగ్టన్: భారతీయ అమెరికన్లకు చెందిన దాదాపు 100 7-ఎలెవన్ స్టోర్లపై అమెరికా ఇమ్మిగ్రేషన్ అధికారులు గురువారం దాడులు జరిపారు. 21 మందిని అరెస్టు చేశారు. అక్రమంగా వలసవచ్చిన వారికి ఉద్యోగాలు ఇవ్వవద్దంటూ హెచ్చరించారు. దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాలు, డిస్ట్రిక్ట్ ఆఫ్ కొలంబియాలో దాడులు జరిగిన యూఎస్ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ (ఐసీఈ) అధికారులు 21 మందిని అరెస్టు చేశారు. అరెస్టయినవారు ఏ దేశీయులనేది ఐసీఈ గుర్తించలేదు. అక్రమంగా ఉద్యోగులను నియమించుకునే అమెరికా వ్యాపార సంస్థలకు నేటి చర్యలు గట్టి సందేశాన్ని ఇస్తుంది అని ఐసీఈ డిప్యూటీ డైరెక్టర్ థామస్ డి హోమన్ తెలిపారు. అక్రమంగా ఉద్యోగులను నియమించుకునే వ్యాపార సంస్థలు అక్రమ వలసలను ఆకర్షిస్తున్నాయి. ఈ అయస్కాంతాన్ని తొలగించడానికి మేం చాలా కష్టపడి పనిచేస్తున్నాము. అక్రమ వలసను వాడుకునే కంపెనీల అనుచిత పోటీ తత్వాన్ని నిర్మూలించడ ద్వారా అమెరికన్ వర్కర్లకు ఉద్యోగాల రక్షణకు ఐసీఈ తన ప్రయత్నాలను కొనసాగిస్తుంది అని అన్నారు.

అణు క్లబ్‌లో భారత్‌కు బెర్తు

న్యూఢిల్లీ: భారత్‌కు అణు సరఫరాదారుల బృందం(ఎన్ఎస్‌జీ) లో సభ్యత్వం ఇప్పించడంలో అంతర్జాతీయ భాగస్వాములతో అత్యంత సన్నిహితంగా పనిచేస్తామని అమెరికా రాయబారి కెన్నెత్ జుస్టెర్ గురువారం తెలిపారు. భారతదేశం సమీప భవిష్యత్తులో రసాయనిక, జీవ సంబంధిత ఆయుధాలపై ఆస్ట్రేలియా బృందంలో చేరుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. 48 సభ్యులతో అణు వాణిజ్యాన్ని నియంత్రించే ఎన్ఎస్‌జీలో చేరాలని భారత్ అనాదిగా ఆశిస్తున్నది. కానీ చైనా అదేపనిగా భారత్ ప్రయత్నాలకు అడ్డుతగులుతూ వస్తున్నది. భారత్-అమెరికా అణు ఒప్పందం కింద ఎన్ఎస్‌జీ, మిస్సైల్ టెక్నాలజీ రిజైమ్(ఎంటీసీఆర్)లో భారత్ అభ్యర్థిత్వానికి అమెరికా మద్దతు ఇవ్వాలి. భారత్ ఎంటీసీఆర్, వస్సెనార్ ఒప్పందాన్ని వరుసగా 2016, 2017లో కుదుర్చుకుంది.

క్రీడాప్రభ

యువ జట్టు ఉత్సాహం!



గెలిస్తే... నాలుగు!

- తొలి పోరు 14న ఆసీస్‌తో
- అండర్19 ప్రపంచకప్ రేపే షురూ
- ఫిబ్రవరి 3న ఫైనల్
- మొదటి మ్యాచ్‌లో పాక్‌తో అఫ్గాన్ ఢీ

ఐదుసార్లు ఫైనల్ చేరిక... మూడుసార్లు విజేతగా రికార్డు. ఇదీ ఐసీసీ అండర్ 19 క్రికెట్ ప్రపంచకప్‌లో భారత యువ జట్ల ప్రస్థానం. నాలుగో ప్రపంచకప్‌ను వశం చేసుకోవాలని పృథ్వీ షా సారథ్యంలోని భారత అండర్ 19 జట్టు ఉవ్విళ్లూరుతోంది. కుర్రాళ్లు ఎంతగానో అభిమానించే కోచ్ రాహుల్ ద్రవిడ్ మార్గదర్శకత్వంలో రాటు దేలిన భారత యువకులు ప్రపంచ కప్ బరిలోకి దూకేందుకు సమరోత్సాహంతో ఉన్నారు. దేశవాళీ టోర్నీల్లో పరుగుల ప్రవాహం సృష్టించిన షా... భారత జట్టును టీమ్ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లిలా విజయపథంలో నడిపిస్తాడో లేదో చూడాలి. సీనియర్ జట్టు కోచ్ బాధ్యతలు వద్దని.. యువ జట్టు బాధ్యతలు చేపట్టిన ద్రవిడ్.... జట్టులో కడ వరకు స్ఫూర్తిని నింపాలి. ప్రపంచ కప్‌లో భారత జట్టు తన తొలి పోరులో 14న ఆస్ట్రేలియాతో తలపడుతుంది. 2018 అండర్ 19 ప్రపంచ కప్‌కు న్యూజిలాండ్ ఆతిథ్యమిస్తోంది. ఈ నెల 13న టోర్నీకి తెర లేవనుంది. తొలి పోరులో పాకిస్థాన్, అఫ్గానిస్తాన్ తలపడతాయి. ఫైనల్ ఫిబ్రవరి 3న నిర్వహిస్తారు.

ఆంధ్రప్రభ, క్రీడావిభాగం

భారత అండర్ 19 జట్టుకు అత్యంత విజయవంతమైన జట్టుగా రికార్డుంది. ఇప్పటికి ఐదుసార్లు ఫైనల్ చేరిన భారత్ మూడుసార్లు విజేతగా నిలిచింది. భారత్ కాకుండా ఆస్ట్రేలియా మాత్రమే మూడు సార్లు ప్రపంచకప్‌ను గెలుచు కుంది. దీంతో పృథ్వీ షా బృందంపై అంచనాలు ఎక్కువగా ఉన్నాయి. యువ జట్లతో ఆడిన వన్డేల్లో, ఫస్ట్‌క్లాస్ క్రికెట్లో 18 ఏళ్ల కెప్టెన్ షాతో పాటు ఆటగాళ్లు హిమాన్షు రాణా, షుబ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, ఇషాన్ పొరేల్‌కు మెరుగైన ప్రదర్శన ఇచ్చారు. వారి అనుభవం దృష్ట్యా కూడా భారత్ 2018 అండర్ 19 ప్రపంచకప్‌ను కైవసం చేసుకోగలదని అందరూ భావిస్తున్నారు. దీనికి తోడు టీమ్ఇండియా మాజీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్ మార్గ నిర్దేశకుడిగా ఉండడం జట్టుకు కలిసి వచ్చే అంశం! 2016లో బంగ్లాదేశ్ ఆతిథ్యమిచ్చిన ప్రపంచకప్‌లో భారత్ ఫైనల్ చేరింది. తుది పోరులో వెస్టిండీస్ చేతిలో ఓడింది. ఈ సారి భారత అండర్ 19 జట్టు పూర్తిగా భిన్నమైంది. దేశవాళీలో ముంబై తరఫున కెప్టెన్ షా రికార్డు స్థాయిలో పరుగులు చేశాడు. భారత్ గత ఏడాది ఇంగ్లండ్‌ను యూత్ వన్డే సిరీస్లో 5-0తో వైట్‌వాష్ చేయడంలో గిల్ ప్రధాన పాత్ర పోషించాడు. ఆసియా క్రికెట్ మండలి నిర్వహించిన అండర్ 19 ఆసియా కప్‌లో మాత్రం భారత యువ జట్టు పేలవ ప్రదర్శన చేసింది. కుర్రాళ్లు మూడు మ్యాచ్‌ల్లో కేవలం ఒకటే గెలిచారు. నేపాల్, బంగ్లాదేశ్ జట్ల చేతిలో ఓడారు. ఆ నిరాశాజనక ప్రదర్శనను మరిచిపోయి ఈ సారి ప్రపంచకప్‌లో సత్తా చాటాలని భారత యువకులు తహతహలాడుతున్నారు.

బ్యాటింగే బలం : ప్రపంచకప్ ఆడుతున్న భారత యువ జట్టుకు... పరిమిత ఓవర్ల క్రికెట్లో సీనియర్ల మాదిరిగా బ్యాటింగే బలం. కెప్టెన్ షా... 10 యూత్ వన్డేల్లో 361 పరుగులు సాధించాడు. హిమాన్షు రాణా 14 మ్యాచ్‌లలో 452 కొన్ని అద్భుత ప్రదర్శనలు చేశాడు. ఆ విశ్వాసంతో అతను ప్రపంచకప్ బరిలోకి దిగుతున్నాడు. తర్వాతి స్థానాల్లో బ్యాటింగ్ చేసే అనుకూల్ రాయ్, అభిషేక్ శర్మ మిడిలార్డర్‌ను పరిపుష్టం చేస్తారు. వీరిద్దరితో కూడిన మిడిలార్డర్ ఎలాంటి సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉంది. భారత యువ జట్టుకు చెప్పుకోదగ్గ బలహీనత లేనప్పటికీ... జట్టు బ్యాటింగ్ ఎక్కువగా మిడిలార్డర్‌పైనే ఆధారపడి ఉందన్న సంగతి అండర్ 19 ఆసియా కప్‌లో ప్రదర్శన ద్వారా తేటతెల్లమైంది. మిడిలార్డర్ విఫలమైతే కుప్ప కూలే బలహీనత జట్టుది. ప్రత్యర్థి ఆరంభంలో దూకుడుగా ఆడితే అయోమయంలో పడుతుంది. జట్టులోని కొందరు ఆటగాళ్లే దేశవాళీ క్రికెట్ ఆడివున్న నేపథ్యంలో కోచ్ ద్రవిడ్ ఈ భారీ టోర్నీలో వారిని ఎలా నడిపిస్తాడన్నదే కీలకం.


పృథ్వీ షా, రాహుల్ ద్రవిడ్

అతడే కీలకం: ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఒక్క మ్యాచ్ అయినా ఆడని ఆల్‌రౌండర్ శివమ్ మావి... ప్రపంచకప్‌లో భారత జట్టుకు కీలకం కానున్నాడు. గత ఏడాది అండర్ 19 జట్టు ఆడిన వన్డేలు, అనధికార టెస్టుల్లో శివమ్ ఆకట్టుకున్నాడు. కుడి చేతి వాటం మీడియం పేసర్ శివమ్... గత ఏడాది ఇంగ్లండ్‌ను వన్డేల్లో వైట్‌వాష్ చేయడంలో ప్రధాన పాత్ర పోషించాడు. గత రెండు నాలుగు రోజుల మ్యాచ్‌లలో 10 వికెట్లు తీసి ఊపు మీదున్నాడు. సీమ్, స్వింగ్‌కు అనుకూలించే న్యూజిలాండ్ పిచ్‌లపై కొత్త బంతితో శివమ్ ఉపయుక్తంగా ఉంటాడు.

రికార్డు సృష్టిస్తారా!: 1988లో ఐసీసీ అండర్ 19 ప్రపంచకప్ ఆరంభించిన తరువాత భారత యువ జట్లు ఇప్పటి వరకు మూడు సార్లు విజేతగా నిలిచాయి. 2000లో తొలిసారి లంకను 6 వికెట్లతో ఓడించి ప్రతిష్టాత్మక కప్‌ను వశం చేసుకుంది. ఆ ప్రపంచకప్‌లో మహ్మద్ కైఫ్ జట్టును నడిపించాడు. యువరాజ్ సింగ్ ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచాడు. 2008లో జట్టుకు సారథ్యం వహించిన విరాట్ కోహ్లి విజేతగా నిలిపాడు. ఫైనల్లో భారత్ డక్‌వర్త్ లూయిస్ ప్రకారం 12 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై గెలిచింది. 2012లో ఉన్ముక్ చంద్ సారథ్యంలోని భారత యువ జట్టు ప్రపంచకప్ సొంతం చేసుకుంది. ఫైనల్లో ఆస్ట్రేలియాను 6 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. 2016లో భారత జట్టు జార్ఖండ్ బ్యాట్స్‌మన్ ఇషాన్ కిషన్ సారథ్యంలో ప్రపంచకప్ ఆడింది. ఫైనల్లో విండీస్ కేవలం 5 వికెట్ల తేడాతో సంచలన విజయం సాధించింది. సర్ఫరాజ్ ఖాన్ 71 సగటుతో 355 పరుగులు సాధించాడు. 6 ఇన్నింగ్స్‌లో ఐదు అర్ధసెంచరీలు చేశాడు. సీమ్ బౌలర్ అవేశ్ ఖాన్, ఎడమ చేతివాటం స్పిన్నర్ మయాంక్ దాగర్ వరుసగా 13, 11 వికెట్లు పడగొట్టారు.

ఆస్ట్రేలియా, జింబాబ్వే, పపువా న్యూగినియాతో పాటు పూల్ బిలో ఉన్న భారత యువ జట్టు తొలి పోరులో ఈనెల 14న ఆస్ట్రేలియాతో తలపడుతుంది. 16న పపువా న్యూగినియాను, 19న జింబాబ్వేను ఢీకొంటుంది.

భారత అండర్ 19 జట్టు: పృథ్వీ షా (కెప్టెన్), షుబ్‌మన్ గిల్ (వైస్‌కెప్టెన్), ఆర్యన్ జుయల్ (కీపర్), అభిషేక్ శర్మ, అర్షదీప్ సింగ్, హర్విక్ దేశాయ్ (కీపర్), మన్‌జోత్ కల్రా, కమలేశ్ నగర్‌కోటి, పంకజ్ యాదవ్, రియాన్ పరాగ్, ఇషాన్ పోరెల్, హిమాన్షు రాణా, అనుకూల్ రాయ్, శివమ్ మావి, శివ సింగ్.

అంపైర్ పొరపాటు... హైదరాబాద్‌కు గ్రహపాటు



విశాఖపట్నం, ఆంధ్రప్రభ: హైదరాబాద్-కర్ణాటక జట్ల మధ్య గురువారం సయ్యాద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టీ20 మ్యాచ్‌లో వివాదం చోటు చేసుకుంది. అంపైర్ పొరపాటు హైదరాబాద్ జట్టుకు గ్రహపాటుగా మారింది. టాస్ ఓడి ముందుగా కర్ణాటక జట్టు బ్యాటింగ్ చేస్తున్నపుడు ఈ పొరపాటు జరిగింది. కర్ణాటక బ్యాట్స్‌మన్ కరుణ్ నాయర్... సిరాజ్ వేసిన బంతిని మిడ్ వికెట్ ప్రాంతంలోకి కొట్టి రెండు పరుగులు తీశాడు. బంతి స్పిన్నర్ హసన్ బంతిని బౌండరీ వద్ద ఆపినపుడు అతని ఎడమ పాదం బౌండరీ తాడుకు తగిలింది. ఆ దృశ్యం రీప్లేల్లో స్పష్టంగా కనిపించింది. అంపైర్ ఉల్హాస్ గంధె.. థర్డ్ అంపైర్ సమీక్షను కోరలేదు. బౌండరీ ప్రకటించలేదు. కర్ణాటక 20 ఓవర్లలో 5 వికెట్లకు 203 పరుగులు చేసింది. హైదరాబాద్ లక్ష్యం 204 పరుగులు. కర్ణాటక బౌలింగ్ చేయడానికి మైదానంలోకి వచ్చాక కెప్టెన్ వినయ్ కుమార్ అంపైర్లతో మాట్లాడి స్కోరుకు రెండు పరుగులు జోడించేలా చేశారు. అపుడు కర్ణాటక స్కోరు 205 పరుగులైంది. హైదరాబాద్ 206 పరుగులు చేయాలి. చిత్రంగా హైదరాబాద్ కూడా 203 పరుగులే చేసింది. దీంతో రెండు పరుగుల తేడాతో ఓడింది. కాని కెప్టెన్ అంబటి రాయుడు నేతృత్వంలో హైదరాబాద్ ఆటగాళ్లు మ్యాచ్ పూర్తయినా సూపర్ ఓవర్ వేసామన్నట్లు పిచ్ వద్దే ఉండిపోయారు. దీంతో చాలా సేపు ఈ డ్రామా నడిచింది. దీంతో ఒంటిగంటకు ఆరంభం కావలసిన ఆంధ్ర, కేరళ మ్యాచ్ ఆలస్యంగా ఆరంభమైంది. పోరును 16 ఓవర్లకు కుదించారు. రాయుడు మాట్లాడుతూ...''మా ఇన్నింగ్స్ ఆరంభంలో కొంత అయోమయం ఏర్పడింది. స్కోరును మార్చలేరని అంపైర్‌కు చెప్పాను. మేం 204 పరుగులు చేయడానికి బ్యాటింగ్ చేస్తాం అని చెప్పాను'' అని తెలిపాడు. ''చివర్లో సూపర్ ఓవర్ ఆరంభించమన్నాం. అదే మా వాదన. రెండో మ్యాచ్‌ను ఆపాలన్న ఉద్దేశం మాకు లేదు. మా మ్యాచ్ పూర్తికాలేదన్నది మా ఉద్దేశం. మేం ఇంకా సూపర్ ఓవర్ ఆడాల్సిఉంది. మేం వార్మప్ చేస్తున్నాం'' అని రాయుడు తెలిపాడు. ''నిబంధనలు మారవు కదా. అంపైర్ వెంటనే స్కోరు మార్చివుంటే తప్పులేదు. ఔటైనపుడు పెవిలియన్‌లోకి వచ్చాక అది నాటౌట్ అని తెలిసినా బ్యాట్స్‌మన్‌ను వెనక్కి పిలవరు. నోబాల్ విషయంలోనూ ఇంతే. ఔటైతే ఔటే. అది పొరపాటైనా ఇక ఆడడం కుదరదు'' అని పేర్కొన్నాడు.

ధావన్ స్థానంలో రాహుల్?



జొహాన్నెస్‌బర్గ్ : టీమ్ఇండియా తొలి టెస్టులో బ్యాట్స్‌మెన్ వైఫల్యంతో ఓటమి చవిచూడడంతో జట్టు యాజమాన్యం దిద్దుబాటు చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం. ఓపెనింగ్‌లో ధావన్‌ను తీసుకోవడంపై తీవ్ర విమర్శలు ఎదురుకావడంతో అతనిపై వేటుకు సంసిద్ధమవుతున్నట్లు తెలిసింది. ధావన్ స్థానంలో కర్ణాటక బ్యాట్స్‌మన్ కేఎల్ రాహుల్‌ను తుది జట్టులోకి తీసుకోనున్నట్లు రూఢిగా అందిన సమాచారం. శనివారం ఆరంభం కానున్న సెంచూరియన్ టెస్టులో రాహుల్ ఆడేది ఖాయంగా కనిపిస్తోంది. ఫామ్‌లో ఉన్న రాహుల్‌ను తీసుకోవడం వల్ల ఓపెనింగ్ కుదురుకునే అవకాశముంది. నిజానికి ఓపెనర్లు విజయ్, ధావన్‌లిద్దరూ తొలి టెస్టులో ఘోరంగా విఫలమయ్యారు. దీనికి తోడు ధావన్ ఫీల్డింగ్‌లోనూ విఫలమయ్యాడు. ఫలితంగా కఠిన నిర్ణయాలు తీసుకోవాలని జట్టు యాజమాన్యం భావిస్తున్నట్లు తెలిసింది. దాని ఫలితంగానే ధావన్‌కు బదులు రాహుల్ జట్టులోకి రానున్నాడు. దక్షిణాఫ్రికా పరిస్థితుల్లో అనుభవం ఉన్న విజయ్‌ను కొనసాగించనున్నారు. ఐతే గురువారం సెంచూరియన్ పిచ్‌ను చూసిన అనంతరం కోహ్లి, రవి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి. విదేశాల్లో ఘనమైన రికార్డున్న రహానేను కాదని రోహిత్ శర్మను ఆడించడంపై కూడా విమర్శకులు అస్త్రాలు సంధిస్తున్నారు. ఐతే ఫామ్ ఆధారంగా రోహిత్‌ను కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. లంకతో సిరీస్‌లో పరుగులు చేయడం అతనికి వరమవుతోంది. 2017లో రెండు టెస్టుల్లో ఓ అజేయ సెంచరీ... రెండు అర్ధసెంచరీలు సాధించిన బ్యాట్స్‌మన్‌ను ఎలా తప్పిస్తామని జట్టు యాజమాన్యం వాదిస్తోంది. 2017లో రోహిత్ 21 వన్డేల్లో 71.83 సగటుతో 1293 పరుగులు సాధించాడు. జట్టు యాజమాన్యం తమ వాదనకు బలంగా ఈ గణాంకాలను వివరిస్తోంది. ఐతే ఏడు టెస్టుల్లో 300 పరుగులు చేసిన అసలుసిసలు టెస్టు బ్యాట్స్‌మన్ రహానేతో వన్డేల్లో పరుగులు సాధించిన రోహిత్‌ను పోల్చడం సరికాదు. గత ఏడాది ఆగస్టులో లంకలో రహానే 132 పరుగులు చేశాడు.విదేశాల్లో టెస్టుల్లో 55 సగటు ఉన్న అతణ్ని రోహిత్‌తో పోల్చడం న్యాయం కాదు. తుది జట్టులో రహానేను చేర్చుకోవాలంటే ఒకటే దారి. ఏకైక స్పిన్నర్ అశ్విన్‌ను తప్పించడమే. ఐతే జట్టు యాజమాన్యం ఆ ధైర్యం చేయకపోవచ్చు!.

ఇదీ ఫార్మాట్

2018 ఐసీసీ అండర్ 19 ప్రపంచకప్‌లో మొత్తం 16 జట్లు పోటీపడనున్నాయి. ఈ జట్లు ఏ, బీ, సీ, డీ గ్రూప్‌లుగా విడిపోయి తలపడ తాయి. ఒక్కో గ్రూప్‌లో నాలుగు జట్ల ంటాయి. గ్రూప్ దశలో ఒక్కో జట్టు తక్కిన మూడు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. పాయింట్ల ఆధారంగా గ్రూప్‌లో తొలి రెండు స్తానాల్లో నిలిచిన జట్లు సూపర్ లీగ్ నాకౌట్ దశకు చేరుకుంటాయి. నాకౌట్లో క్వార్టర్ ఫైనల్స్, సెమీ ఫైనల్స్, ఫైనల్ ఉంటాయి. 3, 4 స్తానాల్లో నిలిచిన 8 జట్లు ప్లేట్ డివిజన్‌కు వెళ్తాయి. దీనికి ప్రధాన టోర్నీతో సంబంధం ఉండదు. ఈ విభాగంలో కూడా నాకౌట్ దశ ఉంటుంది. ఫైనల్లో గెలిచిన జట్టు ప్లేట్ టైటిల్‌తో పాటు 9వ స్థానాన్ని దక్కించుకుంటుంది.

సెమీ ఫైనల్స్, ఫైనల్

ప్రపంచ కప్ సూపర్ లీగ్ తొలి సెమీఫైనల్స్ జనవరి 29న.... రెండో సెమీఫైనల్ 30న ఉంటుంది. ఫైనల్ మ్యాచ్ ఫిబ్రవరి 3న నిర్వహిస్తారు.

గ్రూప్‌లు:

గ్రూప్ ఏ: కెన్యా, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, విండీస్.

గ్రూప్ బి: ఆస్ట్రేలియా, భారత్, పపువా న్యూగినియా, జింబాబ్వే.

గ్రూప్ సి: బంగ్లాదేశ్, కెనడా, ఇంగ్లండ్, నమీబియా.

గ్రూప్ డి: అఫ్గానిస్తాన్, ఐర్లాండ్, పాకిస్థాన్, శ్రీలంక.

భువీ...అలా వచ్చాడు!

జొహాన్నెస్‌బర్గ్: ఈ నెల 5. దక్షిణాఫ్రికాతో భారత్ తొలి టెస్టు ఆరంభం అయ్యే రోజు. టీమ్ఇండియా పేసర్ ఇషాంత్ శర్మ ఉదయం లేవగానే తలపోటుతో బాధపడ్డాడు. జ్వరం కూడా వచ్చింది. రెండు గంటల తరువాత అతను కోలుకుంటాడు... 10.30కల్లా మ్యాచ్‌కు సిద్ధమవుతాడని జట్టు యాజమాన్యం భావించింది. కానీ అలా జరగలేదు. దీంతో యాజమాన్యం.. భువనేశ్వర్ కుమార్, ఉమేశ్ యాదవ్‌లలో ఒకరిని ఎంచుకోవలసి వచ్చింది. కెప్టెన్, కోచ్... భువీనే ఎంచుకు న్నారు. భువీ తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా టాప్ ఆర్డర్‌ను కకావికలు చేసి 87 పరుగులకు 4 వికెట్లు తీసుకున్నాడు.

ఒకే పార్శ్వంలో ఫెదరర్, జకోవిచ్

మెల్‌బోర్న్: డిఫెండింగ్ చాంపి యన్ రోజర్ ఫెదరర్, మాజీ చాంప్ జకో విచ్... ఆస్ట్రేలి యన్ ఓపెన్ డ్రాలో ఒకే పార్శ్వంలో ఉన్నారు. జకోవిచ్ మోచేయి గాయం నుంచి కోలుకొని ఇటీవలే తిరిగి టెన్నిస్‌లోకి అడుగుపెట్టాడు. గత ఏడాది నాదల్, ఫెదరర్ మధ్య ఫైనల్ పోరు జరిగింది. ఫెదరర్ టైటిల్ దక్కించుకున్నాడు. నాదల్ ఈ సారి తొలి రౌండ్లో విక్టర్ ఎస్ట్రెలా బర్గోస్‌తో తలపడ తాడు. ఫెదరర్ తన తొలి రౌండ్ పోరులో స్లొవేనియా ఆటగాడు అల్‌జజ్ బెదెనెను ఢీకొంటాడు. క్వార్టర్ ఫైనల్లో ఫెదరర్‌కు డేవిడ్ గోఫిన్ ఎదురుకావచ్చు. నాదల్‌కు మారిన్ సిలిక్ ఎదురు పడే అవకాశాలున్నాయి. మహిళల విభాగంలో రొమేనియా నెంబర్ 1 సిమోనా హలెప్‌కు తొలి రౌండ్లో ఆస్ట్రేలియాకు చెందిన వైల్డ్ కార్డ్ క్రీడాకారిణి డెస్టానీ అయివాతో తలపడుతుంది. క్వార్టర్ ఫైనల్లో కరోలినా ప్లిస్కోవా ఎదురు కావచ్చు. ప్రపంచ నెంబర్ వన్ రఫెల్ నాదల్, నెంబర్ టూ రోజర్ ఫెదరర్‌లకు ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ విభాగంలో ఒకటి, రెండు సీడింగ్‌లు లభించాయి. ఆరు సార్లు చాంపియన్ జకోవిచ్‌కు 14వ సీడింగ్ లభించింది. మహిళల సింగిల్స్‌లో సిమోన్ హలెప్, కరోలినా వోజ్నియాకిలకు ఒకటి, రెండు సీడింగ్‌లు ఇచ్చారు. ఏటీపీ ర్యాంకింగ్స్ ఆధారంగా సీడింగ్‌లు ఇస్తారు. రెండో సీడ్ ఫెదరర్ 20వ టైటిల్ కోసం డ్రాలో దిగువ పార్శ్వం నుంచి పోటీ పడతాడు. గాయాలతో ఆండీ ముర్రే, కీ నిషికోరి... గత సెప్టెంబ రులో బిడ్డకు జన్మనిచ్చిన సెరెనా విలి యమ్స్ ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ నుంచి తప్పుకున్నారు. వింబుల్డన్ తరువాత మోకాలి గాయంతో ఆడని మాజీ విజేత వావ్రింకాకు 9వ సీడింగ్ లభించింది. 23 గ్రాండ్ స్లామ్ టైటిళ్ల విజేత సెరెనా... ఈ ఏడాది ఆస్ట్రేలియన్‌కు దూరం కావడంతో టెన్నిస్ అభిమా నులు కొత్త చాంపియన్‌ను చూడ బోతున్నారు. వింబుల్డన్ చాంపియన్ ముగురుజకు 3, వీనస్ విలియమ్స్‌కు 5 సీడింగ్‌లు ఇచ్చారు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.



సంక్రాంతి సందడి... పందెంకోళ్లదే!

అక్కడ సింహాలు జూలు విదల్చలేదు.. కానీ..
అంతకన్నా మిన్నగానే పౌరుషాగ్ని పుట్టుకొస్తుంది
జాతివైర్యం లేకున్నా.. ఆగ్రహం అగ్గి రగుల్తుంది
శరీరం ఛిద్రమవుతున్నా.. కాళ్ళకు కట్టిన కత్తులు సవ్వడి
చేయాల్సిందే..
ప్రాణం గాల్లో కలిసేవరకు పోరు కొనసాగించాల్సిందే..
ఆ పోరులో విజయం ఓ పక్షందే..
మూగజీవుల పోరాటపటిమను తిలకించేందుకే..
ఖరీదైన కారులు పచ్చని చేలవెంట పరుగుపెడతాయి
నగరాలను వీడి పల్లెలబాట పడతాయి..
పోలీసులను చట్టాన్ని రాజకీయబలంతో కట్టేస్తాయి
కోడిపందాలపేరుతో జూదం పురివిప్పి నాట్యమాడుతుంది
ఎన్నో ఆశలతో పెంచుకున్న పుంజుతల నేలవాలితే..
ఆ పందెంరాయుడి గుండె ఆగినంతపనవుతుంది
ఓటమి భారాన్ని అదిమిపట్టేందుకు మద్యంసీసా
తోడవుతుంది
ఆ మత్తులో.. పౌరుషాగ్నిలో ఓడలు బళ్ళవుతాయి..
ఆలినగలు.. పచ్చనిపొలాలు.. పరాధీనమవుతాయి
ఒక్కసారి గెలిస్తే.. తలరాత మారిపోతుందంటూ..
మళ్ళీ.. మళ్ళీ.. అదే ధ్యాస.. అదే జూదం....

మనిషికి ఆహారంగా మారిపోయే కోడి పుంజులు...మనిషి తలరాతలనే మార్చేసే విచిత్రాన్ని సంక్రాంతి కోడి పందాలలో చూడవచ్చు. గెలుపు ఏ రకమైనదైనా అది ఇచ్చే మజానే వేరు. పందెం పుంజు గెలిచిందంటే...గెలుపు ఆనందంతో పాటు డబ్బూ దక్కుతుంది. సంక్రాంతి సందళ్లలోని ముగ్గులు, భోగిపళ్లు, హరిదాసులు, గంగిరెద్దులు...వంటివయినా కనుమరుగు అయిపోతున్నాయేమో కానీ..పందెం కోళ్ల ఆవేశం మాత్రం తగ్గలేదు. సంక్రాంతి సందడిని గెలుపు ఓటముల బరిలోకి తీసుకువెళ్లే... పందెం కోళ్లపై ప్రత్యేక కథనం-

కోడిపుంజు పౌరుషానికి చిహ్నం. పందెంకోళ్ళు పరస్పరం పోరాడుకుంటూ కత్తికట్టిన కాళ్ళతో గాలిలో ఎగిరి తన్నుకుంటుంటే చూపరుల రక్తం ఉప్పొంగుతుంది. రెక్కలు రెండూ సగంవిప్పి తళతళ మెరిసిపోయే కత్తి ని... కట్టిన కాలును ప్రత్యర్థి కోడిగుండెల్లో దించడానికి ప్రయత్నించే పుంజులంటే పడిచచ్చేవారెందరో.. కోడిపందాలనగానే తెలుగువాడి మదిలో పల్నాటి పౌరుషాలు కదలాడతాయి. పనికిరాని పౌరుషాలతో కోడిపందాలు వేసి యుద్ధాలు కొనితెచ్చుకుని కాలగర్భంలో కలిసిన రాజ్యాల చరిత్ర మనకు తెలిసిందే. పల్నాడులో నాయకురాలు నాగమ్మ, బ్రహ్మనాయుడు కోడిపందాల్లో రాజ్యాన్ని పణంగాపెట్టి యుద్ధాలు చేసిన సంఘటన నేటికీ మర్చిపోలేము. అయినప్పటికీ సంక్రాంతినెల వచ్చిందంటే ఈ పందాలను చూడాలని ఆడాలని తహతహలాడుతుంటారు.

క్రూరమైన క్రీడ

ఇంకా తెలవారలేదేమీ.. ఈ చీకటి రేయి.. అని ఎదురుచూసే పల్లెజీవులను కొక్కొరోకో అంటూ కోడిపుంజులు నిద్రలేపుతాయి. మగతనిద్రలో ఉన్న ప్రపంచాన్ని వేకువనే మేలుకొలిపే కోడి ప్రాణాలతో పందాలాడడం ఘోరమైన ఆట కాకపోయినా క్రూరమైన ఆటగా చెప్పవచ్చు. అన్నెంపున్నెం ఎరుగని జీవుల కాళ్ళకు విచ్చుకత్తులు కట్టి కుత్తుకలు తెగ్గోయించే క్రీడను ఖచ్చితంగా దారుణమైందనే పేర్కొనాలి. పందెంకోళ్ళు పరస్పరం తలబడుతూ కత్తికట్టిన కాళ్ళతో గాలిలో ఎగిరి తన్నుకుంటుంటే చూపరుల రక్తం ఉప్పొంగుతుంది. ఈలలు, కేకలు, చప్పట్లతో ఆ ప్రాంతమంతా మార్మోగుతుంది.

కాయ్.. రాజా.. కాయ్.. స్టేటస్‌సింబల్ గా మారిన పందాలు

జూదాల్లో చాలారకాలుంటాయి. అయితే సంక్రాంతిస్పెషల్‌గా మారిన ఈ కోడి పందాలు చాలామందికి స్టేటస్‌సింబల్‌గా మారాయి. కేవలం పచ్చని పంటపొలాలమధ్య నూరుశాతం గ్రామీణప్రాంతాల్లో మాత్రమే జరిగే ఈ పందాలకోసం పట్టణవాసులు తహతహలాడుతుంటారు. ఖరీదైన కార్లతో ఈ పంటపొలాల్లోకి దూసుకొచ్చి లక్షలాదిరూపాయలు పణంగా పెట్టి పందాలాడడం స్టేటస్‌సింబల్‌గా ఫీలవుతున్నారు. సంక్రాంతి సంప్రదాయమంటూ రాజకీయనాయకులు, సినీప్రముఖులు, పెద్దపండుగకు వచ్చే ఎన్‌ఆర్‌ఐలు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌లు ఈ పోటీల్లో పాల్గొనడానికి ఉరకలేస్తున్నారు. కొందరైతే జిల్లాలు దాటి స్నేహితులతో కలిసి ఈ పందాల్లో పాల్గొని హుందాగా ఫీలవుతారు. కోడిపందాలను నిషేధించి చాలాకాలమైనా పూర్తిస్థాయిలో అరికట్టడం అసాధ్యంగా మారింది. ఈ పందాలను పేద, ధనిక అనే బేధంలేకుండా అందరూ నిర్వహిస్తుంటారు. అందుకే వీటిని కట్టడిచేయడం కష్టంగా మారింది. సంక్రాంతి పండుగకు దర్శనమిచ్చే గొబ్బిళ్ళు, హరిదాసులు, కొమ్మదాసులు, గంగిరెద్దులువంటి సంప్రదాయాలు వెనకబడుతున్నప్పటికీ కోడిపందాల సంస్కృతి మాత్రం బ్రహ్మాండంగా ఏ ఏడాదికాయేడాది పురోగతి సాధిస్తూనే ఉంది.

తిండికొద్దీ ఫైటు...


పందెంకోళ్ళకు ఆహారం ప్రత్యేకంగా ఇవ్వాల్సి ఉంటుంది. పందెంలో సరిగ్గా ప్రతిభ చూపాలంటే పౌష్టికాహారం ముఖ్యం. అందుకే వీటికి జీడిపప్పు, బాదంపప్పువంటి ఖరీదైన ఆహారాన్ని పెడతారు. కొందరైతే మనుషుల మాదిరిగానే శక్తికోసం కోళ్ళకు క్యాప్సిల్స్ వాడుతుంటారు. కోడిలో క్రొవ్వులేకుండా బలంపెరిగే ఆహారం ఇస్తారు. చిన్నపాటి పందాలతో ఆడేవారు...రాగులు, సజ్జల వంటి ఆహారంతో సరిపెట్టినా, పెద్ద మొత్తంలో పందానికి ఆడే కోళ్లకు మాత్రం ఆహారాన్ని చాలా జాగ్రత్తగా పెడతారు.

ఎక్సర్‌సైజులు తప్పవు...శిక్షణ కూడా

కొందరు మనుషుల్లాగ ఈ కోళ్ళు తిని తొంగుంటే పందాలకు పనికిరావు. వీటికి రెండుపూటలా ఎక్సర్‌సైజులు తప్పనిసరి. నీటిలో ఈతకు తీసుకువెళ్ళడం, నేలపై బాగా పరుగెత్తించడంవంటి వ్యాయామాలెన్నో చేయిస్తుంటారు. వీటికి ప్రత్యేకంగా శిక్షణని ఇవ్వడానికి..బొబ్బిలి, విజయనగరం, ఒరిస్సా, కర్ణాటక, కోల్‌కతా వంటి ప్రాంతాలనుండి స్పెషల్ కోచ్‌లు కూడా వస్తుంటారు. గోదావరి జిల్లాల్లో ఎక్కువగా దిగే ఈ కోచ్‌లు..పండుగకు పదిహేను రోజుల ముందు నుండి కోళ్లకు శిక్షణని ఇస్తుంటారు. పందెంలో ఏ కోడి ఎంతవేగంగా కాలు కదుపుతుందనేదే ముఖ్యం. కాలివేలికి కట్టిన కత్తి ఎదుటి పుంజు దెబ్బలు కాస్తుండగా...ఆ కాలితో అవతలిపుంజును దెబ్బకొడితే అదే విజేత. ఈ పందెంలో మరణించిన కోడికి కూడా డిమాండ్ అధికంగా ఉంటుంది. బాదం, పిస్తాతో పెరిగిన ఈ కోడిమాంసం కిలో ధర చెబితే ఆశ్చర్యపోతారు. డిమాండ్‌నుబట్టీ ఒక్కోసారి కిలో రూ.1000లు పైనే పలుకుతుంది. కోడిమాంసానికి ఇంతరేటా అని ఆలోచించడం కాదు, దాని రుచి చూసి చెప్పండంటారు పందెంరాయుళ్ళు. ప్రస్తుతం సంక్రాంతిసీజన్ కావడంతో నెలలతరబడి పెంచిన ఈ కోళ్ళధరలు చుక్కలనంటుతున్నాయి. అయితే ఈ ఏడాది కోర్టుతీర్పు నేపథ్యంలో వీటి కొనుగోలుకు వెనకాముందాడుతున్నారు. కోడిపందాల నిషేధాన్ని పగడ్బందీగా అమలుచేస్తే వీటి పెంపకందారుల పరిస్థితి తారుమారైపోతుంది. బోల్డంత పెట్టుబడితో పెంచి పోషించిన కోళ్ళను ఏంచేసుకోవాలో తెలియక ఆ పెంపకందారులు దిక్కులు చూడాల్సిన పరిస్థితి. అలాకాకుండా ఎప్పుడూ మాదిరిగానే పోనీలే పండగే కదా... అని చూసీచూడనట్లు వదిలేస్తే ఈ కోళ్లధర కోడిని బట్టీ రూ.రెండువేలునుండి పాతికవేలవరకు పలుకుతుంది. ఈ ధరలు మనల్ని ఆశ్చర్యంలో ముంచెత్తక మానవు.

హైకోర్టు వద్దంది...అయినా ఆగే పరిస్థితి లేదు

కోడిపందాలకు అనుమతులు లేకపోయినప్పటికీ చాటుమాటుగానో, మామూళ్ళమాటునో యధేచ్ఛగా జరుగుతూనే ఉంటాయి. అయితే గత కొంతకాలంగా జిల్లానాయకులు రాష్ట్రస్థాయి నేతలపై ఒత్తిడి తీసుకువచ్చి మరీ పండగ మూడురోజులు కోడిపందాలకు అనుమతులు తీసుకువస్తున్నారు. ఈ పందాలను ఎమ్మెల్యేలు, ఎంపిలే పుంజులు పట్టుకుని ప్రారంభిస్తుండడం రివాజుగా మారిపోయింది. చట్టాలు చేసేవారే కాయ్‌రాజాకాయ్ అంటుంటే ఖాకీపెద్దలు కాదనలేకపోతున్నారు. గోదావరి జిల్లాల్లో ప్రధానంగా జరిగే ఈ కోడిపందాలపై ప్రస్తుతం మునుపెన్నడూ లేనంత చర్చ జరుగుతోంది. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఈ కోడిపందాలపై కఠినచర్యలు తీసుకోవాలంటూ గత రెండేళ్ళమాదిరిగానే ఈ ఏడాది కూడా తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. కానీ ఏటా మాదిరిగానే పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన బీజేపీనేత రఘురామకృష్ణంరాజు హైకోర్టు తీర్పును సవాల్‌చేస్తూ ఎన్నోదశాబ్దాలుగా సంప్రదాయంగా వస్తున్న ఈ కోడిపందాలకు... సంక్రాంతికి అనుమతినివ్వాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అలాగని సుప్రీంకోర్టు తీర్పు వచ్చేవరకు పందెంరాయుళ్ళు ఇక్కడ వేచి ఉండే పరిస్థితి లేదు. ఎప్పటి మాదిరిగానే భారీస్థాయిలో సంక్రాంతి మూడురోజులు కోడిపందాలు నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన హోంశాఖామంత్రి, ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప కోడిపందాలు నిర్వహించడానికి స్వయంగా అంగీకరించిన సంగతి తెలిసిందే. రాజప్ప ప్రకటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆగ్రహం వ్యక్తంచేసారు. కానీ ఉభయగోదావరి జిల్లాల్లో ఎమ్మెల్యేలు మాత్రం ఈ కోడిపందాలు జరగాల్సిందేనని పట్టుబడుతున్నారు. కొందరు బహిరంగంగా ప్రకటిస్తుంటే మరికొందరు కోడిపందాల నిర్వహణకు తమవంతు కృషిచేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆంక్షలు పెడితే ప్రభుత్వానికి తీవ్రవ్యతిరేకత వస్తుందని... కోడిపందాల విషయంలో చూసీచూడనట్లు వ్యవహరించాలని ముఖ్యమంత్రికి కూడా ఆ పార్టీ నేతలు నివేదిక ఇచ్చినట్లు సమాచారం.



పందెం కోళ్లు భిన్న రకాలు... కాలం నిర్ణయించే విజయం

పందెంకోళ్ళలో మైలా, కాకి, డేగ, కొక్కిరాయి, సీతువా, పచ్చకాకి, పెట్టమారు, పిచ్చుక, వన్నెగౌడ, తెల్లనెమలి, నల్లనెమలి అనేవి ప్రధానరకాలు. వీటిల్లో పచ్చకాకి, డేగ రకాలకు డిమాండ్ ఎక్కువ ఉంటుంది. చాలా విచిత్రమైన విషయం ఏంటంటే పందెంకోళ్ళ జయాపజయాలు కాలానుగుణంగా మారతాయని పందెంనిపుణుల విశ్వాసం. వారి లెక్కల ప్రకారం పౌర్ణమిముందు శుక్లపక్షం, పౌర్ణమి తరువాత వచ్చే కృష్ణపక్షాల్లో... కోళ్ళ రంగునుబట్టీ ఆయా రోజుల్లో రక్తప్రసరణ జరుగుతుందని భావిస్తారు. ఆ మార్పును బట్టీ వాటి పోరాటపటిమ ఆధారపడి ఉంటుందంటారు. ఆయా రోజుల్లో రాశులనుబట్టీ 27 నక్షత్రాల్లో... పందాలు కాస్తుంటారు. ఒక్కోనక్షత్రంలో ఒక్కో రంగు కోడి విజయం సాధిస్తుందని భావిస్తారు. ఈ వివరాలతో కుక్కుట శాస్త్రం పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. తెలిసినవారు...తాము పందెంలో ఉన్నపుడు ఉన్న నక్షత్రాన్ని బట్టి...ఏ రంగు కోడి గెలుస్తుందో, ఓడుతుందో చూసుకుని దాన్ని బట్టే ఆడతారు.

మూడు రకాల పందాలు

ఆంధ్రప్రదేశ్ గోదావరి జిల్లాల్లో మూడురకాల కోడిపందాలు జరుగుతుంటాయి. వీటిల్లో కత్తులు కట్టి పోరాడించేవీ మొదటిరకంకాగా, రెండవది డింకీ పందెం, మూడవది ఆసిలీ పందెం. ఎంతో ఉత్సాహాన్నిచ్చే క్రికెట్‌లో 20-20, వన్డే టెస్ట్‌మ్యాచ్‌ల మాదిరిగానే ఈ కోడిపందాలు నిర్వహిస్తుంటారు. కాలుకు కత్తికట్టి పోరాడే పందెం నిముషాల్లో ఫలితం తేలిపోతుంది. 20-20 మ్యాచ్ టైపన్నమాట. గంటల్లో ముగిసే డింకీపందెం వన్డేమ్యాచ్‌లాంటిది. ఇక మూడవరకమైన ఆసిలీ పందెం ఒక్కొక్కసారి రెండురోజులవరకు కొనసాగుతుంది. ఇది టెస్ట్‌మ్యాచ్‌లాంటిదన్నమాట. కొన్ని సందర్భాల్లో టెస్ట్‌మ్యాచ్‌మాదిరిగానే ఈ పందాలకు కూడా ఫలితాలు తేలవు. అయితే ప్రస్తుత 20-20మ్యాచ్‌ల కాలంలో కత్తిఫైటింగ్‌లవైపే పందెంరాయుళ్ళు, సందర్శకులు ఆసక్తి చూపుతున్నారు. కోళ్లకు కత్తి కట్టటంలో నేర్పున్నవాళ్లు ప్రత్యేకంగా ఉంటారు. కత్తి కట్టటంపైనే గెలుపు ఆధారపడి ఉంటుంది.

ఉభయగోదావరి జిల్లాల్లో కొన్ని కుటుంబాల వారికి ఇది ఆచారంగా వస్తున్నది. పందెం రాయుళ్లు తమ పుంజులకు ఆ కుటుంబాల వారినుండే కత్తిని కట్టిస్తారు. ఇందుకు వారికి భారీగా పారితోషకం కూడా ఇస్తారు. సంక్రాంతికి నాలుగురోజుల ముందునుండే మొదలయ్యే పందాలకు రాష్ట్రం నలుమూలల నుండి పందాలు కాసేవారు గోదావరి జిల్లాలకు చేరుకుంటారు. భీమవరం, ఆకివీడు, ఐ-భీమవరం పాలకొల్లు రాజానగరం, కాకినాడ, గోకవరం, కోరుకొండ మొదలైన ప్రాంతాల్లో హోటళ్లు, లాడ్జీల్లో ఉండి పందాలకు వెళుతుంటారు. కొంతమంది స్థానికంగా పెంపకం దార్లనుండి పుంజులను ఐదునుండి పదివేల వరకు ధరను చెల్లించి కొంటుంటారు. పుంజుల వంశం తాలూకూ వివరాలను రహస్యంగా ఉంచుతారు. అలాగే పందాలు ముగిసేవరకు పుంజులు బ్రహ్మచర్యంతో ఉండేలా జాగ్రత్త పడతారు.

(ఆంధ్రప్రభ, తూర్పుగోదావరి జిల్లా)

వివేకానందుని దృష్టిలో

'మాతృదేవోభవ'

ఈ నవ భారత పథ నిర్దేశకునికి యువత మీదే ఆపార విశ్వాసం. యువతలోని వజ్ర సంకల్పం, ఉక్కు నరాలు , ఇనుప కండరాలు మాత్రమే భారత భావి భాగ్యోదయానికి బాటలు పరుస్తాయని ఆయన దృఢ విశ్వాసం. యువతలో స్వార్థ త్యాగం, సేవాభావం సులువుగా ఉద్దీపింపజేయగలిగినపుడు వారు కర్మశీలురుగా మారుతారు. అప్పుడే 'నా దేశంలో కుక్క కూడా ఆకలితో చావడాన్ని నేను భరించలేను' అన్న స్వామి కల సాకారమవుతుంది. యువతలో శీలం, సంస్కారం ఎంత ముఖ్యమో, లక్ష్య సాధన మార్గం కూడా అంతే ముఖ్యమని, పవిత్రమని తెలుసుకోవాలి.



భారతీయ సంస్కృతికి, ఆధ్యాత్మికోన్నతికి మూలపురుషులు మన మహర్షులు. మనది ఋషి వారసత్వం. మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ, అతిథి దేవో భవ అని చాటిన మహాధార్మిక వారసత్వం మనది. ఇదే నైతిక ప్రబోధాన్ని 'మను స్మృతి' కూడా 'మాతాగౌరవేణాతిరుచ్యతే ' అని చెబుతోంది. ప్రతి జీవికి ఒక పరమార్థాన్ని సృజించే ఈ లోకంలోకి పంపిస్తున్నాడు పరమాత్మ. ఏ ప్రయోజనాన్ని ఆశించకుండా ఈ విశిష్ట మానవ జాతిని సృష్టించలేదు. ఆ తేజోమూర్తి ప్రతి జీవిలోనూ వెలుగుతూ తన క్రీడలో తానే రమిస్తున్నాడు. తాను సృజించిన ఈ జీవి ఈ లోక కష్మలాన్ని ఛేదించుకుని మళ్ళీ తన ఆలింగనంలోకి రావాలన్నదే ఆయన సంకల్పం. ఆయన సర్వాంతర్యామి. ఏ ప్రాణి తనకై చేతులు చాచినా ఎప్పుడూ సిద్ధంగా ఉండే మిత్రుడు ఈశ్వరుడు. ఆయన సర్వభూత సుహృదుడు.

'విభూతివంతమూ, కాంతివంతమూ, శక్తివంతమైనది ఏది ఉన్నా నా తేజోంశ సంభూతమేనని తెలుసుకో అని శ్రీకృష్ణ భగవానుడు ఆ రూపంలో దర్శనమిచ్చి మహోన్నత ఆధ్యాత్మిక బోధనలను లోకానికి అందించాడు.

వివేకానందుడు మానవ జాతి ప్రేమికుడు, మహాదేశభక్తుడు, మహాయోగి, జ్ఞాన సిద్ధునిగా, యుగాచార్యునిగా మనం ఆయనను దర్శిస్తాం. కులమత విద్వేషాలతో విచలితమై ఉన్న మన మతాన్ని, భారతదేశాన్ని మహోన్నతమైన, పరమ పవిత్రమైన బోధనలతో కాపాడిన మహనీయుడు ఆయన. 'ఆయన జన్మించి ఉండక పోతే మన మతం అంతరించేది. భారతదేశానికి స్వాతంత్ర్యం లభించి ఉండేది కాదు' అని అన్నారు మేధావి చక్రవర్తుల రాజగోపాలాచారి. ఆ మహా దార్శనికుడైన వివేకానందుని బాట తప్ప నేటి యువతకు వేరే మార్గం లేదు. ఆయన ప్రచండ స్ఫూర్తి, భావ సంపదే నేటి యువతకు జీవన వేదంగా మారి, ఆచరణలోకి రావాలి.



భువనేశ్వరీదేవి

ఈ నవ భారత పథ నిర్దేశకునికి యువత మీదే ఆపార విశ్వాసం. యువతలోని వజ్ర సంకల్పం, ఉక్కు నరాలు , ఇనుప కండరాలు మాత్రమే భారత భావి భాగ్యోదయానికి బాటలు పరుస్తాయని ఆయన దృఢ విశ్వాసం. యువతలో స్వార్థ త్యాగం, సేవాభావం సులువుగా ఉద్దీపింపజేయగలిగినపుడు వారు కర్మశీలురుగా మారుతారు. అప్పుడే 'నా దేశంలో కుక్క కూడా ఆకలితో చావడాన్ని నేను భరించలేను' అన్న స్వామి కల సాకారమవుతుంది. యువతలో శీలం, సంస్కారం ఎంత ముఖ్యమో, లక్ష్య సాధన మార్గం కూడా అంతే ముఖ్యమని, పవిత్రమని తెలుసుకోవాలి.

ప్రతి ఒక్కరికి మాతృమూర్తి ప్రథమ గురువు. తల్లిదండ్రులిద్దరూ దైవ సమానులే. యువత వారి పట్ల ప్రేమ, సేవాభావం, సంరక్షణ బాధ్యతల్ని అతి పవిత్రమైనవిగా భావించాలి. మాతా పితరుల సేవ, సంరక్షణను మించిన పుణ్యకార్యం, మోక్షకారకం మరేదీ లేదు. అందుచేతనే భగవాన్ శ్రీసత్యసాయిబాబా తన ప్రతి అనుగ్రహ భాషణంలోనూ, విద్యార్థులకు మాతృ ప్రేమ, మాతా పితరుల సంరక్షణ బాధ్యతల గురించే ప్రముఖంగా ప్రబోధించేవారు. స్వామి వివేకానందుని మాతృ ప్రేమ, భక్తి విశ్వాసాల గురించి నేటి యువత కొద్దిగా తెలుసుకోవడం ఎంతో అవసరం.

వివేకానందుని తల్లి భువనేశ్వరీ దేవి. ఆమెకు నరేంద్రుడి మీద ఎంత ప్రేమో, ఆయన తన తల్లిని అంతకు మించి ప్రేమించేవాడు. 'ఈ ప్రపంచంలో నేను గాఢంగా ప్రేమించే ఒకే ఒక వ్యక్తి నా తల్లి' అంటూ తల్లి పట్ల తన మహోన్నత ప్రేమను వ్యక్తీకరిస్తాడు స్వామి వివేకానంద.


ఆయన రాసిన 775 లేఖలు ప్రచురితమయ్యాయి. కాని వాటిలో ఆయన తన తల్లికి రాసిన లేఖలు ఏవీలేవు. కాని 1898 నవంబర్ 22వ తేదీన ఆయన ఖేత్రి మహారాజు అజిత్ సింగ్‌కు వ్రాసిన లేఖ ఆయన మాతృప్రేమ ఔన్నత్యాన్ని ఎలుగెత్తి చాటుతోంది. ఆ లేఖలో 'నా జీవితంలో మిమ్మల్ని మాత్రమే మిత్రునిగా భావించాను. అందువల్ల నా భావాలను స్పష్టంగా చెబుతున్నాను. లోకోద్ధరణకు పూనుకుని కన్న తల్లిని అలక్ష్యం చేశానన్న బాధ ఎక్కువగా ఉంది. నా చివరి కోర్కె ఒక్కటే. నా మాతృమూర్తి వద్ద ఉంటూ సేవ చేయడం, దాని వల్ల ఆమె శేష జీవితం ప్రశాంతంగా ఉంటుంది. ప్రస్తుతం ఆమె పూరి ఇంటిలో ఉంటున్నారు. ఆమెకు ఒక చిన్న గది నిర్మించాలనుకుంటున్నాను. నా స్వంత పనుల కోసం ఇప్పటివరకూ ఎవరినీ ఏమీ అడగలేదు. నా జీవితంలో మొట్టమొదటి సారిగా ఈ ఉపకారం చేయాల్సిందిగా కోరుతున్నాను. ఐరోపా నుంచి నాకు అందిన డబ్బును అంతటిని శ్రీరామకృష్ణా మిషన్ కార్యక్రమాలకు వినియోగించడం జరిగింది'. ఇందులోని ప్రతి అక్షరం ఆర్ద్ర ప్రపూర్ణం. స్వామికి తల్లి పట్ల ఉన్న అపార ప్రేమకు నిలువుటద్దం. ఇది యువతకు స్ఫూర్తిదాయకంగా నిలవాలి. అలాగే స్వామి 1900వ సంవత్సరం జనవరి 17వ తేదీన తన అమెరికన్ శిష్యురాలు ఓబెల్‌కు రాసిన లేఖాంశాలు కూడా చిరస్మరణీయాలు. 'నా తల్లి నా కోసం ఎన్నో కష్టాలు అనుభవించింది. ఆమె చివరి రోజులు ప్రశాంతంగా ఉండేలాగున ప్రయత్నించాలి. ఆది శంకరులు అదే రీతిన తన తల్లికి సేవలందించారు' అని వ్రాశారు. తల్లి కోరిక మేరకు స్వామి అమెను ఢాకాలోని చంద్రనాథ్ ఆలయానికి, అస్సాంలోని కామాఖ్య క్షేత్రానికి, పూరి జగన్నాథ క్షేత్రానికి తీసుకువెళ్ళారు. మాతృ ప్రేమ ద్వారా లోకోద్ధరణ జరపవచ్చు అనే సందేశాన్ని తన ఆచరణ ద్వారా ఆయన లోకానికి ప్రసాదించారు. భరత మాత అనుంగు పుత్రుడు స్వామి వివేకానందుడు. కనుక యువత తప్పక స్వామివారి అఖండ స్ఫూర్తిదాయకమైన సాహిత్యాన్ని పఠించి, ఆచరించడం ద్వారా భరతమాత సేవకు కృతనిశ్చయంతో ఉద్యుక్తులవుతారని ఆశిద్దాం!! లోకాస్సమస్తాత్ సుఖినో భవంతు!!

- పింగళి పాండురంగారావు
9440554114

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

అపరిహారం



శ్రీ రమణాశ్రమం
12-3-47

కొండమీద ఉండగా శ్రీవారే టెంకాయ చిప్పలతో గరిటెలు,చెంచాలు, గిన్నెలు ఎన్నో తయారుచేసేవారట. ఈ మధ్య కూడా అప్పుడప్పుడు టెంకాయ చిప్పలతోనే గిన్నెలు, చెంచాలు తయారు చేసి, చక్కగా మెరుగు పట్టి దంతపు సామాన్ల వలె చేసి దగ్గరున్న వారితో 'ఇదుగో ఇవి జాగ్రత్తగా దాచండి, మనకెప్పుడైనా కావాలంటే ఉపయోగిస్తవి. వెండి బంగారు మనకెట్టా వస్తుంది. ఇవే వెండి గిన్నెలూ, బంగారు చెంచాలూను. చెయ్యి కాలదు. చిలుమూరదు. సుఖంగా ఉంటుంది' అని అంటే ఉండుటే గాక తామేదైనా ఫలహారం చేసేప్పుడూ, ఆశ్రమంలో మలయాళపు గంజికాచినప్పుడూ అవే ఉపయోగిస్తారు భగవాన్.

బత్తాయి పండ్లూ, కమలాలూ మొదలైనవి వస్తే, వాటి తొక్కలు పారవేయనీయక, పచ్చళ్ళుగానూ, ఊరగాయలు గానూ, పులుసు ముక్కలుగానూ ఇంకా ఎన్నో విధాల ఉపయోగపడేలా చేస్తారు భగవాన్. అదేగాక భోజన సమయంలో విస్తరిలో ఏ మాత్రం పదార్థమున్నా సహించరు. ఉపయోగకరమైన పదార్ధములేవి పరిహరించుట తగదని ఆచరణ రూపంగా బోధిస్తూ ఉంటారు.

రోజా పుష్పాలు ఎవరైనా తెచ్చి ఇస్తే భగవాన్ వాటిని కళకద్దుకుని గడియారం మీద పెట్టి ఉంచి, వాడి రాలిన రేకులన్నీ తింటూ పక్కనున్న వారికిన్నీ ఇస్తారు. ఒకసారి రోజా పూలదండ ఒకటి తెస్తే అమ్మ కోవెలలో అలంకరించి నిర్మాల్యం అన్ని పువ్వులతో బాటు గంపలో పడవేశారు అర్చకులు. భగవాన్ బయటకు వెళ్లి వస్తూ, అది చూచి వారిపై కోపగించుకుని ఆ రేకులన్నీ ఏరి తెచ్చి పాయసంలో వేయంచేసరికి ఘుమఘుమలాడుతూ ఎంతో రుచిగా ఉన్నది. కొండకు వెడుతూ ఉంటారా, వచ్చే పోయే దారిలో ఉపయోగకరమగు ఆకులేమైనా కనిపిస్తే సేవకులతో పాటు, తామున్నూ కోసి తెచ్చి పక్వం చేసే విధానం చెప్పి ఎంతో రుచిగా తయారుచేయిస్తారు భగవాన్. ఖరీదు గల వాటి కంటె కానీ ఖర్చు లేకుండగా అందరికీ లభించే పదార్థాలే వారికి ప్రీతి. ఇవన్నీ సాధారణ విషయాల వలె తోస్తవి గానీ సరిగా ఆలోచిస్తే అన్నీ మనకు పాఠాలే. స్వల్ప ఆదాయంతో జీవితం గడపవచ్చని బోధిస్తున్నారన్న మాట.

- సూరి నాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/



రాధారమణ్ చరణ్ దాస్


కుక్కలు 'చింపని' విస్తరి

జంతువులకు మనుషుల మాదిరి క్రమశిక్షణ ఉండదని చాలా మంది భావిస్తుంటారు. వాటి క్రమ శిక్షణ వాటికుంటుంది. అయితే ఒక జంతువు పుణ్యఫలమో, శ్రీహరి అనుగ్రహమో ఒక శునకం మరణానంతరం చేసిన సంతర్పణకు కుక్కలు హాజరై, వ్యవహరించిన వైనం ఆశ్చర్యం గొలుపుతుంది. ఆ సంఘటన ఇది. రాధారమణ్ చరణ్ దాస్ బాబాజీని అందరూ 'చారా బాబా' అని పిలుస్తారు. చారా బాబా అంటే గొప్ప బాబా అని అర్థం. చైతన్య మహాప్రభు సంప్రదాయానికి చెందిన మహాపురుషుడాయన. ఒకసారి ఆయన తన శిష్యులతో చైతన్య మహాప్రభు మందిరంలో భజన చేసి తన నివాసానికి వెడుతున్నారు. దారిలో ఒక కుక్క ఆ భక్త బృందంతో కలిసింది. వారితో పాటే సాగింది. వారు నడక ఆపి సంకీర్తన చేస్తున్నపుడు వారితో పాటే ఆగేది. ఇతర భక్తుల మాదిరే భక్త్యావేశంలో మార్గంపై పడి పొర్లేది. అది ఆ కుక్కకు కలిగిన ఏనాటి పుణ్య ఫలమో. కొంతసేపటికి అందరూ తమ తమ కుటీరాలకు వెళ్లిపోయారు. కాని ఆ కుక్క ఎక్కడికు వెళ్లకుండా ఆ కుటీరాల ప్రాంతంలో ఉండిపోయింది. అందరూ ఆ కుక్కను 'భక్తి మాత' అని పిలిచేవారు. ఇలా కొంతకాలం గడిచింది. అంతిమ ఘడియలు వచ్చాయి ఆ కుక్కకు. దాని ఎదుట అందరూ నామ సంకీర్తన చేశారు. అది ఆ నామ సంకీర్తన వింటూ ప్రశాంతంగా ఈ లోకాన్ని విడిచింది. దాని కళేబరాన్ని గంగా వాహినిలో వదిలారు. వైష్ణవ సంప్రదాయానికి చెందిన జీవిగా దానికి సద్గతి అందుతుందని అందరూ భావించారు. రాధారమణ్ చరణ్ దాస్ దానికి 14 రోజుల తరువాత అంతిమ సేవగా వైకుంఠ సమారాధన లాంటి ఒక కార్యక్రమాన్ని ఏర్పరిచారు. ఆ ఊరిలోని అన్ని కుక్కలకు సంతర్పణ ఏర్పాటు చేద్దామనుకున్నారు. కొందరు ఆ సంగతిని హాస్యాస్పదంగాను, విచిత్రమైన చర్యగాను ఎవరి భావాలకు తగ్గట్టు వారు భావించారు. ఆయన శిష్యులలో ఒకరైన నవద్వీప బాబాజీ తమ గురువు ఉద్దేశాన్ని అమలు చేయటానికి సంసిద్ధులయ్యారు. గురువు ఆదేశం ప్రకారం ఆ ఊరిలోని ప్రతి కుక్కకు మొక్కి, 'రేపు రాత్రి భక్తి మాత జ్ఞాపకార్థం సంతర్పణ బరాల్ ఘాట్ వద్ద ఏర్పాటు చేయబడుతుంది. దానికి ఇతర కుక్కలతో కూడా రండి' అని ఆహ్వానించాడు. ఇతర వైష్ణవ భక్త బృందాలను రాధారమణ్ స్వయంగా ఆహ్వానించాడు. కొందరు కొట్టి పారేశారు. మరికొందరు తేలికగా తీసుకున్నారు. ఇంకొందరు రసాభాస అవుతుందన్నారు.

విందు సమయం రానే వచ్చింది. కుక్కలకు విందు ఎలా జరుగుతుందోనని ప్రజలు తండోపతండాలుగా చూడటానికి వచ్చారు. విందు సమయానికి ఒక దాని వెంట ఒకటిగా కుక్కలు అన్నీ వచ్చి పంక్తిగా నిలబడ్డాయి. శిక్షణ పొందిన వ్యక్తుల వలె ఒక దాని వెనుక ఒకటి నిలబడటం చూసి అందరూ ఆశ్చర్యపోయారు. వాటిలో దైవాన్ని చూసిన బాబాజీ వాటికి సాష్టాంగ నమస్కారం చేశారు.

విందుకు అరటి ఆకులు పరిచారు. ఆహార పదార్థాలన్నిటినీ ఒక ముద్దగా శునకాలు తినేందుకు వీలుగా వడ్డించారు. వాటికి ఎదురుగా ఉన్న ఆకులలో ఆహారం వడ్డించగానే అవి ఆదరాబాదరా తింటాయనుకున్న వారికి ఆశాభంగమే ఎదురయింది. అన్ని శునకాలకు వడ్డించిన తర్వాత ఆహార పదార్థాలను స్వీకరించమని రాధారమణ్ వాటిని కోరారు. అప్పుడు ఒక నల్లకుక్క వచ్చి వడ్డించిన పదార్థాలను వాసన చూసుకుంటూ వేగంగా వెళ్లిపోయింది. అందరూ హరిహరి అని ఆనందంగా నినాదాలు చేశారు. అప్పుడు అవి తమ ముందున్న ఆకుల్లోని ఆహార పదార్థాలను తినడం, చూసే వారందరినీ ఆశ్చర్యచకితలను చేసింది. అవి ఘన పదార్థాలు తిన్న తర్వాత ముంతలలో నీరు నింపి వాటి ముందుంచారు. అవి నీటిని తాగాయి. ఆకులలో మిగిలిన పదార్థాలను మహాప్రసాదంగా స్వీకరించారు అక్కడికి వచ్చిన వారు. రాధారమణ్ తాను చేసిన సంతర్పణలో తప్పు ఉంటే మన్నింపుమని ఆ శునకాలలోని శ్రీహరిని ప్రార్థించాడు. శునకాలు వచ్చిన విధంగానే ఒకటి తరువాత ఒకటి నిష్క్రమించాయి. గందరగోళం, రసాభాస అవుతుందనుకున్న వారికి కనువిప్పు కలిగింది. ప్రతి జీవిలో ఉండే హరిని గుర్తించాలి. అప్పుడే అంతా సవ్యంగా, ఆనందంగా సాగుతుంది. జంతుకోటి జీవంలో జగన్నాథుని కాంచటమే పరమావధి.

- ముళ్ళపూడి పాండురంగ సాయినాథ్
మున్నలూరి బోస్



భగవద్గీత

శక్తిమంతుల్లో శక్తిని

అధ్యాయం 7
శ్లోకం 10:

బీజం మాం సర్వభూతానాం
విద్ధి పార్థ సనాతనమ్।
బుద్ధిర్బుద్ధిమతామస్మి
తేజస్తేజస్వినామహమ్॥

తాత్పర్యం

ఓ పృథకుమారా ! నేనే సర్వప్రాణులకు సనాతన బీజమనియు, బుద్ధిమంతుల బుద్ధిననియు, శక్తిమంతుల శక్తివనియు తెలిసికొనుము.

భాష్యం

చరాచర జీవరాశులకు బీజం శ్రీకృష్ణుడే. 84 లక్షల జీవరాసులలో కొన్ని స్థావరమైతే, మరికొన్ని కదిలేవి. వాటన్నింటికీ జీవమునిచ్చేది శ్రీకృష్ణుడు. వేదాలలో చెప్పినట్లు బ్రహ్మము లేదా పరమ సత్యము సర్వానికి మూలము. అయితే శ్రీకృష్ణుడు పరబ్రహ్మము. బ్రహ్మము నిరాకారమైతే, పరబ్రహ్మము సాకారము. భగవద్గీత ప్రకారము బ్రహ్మమునకు శ్రీకృష్ణుడే ఆధారభూతుడు. కావున శ్రీకృష్ణుడే సర్వమునకు మూలము. అన్నింటికీ బీజము, భౌతిక సృష్టికి ఆధారము. అలాగే బుద్ధికి కూడా ఆయనే మూలము. కాబట్టి బుద్ధి లోపించిన వ్యక్తి ఆ శ్రీకృష్ణున్ని అర్థము చేసుకొనలేడు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

శాల్మలి ద్వీపం - అధిదేవత



శాల్మలి ద్వీపం ప్లక్షద్వీపానికి రెండింతల వైశాల్యం కలిగి ఈ ద్వీపముతో సమానమైన సురా సముద్రముతో చుట్టబడి వుంటుంది. ఇచ్చట శాల్మలి వృక్షము (బూరుగు చెట్టు) ప్లక్ష వృక్షము వలె అంతటి వైశాల్యం కలిగి ఉంటుంది. ఈ ద్వీప అధిపతి ప్రియవ్రతుని కుమారుడు యజ్ఞ బాహువు. అతను తన ఏడుగురు కుమారులకు వారి పేర్లతోనే ఏడు వర్షములగా దీనిని విభజించి పంచాడు.

సులోచన, సౌమనస్య, రమణక, దేవవర్ష, పారిభద్ర, అప్యాయన, అవిఘ్నాతము అనే ఏడు వర్షములకు స్వరస, శతశృంగ, వామదేవా, కుంద, ముకుంద, పుష్పవర్ష, సహస్రశృతి అనేవి ఏడు సీమ పర్వతములు. అనుమతీ, శినీవాలీ, సరస్వతీ, కుహూ, రజనీ, నందా, రాకా అనునవి ఏడు సీమ నదులు. ఈ సప్త వర్షాలకు శ్రుత ధర, వీర్య ధర, వసుంధర, ఇషంధరులను నలుగురు పురుషులు భగవంతుడు, వేదమయుడు అయిన చంద్రుని వేదమంత్రములతో ఆరాధిస్తారు.

ధర్మం-మర్మం

స్వగోభిః పితృదేవేభ్యః విభజన్ కృష్ణ శుక్ల యోః
ప్రజానాం సర్వాసాం రాజా అంధః సోమో న ఆస్త్వితి॥



- డా॥ కందాడై రామానుజాచార్య

దినఫలాలు

మేష రాశి: విద్యా ప్రయత్నాలు అనుకూలం. కుటుంబ సఖ్యత పెరుగుతుంది. శారీరక శ్రమ అధికం. ఆరోగ్యంలో చిరు జాగ్రత్తలు అవసరం. రుణ ఒత్తిడులు తగ్గుతాయి. ఆదాయంలో మెరుగైన వాతావరణం ఉంటుంది.

వృషభ రాశి: వాహన నిర్ణయాలు ఉపకరిస్తాయి. ఆరోగ్య ప్రతికూలత ఉంటుంది. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. రాజకీయ ఒత్తిడులు పెరుగుతాయి. ఆదాయం పర్వాలేదు.

మిథున రాశి: దూర ప్రయాణాలు అనుకూలం. ఆర్థిక ప్రయత్నాలు పర్వాలేదు. మానసిక రుగ్మతలు పెరుగుతాయి. ఆరోగ్యం పర్వాలేదు. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. అధిక ప్రయత్నాలలో అనుకూల పరిస్థితులు ఆర్థికంగా ఉంటాయి.

కర్కాటకరాశి: ఆర్థిక లావాదేవీలు, ప్రక్రియలు ఉపకరిస్తాయి. పనులలో ఒత్తిళ్లు పెరుగుతాయి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. ఆదాయంలో అసహన పరిస్థితులు పెరుగుతాయి.

సింహ రాశి: స్థిరాస్తి నిర్ణయాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ ఉంటుంది. రుణ ఒత్తిడులు తగ్గుతాయి. మానసిక ధైర్యం పెరుగుతుంది ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార విజయాలు దగ్గరవుతాయి. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

వృశ్చిక రాశి: ఉద్యోగ ప్రయత్నాల్లో విజయాలు సాధిస్తారు. అసంతృప్తి సంఘటనలు అన్ని రంగాల వారికి కొనసాగుతాయి. ఆరోగ్యం పర్వాలేదు. అసహన పరిస్థితులను పరిష్కరించుకోలేకపోతారు. ఆదాయం పర్వాలేదు.

ధనూరాశి: గృహ కార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఉద్యోగ ప్రయత్నాలు లాభిస్తాయి. ఆకస్మిక ఖర్చులు లేకపోలేదు. ఆరోగ్యంలో మంచి మార్పులు చేకూరుతాయి. గతంలోని పొరపాట్లు వెలుగు చూస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: రుణ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఆకస్మిక ఖర్చులు పెరుగుతాయి. ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి. వ్యాపారంలో అవమానకర సంఘటనలు ఎదురవుతాయి. ఆదాయ మార్గాలు ఇబ్బందులు పెడతాయి.

కుంభ రాశి: ఉద్యోగపరంగా ఒత్తిడులు పెరుగుతాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు అవసరం. రుగ్మతలు తగ్గుతాయి. చేపట్టే కార్యక్రమాలలో అలసత్వం పెరుగుతుంది. ఆదాయం పర్వాలేదు.


మీనరాశి: విద్యా ప్రయత్నాలు కలసి వస్తాయి. నూతన కార్యాలలో ప్రోత్సాహకాలు ఉంటాయి. ఉద్యోగ వ్యవహారాల్లో విజయాలు ఉంటాయి. ఆరోగ్యంలో మెరుగైన మార్పులుంటాయి. ముఖ్య కార్యక్రమాలు సగంలోనే ఆగిపోతాయి. జాగ్రత్త తప్పనిసరి. ఆశించిన ఆదాయం పొందలేకపోతారు.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

రిస్క్ లేని ఇన్వెస్ట్‌మెంట్స్

Business సరిగమలు



సురక్షితమైన పెట్టుబడులు ఏవి? ఎలాంటి రిస్క్ లేని పెట్టుబడులు చాలా తక్కువ అనే చెప్పాలి. రిటైర్డ్ అయిన తర్వాత కూడా ఈ పెట్టుబడులకు ఫలితం పొందగలగాలి. చక్కని భవిష్యత్తు కోసం తగినంత పెట్టుబడులు చేయడం ఎవరికైనా తప్పనిసరి. అయితే ఇన్వెస్ట్‌మెంట్ చేయడంలో చాలానే జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. తాము చేసిన పెట్టుబడులు భద్రంగా ఉండాలని, అలాగే తగినంత స్థాయిలో రాబడులు అందించాలని తమకు ఓ నిధి ఏర్పడేందుకు సహకరించాలని అందరూ భావిస్తారు. అయితే ఇందుకు ముందుగా అసలు ఎన్ని రకాల పెట్టుబడుల సాధనాలు ఉన్నాయనే అంశంపై అవగాహన అవసరం.

మన దేశంలో ఇన్వెస్టర్లకు నియర్ టర్మ్, షార్ట్ టర్మ్, లాంగ్ టర్మ్ కోసం అందుబాటులో ఉన్న పలు రకాల పెట్టుబడి అవకాశాలను తెలుసుకుందాం. ఏవి పెట్టుబడి సాధనాన్ని ఎందుకు ఉపయోగించవచ్చో అవగాహన పెంచుకుందాం.

ఈక్విటీ షేర్లు

దీర్ఘకాలంలో అత్యధిక రాబడులను అందించేందుకు అవకాశం ఉంటుంది. కనీసం ఐదేళ్ల పాటు ఆ నిధులు అవసరం లేదని భావిస్తే పెట్టుబడి చేయండి.
ఈక్విటీల్లో పెట్టుబడికి రెండురకాల ఆప్షన్స్ ఉన్నాయి.
సెకండరీ మార్కెట్ ద్వారా (స్టాక్ ఎక్స్‌చేంజిలలో లిస్ట్ అయిన కంపెనీల షేర్లు కొనడం)ప్రైమరీ మార్కెట్ ద్వారా (ఐపీఓలకు దరఖాస్తు చేయడం)
సుదీర్ఘకాలంలో మదుపరులు పెట్టుబడులపై అత్యధిక రాబడులను ఈక్విటీ షేర్లు మాత్రమే అందించగలిగాయి. అయితే, ఈక్విటీలలో పెట్టుబడి అంటే అధిక రిస్క్ అనే విషయం గుర్తుంచుకోవాలి.

జీవిత బీమా పాలసీలు

పెట్టుబడుల కోసం మాత్రమే అయితే జీవితబీమా పాలసీలను కొనకండి.
ఎంచుకున్న పాలసీ ప్రకారం లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియంలో ఈ ఖర్చులు ఉంటాయి.
- ♦ మరణానంతరం ప్రయోజనం కవరేజ్
- ♦ బిల్డ్ ఇన్ ఇన్వెస్ట్‌మెంట్ రిటర్న్స్
- ♦ కమిషన్స్ వంటి ఇతర ఖర్చులు

పెట్టుబడుల కోసమే బీమా పాలసీలు చేస్తున్నట్లయితే మీరు ఈ ఖర్చులను కూడా భరించాల్సి ఉంటుంది. అందుకే ఇతర ఐచ్ఛికాలను పరిశీలించాలి. అయితే జీవిత బీమా కూడా ముఖ్యమే అనే విషయం తెలుసుకోవాలి.

బాండ్లు, డిబెంచర్లు

కేపిటల్ గెయిన్స్ ట్యాక్స్ రిబేట్ పొందేందుకు పెద్ద పెట్టుబడుల కోసం అవకాశం ఇది. ఫిక్స్‌డ్ డిపాజిట్లతో పాటు కంపెనీలు జారీ చేసే ఇతర ఫిక్స్‌డ్ ఇన్‌కం సాధనాలే బాండ్లు, డిబెంచర్లు. సెకండరీ మార్కెట్‌లో లిక్విడిటీ లేకపోవడం, ప్రైమరీ మార్కెట్ కదలికలు అంచనా వేసేందుకు కష్టం కావడంతో, వీటిలో పెట్టుబడులు ఆర్థిక కంపెనీల నుంచి సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ఎక్కువ యీల్డ్ పొందేందుకు సెకండరీ మార్కెట్‌లో అవకాశం ఉన్నా, సమస్యలు ఎదురుకాకుండా ఉండాలంటే భారీ మొత్తాలను ప్రైమరీ మార్కెట్‌లలో పెట్టుబడి చేయడమే ఉత్తమం.

కంపెనీ ఫిక్స్‌డ్ డిపాజిట్లు

ఫిక్స్‌డ్ ఇన్‌కం పోర్ట్‌ఫోలియోలో ఎక్కువ రాబడులను అందించే ఆప్షన్ ఇది. చిన్న మదుపర్ల దగ్గర నుంచి కంపెనీలు నిధులను సేకరించే సాధనాలే ఈ ఫిక్స్‌డ్ డిపాజిట్లు. సహజంగా ఏడాదంతా వీటిని ఇన్వెస్ట్ చేయవచ్చు. 12 నెలలకు మించి వ్యవధి ఉంటే మాత్రమే వీటిలో ఇన్వెస్ట్ చేయాలి. చాలావరకు కంపెనీలు మెచ్యూరిటీకి ముందు నగదుగా సౌలభ్యం ఇవ్వవు. అందుకే చాలా జాగ్రత్తగా ఎంచుకోవాల్సి ఉంటుంది.



పిపిఎఫ్

పన్ను చెల్లింపుదారులకు ఉత్తమమైన ఫిక్స్‌డ్ ఇన్‌కం పెట్టుబడి సాధనం. చిన్న ఇన్వెస్టర్లకు పీపీఎఫ్ అత్యుత్తమమైన పెట్టుబడి సాధనం.. ఎందుకంటే
- ♦ పన్నుకు ముందు ప్రభావ వడ్డీ రేటు లెక్కిస్తే ఎంతో ప్రయోజనం
- ♦ పెట్టుబడిలో 20శాతం వరకూ పన్ను రాయితీ పొందే సౌలభ్యం
- ♦ ప్రభుత్వ పథకంకావడంతో అతి తక్కువ రిస్క్

అయితే లిక్విడిటీ అంతగా లేకపోవడం ఇందులో ప్రతికూలం. ఉపసంహరణకు అవకాశాలు అతితక్కువగా ఉంటాయి.

బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్స్

తక్కువ రిస్క్‌ను మాత్రమే భరించగలిగేవారు 6-12 నెలల వ్యవధితో వీటిలో పెట్టుబడి చేయవచ్చు. టర్మ్ డిపాజిట్స్‌గా కూడా వీటిని పిలుస్తారు. షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులలో ఇవి లభిస్తాయి. ఎఫ్‌డీలలోకనీస పెట్టుబడి వ్యవధి 14 రోజులుగా ఉంటుంది.
ఎఫ్‌డీలలో పెట్టుబడులకు 6 -12 నెలలు తగిన సమయం. సహజంగా ఆరునెలలకంటే తక్కువకాలానికి మనీ మార్కెట్ ఫండ్ రిటర్న్స్ కంటే వడ్డీ తక్కువగా ఉంటుంది. వీటిలో పెట్టుబడులు చేసేటప్పుడు కాలవ్యవధిని నిర్ణయించుకోవాలి. ముందస్తుగా విత్‌డ్రా చేసుకుంటే కొన్నిసార్లు జరిమానాకు అవకాశం ఉంటుంది.

మ్యూచువల్ ఫండ్స్

మీరు ఎప్పుడైనా ఇతరులతో కలిసి పెట్టుబడులు చేశారా? సహజంగా మ్యూచువల్ ఫండ్స్ దగ్గర దగ్గరగా ఇలాంటి విధానమే అవలంబిస్తాయి. అనేకమంది ఇన్వెస్టర్లు కలిసి తమ పెట్టుబడులను స్టాక్స్, బాండ్స్, ఇతర పెట్టుబడి సాధనాలను కొంటూ ఉంటారు.
మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్ చేయడం ద్వారా మదుపర్లు
- ♦ ప్రొఫెషనల్ మనీ మేనేజర్ సేవలను పొందొచ్చు.
- ♦ తక్కువ పెట్టుబడినే చేసినా డైవర్సిఫైడ్ పోర్ట్ పోలియోలో పెట్టుబడి చేయొచ్చు.




లిక్విడ్ ఫండ్స్ (మనీ మార్కెట్ ఫండ్స్)

లిక్విడిటీపై రాజీపడకుండానే సేవింగ్స్ అకౌంట్ కంటే ఎక్కువ రాబడులను అందించేవే మనీమార్కెట్ ఫండ్స్. ప్రత్యేకంగా షార్ట్‌టెర్మ్ ఫిక్స్‌డ్ ఇన్‌కం సాధనాల్లో మాత్రమే పెట్టుబడులు చేసేందుకు నిర్ణయించిన ప్రత్యేకమైన మ్యూచువల్ ఫండ్స్ ఇవి. ఇతర అనేక మ్యూచువల్ ఫండ్స్ మాదిరిగా కాకుండా, ప్రధానంగా మీ పెట్టుబడిని కాపాడడంపైనే దృష్టినిలిపి, ఆ తర్వాతే రాబడులకోసం ప్రయత్నించడం వీటి ప్రత్యేకత.

పోస్ట్ ఆఫీస్ సేవింగ్స్ స్కీమ్

ఇందులో రిస్క్ తక్కువ. అలాగే మూలం వద్ద పన్ను (టీడీఎస్) కూడా ఉండదు. బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే ఎక్కువ వడ్డీని అందించడంతో.. సహజంగా వీటిలో పెట్టుబడులపై జనాలు ఆసక్తి చూపుతారు. మీరు



రిటైర్ అయిన వ్యక్తి అయితే, మీ వ్యక్తిగత, క్రమం తప్పని ఆదాయం కోసం మంత్లీ ఇన్‌కం ప్లాన్ ఎంచుకోవచ్చు.
మరో వైపు రిస్క్ కూడా తక్కువ కావడంతో పాటు పోస్ట్ ఆఫీస్ సేవింగ్స్ స్కీమ్‌పై టీడీఎస్ కూడ ఉండకపోవడం ఆకర్షణీయం. పోస్ట్ ఆఫీస్‌లు నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్స్, నేషనల్ సేవింగ్ స్కీమ్, కిసాన్ వికాస్ పత్రాలు, మంత్లీ ఇన్‌కం స్కీమ్, రికరింగ్ డిపాజిట్ వంటి పలు పథకాలను నిర్వహిస్తాయి.

సేవింగ్ బ్యాంక్ అకౌంట్

అదనంగా ఉన్న నిధులను అతి తక్కువ సమయం కోసం.. అంటే 30 రోజుల కంటే తక్కువగా ఉన్నప్పుడు, సేవింగ్స్ బ్యాంక్ ఖాతాలను ఆశ్రయించవచ్చు. సహజంగా ఎవరికైనా ఇది మొట్టమొదటి పెట్టుబడి సాధనంగా కూడా ఉంటుంది. అయితే, దీనిపై అతి తక్కువగా అంటే వార్షికంగా 3.5 నుంచి 4శాతం మాత్రమే వడ్డీ లభిస్తుంది. ఇది సేఫ్ డిపాజిట్ లాకర్స్ కంటే కొంత నయం అంతే.

బంగారం సింగారమే కాదు...

పెట్టుబడులకు మంచి మార్గం

బంగారం కేవలం ఆభరణాలకు మాత్రమే కాదు. పెట్టుబడులు పెట్టానికి ఇదొక మంచి మార్గం అని రుజువవుతుంది. ఇతర మ్యూచువల్ ఫండ్స్ మాదిరిగానే బంగారంపై పెట్టుబడులు పెట్టే వారి సంఖ్య పెరుగుతుంది.

ధరల పెరుగుదలలో ఎప్పటికప్పుడు రికార్డులు నమోదు చేసుకుంటున్న బంగారం తనకేదీ సాటిలేదని నిరూపిస్తోంది. గడిచిన వందేళ్లను పరిగణలోకి తీసుకుంటే బంగారం ధరలు 2వేల రెట్లు పెరిగాయి. ఆస్తుల విలువ పెరుగుదలకు సంబంధించి బంగారానికి మరేదీ పోటీకాదని స్పష్టమవుతోంది. ఇలాంటి బంగారం మీద పెట్టుబడులు పెట్టవచ్చా.. పెట్టుబడులు పెట్టడంలో లాభాలు ఉన్నాయా? నష్టాలు ఉన్నాయా? ఈ వివరాలు ఇప్పుడు చూద్దాం.
పండగల కాలం వచ్చేసింది. ఈ సీజన్స్‌లో చాలా కంపెనీలు ఆఫర్లు ప్రకటిస్తూ ఉంటాయి. దీంతో వాహనాలు, గృహోపకరణాలు లాంటివి కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతుంటారు. ముఖ్యంగా బంగారం కొనడానికి ఆసక్తి చూపిస్తుంటారు. బంగారానికి శుభకార్యాలకు విడదీయరాని బంధం ఉందని చెప్పవచ్చు. పండగలకు, శుభకార్యాలలో బంగారం కొనుగోలు చేసేందుకు ప్రజలు మరింత ఆసక్తి కనబరుస్తారు. బంగారు ఆభరణాలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. అయితే బంగారం ధర ఎప్పుడు ఎలా ఉంటుందో మనం చెప్పలేదు. ఒక సంవత్సరం పెరిగితే మరో సంవత్సరం తగ్గిపోతుంది. పండగల వేళల్లో బంగారంపై పెట్టుబడులు పెట్టాలనుకునేవారు... బంగారు ఆభరణాలను లేదా గోల్డ్ కాయిన్స్‌ని కొనుగోలు చేస్తారు. అయితే ఈటీఎఫ్ (ఎక్స్‌చేంజి ట్రేడెడ్ ఫండ్స్) లో పెట్టుబడులు పెట్టడం చక్కటి మార్గం. బంగారంపై పెట్టుబడులు పెట్టాలనుకుంటే బంగారమే కొనాల్సిన అవసరం లేదు. ఈ ఈటీఎఫ్‌లో పెట్టుబడి పెడితే సరిపోతుంది. డిమ్యాట్ ఎకౌంట్ ద్వారా ఇందులో పెట్టుబడి పెట్టొచ్చు. తిరిగి తీసుకోవాలనుకుంటే.. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న బంగారం ధరను పట్టి మీరు పెట్టిన పెట్టుబడులు పొందవచ్చు. ఇందులో పెట్టుబడులు పెట్టడం వలన దొంగల భయం ఉండదు. ఈ విధానంలో బంగారాన్ని డిజిటల్ ఫామ్‌లో చేసుకోవచ్చు. ఈ కొత్తరకం బంగారం పెట్టుబడుల విధానంతో... పండగను మరింత సంతోషంగా జరుపుకోండి.

మార్కెట్ ఒడిదొడుకులు

మార్కెట్ ఒడిదొడుకులను తట్టుకునే శక్తి బంగారానికి మాత్రమే ఉంది. మార్కెట్‌లో రూపాయి విలువ పడిపోయినా. ఆ ప్రభావం బంగారంపై పెద్దగా చూపించదు. అందుకే బంగారంపై పెట్టుబడులు పెట్టేందుకు అందరూ ఆసక్తి చూపిస్తుంటారు. అయితే.. గత ఐదేళ్లలో బంగారం ధరను ఒకసారి పరిశీలిస్తే పసిడి ధరలో మార్పులు చూడవచ్చు. కాబట్టి ఇందులో పెట్టుబడులు పెట్టడం అంత మంచిదేమి కాదని చెబుతున్నారు ఆర్థిక నిపుణులు. కానీ ఆర్థిక పరిస్థితి సరిగా లేని సమయంలో ఈ బంగారమే మీకు రక్షణగా నిలుస్తుంది.



ఇప్పుడు మీరు బంగారు ఆభరణాలు కొనుగోలు చేస్తున్నారనుకుందాం. అలా కొనుగోలు చేసేటప్పుడు ఆ ఆభరణం తయారు చేయడానికి అయ్యే ఖర్చును కూడా దుకాణదారుడు మన మీదే వేస్తాడు. కానీ.. అదే ఆభరణాన్ని మనం అమ్మాలనుకుంటే మాత్రం.. మేకింగ్ చార్జీల ఖర్చు మనకు రాదు. అలా అని మేకింగ్ చార్జి వివరాలను తీసుకోకుండా ఉండొద్దు. ఎందుకంటే దానిని మనం అమ్మాల్సివచ్చినప్పుడు మనం వారిని పూర్తిగా నమ్మించినప్పుడే ఆ వస్తువుకి ఎక్కువ ధర పలుకుతుంది. కాబట్టి ఆ వివరాలు చాలా అవసరమౌతాయి.
మార్కెట్ ఒడిదొడుకులను తట్టుకోవడానికి బంగారం కొనుగోలు చేయాలనుకుంటే బంగారం కొనడమే మంచి నిర్ణయం.

డిజి లాకర్ సురక్షితం

చాలామంది భారతీయులు స్వంత వాహనం ఉన్నట్లయితే రోడ్డు మీద రాగానే కొన్ని ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ట్రాఫిక్ పోలీసులు వారిని పత్రాల గూర్చి ఆరాతీస్తారు. వాహనంలో పత్రాలు లేనట్లయితే అంతే సంగతులు. ట్రాఫిక్ పోలీసులను బతిమాలుకోవాలి. ఒరిజినల్ పత్రాలైన డ్రైవింగ్ లైసెన్స్, వాహన యాజమాన్య పత్రాలు ఒక్కోసారి మర్చిపోతుంటాం. ఇలా మర్చిపోయి రోడ్డు మీదికి రావడం నేరంగా మారిపోతుంది. ఇలా రోడ్డు మీద ట్రాఫిక్ పోలీసులతో చర్చలు లేకుండా డిజిటల్ లాకర్ అందుబాటులో వచ్చింది. ఇలాంటి పత్రాలను భద్రపర్చుకోవడానికి డిజి లాకర్ ఎంతో దోహదపడుతుంది.

పూర్వకాలంలో విలువైన ఆభరణాలు, డబ్బును దాచుకునేందుకు అల్మారాలో ఒక ప్రత్యేక లాకర్ ఉండేది. ఇప్పట్లో అందరి దగ్గరా వివిధ పత్రాల్లోనే డబ్బు సంబంధిత పెట్టుబడులు ఉంటున్నాయి. భౌతికంగా ఏ వస్తువులూ లేకపోయినా ఎంతో పెట్టుబడిని వివిధ మార్గాల్లో ఆన్‌లైన్లో పెడుతున్నారు. ఈ క్రమంలో ముఖ్యమైన పత్రాలు, ఇన్సూరెన్స్ సర్టిఫికేట్లు, బాండ్లు వంటివి ఉన్నాయి. ఇలాంటి డాక్యుమెంట్లు పోతే మళ్లీ వాటిని ఆయా సంస్థల నుంచి తీసుకోవడం కాస్త ప్రయాసే. ఇలాంటి ఇబ్బందులను దూరం చేసేందుకు కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిందే డిజిటల్ లాకర్. ఇది భారత ప్రభుత్వం తన ప్రజలకు అందించే ప్రత్యేక ఆన్‌లైన్ ఆధారిత సేవ. దీనికి ఆధార్ కావాలి. మరి దీని వాడకం ఉపయోగాలేంటో తెలుసుకుందాం..

డిజిటల్ లాకర్ ఫీచర్స్

ప్రతి వ్యక్తి డిజిటల్ లాకర్, ఆధార్ సంఖ్యతో అనుసంధానించేలా ఈ ఏర్పాటు ఉంటుంది. డిజిటల్ లాకర్ వెబ్‌సైట్లో ఈ పత్రాలను జారి చేసిన సంస్థలు, పౌరుల ఇతర రుజువులను ఈ పద్ధతిని అంగీకరిస్తాయని పలు సస్థల, వెబ్‌సైట్ల జాబితాలు ఉంటాయి. సంతకం చేసేందుకు కూడా ఈ సైన్ పద్ధతి ఉంటుంది. ప్రభుత్వం వద్ద నమోదు చేసుకున్న ఏజెన్సీ లేదా సంస్థలకు ఈ డాక్యుమెంట్లను ఆన్‌లైన్లో అందుబాటులో ఉంచుతారు. మొత్తం పత్రాలు దాచుకునేందుకు ఒక్కో వ్యక్తికి 10ఎంబీ స్పేస్ ఉంటుంది.
ప్రస్తుతం యువతరం బీమా పాలసీలు, ఎప్టీలు, బంగారు బాండ్లు వంటి వాటినన్నింటినీ ఆన్‌లైన్లోనే కొనుగోలు చేసేందుకు ఆసక్తిచూపుతున్నారు. ఇంకా పాస్‌పోర్టు, పాన్ కార్డు, ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు పత్రం వంటి వాటికోసం ఆన్‌లైన్లో దరఖాస్తు చేసే వీలుంది. విద్యార్థులు తమ కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో ప్రవేశసమయంలో ఎన్నో ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అయితే అవన్నీ భద్రపరచుకునే విషయం వచ్చేసరికి ఎంతో ఆందోళన ఉంటుంది. ఎందుకంటే ధృవపత్రాలను ఒక చోట నుంచి మరో చోటకు తీసుకుపోయేటప్పుడు వేటినైనా మర్చిపోయే, లేదా పోగొట్టుకునే ఆస్కారం లేకపోలేదు. అయితే ఈ సమస్యలన్నింటికీ పరిష్కారమే డిజిలాకర్. దీంతో పత్రాలన్నింటినీ ఆన్‌లైన్లో భద్రపర్చుకోవచ్చు.



ఆధార్ తప్పనిసరి

డిజిలాకర్ నమోదు కోసం ఆధార్ సంఖ్య తప్పనిసరి. ఎంటర్ ఆధార్ నంబర్ అన్ని ఉన్న చోట 16 అంకెల ఆధార్ నెంబర్ నమోదు చేయండి. తర్వాత ఓటీపీ ఆధారంగా లేదా వేలిముద్ర ఆధారంగా అనే రెండు ఆప్షన్‌లు ఉంటాయి. ఓటీపీని ఎంచుకున్నట్లయితే వారు నమోదిత మొబైల్, మెయిల్ ఐడీలకు ఓటీపీని పంపుతారు. ఓటీపీని గడిలో పూరించి వ్యాలిడేట్ ఓటీపీని నొక్కాలి. ఓటీపీ సరిపోలితే సైన్‌అప్ యూజర్ నేమ్, పాస్‌వర్డలను సృష్టించుకోవచ్చు.
ఫింగర్ ప్రింట్‌ను ఎంచుకుంటే వినియోగదారుడు ఫింగర్ ప్రింట్ యంత్రంపై వేలిముద్రను ఉంచాలి. ఫింగర్ ప్రింట్ సరిపోలితే సైన్ అప్ పేజిలో యూజర్ నేమ్, పాస్ వర్డ్‌ను సృష్టించుకోవచ్చు.
డిజిటల్ లాకర్లో ధ్రువపత్రం పేరు, అప్‌లోడ్ చేసిన తేదీ, డాక్యుమెంట్ స్టేటస్, ఈ సైన్ అయిందా లేదా అనే వివరాలు, చర్య (డిజిటల్ లాకర్ నుంచి ధృవపత్రాన్ని తీసివేయడం లేదా పూర్తిగా తొలగించడం), వివరాలు, అప్‌లోడెడ్ డాక్యుమెంట్లను ఈ మెయిల్ ద్వారా షేర్ చేయడం, డిజిసైన్ ఆప్షన్ ఉంటుంది. అంటే ఈ సైన్ పూర్తయిన ధ్రువపత్రాలను టిక్ గుర్తుతో సూచిస్తారు.



నటాషా దోషి

ప్రతిభ చూపించాల్సిన సమయం ఇదే

ముంబై భామ నటాషా దోషి టాలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది. బాలకృష్ణసరసన ఆమె నటించిన తాజా చిత్రం జైసింహా ఇవాళ విడుదలకు సిద్ధమవుతోంది. మలయాళ చిత్రం మాత్రికన్‌తో నాయికగా తెరంగేట్రం చేసింది నటాషా. సంప్రదాయ నృత్యకారిణి అయిన ఈ భామ...వైద్య వృత్తిని అభ్యసిస్తోంది. త్వరలో డెంటిస్ట్‌కోర్సు పూర్తి చేయబోతోంది. జైసింహా తనకు తెలుగులో సరైన అరంగేట్ర చిత్రమని చెబుతోన్న నటాషా...మంచి చిత్రాలు చేయాలన్నదే తన ఆలోచన అంటోంది. జైసింహా గురించి నటాషా చెప్పిన మరిన్ని విశేషాలు ఆమె మాటల్లో వింటే....నేను ముంబైలో పుట్టి పెరిగాను. పదేళ్ల వయసులోనే చిత్ర పరిశ్రమలోకి రావాలని నిర్ణయించుకున్నాను. సంప్రదాయ, పాశ్చాత్య నృత్యాలను నేర్చుకున్నాను. నటించడం అనేది నా కోరిక. మలయాళంలో నా మొదటి చిత్రం మాత్రికన్. తర్వాత హైడ్ అండ్ సీక్ చేశాను. ఈ సినిమా తమిళంలోనూ రీమేక్ అయ్యింది. అందులో నటించే అవకాశం నాకే దక్కింది. ఈ చిత్రం కోసం సుమారు వంద మంది తారలను ఆడిషన్ చేశారు. నా పాత్ర కథలో కీలకమైంది కాబట్టి...చాలా ఆలోచించి నన్ను తీసుకున్నారు. కథలో నాది సంప్రదాయ కుటుంబంలోని పాత్ర. చాలా పద్ధతిగా పెరిగిన అమ్మాయిని అయితే చదువుల కోసం విదేశాలకు వెళ్తాను. అక్కడి పద్ధతులకు అలవాటై దారితప్పుతాను. నేను స్వస్థలం కుంభకోణంకు తిరిగొచ్చాక..ఓ సంఘటనకు కారణమవుతాను. అదేంటి అనేది కథలో కీలకం. మీరు తెరపైనే చూడాలి. ఈ సినిమాలో నాకొక పాట కూడా ఉంది. దుబాయ్‌లో చిత్రీకరించిన ఈ పాటలో బాగా నృత్యాలు చేసే అవకాశం వచ్చింది. మనకున్న ప్రతిభను చూపించే అవకాశం ఇదే అనుకున్నాను. నయనతారతో నాకు కొన్ని సన్నివేశాలున్నాయి. అంత పెద్ద నాయిక అయినా స్నేహంగా ఉంటుంది. జైసింహా మిమ్మల్ని ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది. మలయాళం, తమిళం, తెలుగులో కొత్త చిత్రాల కోసం సంప్రదిస్తున్నారు. ఆ సినిమాల వివరాలు త్వరలో వెల్లడిస్తాను. నాకు భాషాబేధాలు లేవు. మంచి చిత్రాలు చేయాలన్నదే నా కోరిక. దంత వైద్యురాలిగా మారి ఆస్పత్రి పెట్టాలనే ఆలోచనాఉంది. అని చెప్పింది.

లైన్‌లో మల్టీస్టారర్!



నాగార్జున

వరుస సినివాలతో, వైవిధ్యమైన పాత్రలతో నటుడిగా తిరిగి విజృంభించాలని నాగార్జున కోరుకుంటున్నారు. ఇదే విషయాన్ని ఇటీవల వెల్లడించారు కూడా. మనం, సోగ్గాడే చిన్నినాయన, ఊపిరి వంటి చిత్రాలతో హ్యాట్రిక్ విజయాన్ని అందుకున్న ఆయనకు ఓం నమో వేంకటేశాయ చిత్రం బాక్సాఫీసు వద్ద ఆశించిన విజయాన్ని అందించలేక పోయింది. ఇక ఈ మధ్య వచ్చిన రాజుగారి గది-2 చిత్రం ఆయనకు సంతృప్తినిచ్చింది. అయితే ప్రస్తుతం తాను చేస్తున్న చిత్రం, చేయబోతున్న చిత్రంతో మంచి విజయాలను అందుకోగలనన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం రాంగోపాల్‌వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం షూటింగ్‌లో నాగ్ బిజీగా ఉన్నారు. ఇందులో ఆయన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. పాత్రలో ఇమిడిపోయేందుకు ఆయన తన బాడీలాంగ్వేజ్‌ను కూడా మార్చుకున్నారు. కాస్త వయసు పెరిగినా తగిన వ్యాయామంతో ఆ పాత్రలో మంచి ఫిట్‌నెస్‌తో నటిస్తున్నారట. ఇక నాగ్, వర్మల కలయికలో దాదాపు ఇరవై ఏళ్ల అనంతరం రూపొందుతున్న చిత్రమిది. నాగ్‌సరసన మైరా సరీన్‌కథానాయికగా నటిస్తుండగా, ఏప్రిల్‌లో ఈ సినిమాను విడుదల చేయాలన్నది చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకుంది. ఇదిలావుండగా...ఈ చిత్రం సెట్స్‌పై ఉండగానే నాగ్ మరో చిత్రాన్ని లైన్‌లో పెట్టారు. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో నాగార్జున, నాని కాంబినేషన్‌లో ఓ మల్టీస్టారర్ చిత్రం రూపొందనున్నట్లు కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతోంది. ఇందులో నాగార్జున డాన్‌గా, నాని డాక్టర్‌గా కనిపించబోతున్నారని అంటున్నారు. డాక్టర్‌గా నటించబోయే నానికి జోడీగా రకుల్‌ప్రీత్‌సింగ్‌ను ఎంపిక చేశారని తాజాగా వినిపిస్తోంది. వైజయంతీ మూవీస్ పతాకంపై అశ్వనీదత్ నిర్మించనున్న ఈ సినిమా వచ్చేనెల నుంచి సెట్స్‌పైకి వస్తుందని సమాచారం. ఇక రకుల్‌కు కూడా స్పైడర్ చిత్రం తర్వాత తెలుగులో నూతన అవకాశాలు ఏవీ? అన్న మాటలు వినిపిస్తున్న తరుణంలో ఈ చిత్రంలో ఆమె ఎంపిక ప్రాధాన్యాన్ని సంతరించుకుందని చెబుతున్నారు.

శృంగార తారతో ఆర్జీవీ 'చిత్రం'

గన్స్ అండ్ థైస్ అనే పెద్దలకు పరిమిత వెబ్ సిరీస్ రూపొందించిన వివాదాస్పద దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ మరోసారి అలాంటి ప్రయత్నమే చేస్తున్నారు. గాడ్ సెక్స్ అండ్ ట్రూత్ పేరుతో ఈ లఘు చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రంలో అమెరికన్ శృంగార తార మియా మాల్కోవా ప్రధాన పాత్రలో నటిస్తోంది. బాలీవుడ్‌లో సన్నీ లియోన్ తర్వాత అడుగు పెడుతున్న పోర్న్ స్టార్ మియా కావడం విశేషం. దర్శకుడు మహేష్ భట్ రూపొందించిన జిస్మ్ 2 చిత్రంతో హిందీ తెరపైకి సన్నీ లియోన్ వస్తే..మళ్లీ ఇన్నేళ్లకు కొత్త శృంగార తార పరిచయమవుతోంది. ఈ విషయాన్ని మియా మాల్కోవా సామాజిక మాధ్యమాల ద్వారా ధృవీకరించింది. మియా మాట్లాడుతూ....గాడ్ సెక్స్ అండ్ ట్రూత్ పేరుతో భారతీయ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ నాతో షూటింగ్ చేస్తున్నారు. ఇటీవల యూరప్‌లో చిత్రీకరణ జరిపారు. సన్నీ లియోన్ తర్వాత బాలీవుడ్‌లోకి వస్తున్న తారను నేనే. అని చెప్పింది. ఈ లఘు చిత్రంలో మియా మాల్కోవా ఉన్న పోస్టర్‌లు విడులయ్యాయి.



మియా మాల్కోవా

వినాయక్ చేతుల మీదుగా

నందు, సౌమ్య వేణుగోపాల్ జంటగా నటిస్తున్న చిత్రం ఇంతలో ఎన్నెన్ని వింతలో. వరప్రసాద్ వరికూటి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని హరిహర చలన చిత్ర పతాకంపై ఎస్. శ్రీకాంత్ రెడ్డి, ఇప్పిలి రామమోహనరావు నిర్మిస్తున్నారు. పూజా రామచంద్రన్ కీలకపాత్రలో నటిస్తోంది.



ఈ చిత్రం థియేట్రికల్ ట్రైలర్‌ను ప్రముఖ దర్శకుడు వివి.వినాయక్ ఆవిష్కరించారు. ఇంటిలిజెంట్ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నప్పటికీ ట్రైలర్ విడుదల చేయడం ఆనందంగా ఉందని నిర్మాతలు చెప్పారు.

చిత్ర దర్శకుడు వరప్రసాద్ నా శిష్యుడు. తను దర్శకుడు అవుతున్నాడని తెలిసి సంతోషించాను. ట్రైలర్ బాగుంది. నా శిష్యుడికి మంచి విజయం రావాలని, పెద్ద హీరోలతో సినిమాలు తీసే స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నాను అని ఈ సందర్భంగా వినాయక్ అన్నారు. ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేస్తామని నిర్మాత ఇప్పిలి రామమోహన్‌రావు చెప్పారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం ఎస్. మురళి మోహన్‌రెడ్డి, సంగీతం యాజమాన్య, సాహిత్యం సురేష్ గంగుల, రచనా సహకారం శివ యద్దనపూడి,



శీనుగాడి ప్రేమకథ



శ్రీనివాసరావు, ప్రణవి

శ్రీనివాసరావు, ప్రణవి, కావేరి, చాందిని ముఖ్యతారాగణంగా తెరకెక్కుతున్న చిత్రం శీనుగాడి ప్రేమ. సిన్సియర్ రామామా అనేది ఉప శీర్షిక. ఆర్‌కె.డి దర్శకుడు. సుష్మా ఎంటర్‌టైన్‌బూమెంట్ మీడియా పతాకంపై ధరిమిశజెట్టి సత్యేశ్వరి నిర్మిస్తున్నారు. షూటింగ్, డబ్బింగ్ పూర్తయింది. ప్రస్తుతం రీ రికార్డింగ్ జరుపుతున్నారు.

నిర్మాత మాట్లాడుతూ సంగీత దర్శకుడు రమణ కథకు అనుగుణంగా చక్కని సంగీతం అందించారు. సినిమా అనుకున్నదానికంటే బాగా వచ్చింది. లవ్, సెంటిమెంట్, యాక్షన్, వినోదం మిళితం చేస్తూ రూపొందించాం అని చెప్పారు.ఈ చిత్రంలో ఇంకా కావేరి, చాందిని, రాంపల్లి వెంకటరమణ, సునీత, రంజిత్ తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం సతీష్, సంగీతం రమణ, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు సుష్మా ఎంటర్‌టైన్‌మెంట్స్ మీడియా.

